(196)

Presented by the members of the Hoall Theosophical Lodge, Machilipatnam

to 1060

Mr & Mrs Bhimaraju Narayana Murthy

wishing them a happy married life

(in commemoration of ...

... all kindness

బ్రహ్మవిద్యాదర్పణము

బ్రహ్మవిద్యాదర్పణము

(HINDUISM IN THE LIGHT OF THEOSOPHY)

దివ్యజ్ఞానసమాజ ఉపన్యాసకుఁడు

చిట్టిమూరు రామయ్య, బి. ఏ., ఎల్. టి.,

గారిచే రచియింపఁబడినది

(మూఁడవకూర్పు)

"వసంతా ఇన్స్టిట్యూట్"

థియొసాఫికల్ సొసైటి

అడయారు, మద్రాసు

DEDICATED

WITH KIND PERMISSION

TO

MRS. ANNIE BESANT, F.T.S.

BY

HER DEVOTED PUPIL

THE AUTHOR

అవతారిక

మనుజుఁ డెవఁడు? ఎందుండి వచ్చినవాఁడు? ఎచటికిఁ బోవువాఁడు? వా డేమి చేయవలెను? ఏ విధముగ నేల చేయవలయు? అను నీమొదలగు విషయములు ఎల్లవారును దెలిసికొనఁదగినవి గదా! ఇవి వివరముగను సులభముగను నొక్కచోఁ దెలియఁజేయు నాంధ్రగ్రంథములు దొరకుట యరుదు. సంస్కృతభాషయందు బరిచయము గలవారును ఆ భాషాపాండిత్యము గలిగి యనేక గ్రంథములఁ జదివినను నివి యంత సులభముగ దెలియవు. అందుచే నివియన్నియును దేటతెల్లముగ దెలియునట్టి గ్రంథము సులభశైలితో వ్రాయఁబడి యున్నది. దివ్యజ్ఞానసమాజము (The Theosophical Society) వా రీమొదలగు ననేకవిషయములను బరిశీలించి ప్రకృతిశాస్త్రములందు బ్రవీణత గలవారి యుక్తులకును లౌకికానుభవమునకును ననుకూలముగ ననేక గ్రంథముల వ్రాసి యున్నారు. వానిని శోధించి కొన్ని ముఖ్యాంశము లీగ్రంథమున గ్రంథకర్త వివరించియున్నాఁడు. మఱియు సర్వజనులకు సులభసాధ్యముగ నుండవలయునను నుద్దేశ్యముతో నీగ్రంథమును స్వల్పక్రయమునకు నీయ నిశ్చయించినాఁడు.

లోకోపకారమునకై గ్రంథకర్త చేసిన యీ యుపన్యాసము భగవంతుఁడును నాతిభక్తులగు మహాత్ములు గ్రహించి నెఱవేర్తురు గాక.

అడయార్ — తూముచెర్ల రామచంద్రరావు.

13-6-12 — [illegible]

మొదటికూర్పు పీఠిక

"థియసాఫికల్ సొసైటి" యను నామాంతరమునం బరగు దివ్యజ్ఞానసమాజమను సభ యిప్పటికి ముప్పదియాఱు సంవత్సరముల క్రిందట స్థాపింపఁబడి యిప్పుడు ప్రపంచమున సమస్తదేశములయందు వ్యాపించియున్నది. ఆసభవారిచేఁ బ్రచురింపఁబడిన గ్రంథములు అనేకభాషలలో ననేకుల కత్యంతానందమునిచ్చుచు, విశేషముగ మేలొనరించుచున్నయవి.

ఆ సమాజము ముఖ్యోద్దేశ్యము లెవ్వియన, లోకమునందలి పెక్కుమతములయందుండు సారభూతములగు సిద్ధాంతముల వెల్లడిచేసి మతము లన్నిటియందలి ముఖ్యాంశము లన్నియు నొక్కరీతిగనే యున్నవనియును, ఆమతము లన్నింటికి మూలము నొక్కటియగు పరవిద్యయే యనియును, నిరూపించి తద్ద్వారా మానవకోటియందంతట గలిగియుండు మతవైషమ్యములు మాన్పి సోదరభావమును, ఏకమత్యమును స్థాపించుట యొకటి. మఱియు మానవునియందును, బాహ్యప్రపంచమునందును, అతీంద్రియములై మహామహములగు ధర్మములను, తత్త్వములను బరిశీలించి తత్త్వసారమును స్వానుభవముచే వెల్లడిచేయుట రెండవది.

ఈ యుద్దేశ్యములతో ననేక గ్రంథము లనుభవజ్ఞులగు వారిచే నాంగ్లేయభాషయందు వ్రాయఁబడియుండ నా గ్రంథములన్ని మతములవారికిని, వారివారి మతగ్రంథముల యందలి పరమరహస్యములను విస్పష్టముగ విపులముచేయు సహాయములుగ నున్నయవి. వానిం జదివినవారు వానివలనఁ గలుగు నానందము ననుభవించుచు, ఆ గ్రంథములు మన దేశభాషలలో లేమిచే నాంగ్లేయభాష నభ్యసింపని యనేకులకు సాధ్యములు గాకపోవుటకుం జింతిల్లి వానిని దేశభాషలలో రచించిన బాగుగ నుండునని యోచించుచుండ [illegible] నుండు దివ్యజ్ఞానసమాజశాఖయగు తత్త్వజ్ఞానసభ కధ్యక్షులగు మహారాజశ్రీ అనుముపల్లె నంజుండప్ప, బి.ఏ., బి.యల్., గారు ఆ గ్రంథములయందలి ముఖ్యాంశములను సులభశైలితో బాలురకుంగూడ దెలియునట్లు తెనుఁగుభాషలో వ్రాసి వేలకొలఁది ప్రతులను ముద్రించి యనేకులకు నుచితముగ నీయ నారంభించిరి. వారీకార్య మనేకసంవత్సరములుగఁ జేయుచున్నారు. ఇట్లు లోకోపకారముకొఱకు వ్యయప్రయాసముల కోర్చి పాటుపడుచుండు మహారాజశ్రీ నంజుండప్ప, బి. ఏ., బి. యల్. గారును, మఱియు నీ దివ్యజ్ఞానసమాజమున మిగుల శ్రద్ధతోఁ బనిచేయుచుఁ జెన్నపురరాజధానియందలి దివ్యజ్ఞానసమాజ శాఖల కన్నింటికిఁ బై విచారణకర్తగా పనిచేయుచుండు, మహారాజశ్రీ టి. రామచంద్రరావు, బి.ఏ., బి.యల్.

గారును ఆ పత్రికలయందలి విషయముల నన్నింటిని నొక్క-టిగఁ జేర్చి గ్రంథరూపముగ వ్రాసిన నెక్కుడు యుపయుక్తముగ నుండునని తలంచి యీకార్యమును గొనసాగింప వలయునని నా కాజ్ఞనియ్యఁగా వారియాజ్ఞ నుల్లంఘింపఁ జాలక యీకార్యమును బూనితిని. ఆ పిదప నాపత్త్రికల యందలి విషయములమాత్రము గాక యీసభవారిచేఁ బ్రచురింపఁబడిన యితర గ్రంథములయందలి ముఖ్యవిషయములం గూడఁ జేర్చి వ్రాసిన మేలుగనుండునని తలంచి యాంగ్లేయ భాషయందలి యనేక గ్రంథములనుండి సారమును గ్రహించి యీ విషయముల నన్నింటిని సంస్కృతగ్రంథములనుండి ప్రమాణములతో నాంధ్రులకు సులభముగ నర్థమగునట్లు నా శక్తికొలఁది వ్రాసితిని. ఇందు సాధ్యమైనంతమట్టుకు క్రొత్త క్రొత్తమాటలను గాక వేదాంతగ్రంథములయందలి పరిభాషనే యుపయోగించుచున్నాఁడను.

సిద్ధాంతములన్నియు వేదాంత గ్రంథములయం దుండు నవియే గాని క్రొత్తవిగావు. ఐనను సంస్కృతమున బహు గ్రంథవిన్యాసములతోఁ గాని సాధింపరాని విషయములన్నియుఁ బెక్కుస్థలములనుండి యొక్కొక్కదిక్కున చేర్చి క్రోడీకరించి సులభసాధ్యములుగ వ్రాయఁబడినవి.

సామాన్యముగఁ బైపైన చూచువారలకుఁ గ్రొత్తవిగఁ గన్పడు కొన్ని విషయములు శాస్త్రసమ్మతములుగ నిరూపింపఁబడి ప్రమాణములతోడఁ జూపఁబడినవి.

సామాన్యముగ హిందువులలో భువనాది లోకములు దొంతికుండలవలె నొకదానిపై నొకటియున్నట్లు జనులు తలంచుట గలదు. దివ్యజ్ఞానసామాజికులు వ్రాసిన గ్రంథములందెల్ల యెడల నాసిద్ధాంతము సమంజసము కానిదియు, లోకములన్నియు నొకదానిలో నొకటిగఁ దూరుకొని యొకే స్థలముననే యున్నవనియును, ఊర్ధ్వలోకములలో ప్రతియొకటియు దానికంటెఁ గ్రిందిలోకముల నన్నింటిని దూరి యున్నను వ్యాపించి వాని నతిక్రమించి పైనఁ గొంతదూరముగా నున్నదనియుఁ జెప్పుచున్నారు. ఈ విషయమును పరిశీలించి చూడ శ్రుతిసమ్మతమని స్పష్టమగుచున్నది. ఉపనిషత్తులన్నింటిలో గొప్పదియగు బృహదారణ్యకమునందును, మఱియు సుబాలోపనిషత్తునందును ఈ విషయము స్పష్టముగ నిరూపింపఁబడియున్నది. భువర్లోకము భూలోకములో నోతప్రోతముగ నున్నదనియును, అట్లే సువర్లోకము భువర్లోకములో నోతప్రోతమనియును, ఆలాగుననే యూర్ధ్వలోకము లన్నియు వాని క్రిందిలోకములలో నోతప్రోతములుగ నున్నవనియును జెప్పఁబడియున్నది. ఓతప్రోతమనగా వస్త్రమునందు పడుగు, పేక (నిడివి, వెడల్పు దారముల) వలె నొకదానిలో నొకటి చొచ్చి వ్యాపించి యున్నవని యర్థము.

జీవుని యుపాధుల విషయమునఁగూడఁ బరిశీలించి విచారించిన వేదాంతగ్రంథములయందలి విభాగమునకును, థియా

సాఫికల్ సొసైటీవారుచేయు విభాగమునకును భేదము గానరాదు. సంస్కృతగ్రంథములయందు సూక్ష్మశరీరమని మొత్తముగఁ జెప్పఁబడునది, దివ్యజ్ఞానసమాజగ్రంథములలోఁ బ్రాణములకునికిపట్టయియుండు ప్రాణమయకోశమును, కేవల కామక్రోధాది మనోవికారముల కునికిపట్టగు కామమయశరీరమును, శుద్ధసంకల్పములు, విశుద్ధభావములు లోనగు మనోవృత్తుల కునికిపట్టగు మనోమయ విజ్ఞానమయకోశములునుగ విభజింపఁబడియున్నది. పైఁజెప్పిన కామమయ మనోమయ శరీరములు రెండును గలసి వేదాంతగ్రంథములయందుఁ జేర్చఁబడియుండు మనోమయకోశ మగును.

మఱియు ననేకులు పురుషప్రయత్నమువలని ప్రయోజనమును గొంచెమునను లెక్కింపక యంతయును విధిలిఖితమనియును, పురుషునకు స్వాతంత్ర్యమించుకయును లేదనియు, దలఁచుట గలదు. దైవము పురుషకారము విషయమై శాస్త్రములయందుఁ జెప్పఁబడిన విషయములను ప్రమాణములతోడ నెత్తి యుపపాదించి పురుషకారము యొక్క యావశ్యకతయు, దైవమునకును బురుషకారమునకును గల సంబంధమును స్పష్టముగ నిందు నొక్కి వ్రాయఁబడినది.

ఈ చిన్నగ్రంథమునఁ గర్మబ్రహ్మస్వరూపములు రెండును సంక్షేపముగ విచారింపఁబడి యుండుటచే నెల్లరకు నుపయోగకరముగ నుండుననునమ్మకముతో నిద్దానిని జిజ్ఞాసువులకందఱకును వినయపూర్వకముగ నర్పించుచున్నాఁడను.

గుణదోషములఁ బరిశీలించి గుణములను గ్రహించి దోషముల సహింతురని ప్రార్థించువాఁడను. మఱియును జదువరులు గ్రంథమునందలి విషయములను గుఱించి సవరణలనుగాని, మార్పులనుగాని సూచించినచో వానిని వందనపూర్వకముగ గ్రహించి ముందుకూర్పున కవకాశముండిన వానిని వినియోగించెదను.

ఈ గ్రంథమును బ్రచురించుటకు ముందుశోధించి సంస్కరించిన పెన్షనర్డ్ సబ్జడ్జిగారగు మహారాజశ్రీ టి. రామచంద్రరావుగారికిని, సబ్జడ్జిగారగు మహారాజశ్రీ వావిలాల వేంకటశివావధానులుగారికిని, ఎంజనీరు మహారాజశ్రీ పిల్లచెరువు గోపాలయ్యగారికిని, బ్రహ్మశ్రీ అన్నవరము రాఘవశాస్త్రులుగారికిని నావందనముల సమర్పించుచున్నాను.

ఆదినుండి నాకు సహాయులై గ్రంథమును బూర్తిచేసి భాషాస్ఖాలిత్యముల నన్నింటిని సవరించి వ్రాసి అచ్చుప్రతులను దిద్ది గ్రంథమును గొనసాగించిన నాస్నేహితులును, సహయోపాధ్యాయులును, కడప మ్యునిసిపల్ హైస్కూలునందాంధ్రోపాధ్యాయులు నగు బ్రహ్మశ్రీ జనమంచి శేషాద్రిశర్మగారికి నావందనముల నిచ్చుచు వారికి నా యుపాంకృతజ్ఞత నిచ్చుట విన్నవించుకొనుచున్నాను.

కడప
12-6-12

చిట్టమూరు రామయ్య

రెండవకూర్పు పీఠిక

ఈ చిన్నపుస్తకము రెండవకూర్పు ప్రచురించవలసినంత భాగ్యము కలిగినందులకు కృతజ్ఞతాపూర్వకముగ చదువరులకు వందనముల సమర్పించుచున్నాడను. గ్రంథమునందలి శబ్దజాలమును స్వల్పముగ సవరించి యచ్చటచ్చట కొన్ని విషయములు విస్తరించి వ్రాసితిని. మొదటకూర్పునందువలె నీ కూర్పునందును బ్రహ్మశ్రీ టి. రామచంద్రరావుగారు ఆమూలాగ్రముగ పరిశీలించి, యుచితములగు సవరణలను సూచించినందుకు వారికి నా వందనముల నర్పించుచున్నాడను.

ఈ గ్రంథము ఆంధ్రదేశమున చదువరులచే ప్రీతితో ఆదరింపబడుటయేగాక కర్ణాటక భాషయందును ద్రావిడభాషయందును భాషాంతరీకరణము చేయబడి యితరభాషలలో సైతము చదువరులచే ఆదరింపబడినందులకు ఎంతయు కృతజ్ఞుడను.

ఏ గురువుల అనుగ్రహమువలన, వారి కైంకర్యములో నొకటిగ నీగ్రంథము వ్రాయబడెనో, ఆ మహనీయులు ఈ రెండవకూర్పును అనుగ్రహించి, చదువరులను వారియనుగ్రహ పాత్రులుగ చేయుదురుగాక యని ప్రార్థించెద.

అడయార్
మార్చి, 1920

చిట్టిమూరు రామయ్య

మూడవకూర్పు పీఠిక

ఈ గ్రంథము మొదటి రెండుకూర్పులును ఆంధ్రలోకము నందు గొప్పప్రఖ్యాతిగాంచినవి. దీనిని సమాజసభ్యులేగాక తదితరులుగూడ ననేకులు చదివి ధన్యులైరి. అందుచేత రెండవకూర్పు ప్రతులు చెల్లిపోయినవెంటనే తిరిగి మూడవ కూర్పు ముద్రించనందున చాలమంది నిరాశను వెలిబుచ్చిరి. కాని, కొన్ని యనివార్యకారణములచే నాలస్యమైనది. అందుకు పాఠకులు మన్నింతురు గాక !

దీనిలో నొక్కొక్క యధ్యాయమును ప్రత్యేకముగా నొక్కపుస్తకముగ ప్రచురించిన బాగుండునని కొందరును, మరి కొన్నివిషయముల నొకటి రెండధ్యాయములుగ జేర్చిన బాగుండునని కొందరును సలహాలిచ్చిరి. ఆయాలోచనలో గొంతతడవైనది, గాని, తుదకు గ్రంథమును యథాతథముగ ప్రచురించుటయే యుక్తమని, యనేకకారణములచే దోచినది. అందుచేతనే ఇందక్కడక్కడ ప్రమాదజనితదోషముల దిద్దుట దక్క తదితరమార్పులేమియు జేయలేదు.

ఈ కూర్పునకు కావలసిన సవరణలజేసి, అచ్చుప్రతులను (ప్రూఫులను) దిద్ది మాకు సహాయముచేసిన శ్రీ గుంటూరు వెంకటసుబ్బారావుగారికి కృతజ్ఞులము.

ఇదివరకువలె నీగ్రంథ, మాంధ్రలోకమున ముముక్షువుల కత్యంతోపయుక్తమై, సేవించి, గ్రంథకర్త యాశయమును నెరవేర్చుగాక !

అడయార్ వసంతా ఇన్‌స్టిట్యూట్
31-7-41

ఓమ్

విషయసూచిక

మొదటి యధ్యాయము

రెండవ యధ్యాయము

మూడవ యధ్యాయము

లుగ నభివ్యక్తమాయెను. ఈశ్వరశక్తి లేక మాయాశక్తి ప్రకృతియందుఁ బ్రవేశించి, దానికి వ్యాపారము గలుగఁ జేయును. శక్తిత్రితయము, పృథివ్యాదిలోకములు.

నాల్గవ యధ్యాయము

జీవు లీశ్వరాంశములు. జీవులు నిత్యులు-షడ్వికారరహితులు. ఉపాధులు—లింగదేహము-స్థూలసూక్ష్మశరీరములు.

ఐదవ యధ్యాయము

తేజస్స్వరూపము. వివిధపదార్థములు తేజస్సు వేర్వేఱుగ నుండు. కొన్ని పరిశుద్ధ తేజస్సు గలిగియుండుటచే గ్రాహ్యములు. మఱికొన్ని యపరిశుద్ధతేజస్సు గలిగియుండుటచే త్యాజ్యములు. మనోవృత్తులుమాఱునట్లు తేజస్సు మాఱును. యోగుల తేజస్సు పరిశుద్ధమై విశేషదూరము వ్యాపించియుండుటచే నది వారి యాశ్రమమనఁబడును. తీర్థములు దివ్యక్షేత్రములు.

ఆఱవ యధ్యాయము

జీవునకు శరీరములు లేనిచో వ్యాపార మసాధ్యము. శరీరములు నశ్యములు, శరీరి నిత్యుఁడు. స్థూలశరీరము, అన్నమయ

నిష్ప్రయోజనములు. పరోపకారార్థము మనశ్శక్తి నుపయోగించుటయందలి రహస్యము.

ఎనిమిదవ యధ్యాయము

మరణమన నేమి? మరణము యథార్థముగ దుఃఖహేతువుగాదు. జీవితకాలమునందలి శుభాశుభ కర్మము లన్నియు నుత్క్రమణకాలమున జీవునకు మనోగోచరములయి రాఁబోవు జన్మమున స్వభావమగు. జీవుఁడు స్థూలశరీరము నశించినపిదప నాప్తులగువారలకు గనఁబడుటయుగలదు. వానిం జూచినవారలు పిశాచములని భయపడ నవసరము లేదు. అప్పుడుదవగు మనోవృత్తి. ఉత్తరక్రియలు, వాని వలని ప్రయోజనము. నరకదుఃఖమును, స్వర్గసుఖమును. నరకానుభవమన నేమి? జ్ఞానసాధనములగు పాఠశాలాప్రాయములు.

తొమ్మిదవ యధ్యాయము

ఒక్కొక తత్త్వమునుండి యొక భూతసూక్ష్మము ఈశ్వరాంశమగు జీవుని నంటియున్నది. ఈ పరమాణువులన్నియు నొక జ్యోతిర్మయమగు తంతువుతోఁ గట్టఁబడియున్నవి.

ప్రతిజన్మమునందును జీవుఁడుచేయు కర్మములన్నియు నీ భూత సూక్ష్మములయందు మార్పుచేసి, స్వభావముగ నిలిచియుండును. పంచాగ్నివిద్య.

పదియవ యధ్యాయము

కారణములేక కార్యము పుట్టదు. కార్యముండినచో కారణముండియే తీరును. నైజములగు బుద్ధిసామర్థ్యము, సుగుణదుర్గుణములు, లోకమునఁ గలుగు ఫలప్రాప్తియు, పూర్వజన్మకర్మానుసారములుగాని యకారణములు కావు. పూర్వజన్మకృతకర్మ ఫలము దైవమనఁబడును. పురుషప్రయత్నములేకయే దైవము ఫలము నియ్యఁజాలదు. పురుషకారముచేత పూర్వకర్మఫలములఁ గొంత మార్పఁదగును. పురుషప్రయత్నముతో నింద్రత్వము, రుద్రత్వము సైతము సాధింపఁదగు. జ్యోతిశ్శాస్త్రము ప్రకారము జననకాల గ్రహస్థితి పూర్వకర్మఫలములను సూచించునుగాని గ్రహములు కర్మములఁ జేయించువారు కారు. సంచిత, ప్రారబ్ధ, క్రియమాణకర్మములు. జ్ఞానముచే సంచితకర్మము నశించును. ఈశ్వరార్పణముగఁ జేయఁబడు క్రియమాణకర్మము బంధకారణము కాదు. మోక్షహేతువగు. జ్ఞానులగువారు లోకహితార్థము కర్మములం బూని వర్తింతురు.

పదునొకండవ యధ్యాయము

ధర్మమన నేమి? జీవులపరిపక్వము ననుసరించి ధర్మము వేర్వేఱుగ నుండును. జీవులు తమోగుణప్రధానులు, రజోగుణప్రధానులు, సత్వగుణప్రధానులు. హిందువుల వర్ణధర్మములును, ఆశ్రమధర్మములును ఈ గుణవిభాగము ననుసరించినవి. ఆయావర్ణముల కుండఁదగు లక్షణములు లేనిచో ఆ వర్ణము నామమాత్రము. గుణములనుబట్టి వర్ణనిరూపణము గాని జన్మమునుబట్టి కాదు. వర్ణాశ్రమధర్మములు. వాని యుద్దేశ్యములు. కర్తవ్యములగు ధర్మములను శాస్త్రములు విధించుచున్నవి గాని పూజ్యతను, సన్మానములను, సూచించుట లేదు. ప్రవృత్తి నివృత్తిమార్గములు.

పండ్రెండవ యధ్యాయము

మానవజన్మము ప్రాప్తించినది మొదలు మోక్షప్రాప్తి యగువఱకు జీవునకు మూఁడుమార్గములు గలవు. కర్మమార్గము, భక్తిమార్గము, జ్ఞానమార్గము. మార్గములు మూఁడైనను గమ్యస్థాన మొక్కటియే.

పదుమూఁడవ యధ్యాయము

పదునైదవ యధ్యాయము

పదునాఱవ యధ్యాయము

పదునేడవ యధ్యాయము

శ్రీ పరబ్రహ్మణే నమః

బ్రహ్మవిద్యాదర్పణము

మొదటియధ్యాయము

బ్రహ్మవిద్య

ఉ|| ఎంతయు [illegible] జాలముల [illegible] సృజించి వాని స
[illegible] బోధ[illegible] స్వకీయ[illegible]ము
[illegible]
[illegible] మిముఁ ||

(1) సకలకోటిబ్రహ్మాండనాయకుండును, వేదపురుషుండును, సర్వజ్ఞుండును నగు భగవంతుండు మానవకోటిని సృజించి, దాని సృష్ట్యభివృద్ధికై దేశకాలానుగుణ్యముగ బహుమార్గములు నిర్మించియున్నాఁడు. వారు వారి [illegible]ముల ననుసరించుచుఁ దమ తమ మతమే సత్యమనియును, తమతమ మతమునందే పరమాత్మతత్త్వము పరిపూర్ణముగఁ బోధింపఁబడుచున్నదనియును, తమ మతమునందలి దైవము తప్ప మఱి దేవుఁడున్నను సత్యము గాదనియును, తాము తప్పం దక్కిన మతస్థులందఱు నజ్ఞానాంధకారమగ్ను లగుటచే వార

లకు మోక్షప్రాప్తి యసాధ్యమనియును భావించుచు, యథార్థతత్త్వము తమకుమాత్రమే తెలియుననను నభిమానముచే నిండినవారలై, యితరులను దూషించుచున్నారు. ఇట్లొకొక్క మతస్థు లన్యమతస్థులయం దసూయఁ జూపుచుండుటం బట్టి మతవైషమ్యములు సామాన్యములుగ నున్నయవి.

ఐనను విద్వాంసులు తమతమ మత గ్రంథములనే పూర్వముగ శోధింప నట్టి వైషమ్యమున కవకాశము చూడక పోవుటయేకాక యేకత్వమును జూచుటకుఁ జాలియున్నారు. వారు పరమత గ్రంథములనుగూడ నిష్పక్షపాతముగ శోధించి చూడ నన్ని మతములయందును ముఖ్యాంశము లొక్కటిగనే యున్నవి యనియును, వివిధమతములయందలి పరస్పర భేదములు స్వల్పములనియును, అట్టి భేదము లముఖ్యములయందే గాని ముఖ్యమగుతత్త్వమునం గానరా వనియును దృఢముగ విస్పష్టమగుచున్నది. ఇట్లు సమన్వయ మగుచుండ యథార్థతత్త్వ మొక్కటియే యనియు, బాహ్యదృష్టికిం జూపట్టు భేదములు సైతము దేశకాలభేదములం బట్టి వచ్చియుండఁ దగుననియు నూహింపఁదగియున్నది.

ఈమతము లన్నింటియందు ముఖ్యాంశములనఁదగు సిద్ధాంతములే మతము లన్నింటికి మూలమగు బ్రహ్మవిద్య. దీనినే గుప్తవిద్య యనియుం జెప్పుదురు.

ఈరీతిని బ్రహ్మవిద్య సద్గ్రంథములకు మూలమని రూఢిం గినచో జనులు తమతమ మతముల ననుసరించుచుఁ బరస్పర వైషమ్యములు లేక యైకమత్యము గలిగియుండఁ గలుగుదురు. అట్లైన మత మనునది మానవకోటియం దైకమత్యమును బుట్టింపజాలునది యగు. మానవులయందు సకల సద్గుణ్యములకు మతమే కారణమని యనుభవములు చెప్పనాస్తి కల్ల యగు.

భగవంతుఁడు ప్రతికల్పమునందును బూర్వకల్పమునందు నుండినరీతినే ప్రపంచమును సృజించును.

ధాతా యథాపూర్వ మకల్పయత్ ।

అట్లు వర్తమానకల్పాదియందు సృజించిన మానవకోటికి దోవజూపి, వారిని కృతార్థులఁ జేయుటకై పూర్వకల్పములఁ బరిపూర్ణులయి బ్రహ్మవేత్తలగు సనకాదిమహాత్ములను లోకమున జన్మింపఁజేసె. ఆమహానీయులు, తాము కృతార్థులయ్యును, పామరజనోద్ధారకార్యము నవలంబించి, వర్తమానకల్పమున మానవులచే ననుష్ఠేయము లగు నానాధర్మములను బ్రతిపాదించిరి. ఆధర్మములన్నియు నీకల్పమునఁ గాలానుగుణముగ ననుష్ఠేయము లగును. ఆమహానీయులు మహర్షులై [illegible] ధర్మమార్గముల నుపదేశించి శిక్షించి ప్రజలచే నామార్గముల ననుష్ఠింపఁ జేసి వారిని గ్రమక్రమమున నుచ్చస్థితికిఁ దెచ్చుటకు బహుకాలము పాటుపడిరి. తల్లి కొంతకాలము దనుక

పిల్లలను బోషించి కైదండయొసఁగి నడిపించి శిశువు కొంత నడువనేర్చిన పిమ్మట స్వతంత్రముగ నడుచుటకు నేర్చుకొనవలయునని ప్రత్యక్షముగ శిశువునకు దనసహాయము నిచ్చుటను మాని దాని కపాయము గలుగకుండ దూరమున నుండి కనిపెట్టియుండురీతి నామహాత్ములు కేవల బాలిశులగు మానవులఁ గొంత కాలము రక్షించి శిక్షించి పిదప వారికి స్వాతంత్ర జ్ఞానము గలుగుటకై తాము విరమించి యదృశ్యులయి కనిపెట్టియుందురు.

ఇట్లు విచ్చలవిడిగ విడువఁబడిన మానవులు కాలక్రమమున నుపదిష్టధర్మములను మఱచి గ్రహింపఁజాలక చక్కఁగ ననుష్ఠింపక తప్పుత్రోవలం బోవుచుండ నట్టివారిని గుమార్గములనుండి మరలించి యుద్ధరింప దయాసముద్రులగు నామహాత్ముల కూటమునుండి యొకానొకరు కాలోచితముగ నాయా దేశములయం దవతరించి కాలానుసారముగ బ్రహ్మవిద్యయందలి కొన్ని విషయముల నుపదేశించి వారలకు సన్మార్గముం జూపి మరల మఱుఁగు పడుచుండిరి.

ఇట్లు పెక్కు దేశములయందుఁ గాలానుగుణముగ నవతరించినవారే ప్రపంచమునందలి వివిధమతస్థాపకులు. మతస్థాపకులందఱు నామహానుభావుల సమాజమునుండియే యవతరించినవారు. వారలచే స్థాపింపఁబడిన మతములన్నియు నా బ్రహ్మవిద్యావృక్షశాఖలే. మతములన్నియు నామూలమునుండియే

తమసారమును గ్రహించుచున్నవి. వివిధ మతములయందు ముఖ్యాంశములన్నియు సమములై యుండుటకిదియే కారణము. ఐనను ఆవిద్య వేలువేలు కాలములయందు వేలువేలు దేశముల భిన్నభిన్న ప్రజల కుపదేశింపఁబడియుండుటచే నాయా దేశకాలముల ననుసరించియు, జనుల రుచిప్రవృత్తులంబట్టియు, బాహ్యాచారములయందనేక భేదములుండక తప్పదు. కావుననే నానావిధ మతములయందుఁ బరస్పరభేదములు కన్పట్టుచున్నవి. జ్ఞాని యగువాఁడు బాహ్యములగు భేదములం జూడక యంతస్సారమగు నైక్యమునుఁ జూడఁదగు. పర్వతాగ్రములయందు మేఘుఁడు వర్షింప వర్షజల మచ్చటనుండి నలుప్రక్కలం బ్రవహింప నాజలము ప్రవహించు భూమిగుణమును బట్టి యొకచో నాజలము కృష్ణవర్ణముగను, ఒకచో రక్తవర్ణముగను, వేఱొకచోటఁ బీతవర్ణముగను సిత్తనేక వర్ణములుగ వ్యక్తమగుచున్నదికదా! పర్వతాగ్రమునుండి వెలువడు శుద్ధోదకస్థానీయము బ్రహ్మవిద్య. నానా దేశముల యందు నానావర్ణములుగ బ్రవహించు నద్యుదకస్థానీయములే తచ్ఛాఖలగు మతములు. భిన్నవర్ణములు దేశభూమి లేకాని మూలమున లేవు. అనఁగా నానామతములందలి సమానధర్మము లుదకస్థానీయములు. పరస్పరభేదములు భిన్నవర్ణస్థానీయములు. ఇట్లన్ని మతములకు మూలము బ్రహ్మవిద్యయే. భగవంతుఁ డద్వితీయుఁడై, ఏకమై యెట్లు ప్రకా

శించు చున్నవాఁడో అటులే బ్రహ్మవిద్యయు నేకమై సర్వ వ్యాపినియై యున్నయది.

ఇట్టి బ్రహ్మవిద్యను బరిపూర్ణముగ రక్షించుచు లోకహి తార్థము బ్రహ్మవిద్యాస్వరూపులై యుండువారు పైఁజెప్పిన మహాత్ములసమాజమున నుండువారే. ఆమహాత్ములు ఇకాలమునందును నున్నవారే యని వారి యనుగ్రహపాత్రు లగు పెద్దలు చెప్పుచున్నారు. భగవ చ్ఛ్రీశంకరాచార్యులవారును వివేకచూడామణియందు వారి నిట్లు వర్ణించియున్నారు.

శ్లో॥ శాంతా మహాంతో నివసంతి సంతో
వసంతవ ల్లోకహితం చరంతః ।
తీర్ణా స్స్వయం భీమభవార్ణవం జనా
నహేతునాన్యా నపి తారయంతః ॥
అయం స్వభావ స్స్వత ఏవ యత్పర
శ్రమాపనోదప్రవణం మహాత్మనామ్ ।
సుధాంశు రేష స్వయమర్కకర్కశ
ప్రభాభి తప్తా మవతి క్షితిం కిల ॥

తా. శాంతస్వరూపులును మహాత్ములును వసంతునిం బోలి లోకహితముకొఱకు వర్తించువారును, భయంకర సంసారసాగరమును దాము తరించి నిర్వ్యాజకరుణచేఁ బామరులయి భవసాగరమున మునింగియున్న యితరజనులను దరింపఁజేయు వారునునై యెప్పుడును నామహాత్ములు నివసించియే యున్నవారు.

అట్టి మహాత్ము లిపుడును హిమవత్పర్వతసిద్ధక్షేత్రముల యందు రాజయోగు లయి నివసించియున్నవా రనియును, ఆధునికులలో నయితము అనేకజన్మపుణ్యసంస్కా లయిన వా రలకుఁ గన్పడి వారిని దయయనుగ్రహమునకుం బాత్రులం జేయుచున్నవారనియును, అనుభవజ్ఞులు దృఢముగఁ జాటించు చున్నవారు.

ఇక్కాలమున నన్ని దేశములయందును సనాతనధర్మములు పూర్వపక్షములై జనులు కేవల ప్రకృతిబద్ధులయి నిరీశ్వర వాదులగుచుండ నట్టిబాలిశుల యజ్ఞానముం బాపి యుద్ధరింప నామహాత్ములలో నిద్దరు కరుణించి యోగ్యులగు నిజశిష్యు లకుఁ బ్రసన్నులయి వారలచే దివ్యజ్ఞానసమాజ మనుపేర నొకసమాజమును స్థాపింపఁజేసిరి. ఆసమాజము స్థాపింపఁబడిన కొద్దికాలముననే ప్రపంచమునం దెల్లయెడలను వ్యాపించి బ్రహ్మవిద్యాసారమును ఇక్కాలమున కనుగుణముగ బోధించి ప్రపంచమునందలి నానామతములఁ బునరుజ్జీవితములుగఁ జేయుచున్నది. పైఁజెప్పినరీతిని బూర్వమునుండి కాలానుగుణ ముగ నానాదేశములయందు నానావిధమతముల స్థాపించు చుండిన యీసిద్ధసమాజమువారే యిక్కాలమున క్రొత్తక్రొ మతమును స్థాపింపక పూర్వమతములను సమన్వయముచేసి మత ద్వేషములం బాపి మైత్రీనుత్యమును వృద్ధిచేసి నానాత్వమునం దేకత్వమును నిరూపించుటకై ఆసమాజము నేర్పరిచియు

న్నారు. మతాభిమానము లేశమైనను లేని యనేకులు ఆ సమాజముద్వారా తమతమమతములయం దభిమానము గలవారై తన్మతాచారముల నెక్కుడుశ్రద్ధతో ననుష్ఠించుచున్నారు. ఈ సమాజ మేయే దేశములయందు వ్యాపించిన నాయా దేశములయందలి మతములు పునర్జీవితములై తద్దేశీయుల కాయామతములయందుఁ బ్రకృష్టాభిమానము వృద్ధియగుచున్నది. ఇంతియకాదు. ఎల్లరకు నితరమతములయందాదరణబుద్ధి కలిగి పెక్కుమతస్థులయందు సోదరభావము పుట్టియైకమత్యము వర్ధిల్లుచున్నది. ఈసమాజము ఒక్కమతము నుండి వేఱొకమతమునకు మాఱుట యయుక్తమనియును, ప్రతిజీవుఁడును పరిపూర్ణత్వము నెందుటకు వలయునుపాయముల నన్నిమతములు బోధించుచునే యున్నవనియును, దమతమ మతాచారములఁ జక్కఁగ ననుష్ఠించిన జీవుఁడు పరిపూర్ణుఁడు కాఁజాలుననియును, దృఢముగఁ జాటించుచున్నయది. ప్రపంచమునందలి మతము లన్నియు కడపట నొకటేపదవిని పొందించును.

> త్రయీ సాంఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవమితి
> ప్రభిన్నే ప్రస్థానే పరమిద మదః పథ్యమితి చ
> రుచీనాం వైచిత్ర్యాత్ ఋజు కుటిల నానాపథజుషాం
> నృణా మేకో గమ్యః త్వమసి పయసా మర్ణవ ఇవ ॥

(మహిమ్నస్తోత్రము)

తా. వైదికమార్గము (అనగా పూర్వమీమాంస), సాంఖ్యము, యోగము, పశుపతిమతము, వైష్ణవము, ఈ మొదలగునవి భిన్న భిన్నమార్గములు. కొందరొకదాని శ్రేష్ఠమనియు, మరికొందరింకొకదాని నుంచిదనియును తలతురుగాని అన్నియును రుచిభేదముల ననుసరించి ఒక్కొక్కరికి ఒక్కొక్క మార్గము యుక్తమగును. తుదకు మానవులకు, అన్నిమార్గముల ద్వారా పొందదగిన గమ్యస్థానము నీవొక్కడవే. నదుల కన్నింటికి గమ్యస్థానము సముద్రమే అయినట్లు మానవులందరు పొందదగిన ప్రాప్యస్థానము నీవే.

ఈఅర్థమునే సూతసంహితయందు మఱియు విశదముగ బోధింపబడియున్నది. సామాన్యముగ వేదబాహ్యములనియు దూష్యములనియు ఎంచబడు మతములగు బౌద్ధ జైనఆగమములు సైతము సాక్షాత్ పరమేశ్వరునుండి వెలువడినవియే యని నిరూపింపబడియున్నది.

కాపాలం లాకులం చైవ తథా ర్భద్రాన్త్వబ్జాది
తథా పాశుపతం సోమం భైరవప్రముఖాగమాః
తేషామేవోపభేదాంశ్చ శతశోథ సహస్రశః
విష్ణ్వాగమాస్తథా బ్రాహ్మా బుద్ధార్హద్వ్యాగమా అపి
అనేకభేదభిన్నాని తథా శాస్త్రాంతరాణి చ
నిర్మమే శంకరస్సాక్షాత్ సర్వజ్ఞస్సంగ్రహేణ తు

*　　*　　*　　*

తత్రైకతే హి మార్గాస్తు నహంతవ్యా మనీషిభిః

యథా తోయప్రవాహానాం సముద్రః పరమావధిః
తథైవ సర్వమార్గాణాం సాక్షాన్నిష్ఠా మహేశ్వరః
యేన యేన ప్రకారేణ జనై రేభిరుపాసితః
తత్తన్మార్గానుగుణ్యేన సాధకత్వం హ్యుపైతి సః ॥

(సూతసంహిత, యజ్ఞవైభవఖండ, ౨౨ వ అధ్యాయము)

తా, కాపాలము, లాకులము, పాశుపతము, సోమము, భైరవము మొదలగు ఆగమము లనేక భేదములు. విష్ణ్వాగమములు, బ్రాహ్మాగమములు, బుద్ధాగమము (బౌద్ధమతము), అర్హాగమము (జైనమతము) మఱియు వేలకొలది శాస్త్రాంతరములును అన్నియును సాక్షాన్మహేశ్వరుని నుండి వెలువడినవియే. విజ్ఞులగువారు ఈ మార్గములను తర్కములతో ఖడించరాదు. నదుల కన్నింటికి సముద్రమే పరమావధి అయినట్లు మార్గంబు లన్నింటికి కడపట ప్రాప్యస్థానము మహేశ్వరుఁడే. ఏయేమార్గమున ఉపాసించిన ఆయామార్గమునే పరమపురుషార్థమును పొందుదుము.

మహానుభావులైన ఋషులభావ మిట్లుండ, ఇక్కాలమున ఒక్కొక్క మతమువారును తమమత మొక్కటియే పురుషార్థసాధనమని యన్యమతములవారలను దూషించుచున్నారు. అట్టి మతవైషమ్యములు మాని సర్వమతములయందలి సామాన్య ధర్మములను గుర్తించి సోదరభావముతో ప్రవర్తింపవలయును.

సర్వమతసామాన్యములగు ముఖ్యాంశములు :

I. ఏక మేవాఽద్వితీయం బ్రహ్మ

జగదీశ్వరుండును, జగదుత్పత్తిస్థితిలయ హేతుభూతుండును, సర్వసాక్షియు, సచ్చిదానందస్వరూపుండును నగు నీశ్వరుం డొక్కండు, నద్వితీయుండు నయి యున్నవాండు.

ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వము దాన యైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్ ॥

(భాగవతము)

నానాదేశములందు నానావిధ మతములవారిచేఁ బెక్కు నామములచే నెఱుఁగఁబడు నీశ్వరతత్త్వ మొక్కటియే. హిందువులచే భగవంతుఁ డనియు, సదాశివుఁ డనియును, మహావిష్ణు వనియును, బ్రహ్మ మనియును మఱియును బెక్కు నామములం బిలువఁబడు తత్త్వము నే "అల్లా" యని మహమ్మదీయులును, "జహోవా" యని హీబ్రూవులును, "అహుర్మజ్ద్" అని పారశీకమతస్థులును, "గాడ్" అని యాంగ్లేయులును బిలుచు చున్నారు. పేరు లెన్నియైనను నేమి? పేరులచే సూచింపఁ బడు తత్త్వ మొక్కటియే. సకల మతములును ఈశ్వరు డొక్కఁడే యని యుద్ఘోషించుచున్నవే కాని పలువు రీశ్వరు లని చెప్పు సిద్ధాంత మొక్కటియుం గాదు.

హిందువులు ముప్పదిమూఁడుకోట్ల ఈశ్వరుల నుపాసించు వారని పరమతస్థులగు కొందఱి యభిప్రాయము. ఇది హిందూ మత సిద్ధాంత మెఱుఁగమిచేఁ గలుగునది కాని వేఱు కాదు. అట్టి సిద్ధాంతము హిందూమత సిద్ధాంతమునకు ప్రత్యక్షవిరుద్ధ మని చెప్పవలయునా? అవాఙ్మానసగోచరుఁడు, నిరంజనుఁడు, నిర్వికల్పుఁడు, నేకము నద్వితీయుఁడును నగు నీశ్వరుఁడు త్రిమూర్తులుగ వ్యక్తమగునని వివిధ మతములయందును ఘోషింపఁబడుచునే యున్నది. వారలక్రిందఁ దదాజ్ఞాప్రవర్తకులగు నసంఖ్యాకులయిన దేవతలు పెక్కు తారతమ్యముల నొప్పి వర్తించుచున్నవారు. ముప్పదిమూఁడుకోట్లను సంఖ్య యీశ్వరునియం దన్వయించునది కాదు. తదాజ్ఞాప్రవర్తకులగు దేవతలను దెల్పునది. ఇంద్రాదిదేవతలు ఈశ్వరులని భావించువారును గలరా? లేరని నొక్కివక్కాణింపనగు. అట్లే యితర మతములయందును గూడ నీశ్వరాజ్ఞాప్రవర్తకులగు దేవకోటు లనేక తారతమ్యముల నొప్పియున్నారని నమ్ముచునే యున్నారు. మహమ్మదీయులును, క్రైస్తవులును "ఏన్‌జల్‌స్" అనియును "ఆర్కేన్‌జల్‌స్" అనియును దూతలనియును బిలుతురు. ఈ విషయమునందు సైతము నామభేదములచే నిరూపింపఁబడు వస్తు వొక్కటియే. పూజ్యులగు దేవదూతలు పెక్కండ్రు కలరని నమ్ము క్రైస్తవులు లోనగువారు హిందువులు దేవతలం బేర్కొనుచో వారల

మూఢులని యధిక్షేపించుచున్నవారు. ఐనను అన్ని మతముల యందును సామాన్యజనుల కగోచరులై సూక్ష్మలోక సంచారులగు దేవతలున్నారనియును, ఆ దేవతలు మానవులకుఁ గీడుమేలు లొనర్పఁజాలియున్నారనియును నమ్మకము నేయున్న వారు. కావున సర్వేశ్వరుఁడొకఁడును, సర్వనియంతయును, తదాజ్ఞా ప్రవర్తకులగు దేవతలనేకులనియును సర్వమతములవారు సామాన్యముగ నమ్మువిషయములు.

II. జీవాత్మలు : ఈశ్వరాంశములు

అన్నిమతములవారు జీవతత్త్వము నిరూపించుచో జీవుఁడు కేవలశరీరము కాఁడనియును, శరీరముకంటె వేఱుగానుండు శరీరమునకధీశ్వరుఁడును నగు జీవుఁడు వేఱుగ నున్నవాఁడని యును, ఆ జీవుఁడు ఈశ్వరాంశమనియును బ్రతిపాదించు చున్నారు. శరీరమే జీవుఁడని చెప్పునట్టి మతము [illegible] గానరాదు. ఆ జీవుఁడు ఈశ్వరాంశమై యుండుటవలననే యీశ్వరునిం బోలి సచ్చిదానందస్వరూపుఁడై యున్నవాఁడు. ఈశ్వరుఁడు మహాజ్యోతిస్స్వరూపుఁడును జీవాత్మలాజ్యోతి నుండి వెలువడిన విస్ఫులింగములనియును ముండకోపనిషత్తు నను, ఈశ్వరాంశములని భగవద్గీతయందును నిరూపింపఁబడి యున్నది.

యథా సుదీప్తాత్పావకాద్విస్ఫులింగాః
సహస్రశః ప్రభవంతే సరూపాః ।

తథాక్షరా ద్వివిధా స్సోమ్యభావాః
ప్రజాయంతే తత్ర చైవాపియంతి ॥

(ముండకోపనిషత్తు)

మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః ॥ (గీత)

III. పరమపురుషార్థము

జీవు లీశ్వరాంశములు గనుక విస్ఫులింగములం దేరీతి నవి వెలువడివచ్చు మహాజ్యోతిలోని శక్తులన్నియు లీనముగా యున్నవో యారీతి నీశ్వరునిలోని సమస్తశక్తులును లీనమై బీజభూతములుగ నున్నయవి. ఈ శక్తులన్నియు వికసించి వ్యక్తమగుటయే పరమపురుషార్థము. దీనికొఱకే జీవులను సంసారమునందు జగదీశ్వరుఁడు ప్రవేశింపఁజేయుచున్నాఁడు. జీవులు సంసారమందు బ్రవేశించి యనేకజన్మములెత్తి స్వకర్మా నుసారముగ నిహాపరలోకములయందు సుఖదుఃఖముల ననుభవించి శుద్ధచిత్తులయి పరిపక్వదశయందు వైరాగ్యభక్తి జ్ఞానపరిపూర్ణత నొంది పరమేశ్వరునియందువలె సమస్తకల్యాణగుణములను బూర్ణముగ నొందుదురు. దీని నీశ్వర సన్నిధానము చెందుటయనియు, నీశ్వరస్వరూపము నొందుట యనియు, స్వస్వరూపమును బొందుటయనియును జెప్ప వచ్చును. ఇదియె ముక్తి. వివిధమతస్థులు రుచివైచిత్ర్యముచేఁ బురుషార్థస్వరూపమును బలువిధములుగ వర్ణించుచున్నను నాయామత మూలగ్రంథములను జక్కఁగ బరిశీలించి సమ

ర సముచేసి చూడ నాస్వరూపవర్ణనమునందు స్వల్ప భేద ముండ వచ్చును గాని తాత్త్విక భేద మొండైన నున్నట్లు చెప్పఁబోలదు. మఱియు నందఱును నీపురుషార్థము నుపదేశించి దాని సాధ్యమగునంత శీఘ్రముగను సులభముగను బొందు నుపాయములఁ బరిశీలించి బోధించుచుఁ దమతమవారివారిని వృథముగఁ బురుషప్రయత్నము సేయఁబురికొల్పుచున్నారు. ఇంద్రియగోచరమగు నీభూలోకము గాక సూక్ష్మములును, నింద్రియాగోచరములునగు నితరలోకము లున్నవనియు నవియన్నియుఁ జీవునకు నానావిధ అనుభవములకు స్థానములై జ్ఞానము నొసంగునవనియును వారందఱు యేకోక్తిగ నంగీకరించుచున్నారు. ఇట్టి పరమపురుషార్థమునే ముఖ్యముగ నిరూపించి తత్సాధనముల బోధింపని మతమొక్కటియుం గానరాదు.

IV. సాధనమార్గము

జీవుఁ డీభూలోకమునఁ బెక్కుమాఱులు జన్మించి కర్మానుసారముగ నితరలోకములయందు సుఖదుఃఖముల ననుభవించి, యా యనుభవముచేఁ బ్రతిజన్మమునందును జ్ఞానమును వృద్ధిచేసికొనుచుఁ గాలక్రమమున ననేకజన్మసంసిద్ధిచేఁ బరమపురుషార్థమును బొందు నని హిందూమతమున వెల్లడిగఁ జెప్పఁబడియున్నది. ఆ జ్ఞానమును సాధించుటకు ముఖ్యముగ నీభూలోకము పాఠశాలవంటిది, భూలోకమున సాధింపఁదగిన

జ్ఞానమును బరిపూర్ణముగ సాధించువఱకు జీవుఁడు మరల మరల జన్మించి యీ భూలోకమను పాఠశాలకు రాక తీరదు. పరమ దయానిధి యగు భగవంతుడు జీవులు పరిపూర్ణు లగునంత వఱకు భూలోకమున వారికి జనన మొసఁగి కృతార్థులను జేయు నుగాని యొక్క జన్మముననె పరిపూర్ణులు కానిమాత్రమున వారిని శాశ్వతనరకప్రాప్తులను జేయఁడు. మఱియు నొకజన్మముననే మనుజుడు పూర్ణుఁడగు ననుటయు అసాధ్యమైన పని.

పురాణేతిహాసములలో చెప్పిన యొక అంశమును మాత్రము మనము మరువరాదు. ఈ ముక్తి యనునది తాను బ్రహ్మానందము ననుభవించుటకే కాదు. కరుణానిధియగు పరమేశ్వరుఁడు సమస్తలోకములను తన యపారకృపతో నేలుచున్నాఁడు. వారి యనుగ్రహమువలన మనము పరిపూర్ణులము కాగా ఆ పరిపూర్ణతను వారి మహాత్కార్యముతో తోడ్పడుటయందే వినియోగించుట పరమధర్మము. ఇంతకంటె నుత్తమమగు పురుషార్థ మేమున్నది. ప్రసిద్ధ మహాపురుషులందఱు దీనినే బోధించియున్నారు. ప్రహ్లాదుఁడు తనకు ప్రసన్నమైన శ్రీ నృసింహమూర్తినిగూర్చి యేమిచెప్పెనో చూడుడు.

శ్లో॥ ప్రాయేణ దేవ! మునయ స్స్వవిముక్తి కామాః
మౌనం చరంతి విజనే న పరార్థనిష్ఠాః ।
నైతాన్ విహాయ కృపణాన్ విముముక్షు ఏకో
నాన్యత్త్వదస్య శరణం భ్రమతో నుపశ్యే ॥

తా. ఓ దేవా, తఱచుగా మునులు తమ ముక్తిని మాత్రము గోరినవారలై, విజనస్థలమున మౌనము నవలంబించి సంచరింతురు. అట్టివారు ఇతరుల శ్రేయస్సువిషయమై యాసక్తిగలవారు కారు. ప్రపంచమునందు దీనులై యున్న వీరిని విడిచి యొక్కండనే మోక్షాసక్తుండను గాను. సంసారమున దిరుగు నీ జనమునకు రక్షకుండవు నీవు తప్ప మఱి యొకరిని గానను.

ఈ విషయమునే మనవారు ఇప్పుడు మఱచిపోయి తమ తమ కృతార్థతనే ముఖ్యముగ యోచించుచు, లోకదుఃఖములను మఱచిపోవుచున్నారు. ఇది చాల ప్రమాదము. మహానుభావుల ధర్మము లోకసంగ్రహమే. ఈ అంశమును దివ్యజ్ఞాన సమాజమువారు విశేషముగ నొక్కి చెప్పుచున్నారు.

ఈ పునర్జన్మవిధి హిందూబౌద్ధమతములయందు మాత్రమే బోధింపఁబడి యున్నదనియును, తక్కిన మతములయందు లేదనియును నాధునికులగు పాశ్చిమమతస్థులయుఁ గ్రైస్తవులయు, మహమ్మదీయులయు నభిప్రాయము. కాని మహమ్మదీయులలోఁ దత్త్వజ్ఞులగు "సూఫి" తెగవారి గ్రంథములలో నీ సిద్ధాంతము గన్పట్టుచునే యున్నయది. క్రైస్తవుల మత గ్రంథమగు 'బైబిల్' లోఁ బెక్కుచోట్ల నీ సిద్ధాంతము విస్పష్టముగ సూచింపఁబడియే యున్నది. ఈ కాలపుఁ గ్రైస్తవులలోఁ గొందఱును, మహమ్మదీయులును నీ సిద్ధాంతమును

నమ్మరుగాని శ్రద్ధాళువులై తమతమ గ్రంథములను జక్కఁగ శోధించిన విద్వాంసు లెల్లరును దీనిని నమ్ముచునే యున్న వారు. ఇక్కాలమునఁ గ్రైస్తవమతబోధకులు సైతము కొందఱీ సిద్ధాంతమును దమప్రజలకు బహిరంగముగ బోధించుచునే యున్నవారు. దివ్యజ్ఞానసమాజశాఖలు ప్రపంచమునందు వ్యాపించుచు రాఁగ రాఁగ నీ ముఖ్యసిద్ధాంతము నెల్లయెడల నన్నిమతములవారు నంగీకరింప మొదలుపెట్టిరి.

V. కర్మము

ఈ రీతిని జీవులు భూలోకమునఁ బెక్కుపర్యాయములు జన్మించి సంసారప్రవాహమున ననేక కర్మములు—లౌకిక కర్మములును, మతాచార కర్మములును—చేసి, వాని ఫలానుసారముగఁ బరలోకము నొందుదురు. వారు మనస్సుచేఁ గాని, ఇంద్రియములచేఁ గాని, కాయముచేఁ గాని చేయు కర్మము లొక్కొక్కటియుఁ దదనుగుణమగు ఫలము నిచ్చుచునే యున్నవి. ప్రతిమనుష్యుఁడును దాను జేయు కర్మానుసారముగ నిహలోకమునను, బరలోకమునను దప్పక ఫలముల ననుభవించును. కావున నీ జన్మమున శ్రద్ధతోఁ బుణ్యకర్మములఁ జేయుచుండిన నిహపరలోక సుఖముల నొందుటయే గాక మీఁది జన్మమునందును నట్టి పుణ్యకర్మములందు రుచి గలుగఁజేసి యట్టి పుణ్యకర్మములందె ప్రవర్తించునటులఁ బ్రేరే

పించు శుభవాసనలతోడను, అట్టి పుణ్యకర్మములను మఱి
కొంత దార్ఢ్యముతోడను, మఱికొంత సులభముగను జేయు
స్వభావముతోడను, శక్తితోడను, జన్మించును. ఆ మీఁది
జన్మమున నా జీవున కిట్టి పుణ్యకర్మములఁ జేయు నవకాశము
నిచ్చు దేశకాలనిమిత్తములు నొసఁగఁబడును. ఆ కారణమున
జీవుఁ డెక్కుడుగ నట్టి పుణ్యకర్మములనే యొనర్చి యుత్తరో
త్తరజన్మములఁ జిత్తశుద్ధినొంది కాలక్రమమున మోక్షసాధన
జ్ఞానసంపన్నుఁడగుచు సంసారచక్రమునుండి విముక్తుఁడయి
మోక్షమును జెందుచున్నాఁడు. అట్లుగాక కామక్రోధములు
గలిగి పాపకృత్యములను జేసిన జీవుఁ డిహపరలోకముల
దుఃఖమును జెందుటయేగాక పిదప జన్మములందు సైతము
పాపకృత్యములయందు రుచియును ప్రేరణయును గలుగఁ జేయు
నశుభవాసనలతో జన్మించి యట్టి పాపకర్మములందే ప్రవ
ర్తించు స్వభావము గలవాఁడగు. మఱియుఁ బుణ్యకార్య
ముల కననుకూలమగు స్వభావము గలిగి పుణ్యకర్మములఁ
జేయఁ బ్రతికూలములగు సందర్భములతో జన్మించును. ఐనను
జీవుఁ డీశ్వరాంశ మగుటంబట్టి స్వస్వరూపము నెఱిఁగి పురుష
ప్రయత్నము చేయ స్వతంత్రుఁడే యగును గానఁ బుణ్యకర్మ
ములను జేయుటయందును, బాపకర్మములను విడుచుటయం
దును, పురుషకారమును జూపి క్రమక్రమముగఁ బరిశుద్ధుఁ
డును పరిపూర్ణుఁడును కావచ్చును. చేసిన పుణ్యపాపకర్మము

లకు మాత్రము ఫలానుభవమును బొందక తీరదు. పాపకర్మ ములందుఁ బ్రవర్తించి మీఁది జన్మములందుఁ బూర్వ దుర్వా సనలు గలవాఁడయ్యును దనకుఁ గల స్వభావమును సందర్భ ములును బ్రతికూలము లయ్యును శాస్త్రవిచారముచేఁ గాని, సత్సాంగత్యముచేఁ గాని పాపపుణ్యముల నెఱిఁగి తాను భగవదంశస్వరూపుఁడ నను జ్ఞానమును బలపరచుకొని ధైర్య ముతో దుర్మార్గమును వదలి సన్మార్గమునఁ బ్రవర్తింప నిశ్చ యించి పూనికతో బ్రయత్నించి, పరిపూర్ణుడగును. ఇట్టి శక్తి పరమదయానిధియైన పరమేశ్వరుఁడు తనయంశమగు జీవున కొసఁగి యున్నాఁడు. కావున నెట్టి పాపియైనను జీవుఁడు స్వస్వరూపము నెఱిఁగి కర్మప్రాప్తములగు దుర్వాసనలను నిర్మూలముచేయ దృఢనిశ్చయుఁడై పశ్చాత్తాపముచేతను, సర్వభూతకారుణ్యముచేతను, భగవద్ధ్యానారాధనములచేతను, బరిశుద్ధుఁడయి కృతార్థుఁడు కాఁగలడు. కావున మనుష్యుఁడు పాపకర్మములను జేయుచోఁ గర్తృత్వము భగవంతునియం దారోపించి భగవంతుఁ డట్టి బుద్ధిని బుట్టించె ననుట యవి వేకము. విధి యనునది జీవుఁడు స్వతంత్రముగఁ జేసిన కర్మ ఫలమే కాని, అకారణముగు భగవంతుని యిచ్ఛ కాదు. కావున విధివశత యనునది మనము చేయుఁబోవు కర్మముల యందన్వయించుట యంత సరిగాదు. ఈ కర్మసిద్ధాంతము హిందూబౌద్ధమతములు మాత్రమే బోధించుచున్నవనియును,

నితర మత సిద్ధాంతములకు విరుద్ధమనియు నీకాలపు వారిలోఁ గొందఱు భావించుచున్నను, ఇతర మతగ్రంథములందును గూడ నీ విషయము గానవచ్చుచున్నది. క్రైస్తవుల మత గ్రంథమునందును "ఎట్టి బీజముల విత్తుదువో యట్టి ఫలముల నీ వనుభవింతువు", "ఎంత నీ వితరుల కిత్తువో యంతయే మరల నీ కీయఁబడును", అను నీ మొదలగు వాక్యముల వలన నీ సిద్ధాంతమే కదా స్పష్టముగ నిరూపింపఁబడుచున్నది. ఇట్లే యితర మతములయందును ఈ విషయము కానఁబడు చున్నది.

కావున నో సోదరులారా! రండు. మన మెల్లగ మీ విషయములఁ జక్కఁగఁ బరిశీలింతము. మన మన మతగ్రంథ ములఁ జక్కఁగఁ జదివి యందలి ధర్మముల ననుష్ఠింతము. మన మతాభివృద్ధికై పాటుపడి కృతార్థుల మగుదము. మతము లన్నియుఁ బ్రహ్మవిద్యాతరుశాఖలే యనియు, నా శాఖ లన్నియు నిష్టఫలదాయకములే యనియు, నెఱింగి పరమత వైషమ్యమును మాని యన్నిమతముల నాదరింతము. సర్వ జ్ఞుఁడును, పరమదయానిధియును నగు పరమేశ్వరుఁడు నానావిధ స్వరూపులైన జీవుల కాయావారికిఁ దగిన శ్రేయోమార్గముల నాయామతరూపమున నేర్పఱచియున్నాఁ డని నిశ్చయించి యాయామతములయం దాయావారికి శ్రద్ధాభక్తులు గలుగఁ జేసి ఆయామార్గముల ననుష్ఠించునటులఁ బురికొల్పుదము.

వైషమ్యములు మాని యందఱము సోదరభావమున నత్యంత ప్రేమతో నన్యోన్య సహాకారులమై భగవత్కైంకర్యమును జేయుదము. లోకమునం దసూయా స్పర్ధాతిరస్కారాది రూపమైన ద్వేషమును మాన్పి సకలజనులను భక్తిప్రేమామృత భరితులనుగఁ జేసి లోకమందంతట నైకమత్యము నెలపి లోకోపకారమునకుఁ బాటుపడుదము. లోకమునం తయు సుఖ పూరితముగఁ జేయుదము. పరమేశ్వర ప్రీతిఁ జేయుదము. కృతార్థుల మగుదము.

సర్వేజనా స్సుఖినోభవంతు !

రెండవయధ్యాయము

గురుశిష్య ధర్మములు

సృష్ట్యాదిని భగవంతుఁడు మానవుల సృజించి వారిలఁ గృతార్థులనుజేయ మన్వాదిమహాత్ములను సైతము మానవ కోటియందు నవతరింపఁ జేసె నని పూర్వాధ్యాయమున సూచింపఁబడెను. ఆ మహనీయుల స్వరూప మించుక విచారింపఁదగియున్నది.

ఒక్కొక్క బ్రహ్మకల్పమునందును జన్మించు జీవులయం దనేక తారతమ్యములు గలవు. వారిలోఁ గొందఱు తమ బూనికతోఁ దమధర్మముల నెఱింగి చక్కఁగ ననుష్ఠించి కర్మఫలములఁ బూర్ణముగ నొందఁజాలియుందురు. ఇట్లు గొందఱు స్వధర్మములఁ జక్కఁగ ననుష్ఠించి యనేకజన్మములఁ గ్రమక్రమమునఁ బక్వమునొంది సంసారసాగరమును దాఁటి పరిపూర్ణులయి, సిద్ధులై, ధర్మస్వరూపులై, యీశ్వరతాదాత్మ్యమును జెంది ముక్తులై యీశ్వరాజ్ఞాపరిపాలనమును బూని లోకహితము పొంటె వర్తించుచుఁ గల్పాంతమున నీశ్వరునియందు లీనమై యుందురు. పూర్వకల్పమునఁ గడతేరిన యమ్మహాపురుషులు వర్తమానకల్పాదియందు అధికారులై

పామరజనోద్ధారణార్థము జనన మొందుదురు, కాని కేవల సామాన్యజనులవలెఁ గర్మనిబద్ధులై జనన మొందువారు కారు. ఇట్టివారే ఋషు లనునామమునఁ బరఁగువారు. వారలు పరిపూర్ణబ్రహ్మానందానుభవము కలవారయ్యును, సంసారసాగరమున మునింగియుండు సజ్జులయం దపారకరుణచే లోకమున మాటిమాటికి సమాన నామరూపములతో[1] జన్మించి శరీరధారులై వర్తింతురు! లోకమున నసంఖ్యాకులగు జీవులు పామరులై సమస్తదుఃఖభాజనులయి సంసారమున వర్తింపుచుండఁ దాము నిర్వాణసుఖ మనుభవింప నిచ్ఛ లేనివారలై యపారదయచే లోకమున జీవులందఱును గడ తేరుదనుక నీ మహాపురుషులు పాటుపడ నిశ్చయించి వర్తింతురు. వీరలు బ్రహ్మవిద్యానిధులై జగమునందలి యజ్ఞానాంధకారమును దొలఁగించి బ్రహ్మజ్ఞానమను వెలుఁగును బ్రకాశింపఁజేసి జగము నుద్ధరింపఁ బూనియున్నవారు. వారలు పరమాత్మతత్త్వమును, పరమాత్మకును జీవులకును బ్రపంచమునకును గల సంబంధమును, సమస్తభూతముల యథార్థతత్త్వమును

[1] పరిపూర్ణులైన జన్మమున వారు ధరించిన స్థూలశరీరమునే, తమ యోగబలముతో, వేలకొలది వత్సరములకాలము నిలుపుకొని కాని, లేక ఇష్టానుసార మా శరీరమును విడిచి మరియొక శరీరమును ధరించినను, పూర్వపు నామరూపములనే ధరించిగాని, లోకమున వర్తింతురు. వారు జరామరణములను జయించినవా రనబడుదురు.

సమస్తభూతములు ప్రాప్యస్థానమును బొందుటకు సాధనము లగు మార్గములను జక్కఁగ దెలిసియుండుటం జేసి ప్రకృతి జనసామాన్యమునకు వలయు ధర్మములను నిరూపింపఁ దగి యున్నవారు. మహర్షులనఁ దగువారలే కల్పాదియందు రాజులుగ సహితము జన్మించి సకలజనుల గక్షించి యుండఁదగువారు. వారివారికిం దగిన ధర్మము లనుష్ఠింపఁ జేయుచురు. అప్పుడు సర్వజనోపయోగముగ వర్ణాశ్రమధర్మముల స్థాపించి జీవకోటుల యోగ్యతానుసారముగ వర్ణాశ్రమ విభాగమును జేసి తగిన కట్టుబాటుల నేర్పఱచి లోకమును బరిపాలించుచుండురు. మనుస్మృతి లోనగు ధర్మశాస్త్రములన్నియు మహర్షిప్రోక్తములే. ఆ పురాతన గ్రంథములయందు రాజధర్మములును, భృత్యధర్మములు, సాంఘిక నియమములు, బ్రహ్మవిద్యాసారము మొదలగునవి సమగ్రముగఁ బ్రతిపాదింపఁబడియున్నవి. బ్రహ్మవిద్యాసార మనఁదగు పరవిద్యను భగవంతుఁడు మనువు, ఇక్ష్వాకు మొదలగు రాజర్షులమూలముననే లోకమున వ్యాపింపఁజేసెనని శ్రీ గీతాశాస్త్రమునఁ జెప్పఁబడి యున్నది.

> ఇమం వివస్వతే యోగం ప్రోక్తవా నహమవ్యయమ్ ।
> వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవేఽబ్రవీత్ ॥
> ఏవం పరంపరాప్రాప్తమిమం రాజర్షయో విదుః ।
> స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥
>
> (గీతా. 4 - 1, 2)

తా. శాశ్వతమైన యీ యోగమును నే, నర్జునా, సూర్యునకుపదేశించితి. అతఁడు మనువునకుం జెప్పె. మను విక్ష్వాకునృపున కెఱిఁగించె. ఇట్లు క్రమక్రమముగ వచ్చిన యీ యోగసారమును రాజర్షు లెఱుఁగుదురు. అట్టి యీ యోగము చిరకాలము జరుగఁగా నశించెను.

మహర్షులచేఁ బ్రతిపాదింపఁబడిన ధర్మము లన్నియు కాలానుసారముగ గల్పాంతము వఱకు ననుష్ఠేయము లయియున్నయవి. చక్కఁగ బరిశీలించి చూడ నా ధర్మములు ఒక్కదేశమునకు మాత్రము గాని, ఒక్క కాలమునకుఁ గాని నిర్దేశింపఁబడినట్లు గానరావు. అవి యధికారానుగుణముగ సర్వజనానుష్ఠేయములును, సర్వలోకోపయుక్తములును, అయియున్నయవి. సర్వజ్ఞులయిన వారిచే విధింపఁబడి యుండుటం జేసి జీవుని సర్వోత్తమ మగుపదవిని జెందించుటయం దతిసమర్థములయియున్నవి. ఆధునికులు వారలవలెఁ బరిపూర్ణజ్ఞానులు గామిం జేసి, నా విధుల తాత్పర్యము గ్రహింపలేక వాని స్వారస్య మెఱుంగఁజాలకున్నారు. ఆ ధర్మము లన్నియుఁ జక్కఁగ ననుష్ఠింపఁబడినచో లోకమున మానవకోటికి మాత్రమే గాక చరాచరములగు సమస్తభూతములకు నత్యంత సుఖ మొనఁగూర్పఁ జాలియుండును. మఱియు, నీ ధర్మాచరణముననె యదృశ్యము లగు భువరాదిసూక్ష్మలోకవాసులగు దేవతలకును, మానవులకును ఆనుకూల్యము సిద్ధించి

లోకమున దేవతాప్రసాదసాధ్యములగు వృష్ట్యాదులు సకాలమునఁ గల్గుటయును సస్యములు ఫలించుటయును సిద్ధించి లోకమునకుఁ బరమ సుఖావాప్తి గలుగఁజాలును. అజ్ఞానముచే నా ధర్మములను విడిచినట్లైన లోకమున మానవకోటియందు అన్యోన్య వైషమ్యభావము కలుగుటయే గాక సకలారిష్టములు గలుగుటకును ఆస్పదమగుచున్నది. వర్తమానకల్పమున మహర్షులు కొంతకాలము మానవకోటియందు జన్మించి జీవకోటులకు మార్గదర్శకులై యుండి కాలక్రమమున జీవకోటుల శ్రేయస్సు నుద్దేశించియే యదృశ్యులయి యున్నవారు. అదృశ్యులయ్యును లోకాభివృద్ధిని గోరుచు, లోకుల వర్తనముల నిరీక్షించుచు, వారెప్పు డనుష్ఠేయధర్మలోపమున క్షీణత నొందుదురో అప్పుడు తా మవతరింపఁగాని, పరిశుద్ధులును, నిష్కాములును, లోకసంగ్రహమే ధర్మముగ నెంచి ప్రపంచాభివృద్ధికై పాటుబడ కంకణము కట్టుకొని లోకమున పనిచేయువారును అగు తమ శిష్యులమూలమునగాని చక్కఁజేయుచుఁ గల్పాంతము వఱకు సనాతన ధర్మములను గాపాడుచు, లోకమున యోగ్యులగు మానవులకు సహాయులగుచుఁ గాచియున్నవారు. కల్పాంతరము నుండి యవతరించిన యాధికారికులు గాక వర్తమానకల్పమునందు జన్మించిన జీవులలోఁ గూడ ధర్మానుష్ఠానబలముచేఁ జిత్తశుద్ధినొంది స్థితప్రజ్ఞులై భగవద్భక్తులై, గుణాతీతులై యీశ్వరభావమునొంది జీవన్ము

క్తులయినవారు నమ్మహనీయ సంఘమునం జేరి వారలవలె మహర్షి శబ్దవాచ్యు లగుచున్నారు. అట్టి జీవన్ముక్తులు సంసార సాగరమగ్నులై యుండు పామరులను దరింపఁజేయుటకుఁ బలుమరు నీ భూలోకమున జన్మించి పాటుపడుటయుం గలదు. వారలు సదా బ్రహ్మానందభరితులై యోగ్యులగు శిష్యులను వెదకుచు నట్టివారి మనస్సులయందుఁ బ్రవేశించి వారి యజ్ఞానమును దొలగించి పరిశుద్ధులను జేసి వారలఁ దమవలెఁ బరిపూర్ణులుగఁ జేయుటకుఁ బాటుపడుచున్నవారు. అట్టివారి యనుగ్రహమునకుం బాత్రులయిన యెడల వారి సహాయము తప్పక కలుగును. మానవులు స్వప్రయోజనపరులై యుండు నంతవఱకు వారల యనుగ్రహము నొందఁజాలరు. పరోపకారబుద్ధి వృద్ధికానుకాను వారల కటాక్షవీక్షణమునకు నర్హులయి శీఘ్రకాలమున వారి ప్రత్యక్షసందర్శనమునకుం బాత్రులయి వారలవలెఁ గాలక్రమమునఁ బరిపూర్ణులై జీవన్ముక్తులు కాఁజాలుదురు. వీరలే పరమగురువులని పిలువఁబడువారు.

గురువులు

గురువనఁగా నజ్ఞానమును బోఁగొట్టి జ్ఞానోపదేశము చేయువారు. సంసార సముద్రమును దరించి యితరులను దరింపఁ జేయఁజూనినవారలే గురువులు.

అవిద్యాహృదయగ్రంథి బంధమోక్షో భవేద్యతః ।
తమేవ గురురిత్యాహు ర్గురుశబ్దార్థవేదినః ॥

తా॥ అజ్ఞానజనితమైన హృదయబంధములకు మోక్ష మెవరివలనఁ గలుగునో వారిని గురువని గురుశబ్దార్థము నెఱిఁగిన పెద్దలు వచించుచున్నారు.

బ్రహ్మాండమున గురువు లనేక తారతమ్యముల నొప్పి యున్నవారు. ముఖ్యముగా గురువులను పరిపూర్ణు లనియు, నపరిపూర్ణులనియును రెండువిధములుగ విభజింపనగు. ప్రథమమున నానందస్వరూపుఁడును, సకల జ్ఞానప్రదాతయును, సంసారరూపమగు నజ్ఞానమును దహించి మహాశ్మశానవాసియు నగు పరమేశ్వరుఁడే "గురోర్గురుః" అను నామమున నొప్పువాఁడు. వారి వెనుక వారికిఁ బ్రతినిధులగు మానవుల వారి పాదారవిందములఁ జేరఁగలవారని చెప్పఁబడిన జీవన్ముక్తుల సమాజము. వీరలు నరగురువు లనియుఁ బిలువఁబడుదురు. వీరు లోకహితార్థము స్థూలశరీరధారులై, ఇప్పుడును హిమవత్పర్వతప్రాంతముల నున్నవారని ముందే సూచింపఁబడియె. ఐనను వీరు సూక్ష్మశరీరములతో జగమునందంతట సంచరించుచున్నారు.

చరంతి హ్యవనౌ నూనం బ్రాహ్మణా భక్తవత్సలాః ।
మూఢానాం గ్రామ్యబుద్ధీనాం బోధనాయాత్ర తిష్ఠినః ॥
కుమారో నారద ఋభు రంగిరా దేవలోఽసితః

. . . . ఏతే పరేచ సిద్ధేశాశ్చరంతి జ్ఞానహేతవః ॥

(భాగవతము, ౬ స్కంధము)

తా. భగవద్భక్తులగు బ్రాహ్మణులు, కుమారనారదులును, ఋభువును, అంగిరసుండును, దేవలాసితులును, పరాశర మైత్రేయ భరద్వాజ వసిష్ఠాదులును, మఱియు ననేకులు సిద్ధులును మాబోంటి యల్పబుద్ధులకు పరమార్థజ్ఞానప్రదాతలై, యున్మత్తాదిచిహ్నములు గలవారై (అనఁగా వారి మహిమను బయలు పఱుపక) స్వేచ్ఛగా భూతలంబున సంచరించుచున్న వారు.

పూర్వకాలమందు జనులు శ్రద్ధాళువులుగ నున్నందున వారల కీమహాత్ములు అప్పుడప్పుడు దర్శనమిచ్చుచుండిరి. ఇప్పుడన్ననో మానవులు కేవల విషయాశక్తులై, స్వప్రయోజనపరులై, భక్తిశ్రద్ధావిహీనులై యుండుటంబట్టి యుమ్మహాత్ముల సందర్శింప నర్హులుగాక యున్నారు. ఐనను భగవత్స్వరూపు లగు వారిని మనము చూడఁజాలక పోయినను మనల నామహాత్ములు సర్వకాలములయందు దివ్యదృష్టితోఁ జూచుచు, మన జ్ఞానవృద్ధికొఱకును, బరిశుద్ధతకొఱకును యత్నించుచున్నారు. సప్తర్షులు, నారదుఁడు, వ్యాసశుకాదులు, గోత్రఋషులు, ఉద్ధవమైత్రేయులు లోనగు వార లీకారణ గురువర్గమునఁ జేరియున్నవారలు. వీరలు పరిపూర్ణులయి, భగవత్స్వరూపులయి, తమకువలయు ప్రయోజన మొద్దియు

లేకున్నను జీవులను దరింపఁజేయుటయే పనిగాఁ బూని ప్రతి
ఫలము నించుకంతయుఁ గోరక సూర్యుఁడు లోకమునకు
వెలుగునిచ్చునటులఁ బాటుపడుచున్నవారు. ప్రపంచమున
జనులను బరిపాలించుటకుఁ జక్రవర్తి యున్నట్లుగను వారి
యాజ్ఞకులోఁబడి మంత్రివర్గమును, రాజప్రతినిధులు నుండు
రీతిని జ్ఞానపరిపాలనమునందు "గురోర్గురుః" అనఁబడుఁగు
మహాదేవుఁడు చక్రవర్తిస్థానమున నుండఁ బైఁ జెప్పిన మహా
త్ముల సమూహము రాజప్రతినిధులంబోలియున్నది. ఇకను
వీరందఱును దఱచుగ నదృశ్యులై పనిచేయువారలు. కావున
సామాన్యజనులకు జ్ఞానోపదేశము చేయుటకొఱకుఁ దమశిష్యు
లలోఁ గొందఱిని జన్మింపఁజేసి మఱియు లోకమున జన్మించి
యుండువారలలో నుత్తములను గొందఱఁ దమశిష్యులనుఁగా
జేసికొని వారిమూలమున నజ్ఞులగువారలకు జ్ఞానము నుపదే
శింపఁజేయుచు భక్తిశ్రద్ధల వృద్ధిఁజేయుచు జగంబున బ్రహ్మ
విద్య మఱువక యుండునట్లు కాపాడుచున్నవారు. వీరలే శా
నునహరింపఁబడిన యపరిపూర్ణులగు గురువులు. వీరలే శాస్త్ర
గురువు లనియును బిలువఁబడుదురు. వీరు భూలోకమున
జన్మించి చిత్తైకాగ్ర్యముతో నీశ్వరధ్యానము చేయుచు, శాంతి
దయ నభ్యసించుచు కారణగురు ప్రేరితులయి, తాము
దమశిష్యప్రశిష్యులతో యోగ్యులగు సామాన్యజనులకు గాక
యోగమార్గముల నుపదేశించుచుఁ, బరుల మేలుకొఱకుఁ

పాటుపడుచుఁ గొంతకాలము భూలోకమునఁ గలసి మెలసి వర్తించుచు జ్ఞానధనమును వెదజల్లి కాలక్రమమున జీవన్ముక్తులై కారణగురువుల సమాజమును జేరుదురు. ఆ శిష్య ప్రశిష్యులలోఁ గొందఱుమాత్రము మహాత్ములగు కారణ గురువుల సందర్శనమునకుఁ బాత్రులయి వారి యాజ్ఞాను సారము లోకమున వర్తించుచుందురు. మఱికొందఱు అట్టి యుత్తమపదవిని జెందక యుండియుఁ దదనుగ్రహపాత్రులై వారిచేఁ బ్రేరితులై లోకుల జ్ఞానాభివృద్ధికొఱకుఁ బాటుపడు దురు. తఱుచుగ లోకమున సజ్జనులును విచారపరులునై యుండువారలకు ఆకస్మికముగ నెవఁడో యొక పురుషుఁడు వచ్చి మనస్సందేహములఁ బాపి సత్పథమును జూపిపోవుట వినుచున్నాము. ఇట్లు మంచిమార్గమును జూపిన పురుషులు కారణగురువుల ప్రేరేపణమున వచ్చినవారలే యని యెన్నఁ దగియున్నయది. ఇట్లు కారణగురువు లనేకవిధములుగ జీవులను సన్మార్గప్రవర్తకులుగఁ జేయుచుందురు. అందొకటి రెండు మార్గములు ముఖ్యముగ నిందు సూచింపఁబడును.

౧. దేశకాలానుగుణముగఁ దమలో నొకరు భూలోకమున నవతరించిగాని లేక తమ ముఖ్యశిష్యుల సమయాను సారముగ నానాదేశముల జన్మింపఁ జేసికాని జీవకోటికి భక్తి జ్ఞాన వైరాగ్యమార్గముల యథార్థతత్త్వము నుపదేశించి, తమ ప్రవర్తనముచే మార్గదర్శులై, పరిశుద్ధులను జేయుదురు.

౨. జీవన్ముక్తులగు కారణగురువులు సూక్ష్మశరీరధారులయి యజ్ఞుల యజ్ఞానాంధకారమును జూచి చింతించి పరమకారుణ్యముతో దానిం దొలఁగించు నిచ్ఛతో వారి హృదయకవాటములయొద్దఁ గాచియుందురు. ఆ మహాత్ములకు జీవులందఱియందు సమానమగు కరుణ కలిగియుండినను జీవులు తమ కామక్రోధాదులచేతను, అహంకార మమకారముల చేతను వారల యనుగ్రహము నొందఁజాలక యున్నారు. సూర్యుని వెలుగు సమస్తగృహములందుఁ బ్రవేశించి ప్రకాశింపఁజేయ సిద్ధముగనుండ గృహస్థువు ద్వారములను, గవాక్షములను గట్టిగ మూసికొనినచో నా వెలుఁగు గృహమునం బ్రవేశింపఁజాలక యుండును గదా. ఐనను సూర్యకిరణములు కవాటమునొద్దనుండి చీఁకటి కొట్టఁజాలక గృహస్థు లెప్పుడైన వాకిలి తెఱచినయెడల నప్పుడని యింటిలోఁ బ్రవేశించి యంధకారమును బోఁగొట్టి గృహమును బ్రకాశింపఁ జేయును. అట్లే మనుష్యుల హృదయములకుఁ గామక్రోధాదులు, నహంకార మమకారములును దట్టమగు కవాటప్రాయమ్ములై కారణగురువులను హృదయములయందుఁ బ్రవేశింపకుండునట్లడ్డపడుచున్నవి. ఎప్పుడైన జీవులు కామక్రోధాదుల నించుకయైన వదలి హృదయకవాటమును దెఱచినయెడల దయామయులగు నామహాత్ములు హృదయములం బ్రవేశించి యజ్ఞానాంధకారమును దొలగించి భక్తిజ్ఞానవైరాగ్యముల నమించి

తముగ నభివృద్ధినొందించి కాలక్రమమున వారికిఁ బ్రత్యక్షము గూడ నగుదురు. కావున నా జీవన్ముక్తులు సర్వకాలముల యందును జీవులను దివ్యదృష్టిచేఁ జూచుచునేయున్నవారు. ఏ జీవుని హృదయమందైనను భక్తిశ్రద్ధలును, భూతదయయు వెలయుచుండునో అట్టివానిని వారు దివ్యదృష్టిచే గాంచి శిష్యునిచేఁ బిలువఁబడకయే యాఁకలిగొన్న బిడ్డయొద్దకుఁ దల్లి పరుగిడివచ్చులాగున బరుగిడివచ్చి జ్ఞానోపదేశము చేసి పోవుచుందురు. ధ్రువున కరణ్యమునందును, ప్రహ్లాదునకు గర్భమునందును దివ్యదర్శియగు నారదమహర్షి వారల హృదయపారిశుద్ధ్యమును దెలిసికొని పిలువబడకయే వచ్చి మిగుల కరుణతో నుపదేశించెను కదా! మఱియును బరీక్షిన్మహారాజుచేఁ బిలువఁబడక దయానిధియగు శుకమహర్షి వచ్చి శ్రీమద్భాగవత పురాణమును బోధించెను గదా! అట్లే జీవులు పరిశుద్ధాత్ములైనయెడల వారలకు జ్ఞానోపదేశము చేయ నిప్పుడును నా మహాత్ములు రా సిద్ధముగ నున్నవారు. ఆ మహాత్ముల దయకుఁ బాత్రులై వారి శిష్యులుగనుండు జీవులు కొంద ఱిప్పుడును నీ జగమునఁ బ్రవర్తించుచున్నవారు.

శిష్యధర్మములు

మహాత్ముల యనుగ్రహమునకు బాత్రుఁడు కాఁగోరు శిష్యుఁడు పరిపూర్ణుఁడగు కారణగురువువంటివాఁ డగుటకుఁ

ప్రయత్నించవలెను. గురువు పరిపూర్ణదయాస్వరూపుఁడును, బరిశుద్ధుఁడునై యుండును గావున శిష్యుఁడును దయాస్వరూపుఁడును, బరిశుద్ధుఁడును నగుటకు యత్నింపవలయు. కామక్రోధములను, అహంకార మమకారములను, విషయాసక్తులోనగు వానిని నశింపఁజేసికొన వలయును. దీనికి ముఖ్యసాధనము ధ్యానమే. ధ్యానమన కారణగురువునుగాని, ఈశ్వరునిగాని మనస్సున నిలిపి పూజించి ప్రేమించుట. ధ్యేయమూర్తి యొక్క కళ్యాణగుణములను మనస్సున మననము చేసి నిత్య ప్రవర్తనమునం దభ్యసించినయెడల "యద్ధ్యానం తద్భవతి" యను న్యాయానుసారముగ ధ్యాని ధ్యేయమూర్తి సారూప్యము నొందును గావున శాంతము, ఇంద్రియనిగ్రహముగల గురువును ధ్యానించిన నట్టివాఁడే యగు. ఈశ్వరునిగాని గురువునుగాని ధ్యానించుచుండఁ దదీయ తేజస్సు ధ్యాని మనంబునం బ్రవేశించి సంసారమాలిన్యమును నశింపఁ జేయును. వేపాఁకు తినిన చేదు చక్కెర తినుటచే నెట్లు తొలఁగింపఁ బడుచుండునో అట్లే కోపస్వభావము గలవాఁడు ఈశ్వరుని శాంతమూర్తినిగా ధ్యానించిన నాకోప ముపశమించును. కామిగానుండువాఁడు కామదాహకుఁడగు సదాశివుని ధ్యానించిన నిష్కాముఁడగును. ఇట్లే యితర దుర్గుణములుగల వారాయాగుణములకు విరుద్ధములగు నీశ్వర కల్యాణగుణముల ధ్యానించిన నాయాదుర్గుణములు నశించి సద్గుణములు

వృద్ధియగును. ఇంతియగాక భక్తుడు సర్వభూతసమబుద్ధితో సర్వజనశ్రేయోభివృద్ధికొఱకు ధ్యానము చేయవలయు. ఇట్టి ధ్యాన మొనరించిన నతనియందు స్వప్రయోజనపరత్వము, అహంకారము పూర్ణముగ నశించి పరిశుద్ధత గలుగును. అప్పుడతనికి గారణగురువు ప్రత్యక్షసందర్శన మొసంగును. కాఁబట్టి శిష్యుఁడు శ్రేయఃప్రాప్తిని గోరినచో వానికి భూతదయయు, నీశ్వరధ్యానమును బక్షికి ఱెక్కలవలె ముఖ్యసాధనములయి యుండును. ఆ భూతదయ యథాశక్తి భూతసేవారూపముగ గన్పడవలయును గాని, కేవలము మానసికముగను వాచికముగను నుండిన చాలదు. మనస్సు తన వశమున నుండిననేగాని వీని నభ్యసింప సాధ్యముకాదు. మనస్సున జలనస్వభావమును వృద్ధిచేయునవి యింద్రియములు గాన మొదట నింద్రియముల వశవర్తులనుగాఁ జేసికొనవలయును. ఆ పిదప స్వతః చంచలస్వభావము గల మనస్సును విషయములనుండి మరలించి యేకాగ్రముగఁ జేయఁదగు. ఇట్లేకాగ్రమగు మనస్సుచే ధ్యానము చేయుచు, నీశ్వరుని యనంతకళ్యాణగుణములను సదా మననము చేయుచు, నా గుణముల నభ్యసించుచుండ వలయును. ఈ రీతిని సాధించుచుఁ గ్రమక్రమమున సాధనచతుష్టయము అనఁగా నిత్యానిత్యవస్తువివేకము, వైరాగ్యము, శమాదిషట్కసంపత్తియు, ముముక్షుత్వము నను నీ నాలుగు సాధనములను సంపాదింప

వలయును. ఈ సాధనచతుష్టయసంపత్తి గల్గుటకు సాత్వికా హారములను గొనుటయు, రాజస తామసాహారముల వర్జించు టయు, బ్రహ్మచర్యము నవశ్యకములు.

ఈ విధముగ ధర్మముల శ్రద్ధతో ననుష్ఠించుచు రాను రాను జీవునకు అజ్ఞానతమస్సు వదలి దివ్యదృష్టి కలుగును. జ్యోతి స్స్వరూపుఁడగు కారణగురువు లోచనగోచరుఁడై పరిపూర్ణ జ్ఞానోపదేశము చేసి పరమేశ్వర సాక్షాత్కారము గావించును. జీవుఁడు బ్రహ్మానందభరితుఁడై పరమేశ్వరునివలె లోకాను గ్రహమందే సదా నిష్ఠుఁడై యుండును. సదాశివుఁడు హాలా హాల విషమును తాను మ్రింగి, లోకమును రక్షించినట్లు పూర్ణుఁడగు మహానుభావుఁడును లోకదుఃఖమును తాను భరించి లోకము ననుగ్రహించుచుండును. మహానుభావుడగు రంతిదేవుఁడు ప్రార్థించిన దదియే గదా!

ఆర్తిం ప్రపద్యేఽఖిలదేహభాజాం
అంతఃస్థితో యేన భవంత్యదుఃఖాః ॥

తా. సమస్తదేహధారుల దుఃఖము నాకు వచ్చుగాక. నేను (నా మనశ్శాంతి) వారలయందు ప్రవేశించి వారందఱు దుఃఖములేనివారగుదురుగాక యనియే నేను ప్రార్థించునది. మనమందరము రంతిదేవునివలె నగుదుముగాక.

మూఁడవయధ్యాయము

ఈశ్వరుఁడు

ఆదియందు "ఏకమేవాఽద్వితీయమ్" అని శ్రుతులయం దుపపాదింపఁబడియుండు నిర్గుణపరబ్రహ్మ మొక్కటియె యుండె. అది యవాఙ్మానసగోచరము. ఆ తత్త్వమున్నదని గాని లేదనిగాని వచింప నసాధ్యము.

నాసదాసీన్నో సదాసీత్ ॥ (ఋగ్వేదము)

నసత్తన్నాసదుచ్యతే ॥ (గీత)

ఆతత్త్వము నిట్టిదని వాక్కులచే వర్ణింప నసాధ్యము. దానియందు వెలుఁగును, దమస్సును, దినమును, రాత్రియును, విద్యయు, నవిద్యయు, ధర్మము, అధర్మమును గూఢముగ నిహితములయి యున్నయవి. ఆతత్త్వమును వర్ణించు లక్షణ మొక్కటియుఁ గానరాదు. ఆ పరబ్రహ్మమును "నేతి, నేతి" అనఁగా "ఇదికాదు, ఇదికాదు" అను వాక్యములచే వర్ణించి యున్నారు. బుద్ధిగ్రాహ్యములగు లక్షణము లన్నియు నాతత్త్వ మును సూచింపఁజాలవు. ఏ విధమున వర్ణించినను ఆ వర్ణన లాతత్త్వమునం దన్వయించవు. కావున "నేతి, నేతి" యను శబ్దములచే గ్రహింపఁదగి యున్నయది.

యదాఽతమస్తన్నదివా న రాత్రిర్న సన్న చాసచ్ఛివ ఏవ కేవలః ....
ద్వే అక్షరే బ్రహ్మపరే త్వనన్తే విద్యావిద్యే నిహితే యత్రగూఢే ....
(శ్వేతాశ్వతరోపనిషత్తు)

అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మాదన్యత్రాస్మాత్కృతాకృతాత్ ।
అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ యత్తత్పశ్యసి తద్వద ॥ (కఠోపనిషత్తు)

మహావాక్యములచే సైతము నిరూపింపఁబడు వస్తువిదియే. ఇది అవిజ్ఞాతమనియు, నవిజ్ఞేయమనియును వర్ణింపఁబడి యున్నది. ఐన నవ్యక్తమగు నాతత్త్వమునుండియే వ్యక్తమగు ప్రపంచమంతయు వెలువడినది. ప్రపంచమునందుఁ బరస్పర విరుద్ధములుగఁ గన్పడు తత్త్వములన్నియు నానాఁగా ద్వంద్వములనఁబడు నవియన్నియు నా తత్త్వమునుండి వ్యక్తములాయె. ఆ తత్త్వము ద్వంద్వాతీతము. దానినుండి యీశ్వరుఁడును, మూలప్రకృతియును వెలువడఁగా వానినుండి చరాచరాత్మకమగు ప్రపంచమంతయు నభివ్యక్తమయ్యెను.

అవ్యక్తమనియు, నిర్గుణమనియు నిరూపింపఁబడియుండు పరబ్రహ్మమునుండి యపరబ్రహ్మమనియును, సగుణబ్రహ్మమనియు, నీశ్వరుఁ డనియును బిలువఁబడు తత్త్వము వ్యక్తమాయెను. ఈ తత్త్వము పరబ్రహ్మమునకంటె నన్యము గాదు.

ఏతద్వై సత్యకామ, పరం చాపరం చ బ్రహ్మ యదోంకారః ॥
(ప్రశ్నోపనిషత్తు)

ద్వేవావ బ్రహ్మణోరూపే మూర్తం చైవామూర్తం చ

మర్త్యం చామర్త్యం చామృతం చ స్థితం చ యచ్చ సచ్చ త్యచ్చ ॥
(బృహదారణ్యకము)

ఈ సగుణబ్రహ్మము వ్యక్తమగునపుడు మూలప్రకృతితోఁ జేరియుండుటచే నీశ్వరుఁడును, మూలప్రకృతియు నను ద్వితయ మేకకాలమున వెలువడె నని చెప్పనగు. ఈ ప్రకృతి పురుషుల సంయోగముననే చరాచరములగు సమస్తభూతము లుద్భవించెను.

ఈ పురుష ప్రకృతులకు సంబంధము గలుగఁజేయునది యీశ్వర శక్తియే. ఈ శక్తియే మాయాశక్తి యనియును బిలువఁబడుచున్నది. చంద్రచంద్రికలకును, అగ్నికి దాహ శక్తికినివలె నీశ్వరునకును మాయకు నవినాభావసంబంధము చెప్పఁబడి యున్నది.

ఈశ్వరుఁడు సచ్చిదానందస్వరూపుఁడు. అనగా సత్, చిత్, ఆనందములను లక్షణత్రితయముతోఁ గూడి యున్నవాఁడు. అట్లే ప్రకృతియు సత్త్వరజస్తమస్సు లను గుణత్రితయముతోఁ గూడినది. ఈశ్వరునియందలి లక్షణత్రయము ప్రకృతియందుఁ బ్రతిఫలింప నొక్కఁడగు నీశ్వరునినుండి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరు లను మూర్తిత్రయ మభివ్యక్తమైనది. జగత్సృష్ట్యాది వ్యాపారములకొఱకు మూఁడురూపములు ధరించినను ముమ్మూర్తులచే నెఱుఁగఁదగు తత్త్వ మేకమగు నీశ్వరుఁడే. ఒక్కొక్కఁడును సచ్చిదానంద రూపుఁడయ్యు

సాకారనిరాకారలక్షణము ప్రధానమైయున్నయది. ఈశ్వరుఁడు రజోగుణమునం బ్రతిఫలించి సద్రూపుఁడై సృష్టికర్తయగు బ్రహ్మయయ్యెను. సత్త్వమునందుఁ బ్రతిఫలించిన యీశ్వరుఁడు చిద్రూపుఁడై స్థితికర్తయగు విష్ణువయ్యెను. తమస్సునందు బ్రతిఫలించిన యీశ్వరుఁడు లయకర్తయు అజ్ఞానలయముచే ఆనందదాయకుఁడైన మహేశ్వరుఁడాయెను. ఈశ్వరుని సచ్చిదానందలక్షణములలో సాకారస్థితి ముఖ్యముగ నీ త్రిమూర్తులలో సాకారియుండు వ్యక్తముగ నుండును.

శ్లో॥ సత్త్వం త్రిలోకస్థితయే స్వమాయయా
బిభర్షి శుక్లం ఖలు వర్ణమాత్మనః ।
సర్గాయ రక్తం రజసోపబృంహితం
కృష్ణం చ వర్ణం తమసా జనాత్యయే ॥

(భా. ౧౦ స్కం. ౩ అధ్యా. ౨౦ శ్లో॥)

తా. అనఁగా పరబ్రహ్మ స్వరూపుండవగు నీవు త్రిలోకరక్షణముకొఱకు సత్త్వగుణముతోఁగూడి శ్వేతవర్ణమును, జగత్సృష్టికొఱకు రజోగుణముతోఁగూడి రక్తవర్ణమును, లోకప్రళయముకొఱకుఁ దమోగుణముతోఁగూడి కృష్ణవర్ణమును స్వమాయాబలమున నీ వొక్కఁడవే ధరించుచున్నావని శ్రీకృష్ణమూర్తిని వసుదేవుఁడు స్తుతించియున్నాఁడు. ఈ విషయమునే తిక్కన సోమయాజిగారు నిర్వచనోత్తర రామాయణమున నిట్లు చెప్పియున్నారు.

ఉ॥ సత్త్వరజస్తమోగుణవశస్థితిఁ గైకొని లీలనీవ బ్ర
హ్మత్వముఁ దాల్చి లోకముల కన్నిటికిన్ జననం బొనర్తు వి
ష్ణుత్వముఁదాల్చి వానికి మనోజ్ఞతరస్థితి వృత్తిఁ జేర్తు రు
ద్రత్వము దాల్చి వానికుచితంబగు సంహృతిఁగూర్తురాఘవా ॥

ఈశ్వరశక్తి సహితము ముమ్మూర్తులతోడ శక్తిత్రితయముగ భాసిల్లుచున్నది. ఆ శక్తి యిచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తియని ముప్విధములుగ వ్యక్తమగుచున్నది. అందుఁ గ్రియాశక్తి బ్రహ్మతోఁ జేరి సరస్వతిగను, జ్ఞానశక్తి విష్ణువుతోఁ గూడి లక్ష్మిగను, ఇచ్ఛాశక్తి మహేశ్వరునితోఁ జేరి యుమగను వెలయుచున్నది. మాయాశక్తి ప్రకృతియందుఁ బ్రవేశించి సదా వర్తించుచుండుటచే మూలప్రకృతి మాయ యని పిలువఁబడుట కలదు.

ఏకమగు బ్రహ్మము బహుత్వమగుట కిచ్ఛయించి ప్రకృతిని వశపఱచుకొని తపోమహిమచే జగత్తును సృజించెను.

సోఽకామయత బహుస్యాం ప్రజాయేయేతి ।
స తపో తప్యత, స తపస్తప్త్వా ఇదగ్ం సర్వమసృజత ॥

భగవంతుఁడు బహుత్వము నిచ్ఛయించి సృష్ట్యున్ముఖుఁడు కాఁగా భగవంతునియందు లీనమైయుండిన భూతములన్నియు వెలువడి ప్రకృతియందుఁ బ్రవేశించి వ్యక్తము లయ్యెను. అందు మొట్టమొదట నింద్ర, వాయ్వగ్ని, వరుణ, క్షితి దేవత లుద్భవించి ఆకాశవాయుతేజస్సలిల భూతత్త్వస్వరూపులై

తదధిపతులయి ప్రకాశించిరి. వీరలు ఒక్కొక్కరు సప్తలోకములలో నొక్కొక్కదాని కధిపతులై యున్నవారు.

ఇవియే ప్రసిద్ధములైన పంచమహాభూత వికారములైన సప్తలోకములు.

పృథివీతత్త్వ వికారమే భూలోకము. దీనికి పృథ్వీదేవత యధిపతి. అప్తత్త్వ వికారము భువర్లోకము. దీనికి వరుణుం డధిపతి. తేజస్తత్త్వ వికారము సువర్లోక మహర్లోకములు. వీని కగ్ని యధిపతి. వాయుతత్త్వ వికారము జనలోక తపోలోకములు. వీనికి వాయు వధిపతి. ఆకాశతత్త్వ వికారము సత్యలోకము. దీని కధిపతి యింద్రుడు. ఈ యేడులోకముల మీఁద నింకను రెండులోకము లున్నట్లు గ్రంథములందు సూచింపఁబడి యున్నయది. అవి వైకుంఠ గోలోకము లను నామములచేఁ బరఁగుచున్నవి. వైకుంఠము మహాకారణ తత్త్వమను నామాంతరము గల యనుపాదక తత్త్వముతోడను, గోలోకము మహత్తత్త్వమను పేరంబరగు నాదితత్త్వముతోడను, నీ రెండు తత్త్వములతోఁ జేయఁబడియున్నవి. మఱియుఁ బ్రళయకాలమున నీశ్వరునియందు లీనమైయున్న జీవాత్మలును బహిర్ముఖులై వ్యక్తమగుదురు. జీవాత్మలు భగవదంశములగుటచే నాదియందు నవ్యక్తమనఁబరఁగు ననుపాదకతత్త్వమున లీనమైయుండి వ్యక్తమై పాంచభౌతిక మగు ప్రపంచమునందుఁ బ్రవేశింతురు.

ఈ లోకములయందు మొదట భూర్భువస్స్వర్లోకములను మూఁడింటియందు జీవాత్మలు సంసారచక్ర నిబద్ధములై పరిభ్రమించుచుండును. ఈ మూఁడులోకములే గ్రంథములందుఁ ద్రిలోకీయను నామమునఁ బరఁగుచున్నవి. ఈ లోకములే బృహదారణ్యకోపనిషత్తునందు మనుష్యలోకము, పితృలోకము, దేవలోకము అని నిరూపింపఁబడియున్నవి.

> అథ త్రయోవావలోకా మనుష్యలోకః పితృలోకో
> దేవలోక ఇతి ॥

సామాన్యముగ జీవు లీ లోకత్రయమును అతిక్రమింపఁజాలరు. ఐనను ఇంద్రియనిగ్రహముచేతను, యోగాభ్యాసముచేతను, భక్తిజ్ఞానవైరాగ్యములచేతను బరిశుద్ధులయి పరిపక్వము నొందినవారలు మహర్లోకమును దాఁటి జనతపస్సత్యలోకములను బొందఁ గల్గుదురు. ఈ లోకము లన్నియు జీవులకు సుఖానుభవరంగములుగ నేర్పడియె. ఇట్లు సత్యలోకమును బొందిన జీవుఁడు శబ్దబ్రహ్మస్వరూపుఁడై ముక్తిసాన్నిధ్యము నొందిన వాఁడగును. ఈ లోకములన్నియు నొకటికంటె నొకటి సూక్ష్మములై యొకదానిలో నొకటి వ్యాపించియుండుటచే నొక్కస్థలమునందె యన్నిలోకము లున్నవని తెలియఁదగు. ఐనను ఒక్కొక్క లోకమును దానికంటె క్రిందిలోకమున కంటె సూక్ష్మమయి తిలబీజమునఁ దైలము వలె నాలోకములను నిండి వాని నతిక్రమించి వ్యాపించి

మున్నది. ఊర్ధ్వలోకములని పిలువఁబడు లోకములన్నియు
ొక దానిపై నొకటి యున్నవనుట కాదు.

ఊర్ధ్వశబ్దముచే నుత్కృష్టతయు, సూక్ష్మతయు నెఱుఁగ
గుఁ గాని స్థలమునం దౌన్నత్యము గాదు.

నాల్గవయధ్యాయము

జీవస్వరూపము

జీవుఁ డీశ్వరాంశ యని పై యధ్యాయమున సూచింపఁ బడియె.

మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః
మనష్షష్ఠా నీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ।
శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ ॥ (గీత)

జీవులు భగవదంశ లగుటంబట్టి సచ్చిదానందస్వరూపు లయ్యెదరు. వారు ప్రళయకాలమునం దీశ్వరునందు లీనమై యుండి కల్పాదియందు బహిర్ముఖులై పాంచభౌతిక శరీరములను బొంది యాయాలోకములందు సుఖదుఃఖ రూపమగు ననుభవములను బొంది జ్ఞానమును గ్రహింతురు. దీనిచే లోకములన్నియు జ్ఞానదాయకములగు భోగస్థానములని యేర్పడును.

సామాన్యముగ జీవుఁడు శరీరములకంటె విలక్షణుఁడు. శరీరముల కధీశ్వరుఁడు. శరీరములు నశించు చుండ శరీరి యగు జీవుఁడు నాశము లేక యుండువాఁడు. జననమరణములు పాంచభౌతికమగు శరీరమునకుఁ గాని జీవునకు లేవు.

న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితావానభూయః ।
అజో నిత్యశ్శాశ్వతో౽యం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ (గీత)

తా. ఈ యాత్మ ఒకప్పుడైనను బుట్టుటగాని చచ్చుటగాని లేదు. ఇంతకుముందు లేకయుండుస్థితిగాని ఇకమీద లేకపోవునట్టి కాలముగాని లేదు. పుట్టుక లేనివాడును, నిత్యుడును, నిర్వికారుడును, సనాతనుడును నగును. శరీరము నశించుచుండినను నశించువాడు కాడు.

జననమరణములు, వృద్ధిక్షయములు లేనిజీవుడు పాంచభౌతికమగు శరీరములం బొంది మనస్సు చేతను, ఇంద్రియములచేతను నానా లోకములయందు సుఖదుఃఖరూపమగు ననుభవముల నొంది తత్త్యాగమును గ్రహించుచున్నవాడు. ఈ జీవుని స్వరూపము నించుక విచారింతము.

జీవుని స్వరూప మీరీతిని వేదాంతపంచదశి యను గ్రంథమున విద్యారణ్యస్వాములవారు వర్ణించియున్నవారు.

చైతన్యం యదధిష్ఠానం లింగదేహశ్చ యః పునః ।
చిచ్ఛాయా లింగదేహస్థా తత్సంఘో జీవ ఉచ్యతే ॥ ౪-౧౧

కూటస్థచైతన్యమును, లింగదేహమును, లింగదేహమందలి చిచ్ఛాయయు నీ మూడును గూడి జీవుడనబడును. జీవుడీశ్వరాంశ మగుటం బట్టి సచ్చిదానందస్వరూపుడగు.

ఆకాశతత్త్వమునుండి యొక భూతసూక్ష్మమును గ్రహించి కేవలావిద్యోపాధి గలిగి యానంద ప్రతిబింబమును జైతన్య స్వరూపము గలవాఁడును నగు. దీనికి దివ్యజ్ఞానసమాజము వార లాత్మయని పేరిడిరి. అంతట వాయుతత్త్వమునుండి యొక భూతసూక్ష్మను గ్రహించి చిత్స్వరూపమగు చిచ్ఛాయ యగును. దీనినే దివ్యజ్ఞానసమాజమువార లాత్మోపాధిక బుద్ధి యని చెప్పుదురు. తరువాతఁ దేజస్తత్త్వమునుండి యొక భూతసూక్ష్మమును (అణువును) గ్రహించి స్వరూపమగు లింగ శరీరమనఁగా మిగిలియుండు శరీరములకు బీజరూపమైన దానిని నిర్మించును. దీనిని సమాజమువారు మనస్సని చెప్పుచున్నారు. కనుక వారు జీవుని "నాత్మబుద్ధిమనస్సు" ని పిలుచుచున్నారు.

ఈ రీతిని జీవుఁడు తక్కిన లోకములం దొక్కొక్క భూత సూక్ష్మమును గ్రహించి యాయాలోకములందుఁ దనకు శరీర ముల నిర్మించుకొనును.[1] ఇట్లు భూలోకమునఁ బృథ్వీతత్త్వము లోని స్థూలభాగముతోఁ జేయబడిన స్థూలశరీరమును ధరించు చున్నాఁడు. ఈ శరీర మన్నమయకోశమని పిలువంబడుచున్న యది. దీనియందుఁ గర్మేంద్రియ జ్ఞానేంద్రియములకు స్థానము లగు గోళములున్నయవి. జీవుఁడు వీనిచే జాగ్రదవస్థయందు స్థూల ప్రపంచమున వ్యవహరించుచుండును. స్థూలశరీరము

[1] ఈ విషయము తొమ్మిదవ యధ్యాయమున విస్తరించి వ్రాయఁబడి యున్నది.

యొక్క పోలికకలిగిన ప్రాణమయకోశము పృథివీతత్త్వము నందలి సూక్ష్మభాగముతో నిర్మింపఁబడి యుండును. దీని యందుఁ బ్రాణములు ప్రసరించుచు నుండును. ఈ కోశము స్థూలశరీరములో నంతటను వ్యాపించి వెలుపల నహింతము కొంతదూరము వ్యాపించియుండును. ఇది యెల్లరికిఁ దృగ్గోచరము కాకున్నను యోగదృష్టిచే జూచువారలకు గోచరమగును. ఇది సూక్ష్మశరీరమునం దొకభాగమని చెప్పనగు. జీవుఁడు భువర్లోకమున నస్తత్త్వముతోఁ జేయఁబడిన శరీరమును దాల్చును. దీనియందుఁ గర్మేంద్రియ జ్ఞానేంద్రియము లుండును. ఇదియు రాగద్వేషములకును, సర్వ్యగాముములకు నునికిపట్టు. ఈశరీరము యోగదృష్టిని జూడ నన్నమయ ప్రాణమయకోశములం దంతట నిండి యారెండిటికి బాహ్యమునఁ గొంతిదూరమువఱకు వ్యాపించియున్న ట్లగపడును. వివిధములగు విషయేచ్ఛలు, కామక్రోధములు, లోభమోహములు లోనగునవి మనస్సున నంకురింపఁ దత్సదృశముగ నీ శరీరము వివిధ వర్ణములుగ మాఱుచుండును. కామక్రోధాదులు లేని మహాత్మునియందుఁగాని శిశువునందుఁగాని యీ శరీరమున నిట్లు మాఱుచుండు వర్ణములు కనఁబడవు. ఇదియు సూక్ష్మశరీరమునం దొకభాగముగ నెన్నఁదగు. దీనిని గామమయ శరీరమని చెప్పనగు. మఱియు సువర్లోకమునఁ దేవతత్త్వ సంబంధమగు ప్రకృతితో నిర్మింపఁబడి యాలోకమున

జీవుఁడు వర్తించుట కుపాధియగు శరీరము నొందును. ఈశరీరమున జీవుని మనోవృత్తులన్నియు నిమిడియుండును. వివిధములగు సంకల్పములు మనస్సున నుత్పత్తియగునపుడు ఈశరీరము నందును దత్సదృశముగ వర్ణము మాఱుచుండును. అనఁగా మనస్సునందు దుర్వృత్తులు పొడమ నీశరీరము బొగ్గు మొదలగు పదార్థములవంటి యసహ్యాకారములగు వర్ణములు కలదియగు. అట్లుగాక నిష్కామప్రేమ మభివృద్ధికాఁగా నా శరీరమున మనోహరమగు రోజాపువ్వు (గులాబి) వర్ణము కనఁబడును. ఇట్లే భక్తి కలిగినచో నత్యద్భుతమగు నీలవర్ణము కనఁబడును. ఇట్లు వివిధములగు వృత్తులు నానావిధ వర్ణములుగ యోగదృష్టికిఁ జూపట్టును. ఇదియును బైఁజెప్పఁబడిన యస్తత్త్వముతోఁ జేయఁబడిన శరీరమును సామాన్యముగ నొక్కటిగ వర్తించుచు మనోమయకోశ మనుపేర నొప్పుచుండును. ఈ శరీరముయొక్క వృత్తులు మనోవృత్తులని యెఱుఁగఁదగు. ఈశరీరము ముందుదహరింపఁబడియున్న కోశముల నన్నింటిని వ్యాపించి బయటఁ గూడఁ గొంతదూరము వ్యాపించియుండును. ఈ కోశములన్నియు జన్మజన్మమునకు మాఱుచుండునవి. మఱియు నా తేజస్తత్త్వసూక్ష్మభాగములతో నిర్మితమై జీవునకు ముక్తిపర్యంతము విడువని యుపాధియై పై నుదహరింపఁబడిన శరీరముల కన్నింటికంటె సూక్ష్మతరమై యుండు శరీరమును జీవుఁడు మహర్లోకమునఁ దాల్చును. ఇదియు

వేదాంతశాస్త్రమున విజ్ఞానమయకోశమనఁ బరఁగు. ఈ కోశము జీవుని శుభాశుభవాసనల కన్నింటికి నునికిపట్టవు. జీవుని వాసనలన్నియు నిందు బీజరూపముగ నుండుటచే నిది యనేక జన్మములకు మూలమై యున్నది. మఱియు సూక్ష్మ సూక్ష్మతరములగు మనోవృత్తుల కన్నిటి కిది యుత్పత్తి స్థానము. ఇందుత్పత్తియగు మనోవృత్తులన్నియుఁ దఱచుగఁ గామవివర్జితములై యుండును. ఇయ్యది శుద్ధమనస్సను నుపాధి యని చెప్పనొప్పు. ఇదియును గూడఁ బైన జాణించిన శరీరముల నన్నింటిని వ్యాపించి వాని వెలుపలను నపారము వెలయుచుండును. ఇది యోగదృష్టికి సత్యద్యుతి తేజోమయ ముగఁ గన్పడును. మహర్లోకమునకంటె సూక్ష్మమైన మూఁడులోకములయం దానందమయకోశ ముండఁ దగు. అదియుం దిది కేవల అణుమాత్రముగ నుండి జీవునకు భక్తి జ్ఞానవైరాగ్యము లతిశయింప నతిశయింప మిక్కిలి తేజోవంత మయి దివ్యస్వరూపమున వెలుఁగుచుండును. ఈ విషయము రాఁబోవు నధ్యాయమున విస్తరించి వ్రాయఁబడు.

జీవునకుఁ బైఁ జెప్పఁబడిన శరీరము లన్నియు నుపాధులుగనుండ స్థూలశరీరమగు నన్నమయకోశము మాత్రము సామాన్య జనులకు దృగ్గోచరమగును. తక్కుంగల శరీరము లన్నియు యోగదృష్టికి మాత్రమే గోచరములగు. యోగదృష్టిచే నాలోకింపఁబడినను స్థూలశరీర మన్నిటికంటె

స్థూలముగను, జిన్నదిగనుఁ గన్పడుచున్నది. తక్కిన యుపాధులన్నియు స్థూలశరీరమున వ్యాపించి దానిం జుట్టుకొని యుండును. ఇవి యొకదానికంటె నొకటి సూక్ష్మమై యొకదానికంటె నొకటి తేజోవంతమై కన్పడుచుండు. కావున స్థూలశరీరమునకు వెలుపలనుండి యోగదృష్టికి మాత్రము కనఁబడుభాగము తేజస్సని పిలువఁబడుచున్నయది.

అయిదవయధ్యాయము

తేజస్సు

తేజస్సన వెలుఁగు. స్థూలపదార్థములకు వ్యతిరేకమయ్యు దానిని జేరి ప్రకాశించుచుండు వెలుగు తేజస్సు.[1] మనుష్యునందువలెఁ బ్రపంచమునందున్న ప్రతివస్తువు చుట్టును దదనుగుణమగు తేజస్సు అండమువలె నుండునని శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. దీపముగల గాజుబుడ్డి చుట్టును గొంతదూరము వఱకు దీపకాంతి ప్రసరించుచుండును గదా! ఆ గాజుబుడ్డి పోవుచోటులందెల్లను వెలుఁగుసహితము పోవుచుండునుగదా! అట్లు ప్రతివస్తువు (అనఁగా పాషాణములు, వృక్షములు, జంతువులు, మనుష్యులు, ఋషులు, దేవతలు) చుట్టును నాయావస్తువులకుఁ దగిన తేజస్సు వెలయుచుండును. ఇయ్యది దివ్యదృష్టిగలవారికిమాత్ర మగపడును. జాత్యంధుఁడు సూర్యరశ్మిని దెలిసికొనఁజాలక సూర్యరశ్మియే లేదని వాదించినను దృష్టిపాటవము గలవారి కది కనఁబడుచున్నయట్లు తేజస్సును మన చర్మచక్షుస్సులచేఁ జూడఁజాలక మనమది లేదనుకొని

[1] తేజః = అనగా త్వగింద్రియ వ్యతిరేకేణ ప్రకాశవిశిష్టా యా త్వక్ — శంకరభాష్యము.

నను దివ్యదృష్టిగలవారికి గోచరమై యది స్థిరముగ నిరూపింపఁబడుచున్నది. ఆ తేజస్స్వరూపమును బట్టి వస్తుగుణములను దెలియఁదగు. యోగమహిమచే నొప్పు మహనీయులు సామాన్యజనులకు జూచినంతనే వారి గుణముల గ్రహించుచుండుట గ్రంథములందు సూచింపఁబడి యుండుటఁ గాదా? మనుష్యులయందువలె నితరవస్తువులయందు నైతము నానావిధములుగ దేజస్సు కనఁబడుచుండును. కొన్నింటియందు దుర్గుణములను సూచించు హేయ మగు తేజస్సును, మఱి కొన్నిఁటియందు సామాన్యమగు తేజస్సును, ఇంకను గొన్నిటియం దుత్తమమును బరిశుద్ధము నగు దివ్య తేజస్సు నున్నట్లు యోగులు చెప్పుచున్నారు. ఈ కారణమునుబట్టి ధర్మశాస్త్రములయందుఁ గొన్నికొన్ని పదార్థములు పరిశుద్ధము లనియును, పూజార్హము లనియును, భోజనార్హము లనియును, ధారణార్హము లనియును నిర్దేశింపఁబడి యున్నయవి. తులసియు, దాని పూసలును విష్ణు ప్రీతికరములనియును, విష్ణుభక్తులు వాని నుపయోగించినఁ బరిశుద్ధులగుదు రనియును; అట్లు బిల్వము, రుద్రాక్షలు శివప్రీతికరము లగుటచే శివభక్తులకు ధారణార్హము లనియును నిర్దేశింపఁబడియున్నది కదా! మఱియు భోజనపదార్థములయందుఁ గూడఁ గొన్ని పరిశుద్ధ తేజోవంతము లగుటచేఁ సాత్వికము లనఁదగి జ్ఞానవైరాగ్య ప్రదము లనియును, మఱికొన్ని మలిన తేజోవంతము లగుట

వలన రాజసము లనియుఁ దామసము లనియు నఁబడి కామక్రోధాదులను, నిద్రాలస్య ప్రమాదాదులను వృద్ధిచేయు ననియును నిరూపింపఁబడి యున్నయవి. ధర్మశాస్త్రకర్తలు యోగదృష్టిచే నొప్పు మహాత్ములగుటం బట్టి యాయా పదార్థములయందున్న తేజోవిశేషములం బరిశీలించి సాత్విక రాజస తామసాహారములఁ జక్కఁగ విభజించి నిర్ణయించి యున్నవారు. ఆధునికులలోఁ గొంద ఱప్పదార్థముల యందున్న రాగముచేతను, అట్టి దృష్టి లేనివా రగుటచేతను, ఈ భేదము లసంగతములని యార్షోక్తులను నిరాకరించుచున్నవారు. కాని యవి పరిపూర్ణజ్ఞానముచేఁ జెప్పుమాటలు కావు. కాఁబట్టి ధర్మశాస్త్రముల ననుసరించి భోజనార్హములగు సాత్విక పదార్థములను మాత్రము గ్రహించుచు, నిషిద్ధపదార్థములఁ ద్యజించుచుండిన మనుష్యుఁడు దన తేజస్సును బరిశుద్ధముగఁ జేసికొని బాగుపడును. అట్లు గాక రాజసతామసాహారములఁ గొనినయెడల శరీర మపరిశుద్ధమై మలిన తేజస్సు గలిగి సత్ప్రవర్తనమునకును, భక్తిజ్ఞానవైరాగ్యాద్యభ్యాసమునకును ప్రతిబంధక మగును.

మనుష్యునకును ఇట్టి తేజస్సు గలదు. జీవుని సూక్ష్మశరీరములన్నియు స్థూలశరీరమునం దంతట వ్యాపించి యాశరీరము వెలుపల సహితము కొంతదూర మావరించియుండు ననియు నాభాగము తేజస్సని వ్యవహరింపఁబడుననియు ముందే చెప్పఁ

బడియె. మఱియు నాశరీరములు మనోవృత్తుల ననుసరించి భిన్న భిన్న వర్ణములు గలవిగ మాఱుచుండు ననియును జెప్పఁబడియె గదా! గాజుకుప్పె (లాందరు) లో తెల్ల పగలు వత్తిని వెలిఁగించినచో నా వెలుఁగు దానిచుట్టు కొంతదూరము వఱకు వ్యాపించి యా గాజుకుప్పె వెంటఁ బోవుచుండును. అటుల వివిధ వర్ణములుగల వెలుఁగుల నిచ్చు పగలువత్తుల నొకదాని వెనుక వేఱొకదాని నాగాజుకుప్పెయందు వెలిఁగింప దాని వెలుఁగుసహితము దాని ననుసరించి మాఱుచుండును గదా! మనుష్యుని శరీరము గాజుకుప్పెగను, మనస్సు వెలుఁగుచుండు పగలు వత్తిగను భావింపుడు. మనోవృత్తులు మాఱినట్లెల్ల మనోమయకోశముయొక్క వర్ణము మాఱుచుండునని ముందే సూచింపఁబడియె. మనస్సు మాఱునటుల శరీరముచుట్టునుండు తేజస్సు మాఱుచుండును. మనస్సునఁ గోప ముద్రేకమైనయెడలఁ జుట్టునున్న తేజస్సు రక్తవర్ణముగను, కామోద్రేక మగుచో నది దాసానిపూవు రంగువలె (జపాకుసుమతుల్యముగ) మాఱును. కేవల స్వప్రయోజన పరత్వము గలిగినచో నా తేజస్సు పండుపోఁకరంగుగ మాఱును. ఎక్కుడగు బుద్ధిప్రసారము గలుగుచో నది సువర్ణ వర్ణముగలది యగు. పరోపకారబుద్ధి గలిగి భక్తిజ్ఞానము లభివృద్ధియై, సదా ధ్యానపరుఁడై యుండు రాజయోగి తేజస్సు స్ఫటికముఁబోలి నిర్మలమై సూర్యకాంతి ననుకరించుచుండును.

సామాన్యజనులయం దీ తేజస్సు శరీరముచుట్టు నించుమిం చుగ రెండడుగులు వ్యాపించియుండును. పరిపూర్ణుఁడగు రాజ యోగులలో కొందరి తేజస్సు రెండు మూఁడు మైళ్లువఱకు వ్యాపించి యుండునని యనుభవజ్ఞులు వచించుచున్నారు. సాధారణముగ మానవు లొకనినొకరు కలిసినపుడు వారి శరీ రముల నావరించియుండు తేజస్సు లొకదానితో నొకటి కలియును. అట్లు కలియుటవలన వారలగుణము లొండొరుల కాపాదించును. కోపియగువాఁడు శాంతుని సమీపించిన యెడల వారిద్దరి సూక్ష్మశరీరముల సంస్పర్శముచే నతని క్రోధ గుణ మించుక శాంతముగ మాఱుఁదగు. లేక శాంతుని శాంతగుణ మొక్కించుక కోపముగ మాఱినను మాఱునగు. ఈ యుభయుల గుణములలో నెవ్వారి గుణము ప్రధానముగ నుండునో వారిగుణములు ఎదుటివారి గుణముల నొక్కింతగ మార్పఁజాలి యుండును. రక్తవర్ణముగల జలము స్వచ్ఛజల మును గలియుటచే స్వచ్ఛజలమునందుఁ గొంచె మెఱుపు రంగును, రక్తవర్ణజలమునందు రక్తవర్ణము తగ్గుటయును గలు గునుగదా! అందు రక్తవర్ణముగు జల మెక్కువగ నుండినచోఁ దుదకు రక్తవర్ణమే ప్రధానమగు. లేక స్వచ్ఛముగు జల మధికముగ నున్నచో దాని గుణము ప్రధానముగ నుండును. అటులే మానవు లిరువురు కలియునపుడు దృఢగా గుణము లెవరియందుండునో వారిగుణము లితరుని గుణములను మార్పఁ

జాలి యుండును. కావుననే సత్పురుష సాంగత్యమువలన సద్గుణము లభివృద్ధియగును. దుష్టుల సాన్నిధ్యముచే వారి గుణము లితరులకు సహిత మలవడును. తపస్సంపన్నులును, పరోపకార పారీణులును, పరమదయాళురును, శాంతస్వరూపులును నగు మహాత్ముల యాశ్రమములందు నైజవిరోధులగు జంతువు లన్యోన్య మిత్రములయి వర్తించుచుండుట గ్రంథములయందుఁ జదివియున్నాము కదా! ఇందుకుఁ గారణ మా మహాత్ముల శాంతమగు తేజోమహిమయే యని తెల్లమగుచున్నది. ఆ మహాత్ముల శాంతగుణము వారిచుట్టును వ్యాపించి యాప్రదేశముల సంచరించు భూతకోటుల నన్నింటిని శాంత స్వభావములు గలవానినిగాఁ జేయు జంతువులు గూడ సహజ వైషమ్యములను మఱచి యన్యోన్య మిత్రభావములతోఁ గలసి మెలసియుండును.

ఈ విషయము మానవు లెల్లరును జక్కఁగ దెలిసికొనఁ దగినది. ఎవ్వరైనను మనోవాక్కాయముల దుర్వృత్తి గల వారైనయెడల వారి తేజస్సు మలినమై వారి సాంగత్యము చేయువారికిని, వారిచ్చు నన్నపానాదులు గ్రహించువారికిని, వారుచేయు దానములఁ బ్రతిగ్రహించువారికిని, మఱియు వారి సంతతివారికిని నాదుష్ట తేజస్సు వ్యాపించుటచే వారెల్లరు దుష్ట బుద్ధులై చెడిపోవుదురు. ఇట్లొకఁడు చెడుటచే ననేకులు చెడి పోవుటయేగాక, ఆ దుష్టతేజస్సు క్రమక్రమమునఁ బ్రబలి

గ్రామమంతయు, మఱియు ననేక గ్రామములకును వ్యాపిం చును. ఇట్లనేకులు చేయు పాపకృత్యముల వలని దోషము మొదటివానికిం గొంతవఱకు నాపాదించును. అట్లే యొక్కా నొక గృహమునందుఁ బరమ పతివ్రత యగు నారీమణియు, ఏకపత్నీ వ్రతుఁడును, దయాళువు నగు పురుషుఁడును నివ సించు చుండినచో వారి పరిశుద్ధ తేజస్సు సమీపమున నున్నవారందఱియందు వ్యాపించి యుండఱకు సద్బుద్ధిని బుట్టించి యనేకులకు మేలుచేయును. అట్లందఱిని సత్స్వభా వము గలవారినిగఁ జేసిన పుణ్యఫల మా స్త్రీపురుషులం జెందు. కావున నెల్లవారును సర్వకాల సర్వావస్థలయందుఁ బరిశుద్ధమనస్కులై, సర్వభూతహితకాములై కరుణాస్వా వారలై భక్తిజ్ఞానవైరాగ్యముల నభ్యసించుచుండ వల యును. అట్లుండువారు తమకుఁ దెలియకపోయినను లోక మునకు మహోపకార మొనరించుచుండువారే. తాము సంసారసాగరమును దాటుటయేగాక సన్నిధిమాత్రమున నితరులను సతపింపక మంచివారినిగాఁ జేయుచుందురు. అట్లుగాక కెవ్వఁడేని దుర్వృత్తియందుండువాఁడు తాఁ జెడుటయేగాక తన సహవాసముచే లోకమునకు నపకా కారియగును. ఎల్లవారు నీ విషయమును జక్కఁగఁ దెలిసి కొని సదా దుర్వృత్తిని వదలి సద్వృత్తి నభ్యసింపవల యును.

ఎవ్వఁడేనియు భోజనకాలమున నీశ్వరధ్యానము సేయుచు భుజించినయెడల నాయన్నము శరీరదార్ఢ్యమును వృద్ధిచేయుట మాత్రముగాక దివ్యతేజస్సు కలదగుటవలన మనోబుద్ధులఁ బరిశుద్ధములఁ జేసి జ్ఞానవైరాగ్యములను సహితము వృద్ధి చేయఁ దగియుండును.

అన్నం బ్రహ్మ రసో విష్ణు ర్భోక్తా దేవో మహేశ్వరః ।
ఏవం ధ్యాత్వా ద్విజో భుంజన్నన్నదోషైర్నలిప్యతే ॥

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥

తా. అన్నము బ్రహ్మస్వరూపము. రసము విష్ణుస్వరూపము. భోక్త మహేశ్వరుఁడు. ఈ రీతిఁ దలంచుచు భుజించు ద్విజుఁ డన్నదోషములచే నంటఁబడఁడు.

ఓ యర్జునా! నే నగ్నిస్వరూపుఁడనై దేహుల దేహములను బొంది ప్రాణాపాన వాయువులం గలసి నాల్గువిధములగు నన్నమును బచనము చేయుచున్నాను.

కావుననే భక్తులు భోజనకాలమునందు జ్ఞానవైరాగ్య సిద్ధికై యీశ్వరధ్యానమును జేయుచునుందురు.

అన్నపూర్ణే సదాపూర్ణే శంకర ప్రాణవల్లభే ।
జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం మే దేహి పార్వతి ॥

అని ధ్యాన మొనరించుచు భుజించుచుందురు. అటులఁ పాకము చేయువారును, వడ్డించువారును బరిశుద్ధ సంకల్పులై

యీశ్వరుని దలంచుచునే పనిచేయవలయును. అట్లు చేయుగ దుస్సంకల్పములు గలవారైనయెడల వారి మలినతేజస్సు అన్నమునందు వ్యాపించి భుజించువారిని సహితము మాలిన్యము గలవారినిగాఁ జేయును.

మఱియు భక్తుఁడు సర్వకాలముల యందుఁ బరోపకార పరుఁడై యుండవలయు ననుట సర్వశాస్త్రసమ్మతమగు విషయము కదా! ఇట్లు పరులకు మేలుచేయుటకై దుష్టుల సాన్నిధ్యమునకుఁ గాని, ప్రాకృతజన సంఘములోనికిఁ గాని భక్తుఁడు పోవలసి యున్నపుడు నిలుకడతోఁ గొలఁదికాల మీశ్వరుని ధ్యానించి, సర్వభూతహితకాముఁడై తన మనస్సు ప్రేమతో నించి, ప్రేమస్వరూపుఁడై జనసంఘములోఁ బ్రవేశించ నగు. అట్లు దృఢముగ సంకల్పించి భగవంతుని వేఁడినచో నతని తేజస్సులో నొకభాగము రక్షకమగు కవచముగ మాఱి యతనిని రక్షించును. ఇట్టి నిద్రించుటకు ముందు సహితము ఇతరుల దుస్సంకల్పములు లోనగునవి నిద్రించు వాని నంటక యుండునటు లీశ్వరుని ధ్యానించి లోకహితమును మనస్సున దృఢముగ సంకల్పించి పరుండవలయును.

సాధారణముగ మలినతేజస్సుగల మానవులు తత్సజాతీయమగు మలినతేజస్సుగల యితరులను దమయొద్ద కాకర్షించు కొందురు. ఒక్కని సంకల్పము లితరులను స్పైతము పొందును. అట్లొకఁడు కోపిగ నుండినచోఁ గోపు లగు నితరుల కోప

సంకల్పముల నాకర్షించుకొని దానిచేఁ దనకోపమును వృద్ధి చేసికొనును. ఇంతియగాక పూర్వము క్రోధాత్ములయి యుండి మృతినొంది పిశాచరూపులుగ సూక్ష్మలోకముల సంచరించు చుండు జీవులను సహితము తనయొద్ద కాకర్షించుకొని వార లచేఁ బ్రేరితుఁడై యనివార్యక్రోధమునకు లోఁబడి యనేక పాపకార్యములను జేయును.[1] ఇట్లితరుల దుర్గుణములను, తత్స దృశములగు నితరుల సంకల్పములను, తత్సమానులును విదే హులును నగు నితర దుష్టులనుగూడ నాకర్షించుకొని క్రమ క్రమమున వృద్ధినొందు చుండును. అట్లుగాక లోకమునం దెల్లవారును భక్తులును, జ్ఞానులును, విరాగులును, ధర్మాత్ము లును గావలయునని సదా యీశ్వరుని ధ్యానించుచు సద్ధర్మ ములను భక్తి జ్ఞాన వైరాగ్యములను అభ్యసించుచు, సర్వ భూతహితమును, జేయుచుండు పురుషుఁడు తన తేజస్సు నపార ముగఁ బరిశుద్ధముగఁ జేసికొనును. ఆ తేజస్సు ఇతర యోగుల యొక్కయు, ఋషులయొక్కయు దివ్యతేజస్సుల నాకర్షిం చును. అట్టి యోగి సాన్నిధ్యమునకు సూక్ష్మశరీరధారులగు ఋషులును, మఱియు దేవతలును వచ్చి యోగి మనంబునం బ్రవేశించి యందలి మాలిన్యమును దుదముట్ట నశింపఁజేసి పోవుదురు. ఇట్లభ్యాసము చేయు యోగుల తేజస్సు దినదినాభి

[1] ఆరణ్యపర్వములో ఘోషయాత్రలో దుర్యోధనుఁడు ప్రాయోపవేశ మున నుండ నపుడు భూతములు బోధించిరను కథ ప్రమాణము.

వృద్ధి గలిగి తుదను బహుక్రోశముల వఱకును వ్యాపించును. మహాత్ముల తేజ స్సెంతదూరము వ్యాపించి యుండునో ఆ దేశమంతయు నా తేజోమహిమచే నిండియుండుటవలన నా మహాత్ముని యాశ్రమ మని చెప్పందగు.

నిగృహీతేంద్రియగ్రామో యత్రయత్ర వసేన్నరః ।
తత్ర తత్ర కురుక్షేత్రం నైమిశం పుష్కరాణి చ ॥

ఇంద్రియసముదాయమును జయించిన నరుఁ డేయే స్థలముల నివసించునో అందందుఁ గురుక్షేత్రము, నైమిశారణ్యము, పుష్కరము ఉండును. అనఁగా నాక్షేత్రము, కురుక్షేత్ర నైమిశారణ్య పుష్కరములతో సమానమని తాత్పర్యము.

ఎవ్వరేనియు నా యాశ్రమమునం బ్రవేశింప నా తేజోగాశి వారలం బరిశుద్ధులం జేసి వారలను భక్తులుగఁ జేయఁగలుగు. ఇప్పుడును గంగ మొదలగు మహానదులయందును, పవిత్ర పుణ్యక్షేత్రములయందును, అనాది దేవాలయములయందును ఋషుల దివ్యతేజస్సు వ్యాపించియే యున్నయది. ఆయా స్థలములయందు మహాత్ములగు మునులు బహుకాలము తపస్సు చేసి పామరజనులను జిరకాల ముద్ధరించుటకొఱకుఁ దమ శక్తిని మహిమను ఆయా తీర్థక్షేత్రములయందు స్థాపించియున్న వారు. ఈ కారణముల వలనను, మఱియు నాగమశాస్త్ర విధుల ననుసరించి ప్రతిష్ఠింపఁబడి యుండుటవలనను దేవాలయములు దివ్యతేజస్సుతో నిండియున్నవి. మఱియును గా

మొదలగు దివ్యక్షేత్రములకును గొప్ప దేవాలయములకును ఋషు లదృశ్యరూపముల నేతెంచి యాక్షేత్రముల మహిమ క్షీణింపకయుండ దమ తపశ్శక్తిచేఁ గాపాడుచుందురు.

కావున నెల్లవారు నమ్మహనీయుల మార్గము ననుసరించి పరిశుద్ధులై యితరుల పారిశుద్ధ్యము కొఱకు ధ్యానించుచు లోకమునందలి పరిశుద్ధతేజస్సును నభివృద్ధి చేయుటకు సదా ప్రయత్న మొనరింతురు గాక.

ఆఱవయధ్యాయము

జీవుని శరీరములు

బ్రహ్మాండమున ననేకలోకము లున్నవనియు, జీవుఁడా యాలోకములందు వ్యవహరించుటకుఁ దగిన యుపాధు లా యా లోకసంబంధమగు ప్రకృతిలోఁ జేయఁబడు ననియు ముందు సూచింపఁబడియె. ఆయా లోకసంబంధమగు ప్రకృతిలోఁ జేయఁబడిన యుపాధి, అనగా, శరీరము, ఒకటి లేనిచో నా లోకానుభవము జీవునకుఁ గలుగనేరదు, కనుక, నా లోకసంబంధమగు జ్ఞానము దొరకదు. బ్రహ్మాండమునం దలి లోకము లన్నింటియందును సాధ్యమగు జ్ఞానము నంతయు సంపాదించుకొనుటకే గదా జీవుఁడు పంచభూతాత్మకమగు నీ ప్రపంచమునం బ్రవేశించి యున్నవాఁడు. దృష్టాంతముగ నీ భూలోకమున జూతము. పృథ్వీతత్త్వముచేఁ జేయఁబడిన స్థూలశరీరము జీవునకు లేకపోయినచో నీ ప్రపంచజ్ఞాన మేలాగు గలుగును? శరీరమున కన్నొకటి లేనిచో రూప జ్ఞానము లేదు గదా! అనఁగా నానావిధములగు వర్ణములు, నానావిధములగు కాంతులు, నానావిధములగు రూపములు ఆ జీవుని కగోచరములు గదా! అట్లే శ్రోత్రేంద్రియము

లేనిచో శబ్దజ్ఞానము సున్నయేగదా! ఈలాగున నీ యొక్కొక్క యింద్రియము లేనిచో నొక్కొక్క విధమగు జ్ఞాన మసాధ్యమగుటవలన స్థూలోపాధిలేని జీవున కీ లోకజ్ఞానమే లేక పోవును. జీవున కిట్టి జ్ఞానమును సంపాదించుకొనవలయు నను నిచ్ఛ గలిగి గదా తత్సాధనము లగు నీ యుపాధులను దేవతల సహాయముచే నిర్మించుకొనెను. ఆత్మశక్తులు క్రమక్రమమున నభివ్యక్తములు కాఁగా ఆత్మ చూడఁదలచినచో నుపాధియందు గన్ను లుత్పత్తియాయెను. ఆఘ్రాణించు కోరికలచే వాని కుపయోగకరములగు కరణముల శరీరము నందుఁ బుట్టించుకొనెను. కరణములద్వారా జ్ఞానమును బొందునది యాత్మయే.

మఘవన్మర్త్యం వా ఇదగ్ంశరీరమాత్తం మృత్యునా తదస్య
అమృతస్య అశరీరస్య ఆత్మనోఽధిష్ఠాన మాత్తో వై సశరీరః ।
అథ యో వేదేదం మన్వానీతి స ఆత్మా మనో అస్య దైవం చక్షుః
సవా ఏష ఏతేన దైవేన చక్షుషా మనసైతాన్ కామాన్ పశ్యన్ రమతే ॥
(ఛాందోగ్యోపనిషత్తు)

తా. ఈ శరీరము నశ్యమగునది. మృత్యువుచే భక్షింపఁబడును. అనఁగా మృత్యువునకు లోఁబడినది. అయినను అమృతస్వరూపుఁడు, నశరీరుఁడునగు నాత్మ కధిష్ఠానముగ నున్నది. ఏతత్త్వము—ఎవరు—దీనిం దెలిసికొనియెదనని తలఁచునో ఆతత్త్వమే ఆత్మ. మనస్సు ఇంద్రియములు నను కరణ

ముల ద్వారా యీ కోశముల ననుభవించి యానందించు వాఁడు.

ఇట్లు శరీరము లన్నియు జ్ఞానసాధనములు కావున నీ శరీరముల విషయము విశదముగ విచారింపఁ దగినది.

స్థూలశరీరము, అన్నమయకోశము

జీవునకుం గల శరీరములు మూఁడు. స్థూలశరీరము, సూక్ష్మశరీరము, కారణశరీరము. వీనికే పంచకోశములనియు సంజ్ఞ కలదు. స్థూలశరీరమన నన్నమయకోశము. సూక్ష్మశరీరమందుఁ బ్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములు నున్నయవి. కారణశరీర మానందమయకోశము. అన్నమయ ప్రాణమయకోశములు రెండును భూలోకసంబంధమగు పృథివీతత్త్వ ప్రకృతి వికారములు. ఒక్కొక్క మహాభూత వికారమునందును స్థూల సూక్ష్మ తారతమ్యములుగల యేడు భాగము లున్నయవి. అందులో పృథివీతత్త్వాంతర్భాగములగు పృథివ్యప్తేజోభాగములచే నిర్మింపఁబడినది అన్నమయకోశము. మిగత నాలుగు సూక్ష్మభాగములతో నిర్మింపఁబడినది ప్రాణమయకోశము.

శరీరము లన్నింటిలోను చిన్నదియై, స్థూలమై, యల్పకాలికమైనది స్థూలశరీరము. ఇందు జ్ఞానేంద్రియ కర్మేంద్రియ గోళములు (అనఁగా నవయవములు) న్నయవి. వీని మూలమున

నింద్రియమనస్సుల ద్వారా జీవునకు భూలోకజ్ఞానము కలుగును. ఇది యన్ని శరీరములలో చిన్నదియైనను ధర్మసాధనములలో మొదటిదియును ముఖ్యమైనదియు నగును. పని చేయువాని కొలుముట్లులవలె మన శరీరము పరిశుద్ధముగను, సూక్ష్మగ్రాహిగను నుండవలయును గదా! త్రుప్పుపట్టి పదను లేని కొలుముట్లులతో పనివాఁడెంత నిపుణుఁడైనను ఏమియుఁ జేయఁజాలఁడు గదా!

మొట్టమొదట శరీర మారోగ్యము గలిగి దృఢమైనదిగ నుండవలయును. ఇందుకు శరీరపారిశుద్ధ్యము, పరిశుద్ధములగు నన్నపానాదులు, వ్యాయామమును, మంచిగాలియు నత్యావశ్యకములు. దినదినము స్నానము చేయకుండినచో రోమకూపములన్నియు మురికిచే నిండి లోపలి మురికి బయటరావీలులేకుండుటచేఁ బలువిధములగు రోగములకుఁ గారణమగును. కావున నన్ని మతములయందును దినదిన మొక పర్యాయమైనను స్నానము చేయుట విధింపఁబడి యున్నది. మన గృహములను గృహసమీప ప్రదేశములను బరిశుద్ధముగ నుంచుకొనవలయును. లేనియెడల గాలి చెడి యనారోగ్యకరమగును. నిర్మలోదకమును ద్రాగవలయు. మద్యమును వర్జింపవలయును. ఆహారములందు తామసాహారము బొత్తుగ వర్జింపవలయును. చెడినపదార్థములు, పర్యుషితములనఁగా చల్దిపదార్థములు, సారముపోయిన పదార్థములు,

మాంసములు, సల్లమందు మొదలగు మత్తుపదార్థములు, ఉల్లి మొదలగు వస్తువులు విడువఁదగినవి. ఇట్టి పదార్థములను సేవించినచో శరీరము దృఢముగాఁ గనఁబడినను సూక్ష్మము లగు విషయముల గ్రహింపఁజాల నశక్తమై యుండును. గాజ సాహారములు విడువఁదగినవియే. సత్పురుషుల సాంగత్యము చేతను, బుణ్యస్థల పుణ్యతీర్థ సేవలచేతను, దేహము పరిశుద్ధ మగును. శరీరమును జాగరూకతతోఁ బెంచినచో నది ధర్మా చరణమునకు శ్రేష్ఠమగు సాధనమగు.

మనకుఁ బుట్టుకతో వచ్చిన శరీరము మార్పు సాధ్యము గాదని తలచరాదు. శరీరము ప్రతి నిమిషమును మాఱుచునే యున్నయది. దానియందలి యణువు లెల్లప్పుడును బహిర్గత ములగుచునే యున్నవి. అట్లే ప్రతినిమిషమునను ఉచ్ఛ్వాస నిశ్వాసముల చేతను, అన్నపానాదుల చేతను నూతనముగ నణువులు శరీరమునం బ్రవేశించుచునే యున్నవి. ఈ రీతి నేడు సంవత్సరముల కాలమున శరీరమంతయు నొకసారి పూర్ణముగ మాఱునని శరీరతత్త్వజ్ఞులు నిరూపించి యున్నారు. ఏడు సంవత్సరములనాఁడు శరీరమునం దుండిన యణువులలో నొకటైన నిప్పుడు శరీరమున నుండదు. ప్రవాహమునం దొక్క జలకణమైనను, ఒక్క నిమిష మొక్క స్థలమున నిలువ కుండినను నొడ్డుననుండి చూచువారలకు నదీప్రవాహ మొక రీతిగనే యుండునట్లు తోఁచురీతిని శరీరమునందలి యణువు

లెడ తెగక మాఱుచుండినను శరీరము మాఱినట్లు మనకుఁ దోఁచును. ఇట్లు మాఱుచుండు శరీరమును బ్రయత్నముతో మంచిదిగఁ జేసికొనుట సులభము.

మఱియు నొక్క విషయమును మఱువరాదు.

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ చ ॥

శరీర మాత్మ కుపాధిగావున నది యాత్మస్వాధీనమం దుండఁ దగినది గాని యాత్మ దీనికి లోఁబడి యుండఁగూడదు. మనము శరీరమని యెంచి దానిని స్వేచ్ఛగా విడువరాదు. శరీరము మనదని తెలిసికొని మనము చెప్పినపనుల నది చేయు నట్లు చూచుకొనవలయును. మనము సంరక్షించు గుఱ్ఱములు మొదలైనవానివలె దానిని శుద్ధిగానుంచి పోషించుచు మనము చెప్పిన పనులు దానితోఁ జేయించుచు రావలయును.

ఈ విధమున బాల్యమునందుండి శరీరమును శిక్షించుచు వచ్చినచో దానిని సులభముగ స్వాధీనమునకుఁ దెచ్చుకొనఁ గలుగుదుము. బాల్యమునందు లేఁత తీఁగవలె శరీరమును ద్రిప్పుకొననగును. వయస్సు రానురాను బ్రానివలె దానిని వంచుట కష్టమగును. కావున బాలుర కీ విషయమును బోధించి వారలచే నభ్యసింపఁజేయుట మంచిది.

సూక్ష్మశరీరము

సూక్ష్మశరీరమందుఁ బైఁ జెప్పినరీతిని మూఁడుకోశము లున్నయవి. వానిలోఁ బ్రాణమయకోశ మన్నింటిలో

స్థూలము. మనోమయకోశము దానికంటె సూక్ష్మము. విజ్ఞానమయకోశ మన్నింటిలో సూక్ష్మము.

ప్రాణమయకోశము

ఇది పైఁజెప్పిన రీతిని పృథివీతత్త్వమందలి సూక్ష్మభాగములచే నిర్మింపఁబడినది. ప్రాణములు దీనినుండియే స్థూలశరీరమునకు వ్యాపించును. దీనినుండియే స్థూలశరీరమునకును మనోమయకోశములోని యింద్రియములకును సంబంధము గలిగియుండును. ఈ కోశము స్థూలశరీరమునం దంతటను వ్యాపించి నిండుకొని యాశరీరమున వెలుపలిభాగమున నైతము కొంచెము దూరమువఱకు వ్యాపించియుండును. స్థూలశరీరమునకంటె సూక్ష్మమై దాని ప్రతిబింబమువలె నుండును. ఇది సాధారణముగ స్థూలదృష్టికి గోచరము గాదు. సూక్ష్మదృష్టిగలవారి కించుక యూదావర్ణము గలిగి గోచరమగునని యనుభవజ్ఞులు చెప్పుచున్నారు.

సాధారణముగ నీ కోశము స్థూలశరీరమును గూడియే యుండును. బలమగు వ్యాధి కల్గినప్పుడును మఱికొన్ని సమయములందును స్థూలదేహమును విడిచివచ్చునని తెలియుచున్నది. అప్పుడు స్థూలశరీరము కేవల బలహీనముగ నుండును. అయిన నెల్లప్పుడును దీనికి స్థూలదేహముతోఁ దంతురూపముగ సంబంధ మెడతెగకయే యుండును. స్థూలశరీరము మాఱునట్లెల్ల నిదియును మాఱుచుండును.

శస్త్రచికిత్స చేయుటకై మైకపువస్తువులఁ బ్రయోగించి నప్పుడు స్థూలశరీరము నిశ్చేతనమై పడియుండ నీ ప్రాణమయకోశము బహిర్గతమగును. అందుచే స్థూలశరీరమునకును మనోమయకోశమునందలి యింద్రియములకును సంబంధము వదలి యుండుటచే స్థూలశరీరము పడుబాధ మనకుఁ దెలియరాదు. మైకముపోయి స్థూలశరీరమునందుఁ బ్రాణమయకోశము ప్రవేశించినతోడనే బాధ తెలియవచ్చును.

మరణకాలమందు మాత్రము స్థూలశరీరమునకును నీ కోశమునకును సంబంధము గలుగఁజేసియుండు తంతువు తెగి రెండును వేఱగును.

బ్రహ్మాండమున కంతటికి సూర్యభగవంతుఁడు ప్రాణదాతయైయుండుట తెల్లమేగదా! సూర్యబింబమునుండి తేజస్సు ప్రాణరూపముగ వెలువడి ప్రపంచమునంతయు వ్యాపించి సకలభూతముల నాడులయందుఁ బ్రవేశించి శరీరములను వీర్యవంతములుగఁ జేయుచున్నది. ఇట్లు సూర్యునినుండి వెలువడు తేజస్సునుండి యొక్కొక్క భూతము తనకు వలయు ప్రాణశక్తిని నాడులచే స్వీకరించుకొనుచుండును. కావుననే గదా సూర్యుని ప్రకాశము లేనిది యేభూతముగాని యభివృద్ధిఁ జెందఁజాలదు. ఈ శక్తి ప్రాణమయకోశము ద్వారముగ స్థూలశరీరమునకు వ్యాపించును. స్థూలశరీర మపరిశుద్ధముగను, ననారోగ్యముగ నున్నప్పుడు ప్రాణమయకోశముగూడ నపరి

శుద్ధమై దుర్బలమగుటచే వలయునంత ప్రాణశక్తిని నాడులచే గ్రహింపఁజాలక దుర్బలమగును. దీనిచే స్థూలశరీరము మఱి కొంత దుర్బలమగును.

స్థూలశరీరము సంపూర్ణారోగ్యము గలిగి యుండిన నీ ప్రాణమయకోశము సూర్యునినుండి వెలువడు ప్రాణశక్తిని స్థూలశరీరమునకు వలసినంతకంటె నెక్కువగ గ్రహించుచుండు ననియు, నప్పుడు ఎక్కుడగు ప్రాణశక్తి స్థూలశరీరమునుండి తేజోరూపముగ బయలువెడలుచుండునట్లు సూక్ష్మదృష్టికిఁ గానవచ్చుచుండుననియు ననుభవజ్ఞులు చెప్పుచున్నారు. కావున మంచి యారోగ్యముగలవారల ప్రక్కను బలహీనులు కొంతకాలము పరుండినచో నాబలవంతుల శరీరమునుండి వెలువడు ప్రాణశక్తిని బలహీనులు గ్రహించుటచే బలము గలుగును. అట్లుగాక సామాన్యుఁడగు నాఁడు రోగిప్రక్కను బరుండినచోఁ గొంతకాలమునకు దాను బలహీనత నొందును.

మరణకాలమునఁ బ్రాణమయకోశము స్థూలశరీరమును బూర్ణముగ వదలిపోవునని చెప్పఁబడియెఁగదా! అంత స్థూల శరీరము శిథిలమగుట కారంభించును. ప్రాణమయకోశమును స్థూలశరీరము ననుసరించి శిథిలమగును. స్థూలశరీర మెంత శీఘ్రముగ శిథిలమగునో అది యంత శీఘ్రముగ జీర్ణమగును. స్థూలశరీరము అగ్నిసంస్కారము చేయబడి భస్మముకాగా ప్రాణమయకోశము సహితము తుదముట్ట నశించును. శాస్త్ర

ములయందు శవమున కగ్నిసంస్కారము విధింపఁబడియుండుట కిదియే ముఖ్యోద్దేశ్యము. భూస్థాపనము చేయఁబడినచో స్థూలశరీరము జీర్ణమగుటకుఁ జిరకాలము పట్టును. కావున ప్రాణమయకోశము నశించుటకును నాలస్యమగును.

మనోమయకోశము

మనోమయకోశము రాగద్వేషాదులగు నన్ని మనోవృత్తులకు నునికిపట్టు. దీనియందు రెండు భేదములు గలవు. రాగద్వేషముల కునికిపట్టయి కామవికారమగు కామమయశరీర మొకటి. మిగిలిన మనోవృత్తుల కధిష్ఠానమగు మనోమయ శరీరము రెండవది. లోకమున సామాన్యజనులందఱికి రాగద్వేష పురస్సరముగఁగాని ప్రవృత్తి సాధారణముగ నుండదు గాన నీ రెండు శరీరములును సాధారణముగఁ గలిసియే వర్తించుచుండును.

కామమయశరీరము

ఇది యోగదృష్టికి మాత్రము గానవచ్చుచున్నది. అనేక వర్ణములతోఁ బ్రకాశించుచుండును. మనోవృత్తులు మాఱునట్లు దీనివర్ణములు మాఱుచుండును. అది యన్నమయప్రాణమయకోశముల రెంటిలోపలనుండి వ్యాపించి వానికి వెలుపలను గొంతదూరమువఱకు నుండును. బాలురయందు మనోవికాసము లేకుండుటంబట్టి వారి కామమయశరీరము సాధారణ

ముగ తెల్లగ నుండును. రాగద్వేషములు హెచ్చను హెచ్చను ఈ శరీరమునం దదనుగుణములగు వర్ణము తేర్పడుచుండును.

ఈ కోశము సమస్తమానవుల కుండినను, పశుప్రాయులగు వారియందు స్పష్టముగ నేర్పడియుండదు. చెదరిపోయిన మేఘమువలె రూప మేర్పడక యుండును. జ్ఞానమధికము కాను కాను స్పష్టమగు రూప మేర్పడి యుండాకారముగం దేలును.

ఆదియందు జీవుండు విశేషముగం గామక్రోధములకు లోంబడియుండుటచే వాని కనురూపములగు వర్ణములు కలిగి యుండును. కామము పుట్టినచో ముదురు ఎర్రవర్ణము గల్గును. మట్టివర్ణము స్వప్రయోజన పరత్వమును సూచించు. అతి క్రోధము గల్గినచో మెఱయు నల్లవర్ణముగల శూలములవలె రూపములు దీనినుండి భువర్లోకమున బయలు వెడలుననియు, భువర్లోక ప్రకృతివికారములగు నీరూపము లాక్రోధమునకు విషయమగువారి మనోమయకోశములకుం దగిలి వారికిం గీడు చేయుననియు యోగదృష్టిగలవారు చెప్పుచున్నారు. కామము పుట్టినచో నా సంకల్పములును రూపమును దాల్చి యితరుల మనోమయకోశమును దాంకునంట. నిర్వ్యాజప్రేమ గలిగి నచో దివ్యమైన గోధుమవన్నె వర్ణములు గల రూపములు వెడలునంట. ప్రేమాతిశయమునుచేం దల్లి బిడ్డను చేతి నెత్తు కొని ముద్దు లిడుచుండు సమయమున నీకోశమంతయు గోధు

వర్ణము గలిగి వర్తులాకారములగు తేజోరూపములు శరీరము నందు నిండియుండునట్లు కనఁబడునఁట. అతిలోభియగువాని శరీర మసహ్యామగు మట్టిరంగు గలిగి యీ శరీరముచుట్టు నినుపకట్లు కట్టఁబడినట్లు చూపట్టునఁట. ఇట్లొక్కొక్క మనోవృత్తి పుట్టినపుడు దాని కనురూపమగునట్టి వర్ణములు గలిగియుండును. ఈరీతిఁ బశుప్రాయుఁడగువాని సూక్ష్మశరీరము అసహ్యాకరములగు వర్ణములు గలిగియుండ, జ్ఞానము వృద్ధియయి యింద్రియమనోనిగ్రహములు గలుగుచు రాఁగా నీశరీరము మిగుల మనోహరవర్ణములఁ గలిగి చూడ సొంపుగ నుండునఁట. రక్తవర్ణము, మట్టిరంగు మొదలగు నసహ్యాకరమగు వర్ణములు మాఱిపోయి ప్రేమాతిశయమును జూపట్టు రోజాపువ్వు వర్ణమును, బుద్ధికౌశల్యమును జూపు బంగారు వర్ణము, భక్తింజూపు నీలవర్ణమును, అనుకంపను దెల్పు నాఁకు పచ్చరంగు మొదలగు మనోహరములగు రంగులతో నిండిన దగు నఁట.

కావునఁ దొలుత పశుప్రాయులుగా నుండినవ్వా డీశరీరమాకార మేర్పడక హేయములగు వర్ణములు గలిగియుండును. జ్ఞానపరిపాకము కాను కాను స్పష్టముగ నండాకారముగా నేర్పడి రమణీయములగు వర్ణములు గలిగియుండును. అప్తత్త్వమునందును బృథివీతత్త్వమందుండు రీతి ననేక స్థూల సూక్ష్మ తారతమ్యములగు ప్రకృతిభాగములు గలవు.

అందు స్థూలప్రకృతి సముదాయములు మడ్డివర్ణములు గలిగి యుండును. సూక్ష్మములు కాను కాను రమణీయములగును. కామక్రోధపూరితములగు మనోవృత్తులు పుట్టినచో నవి స్థూల ప్రకృతినాకర్షించి రూపమును దాల్చుటచే మడ్డిరంగులు గలిగి యుండును. మనోవృత్తులు పరిశుద్ధములు కాను కాను సూక్ష్మ సూక్ష్మతర ప్రకృతిభాగముల నాకర్షించి రూపములు దాల్చుటచే వానిరంగులు రమణీయములుగ నుండును. కావున కామక్రోధముల జయించి యింద్రియ మనోనిగ్రహము లభ్యసించుచు రాను రాను ఈశరీరము పరిశుద్ధమై రమణీయవర్ణములు గలదియగును.

ఈ సూక్ష్మశరీర మూర్ధ్వములగు భువరాదిలోకానుభవము గలుగుటకు జీవున కుపాధియగునని చెప్పఁబడెను. మొదట మొదట జీవులకుఁ గలుగు ననుభవము లన్నియు బాహ్యములగు భూలోకవిషయానుభవములుగనె యుండును. ఇంద్రియ గోళములు స్థూలశరీరమునం దున్నయవి గదా! ఐనను ఇంద్రియములు సూక్ష్మరూపమున నీకామమయ శరీరమున నున్నయవి. బాహ్యవిషయములచే స్థూలశరీరమునందలి గోళములకు స్పర్శకలుగఁగనే వానిమూలమున స్థూలశరీరమునందలి నాడులలోఁ గొన్నింటియందు నతిసూక్ష్మముగఁ జలన మొకటి పుట్టి శిరస్సునందలి మెదడునందు జేరి సూక్ష్మశరీరమునందలి యింద్రియములను జేరును. ఇంద్రియములు చలించినపుడె

జీవునకు విషయజ్ఞానము గల్గును. ఈరీతిని సూక్ష్మశరీరము స్థూలశరీరమునకును జీవునకును ద్వారమై బాహ్యప్రపంచ జ్ఞానమును గలుగఁ జేయుచుండును. ఐనను స్థూలశరీరము విశ్రమించుకాలమున సూక్ష్మశరీరము స్థూలశరీరమును విడిచి వచ్చును. కేవల జ్ఞానహీనులగు మనుష్యులయం దీసూక్ష్మ శరీరము భువర్లోకమునఁ దఱచుగా నిశ్చేష్టితమై యుండును. అతిబాలుఁడు స్థూలదేహావయవములు గలిగియుండియు భూలోకమందు సంచరింపఁజాలక భూమియందు పడియున్నట్లు జ్ఞానహీనుని సూక్ష్మశరీరము భువర్లోకమునఁ దిరుగఁజాలక పడియుండును. జ్ఞానము వృద్ధి కాను కాను ఆలోకమందు సంచరింప శక్తి కలుగవచ్చును. ఇప్పుడు నాగరికులగు జ్ఞానవృద్ధిగలవారల కందఱికి నీశరీరముతో సుషుప్తికాలమున సంచరించుచు నాలోకానుభవముల నొందు శక్తి గలిగియున్నది. ముందు జ్ఞానాభివృద్ధినిబట్టి యీ స్వతంత్రసంచారశక్తియును వృద్ధియగుచుండును. తిరుగ మేల్కాంచినపు డాయనుభవములు తోలుత జ్ఞాపకమునకు వచ్చుట యరుదు. కొంచెము కొంచెము జ్ఞాపకము వచ్చినచో నవియే స్వప్నములనఁబడు చున్నవి. మొదలు కొనయు లేక యసంగతములగు కొన్ని స్వప్నములు మాత్రమట్టివి గావు. అవి స్థూలశరీరమునందుఁ గలుగు నజీర్ణాది వికారములవలనఁ బుట్టినవి. వానిని స్వరూపమునను గుర్తించఁ దగియుండును. అవి తప్ప

శక్తిగన స్వప్నములన్నియు సూక్ష్మశరీరమునందు జీవునకుఁ గలుగు ననుభవములే యగును. మేల్కాంచిన సమయమున మాత్రము పలుమరు కొంచెము జ్ఞాపకమున్నట్లుండి జ్ఞాపకమునకుఁ దెచ్చుకొన యత్నించఁగా నాకొంచెమునకును విస్మృతి కలుగును. ఇట్లు క్రమక్రమమున జ్ఞప్తికి వచ్చుట వృద్ధియగుచురాఁగా దప్పక సాధనచతుష్టయసంపత్తి కలిగి భూతసేవాతత్పరుడై, పరమగురువుల సాన్నిధ్యముఁ జెంది వారి యనుగ్రహమున నేర్చి చేయు యోగాభ్యాసబలమునఁ గుండలినీశక్తి వికసించి సప్తచక్రములును బక్వమయినచో జీవునకు నిచ్ఛామాత్రమున భువర్లోకానుభవమును సూక్ష్మదేహముతోఁ బొంది యా యనుభవములను బూర్ణముగ జాగ్రదవస్థయందు జ్ఞప్తికిఁ దెచ్చుకొనుశక్తి గలుగును.

జాగ్రదవస్థయందు జ్ఞప్తిరాకున్నను భువర్లోకమందు సంచరించు శక్తిగలవారందఱును నిద్రలో నాలోకమునందు సంచరించుచు వారు వారు జాగ్రదవస్థయందుఁ గోరిన పనులు చేయుచుందురు. వారు జాగ్రదవస్థయందు లోకోపకారము చేయఁ గోరుచుందురేని వారు నిద్రలో భువర్లోకవాసులకు నారీతి నుపకారము చేయుచుందురు. ఆ భువర్లోకవాసులు భూలోకమున నివసించుచుండి నిద్రలో భువర్లోకమునకుఁ బోయినవారైనను సరే, మరణానంతరమున భువర్లోకమున నివసించువారైనను సరే వారి కందఱికిని సహాయము చేయు

నగును. వారికిఁ బరోపకారబుద్ధి వృద్ధి కాను కాను పరమగురువులుగాని వారి శిష్యులుగాని వారిని చేఁబట్టి వారికి భువర్లోకమునఁ దగు పనులు నియమించి లోకోపకారముచేయ నవకాశ మిచ్చుచుందురు. కావునఁ బరోపకారబుద్ధిని జాగ్రదవస్థయందు వృద్ధిచేయుచు వచ్చినచో నిద్రకాలమును వ్యర్థముగఁ బోనీయక లోకోపకారముచేయు నవకాశము గలిగియుండును. అట్టి బుద్ధిని మన మందఱము వృద్ధిచేసికొనుచు వచ్చుటయేగాక బాలురకు నట్టి బుద్ధి గలుగునటుల బాల్యము నుండి శిక్షించుచు రావలయును.

జీవితకాలమున నీకామమయశరీరము స్థూలశరీరమునకుఁ బ్రతిబింబరూపమును దాల్చియుండును. మరణానంతరము స్థూలశరీరమును విడిచిపోయినవెనుక నీకామమయశరీరము వేఱురూపమును జెందును. భూలోకమునందలి ప్రకృతి స్థూలసూక్ష్మతారతమ్యములుగ నుండునట్లు భువర్లోకప్రకృతియందును స్థూలసూక్ష్మతారతమ్యములుగ నేడువిధము లుండును. ప్రేత భువర్లోకమును జేరుచో నాకామమయశరీరమందలి భువర్లోకప్రకృతి స్థూలసూక్ష్మతారతమ్యమున నేడుపొరలుగా నేర్పడి స్థూలభాగము వెలుపలను దానికంటె సూక్ష్మ భాగములు లోలోపలను నేర్పడి యేడుపొరలు ఏర్పడును. ఇట్లు మార్పుచెందిన శరీరమునే యాతనాశరీరమని హిందూశాస్త్రములు చెప్పుచున్నవి.

జీవుఁడు భూలోకమున నుండుకాలమునఁ బహుప్రాయుఁడై కామక్రోధములకుఁ బూర్ణముగ లోఁబడి కేవలవిషయాసక్తుఁడై యుండినచో వాని కామముల కనుగుణముగ స్థూలములగు నణువులు యాతనాశరీరమునం దెక్కువగఁ జేరి యుదటి పొర మిక్కిలి దృఢమైనదగు. దానికి మూలమగు కామముల ఫలమంతయు ననుభవించునంతవఱకు నాపొర దృఢముగ నుండి అనుభవములు పూర్తియైనచో నాపొర జీర్ణమై మిగి లిన పొరలు మాత్రము నిలుచును.

సామాన్యముగ విషయకామము లన్నియుఁ దానిసున్ని క్రమమున మఱిమూఁడు పొరలతో సంబంధించి యుండియుఁ గ్రమక్రమమున ననుభవముచే నశించును. ఈ నాలుగుపొరలు నశించువఱకుఁ జీవునకుఁ బ్రేతసంజ్ఞ యుండును. అటుపిమ్మటఁ బితృలోకమును జేరును. ఈపొర తెగ్గువఱకు పిదప జీవుఁడు నాని లోఁ జిక్కియీపొర లనుభవముచే నశించువఱకు నిర్బంధముగ నుండి యనుభవించుచుండును. సంవత్సరాంతము వఱకుఁ జేయు నుత్తరక్రియలు ఈదశయం దుండు జీవునకు సహాయకారులు. జీవునకు బంధకములుగ నుండు పైఁజెప్పిన యుదటి నాల్గుపొర లను జీర్ణింపఁజేసి, ప్రేతత్వమును వదలించి జీవుని బిత్రులోకప్రాప్తునిగఁ జేయును. అంతవఱకు నాక్రియ లుపయోగకరములు.

ఈ యాతనాశరీరవిషయమున వాక రహస్యము గలదని విజ్ఞులు చెప్పుచున్నారు. కామమయశరీరము మనకామముల

కనుగుణముగ నేర్పడుచున్నది. కావున మనోదార్ఢ్యముచే దానిని స్వాధీనపఱచుకొన నవకాశముండును. జీవుఁడు తనకు మరణానంతర మిట్టి నిర్బంధములగు బారలేర్పడక యుండ వలయు నను విషయమును మరణకాలమున మఱువక దృఢముగ మనోనిశ్చయము చేసినచో భువర్లోకమున నిట్టి బారలుగా నేర్పడి వానిని బంధించక యాశరీరము పూర్వముండు రీతిననే యుండనగును. అట్లయినచో వారు భువర్లోకానుభవములు యథావిధిగ ననుభవించుచుండినను దన్నుఁ దానెఱిఁగి స్వతంత్రముగ ననుభవింప నవకాశము గలుగును. లేనిచోఁ బారలేర్పడి వానిలోఁజిక్కి యేమియుఁ జేయనోపక యుండును. అనుభవమనున దేమో తప్పకపోయినను స్వతంత్రముగ ననుభవించుటయందును బరతంత్రముగ నుండుటయందును విశేషభేదము గలదు. జీవుఁ డీలోకమున దుఃఖములు వచ్చినచో వానికి లోఁబడి యవివేకమున నేమియు నెఱుఁగక పరతంత్రుఁడై యనుభవించవచ్చును. అటుగాక వాని ననుభవించుట తప్పకపోయినను వివేకము గలిగి మనోదార్ఢ్యముతోఁ స్వతంత్రుఁడై యనుభవించి వివేకమును వృద్ధిపఱచుకొనఁ జాలును. ఈ రెండుమార్గములకును దారతమ్యముండు రీతిని భువర్లోకమునఁ బారలలోఁ జిక్కి యనుభవించుటకును వానిని దప్పించుకొని స్వతంత్రముగ ననుభవించుటకును దారతమ్యము గలదు. వివేకవంతు

లీరహస్యమును మనసున నుంచుకొని సకాలమున వినియోగ పఱచవలయును.

మనోమయ శరీరము

మనస్సు శుద్ధమనియును నశుద్ధమనియును రెండుభాగ ములు. అందశుద్ధమనస్సన్నఁ గామసంకలితమైనది. ఎప్పు డును గామములతో మిశ్రమమై కామములకు లోఁబడి కామము లీడేర్చుకొనుటకై ప్రవర్తించునది. శుద్ధమనస్సు కామవివర్జితమై జ్ఞానసాధనమైనది. జీవునకు మనస్సుతో సమానమగు సాధన మొక్కటియు లేదు.

కిమితరచ్ఛేతస్సమమ్ సాధనమ్ ।

ఈ రెండింటియందును గామసంకలితమైనది యశుద్ధ మనస్సు. ఇదియె పైఁజెప్పఁబడిన కామమయశరీరము. మనో మయశరీర మనునది రాగద్వేషములతోఁ గూడని మనో వృత్తుల కన్నింటి కునికిపట్టు.

ఈ యుపాధి సువర్లోకసంబంధమగు తేజస్తత్త్వముయొక్క స్థూలభాగముచే నిర్మింపఁబడునది. పైఁజెప్పిన రీతిని సామాన్య జనులు రాగద్వేషయుక్తులుగనే ప్రవర్తించుచుందురు గావున తరుచుగ కామమయ మనోమయ శరీరములు రెండును గూడియే ప్రవర్తించుచుండును. అందుచే నట్టి మనోవృత్తులు గలిగినచో నారెంటియందును వికారములు పుట్టును. రాగ

ద్వేష వియుక్తములగు వృత్తులు పుట్టినచో నవి మనోమయ శరీరమునందు మాత్రము చలనము గలిగించి దానిని మార్చును.

మనుజునకు మృగమునకుం దారతమ్యము మనస్సును బట్టి కలిగినదే కదా! ఇంద్రియములును, ఇంద్రియవ్యాపారములును, మృగములందును గాననగుచున్నవియే గదా! ఆహార నిద్రాభయమైథునములు పశువులందును మనుష్యులందు నొక్కటియేగదా! యుక్తాయుక్తవివేచనము చేయుట, ముందు వెనుక లాలోచించుట, తన స్వభావమును గ్రమక్రమముగ సంస్కరించుకొని పరిశుద్ధముగ జేసికొనుట, తన స్వరూపమును, ఇహపరలోకాది జగత్స్వరూపమును, ఈశ్వర స్వరూపమును, నెఱుంగుట మొదలగు నివియన్నియు మనుష్యుని వ్యాపారములు. ఇవి మృగములయం దసాధ్యములు. వీని కన్నింటికిని మనస్సు సాధనము. కావుననే "కిమితరచ్చైతన్యమమ్ సాధనమ్" అని యనుభవజ్ఞులగు పెద్దలు చెప్పిరి.

మనోమయశరీరము జీవునకు బహుముఖ్యమైన యుపాధి.

జీవుల పరిపక్వస్థితిని బట్టి వారి మనోమయకోశములు ముఖ్యముగ మూఁడువిధములుగ నుండును.

౧. సామాన్యజనుల శరీరము.

౨. బుద్ధికుశలత గలిగి కొంతమాత్రము నాగరికులగు జీవుల మనోమయశరీరము.

3. జ్ఞానియగువాని మనోమయశరీరము.

సామాన్యజనుల మనోమయశరీరము

కేవల పశుప్రాయులగువారికిఁ గామమయశరీర మేరూపమేర్పడక యుండును గదా! వారి కీశరీరముగూడ దానితోఁ జేరియే చెదరఁగొట్టఁబడిన మేఘమువలె నుండును. ఐనను బశువులకంటె నట్టివానికి "వేదస్వస్తనం, వేద లోకాలోకౌ" (రేపువచ్చునది తెలియును, దానుజూచినది గూడ నిదియుఁ దెలియును) అని చెప్పినరీతిని బూర్వస్మరణములు, ముందాలోచనయు లేశమాత్రమైనను గలిగి, యనుభవమై జన్మములు మాఱుచు రాఁగా క్రమక్రమముగ రూపము లేర్పడుచు వచ్చును. ఐన నిట్టి యనుభవముచే జ్ఞానము చాలవఱకు వృద్ధియగునంత దనుక నీ మనోమయశరీరము కామమయశరీరముతోఁ గూడియే వర్తించుచుండును. మరణానంతరము బహుస్వల్పకాలమే సూక్ష్మలోకవాసము గలిగియుండును. వారి మనోమయశరీరము చాలవఱకు కామమయశరీరముకు ప్రతిబింబమై దానివలె వర్ణములును రూపములును గలిగి యుండును.

బుద్ధికుశలతగల నాగరికుని మనోమయశరీరము

ఇట్టివాఁడును చాలవఱకు రాగద్వేషములతోఁ గూడియే ప్రవర్తించుచుండును గావున వానికిని సాధారణముగఁ గామ

మయ మనోమయశరీరములు రెండును జాగ్రదవస్థయందుఁ గూడియే వర్తించుచుండును. ఏనను వాఁడు రాగద్వేష వియుక్తుఁడై గ్రంథకాలక్షేపము భగవద్ధ్యానము లోకోపకార చింతయు మొదలగు వ్యాపారములను దఱచుగఁ జేయుచుండును గావున వాని మనోమయశరీరము క్రమక్రమముగ రూప మేర్పడుచుండును. దానివర్ణము లాయామనోవృత్తుల కనుగుణముగ మాఱుచుఁ గ్రమక్రమముగ రమణీయము లగుచుండును. పైఁజెప్పిన ప్రకారమున నిద్రకాలమున వానికిఁ గామమయశరీరమందు స్వతంత్రప్రవృత్తి కలిగియుండును గాని యీ మనోమయశరీరమునందుఁ బ్రవృత్తి యుండదు. సామాన్యుల కామమయశరీరమువలె వానికి మనోమయశరీరము వ్యాపారము లేక యుండును.

నివృత్తిమార్గము నవలంబించినవాని మనోమయశరీరము

అట్టివాని మనోమయశరీరము పై రెండుశరీరములకంటె రూపము చక్కఁగ నేర్పడి బహు మనోహరములగు వర్ణములు గలిగియుండును. రాజస తామస గుణములుగల సంకల్ప రూపములచే స్థూలప్రకృతి యాకర్షింపఁబడుననియు, సత్త్వగుణముచే సూక్ష్మప్రకృతి యాకర్షింపబడుననియు, గామమయశరీరమందు జెప్పఁబడియె గదా! మనోమయ శరీరమందును ఆరీతినసే వర్ణములేర్పడును. కావున జ్ఞానము వృద్ధియయి సాత్వికవృత్తులు వృద్ధియగుచు రాఁగా నీశరీరము

బహురమణీయమై ఆయావృత్తుల కనుగుణములగు వర్ణములఁ దాల్చియుండును.

విజ్ఞానమయకోశము

ఇది జీవునకు ముందుదహరింపఁబడిన యుపాధు లన్నింటి కంటెను సూక్ష్మతరమైన యుపాధి. మిగిలిన యుపాధులు జన్మజన్మమునకు మాఱుచుఁ గ్రొత్తవిగ నిర్మింపఁబడును. ఈ యుపాధులతో జీవుఁడు భూర్భువస్స్వర్లోకములతో సంబంధము గలవాఁడగును. ఈ మూఁడులోకములలో జీవుఁడు సంసార చక్రమునందుఁ దిరుగుచుండును. భూలోకమును విడిచి భువర్లోకమును, దానిని విడిచి సువర్లోకమును, దానినుండి మరల భువర్లోక భూలోకములను బొందుచుండును. ఈ మూఁడు లోకముల కావల మహర్లోకముండును. అది తేజస్తత్త్వము యొక్క సూక్ష్మభాగములతోఁ జేయఁబడినది. విజ్ఞానమయ కోశ మట్టి సూక్ష్మభాగములతో నిర్మింపఁబడునది. అది గ్రుడ్డువలె వలయాకారముగ నుండును.

మరణానంతరమున సువర్లోకమున అచ్చటి శరీరము నశింపఁగా జీవుఁడు మహర్లోకమును స్పృశించును. అపుడు జీవున కుండు నుపాధి విజ్ఞానమయకోశము. విజ్ఞానమయకోశమున వర్తించు చైతన్యమే జీవుఁడనఁబడును. ఈ కోశము జన్మజన్మమునకును మాఱుటలేదు. ప్రతిజన్మమునను గలిగిన యనుభవములనుండి గ్రహింపఁబడిన జ్ఞానసారమంతయు దీనియం

దుఁ జేరుచుండును. సామాన్యజనులకుం గల జ్ఞానము కొంచెమే గావున వారియం దీకోశము వర్ణశూన్యమై యుండును. కామ క్రోధాది వికారములును, గామమిశ్రితములగు మనోవృత్తులును ఈ కోశము నంటవు. నిష్కామములైన సాత్త్విక మనోవృత్తులును సద్గ్రంథపరిశీలనముచేఁ గలుగు జ్ఞానమును ఎక్కువ కాను కాను ఈ కోశము దివ్యములగు వర్ణములతో నొప్పుచు వచ్చును. ఈ కోశము మఱియున్నికోశములలో వ్యాపించి వాని వెలుపలను గొంత దూరమువఱకుఁ దెలియ నగు.

సాత్త్వికజ్ఞానమును, పారమార్థికబుద్ధియు వృద్ధి కాను కాను ఈ కోశము మిగుల తేజోవంతమైన వర్ణములు గలిగి యుండుటయే గాక గొప్పదిగ నగుచువచ్చును. ముక్తిపదవి సమీపించు మహనీయుల కీకోశము బహుదూరము వ్యాపించుటయే గాక దానియందుఁ గాననగు వర్ణములు సహితము భూలోకమున నెన్నటికిని గోచరములుగాని యపూర్వములైనవిగ నుండు నని యనుభవజ్ఞులైన యోగులు వ్రాసి యున్నారు.

ఇహలోకమందుఁగాని, పరలోకమందుఁగాని స్వప్రయోజనము నుద్దేశించి చేయు కార్యము లొక్కటియు నీకోశమును వికసింపఁ జేయఁజాలవు. నిష్కామములగు వృత్తులును సద్గ్రంథసారగ్రహణమును మాత్రము దీనిని వృద్ధిఁజెందించును

పరోపకారతత్పరులై భగవద్ధ్యానము చేయుచు శమదమాది సాధనములు సంపాదించుచు వచ్చువారి కీకోశము వికసించును. మిగిలినవ్యాపారము లన్నియు నశ్వర ఫలముల నిచ్చుచు సంసార చక్రమునందె భ్రమింపఁజేయును. కావున దీనిని దృఢముగ నెఱింగి యెల్లవారును శాశ్వతములగు ఫలముల నీయఁజాలుమార్గము నవలంబించి పరమపురుషార్థమును బొంది లోకోపకారపరులగుటకు యత్నింతురు గాక.

కారణ శరీరము

ఇదియే ఆనందమయకోశమని వేదాంతగ్రంథములయందుఁ బిలువఁబడుచున్నది. ఇది వాయుతత్త్వ(ప్రకృతి)తోఁ జేయఁబడును. సామాన్యజనులయం దిది బీజాంకురన్యాయముగ నుండును. ఆత్మజ్ఞానము వృద్ధియై జీవుఁడు పరిపక్వస్థితికి వచ్చి పైమెట్టు చేరగా నీకోశము వికసించి స్పష్టమగు రూపము దాల్చును. ఆత్మజ్ఞానమనఁగా సమస్తభూతములయందుండు నాత్మయు, దనయందుండు నాత్మయు నొక్కటియే యను జ్ఞానము, నానాత్వమునం దేకత్వమును జూచుట. తొలుదొలుత నీజ్ఞానము పరోక్షముగ నుండినను యుక్తియుక్తముగ దోఁచినను స్వానుభవమునకు వచ్చియుండదు. జీవుని కీయుపాధి పరిపక్వము కాఁగా భిన్నభిన్నములుగఁ గనఁబడు నన్నింటియందును ఏకత్వజ్ఞానము దృఢమై భిన్నభావము

సంపూర్ణముగ నశించును. శోకమోహములు తుదముట్టc బోవును

శ్లో॥ సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥

యో మాం పశ్యతి సర్వత్ర సర్వంచ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి సచమే న ప్రణశ్యతి ॥

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥

(గీత)

తత్ర కో మోహః కః శోకః ఏకత్వమనుపశ్యతః ।

(ఈశావాస్యోపనిషత్తు)

ఏడవ యధ్యాయము

మనస్సు

మనోహి ద్వివిధం ప్రోక్తం శుద్ధం చాశుద్ధమేవ చ ।
అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామ వివర్జితమ్ ॥
మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।
బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్ ॥

(అమృతబిందూపనిషత్తు)

తా. మనస్సు శుద్ధమనియు నశుద్ధమనియును రెండువిధములగు. కామసంయుక్త మశుద్ధమనియుఁ, గామవిహీనము శుద్ధమనియుఁ జెప్పనగు. మనస్సే జీవునకు బంధమోక్షములకుం గారణము. మనస్సు విషయాసక్తమైనపుడు బంధకారణమును, నిర్విషయమైనచో ననఁగా విషయవిముఖమై యీశ్వరాయత్తమైనచో మోక్షకారణమనియును శ్రుతి యనువదించుచున్నది.

జీవుఁడు తేజస్తత్త్వప్రకృతితోఁ జేయఁబడిన శరీరమును దాల్చి యాశరీరములో వర్తించునపుడు మనశ్శక్తి నుపయోగించును. కనుక మనోమయ విజ్ఞానమయకోశములయందుండు వర్తించు నాత్మశక్తియే మనస్సని పేర్కొనఁబడుచున్నది.

మనస్సు అను శబ్దము మన్ అను ధాతువునుండి యుత్ప న్నమై తెలిసికొనుశక్తి యను నర్థమును బోధించుచున్నయది. అనఁగా మనస్సు జీవునకు జ్ఞానసాధనమునకు ముఖ్యమయిన కరణము. కావున నది యంతఃకరణ మనఁబడును. జీవుఁడు బాహ్యప్రపంచ జ్ఞానమును బొందుటకు మనస్సను సాధనము నుపయోగించువాఁడు. జీవుఁడు కామరహితుఁడై వర్తించు నపుడు మనస్సు శుద్ధజ్ఞానసాధనమై యుండును. సర్వకామముల కునికిపట్టయి కామమయశరీరముతో గలిసి వర్తించునపుడు మనస్సు కామసంకలితమై కామమునకు లోఁబడి దానికి సహ కారియై ప్రవర్తించుచుండును. ఇదియ యపరిశుద్ధ మనఁబడు మనస్సు. బహుకాలమువఱకు జీవుఁడు కామమయుఁడై కామ ములం దగిలి వర్తించుచుండును. కామరహితమైన కర్మ మొక్కటియు నప్పుడు రుచింపదు. అట్టి జీవునియందు శుద్ధ మనఃప్రవృత్తి కవకాశము కలుగుట యరుదు. బహుకాల సుఖదుఃఖానుభవముచే జ్ఞానము కలిగి వైరాగ్య ముత్పత్తి యైనచోఁ గొంచెముగ విషయవిముఖుఁ డగుట కావ్పదము గలిగి శుద్ధమనస్సునకు వ్యాప్తి కలుగును. అంతవఱకు నశుద్ధ మనస్సునకు మాత్రము ఎక్కుడుగ వ్యాప్తి కలిగియుండుటచే నద్దాని లక్షణములను, ధర్మములను బక్కఁగ నెఱింగిన యెడల దానిని వశపఱచుకొని క్రమముగ శుద్ధమనస్సుగ మార్చుటకు నవకాశము గలుగును.

మనస్సు చంచలస్వభావమైనది. ఎల్లప్పుడు నొకవిషయ మునుండి వేఱొక విషయమునకుఁ బరుగిడుచునే యుండును. ఈ కారణమునుబట్టి మనస్సు కపితుల్యమని చెప్పుట కలదు.

సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ
నటత్యాశాశాఖా స్వటతి ఝటితి స్వైరమభితః ।
కపాలిన్భిక్షో మే హృదయకపి మత్యంత చపలం
దృఢం భక్త్యా బధ్వా శివభవదధీనం కురు విభో ॥

(శివానందలహరి)

అది సామాన్యముగ నింద్రియములతోఁ జేరి వర్తించు చుండును. అట్లు వర్తించుటచే మనశ్శక్తి నిశ్శేషముగ నశించును. ఇంద్రియముల నిగ్రహించుటచే మనశ్శక్తి యింద్రియ మార్గమున నశింపక నిలిచి క్రమక్రమముగ వృద్ధియగును.

నదీజలములఁ గాలువలుగఁ ద్రిప్పి యొక చెఱువునకుం జేర్చినచో నాచెఱువు కట్టయందుఁ గొన్నిరంధ్రము లుండెనేని చెఱువులోఁ జొచ్చు జలమంతయు నారంధ్రములనుండి వెలువడి నిష్ప్రయోజక మగుటయే గాక కట్టతెగి యనేకులకు హానికరమునైయుండును. ఆ తటాకరంధ్రములం బూడ్చి యుక్తమగు జలద్వారముల నిర్మింప నందలి జలమంతయుఁ జక్కల పఱుపఁబడి సకాలమున నాజలద్వారములనుండి వెలువడి సుక్షేత్రములపైఁ బ్రవహించి వానియందలి సస్యములను జక్కఁగ ఫలింపఁజేయుటచే ననేక భూతకోటుల కపారముగ

మేలుచేయును గదా! అట్లే యాత్మశక్తియను ప్రవాహము బుద్ధిమార్గమున మనస్సను తటాకమునఁ బ్రవేశించి యింద్రియ ములను రంధ్రముల మార్గమున బయలువెడలి విషయముల యందు నశించుటయే గాక ముందటి యధ్యాయమునఁ జెప్పిన రీతి ననేకులకు మహోపకారము చేయును. అట్లుగాక యింద్రియముల నిరోధించి మనస్సును విషయ విముఖముగఁ జేసినచో మనశ్శక్తి వృద్ధియై యనేకులకు మహోపకారము చేయుటకు సహితము చాలియుండును. ఇట్లింద్రియవ్యాపార మును నిలిపి మనశ్శక్తిని వృద్ధిచేయుటయే యోగమనఁబడును.

తాం యోగమితి మన్యంతే స్థిరామింద్రియధారణామ్ ॥

(కఠోపనిషత్తు)

దేహేంద్రియముల వ్యాపారముచే వానిశక్తి తగ్గురీతిని మనోవృత్తులచే మనశ్శక్తి వ్యయమగుచుండును. సంకల్పము లచే మనశ్శక్తి వ్యయమగుచుండుఁ గావున దానిని వ్యర్థసం కల్పముగఁ జేయఁగూడదు. ధర్మ మాచరించుటయందును, పరోపకార మొనరించుటయందును మాత్రము వ్యయపఱుపఁ దగునేకాని నిష్ప్రయోజకములగు కార్యములయందుఁ గాని, పాపకార్యములందుఁగాని వినియోగింపరాదు. మనశ్శక్తి యనునది పురుషార్థముల సాధించుటకై మానవుల కొసఁగఁ బడిన దివ్యశక్తి. ఆ శక్తిని బ్రతిక్షణమందును నిరుపయోగము లును, ఇతరులకు మేలు చేయఁజాలనివియు నగు సంకల్పములు

చేసి వ్యర్థముచేయుట పాపమని చెప్పవచ్చును. మనస్సును ఇంద్రియములం గూడి విషయములయందు స్వేచ్ఛగా విహ రింపఁ బోనిచ్చిన నది శక్తిహీనమగును. జీవితకాలమంతయుఁ గామక్రోధాహంకార మమకారములచేతను, విషయాసక్తిచే తను మనశ్శక్తిని నశింపఁజేసికొనువాఁడు కట్టకడపట చింతింప వలసిన వాఁడే యగును. అట్లు చేయక మనస్సును జక్కఁగ నియమించుకొని మనశ్శక్తిని వృద్ధిచేయవలయును. ఈ రీతిగా నియమితమైన మనస్సు మిగుల వీర్యవంతమై యోగాభ్యాసా దుల కర్హమై గొప్ప కార్యముల నెన్నియో సాధింపఁ గలుగు.

ఆదినుండి యింద్రియములతోఁ గూడి వర్తించుచుండుటచే మనస్సు విషయాసక్తమై యెప్పుడును విషయసంయోగమును గోరుచుఁ దత్ప్రతిబంధకములగు వాని నన్నింటియందును ద్వేషభావము కలిగియుండును. ఇట్లు సామాన్యముగ మాన వులయందు మనస్సు రాగద్వేషాదులకు లోఁబడియుండును. రాగద్వేషములు సర్వానర్థమూలములు లని భగవద్గీతా శాస్త్రమునందు భగవంతుఁడు నొక్కి వక్కాణించియున్నాఁడు.

ధ్యాయతో విషయాన్ పుంసః సఙ్గస్తేషూపజాయతే ।
సఙ్గాత్సంజాయతే కామః కామాత్క్రోధోఽభిజాయతే ॥
క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతివిభ్రమః ।
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥

(గీతా. ౨ అధ్యా.)

విషయచింతనముచేఁ గామమును, కామముచేఁ గ్రోధమును, క్రోధముచే నవివేకమును (అనఁగా యుక్తాయుక్త వివేచనాజ్ఞానము లేకుండుటను), కడపట సకలపురుషార్థ హానియు నగునని తాత్పర్యము.

మఱియు నీ కామక్రోధములు జ్ఞానమునకుఁ బ్రతిబంధకము లనియును, వానిజయింపక పురుషార్థప్రాప్తి లేదనియును, కామక్రోధోద్భవమగు వేగమును జయించినవారలు బ్రహ్మనిర్వాణమును బొందుదురనియును భగవంతుఁ డుపదేశించి యున్నాఁడు.

> శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।
> కామక్రోధోద్భవం వేగం స యుక్తస్ససుఖీ నరః ॥

(గీతా ౫ అ.)

కావున మనస్సు నాశ్రయించియుండు కామక్రోధాదులగు దుర్గుణముల నశింపఁజేసి మఱియు శమదమాది సద్గుణముల మనంబున నెక్కొల్పుట యవశ్యకము. దుర్వాసనలు దృఢముగా నున్నచో సన్మార్గమున బ్రవర్తించుటయే యసాధ్యము గదా! శాస్త్రములయందు నిషేధింపఁబడిన ధర్మములను వదలి యశుభవాసనలను కొంతమట్టుకయినను తొలఁగఁ ద్రోసికొనవలయును. దుర్గుణములను యథావిధిగా నశింపఁజేయవలయుననిన, తత్ప్రతిపక్ష సద్గుణములను సాధించుటయే సులభమార్గమని యోగశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు.

ఇట్లు చేయుటకు ముఖ్యసాధనము ధ్యానము. ధ్యానమనఁగా నతి చంచలమగు మనస్సును నిలిపి యేకాగ్రముగఁ జేసి భగవంతునియందుఁగాని, తత్సదృశులగు పరిపూర్ణగురువుల యందుఁగాని స్థిరముగ నిలుపుటకై యత్నించుట. ఇట్టి ధ్యానమున మనస్సు పలుతెఱఁగులఁ బరుగిడుచుండ నద్దాని నిరోధించి ధ్యేయమూర్తియందు నిలుపుటచే మనశ్శక్తి నహీనము వృద్ధియగును. దేహమునకుఁ బరిశ్రమమువలె మనస్సునకు ధ్యానము దార్ఢ్యము నిచ్చునది. ధ్యేయమూర్తియొక్క కళ్యాణ గుణములఁ బలుమాఱు మననము చేయుటచే నాగుణములు మనంబున దృఢముగ నిలిచి వృద్ధియగు. దీనికిముందనేక జన్మార్జితములైన దుర్వాసనల నశింపఁజేయవలయును. కావున నికార్యము దీర్ఘకాలమునంగాని సాధించునదిగాదు. దుర్వాసనలన్నియు నేకకాలమున మనోనిశ్చయముచే నశింపఁ జేయుట సాధ్యముకాని పని. ఒకొక్కటిగ వేఱువేఱుగా మనస్సునుండి తొలగింపవలయు. ముందు సూచింపబడినరీతి నాయా దుష్టగుణమునకు విరుద్ధమగు కళ్యాణగుణమును ధ్యేయమూర్తియం దారోపించి యాగుణస్వరూపునిగ ధ్యానించిన నాదుర్గుణము తుదముట్ట నశించి తద్విరుద్ధమగు సద్గుణము స్థిరముగ మనంబున నిలుచును. ఇట్లు క్రమక్రమమున నొక్కొక్క దుర్గుణమును దొలగించి సద్గుణముల దృఢముగఁ జేసికొన వలయు. ఇట్లు కామక్రోధములు, అసత్యము, అసూయ మొదల

లగు దుర్గుణముల నొక్కొక్కటిగఁ దొలగించి యౌదార్యము, భూతదయ, సత్యము, అసూయ లోనగు సద్గుణముల వృద్ధిచేసి కొనుటకు నత్యధిక ప్రయత్నము చేయఁదగు. ధ్యానము కొద్ది కాలము చేయుటచేఁగాని, ప్రతిదినము జేయక యప్పుడప్పుడు చేయుటచేఁగాని, శ్రద్ధలేక చేసినఁగాని, ఫలము సిద్ధింపఁజాలదు.

దీర్ఘకాలాదరనైరంతర్య సత్కారసేవితో దృఢభూమిః ।

(యోగసూత్రము)

దీర్ఘకాలము నిరంతరముగ నాదరముతోఁ జేయు ధ్యానము మాత్రము ఫలము నీయఁజాలును.

మనశ్శక్తి ధ్యానముచే వృద్ధినొందునని చెప్పఁబడియెఁ గదా! మనశ్శక్తి వృద్ధియగుచో సంకల్పసిద్ధియగు. అనఁగా మనస్సున సంకల్పించిన దంతయు నెఱవేఱును. ఐనను ధ్యానాదులచే వీర్యవంతముగఁ జేయఁబడిన మనశ్శక్తిని మానవుఁడితరుల మేలుకొఱ కుపయోగింపవలయును. అట్లు చేయక స్వప్రయోజనపరుఁడై యాశక్తి నుపయోగించినచో వాఁడు రాక్షసుఁడనఁబడును. రావణాసురుఁ డెక్కుడు భక్తిచేతను, ఘోర తపస్సుచేతను, గొప్పసిద్ధుల నందియు, వానిని స్వప్రయోజనపరుఁడై పరులకు హానిచేయుట కుపయోగించెనుగదా. అట్లు మనస్సు నిరోధించుటచేతను యోగముచేతను బొందిన గొప్ప మనశ్శక్తిని స్వప్రయోజనమునకు వినియోగించువారే రాక్షస శబ్దవాచ్యు లగుచున్నారు.

తమకై యన్యహితార్థఘాతుకజనుల్ దైత్యుల్ ।

అని భర్తృహరి చెప్పియుండఁగా హఠయోగాదులచే సాధించిన సంకల్పసిద్ధి గలిగి యధికమనశ్శక్తి గలిగి వానిని బరులకుఁ గీడు జేయుటయం దుపయోగించినచో నట్టివారికంటె ఘోరతరులగు రాక్షసులు లేరని వేఱుగఁ జెప్పవలయునా!

అట్లుగాక ధ్యానయోగాదులచే మనశ్శక్తిని వృద్ధిచేసికొని స్వప్రయోజనము నించుకైనఁ గోరక యెల్లపుడు భూతదయ గల్గి పరులమేలు కొఱకుఁ బాటుపడువారు పుణ్యాత్ములగు ఋషులనఁబడఁ దగియుందురు.

"పరోపకారార్థ మిదం శరీర" మ్మను న్యాయమునఁ బరుల సుఖమే తన సుఖమనియును, పరులదుఃఖమే తన దుఃఖ మనియు నెంచు మహానుభావుఁ డుత్తమయోగి యనఁబడు చున్నాఁడు. అట్టివాఁడు తేజోవంతుఁడై పరిపూర్ణుఁడై బ్రహ్మానందము నొందును.

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥

(గీతా అ. ౬. శ్లో. ౩౨)

మనోధర్మములు

మనోమయకోశమున వర్తించు నాత్మశక్తియే మనస్సనియు, నా మనోమయకోశము తేజస్తత్త్వస్థూలప్రకృతితోఁ జేయఁ బడినదనియును ముందే చెప్పఁబడియె. భూలోకమున శబ్ద

ముత్పత్తి కాఁగా నామధ్యమున నుండు వాయుచలనముచే నాశబ్దము శ్రోత్రేంద్రియమును జేరి వినఁబడురీతిని మనస్సున సంకల్పములు పొడముచో మనోమయకోశము చలించి ఆ చలనములు భువర్లోక సువర్లోకములద్వారా యితరుల మనోమయకోశములఁ బొందును. మనుష్యుని సంకల్పము లేవిధమైనవిగ నుండినఁ దత్సదృశములగు నితరుల సంకల్పముల నివి యాకర్షించునని ముందు సూచింపఁబడియెఁ గదా! మనస్సున సంకల్ప మెద్దియేని పొడమ నది సూక్ష్మప్రకృతియం దొక రూపమును ధరించును. అనఁగా నాసంకల్పము సూక్ష్మలోకములయందుండు ప్రకృతియం దొకవిధమగు చలనమును గలుగఁజేసి ఆ ప్రకృతిని రూపము ధరించునట్లు చేయును. కులాలుని చక్రము వేగముగఁ దిరుగుటచే దానిపైని మృత్తిక ఘటాదిరూపమును దాల్చురీతిని మనస్సంకల్పములు భువర్లోక సువర్లోక సూక్ష్మప్రకృతియందు ప్రవేశించి యాప్రకృతిలో నొక్కింతభాగమును రూపమును ధరించునట్టుగాఁ జేయును. వివిధములగు సంకల్పములు వివిధరూపములు గలిగి నానావిధ వర్ణములతో నొప్పును. ఎక్కుడగు భక్తితోఁగూడి చిత్తైకాగ్ర్యమున ధ్యానించునపుడు సూక్ష్మలోకమున దివ్యమగు నీల వర్ణముగల రూప ముత్పత్తియగును. మఱియు నాభక్తి నిష్కామమగుచో నారూపములు కమలములు లోనగు పుష్పముల యాకారములను దాల్చును. ఏకాగ్రతస్థిరమగుచో భక్తుని

మనోమయకోశమునుండి యూర్ధ్వభాగముగ఼ తేజోవంతమై నీలమగు గోపురరూపము గోచరించును. అట్లే యితర విధము లగు సంకల్పములు మనస్సునం బుట్టునప్పుడు తదనుగుణములగు వర్ణములతో నొప్పుచున్న వివిధరూపములు కన్పడు. ఈ రీతి దృష్టితోఁ జూచునపు డవి కొన్ని నక్షత్రములవలెను, అలయు ములవలెను, మఱికొన్ని తీక్ష్ణములగు శస్త్రములవలెను గన్పడును. సంకల్పములు మనస్సున విస్పష్టముగ లేనిమొదల నుత్పత్తియగు రూపము చెదఱిపోవు మేఘశకలములవలె అంచులు స్పష్టము కాకయుండును. ఇవియును సంకల్పస్వభా వము ననుసరించిన వర్ణములు గలిగియుండును. [75-77 పుటలు చూడుడు.]

ఈ రూపములు సూక్ష్మలోకముల వర్తించు దేవతలలో సంకల్పానుసారముగ నొక్కొక్కరి నాకర్షించుకొని, స్వతం త్రముగ నాలోకమునఁ గొంతకాలము సంచరించుచుండును. ఈ రూపములకును, వాని నుత్పత్తి జేయు మానవులకును దృఢ మగు సంబంధము గలిగియుండును. ఈ రూపములు సమాన మనోభావములు గలవారిచే నాకర్షింపఁబడును. క్రోధసంకల్ప మొకరియం దంకురింప రక్తవర్ణమగు రూప మొకటి జన్మించి సూక్ష్మలోకమున నొక పిశాచమువలె సంచరించుచుఁ గ్రోధ మనస్కులగు నితరులచే నాకర్షింపఁబడును. ఆ రూపము వారి మనోమయకోశము నంటి దానియందలి క్రోధభావములను

వృద్ధిచేయును. ఇట్లే యొకరియందుఁ గామసంకల్పములు పుట్టనవి తత్సదృశరూపములను గలుగఁజేసికొని నైజముగఁ గాముకులగుజనుల సూక్ష్మశరీరముల నంటి వాని నెక్కుడుగఁ జలింపఁజేసి వారి కామగుణము నభివృద్ధిచేయును. ఇట్లొక్కొక్కరి మనోభావములు ఇతరుల మనస్సులం బ్రవేశించి, అవి మంచి సంకల్పములుగ నుండిన, వారిని మంచి వారలనుగాఁ జేయుగుణముగలిగి, దుష్టములైనచో వారల దుష్టులనుగాఁ జేయుచుండును. వెలుపలినుండివచ్చు సంకల్పరూపమున కనుగుణములగు మనోవృత్తులలో నొకటియైన నొకనియందు లేనిచో నారూపము వాని నంటఁజాలక మరలిపోవును. కామసంకల్పములచే జనించు రూపములు కేవల నిష్కాముఁడగు వానియందుఁ బ్రవేశింపఁజాలవు. అటులనే నిష్కామములును సర్వభూతహితములును నగు సంకల్పములు కేవల స్వప్రయోజనపరుఁ డగు కాముకునందుఁ జొరఁజాలవు. ఏగుణమేని యల్పముగ నైన మనంబున నుండినచోఁ దదనుగుణములగు రూపము లాగుణములను బలపఱుపఁ జాలియుండును. కావున సామాన్యజనులలో నొకరి మనోవృత్తు లితరులమనంబులం బ్రవేశించి వారలను మంచివారినిగఁ గాని, చెడ్డవారినిగఁ గాని చేయ సమర్థములగును. ఇట్లొకరి సంకల్పము లితరుల మనస్సులలోఁ బ్రవేశించి బీజరూపముగ నుండు గుణముల దృఢతరములుగఁ జేయుటచే నామనస్సులయందు నహితము

సదృశములగు సంకల్పములు పొడముంగా సూక్ష్మలోకమున మఱికొన్ని సంకల్పరూపము లుత్పత్తియై క్రమక్రమమున నితరులం బొంది విస్తారముగ వ్యాపించుచుండును. కామియగు నొకఁడు విషయసుఖములను గుఱించి పలుమాఱు చింతించు చుండ వాని మనస్సునుండి కామోద్రేకకరములగు సంకల్ప రూపములు వెలువడి యదృశ్యములుగ సూక్ష్మలోకమున విచ్చలవిడిఁ దిరుగుచుండును. ఆ రూపములు కాముకులగు నితరుల మనస్సులలో సులభముగఁ బ్రవేశింప వారియందుం దంగి కముం దల్పముగనుండిన కామమును వృద్ధియగునట్లు చేసి వారి మనస్సులందుఁ గామ సంకల్పములఁ గలుగఁ జేయును. ఆ సంకల్పములచే మఱియు నట్టి సంకల్పరూపములు పెక్కు లుత్పత్తియై యనేకులను గాముకులుగఁ జేయును. కావున నొకని దోషములు వానిని జెఱుపుటతోఁ నిలువక వాని వెంట ననేకులను జెఱుచును. అనేకులను జెఱిచిన దోషముగూడ వానిం బొందును. ఇతరులయందు దల్పముగనైనఁ గామము లేనిచో మొదటివాని కామసంకల్పరూపములు వీరలయందుఁ బ్రవేశింపఁ జాలియుండవు కదా! అల్పముగ నుండు దుర్గుణ ముల వృద్ధిచేసిన దోషము మొదటివానిని జెందుచుండ వాని దుస్సంకల్పరూపముల నాకర్షించుకొనుట యితరుసం దున్న దుస్సంకల్పమువలననే కదా! ఇట్లందఱును దాము చెడుటకుఁ దామే ముఖ్యకారణభూతులును, దమవలె

దుస్సంకల్పములు గల యితరులు సహాకారులుగను నగు దురు.

అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ । (గీత ౬-౬)

ఆత్మైవ హ్యాత్మనో బంధు రాత్మైవ రిపురాత్మనః । (గీత ౬-౫)

అజ్ఞాని దనకుఁ దానే శత్రువువలె వర్తించును. తనకుఁ దానే బంధువు, తనకుఁ దానే శత్రువు, ఇతరులు కాఁగని తాత్పర్యము. అటులనే పరోపకారబుద్ధి భూతదయ లోనగు నిర్వ్యాజ ప్రేమాస్పదసంకల్పము లొకరియం దుత్పత్తి కాఁగా దదను గుణములగు రూపములు సూక్ష్మలోకమున నుత్పత్తియయి మంచివారలగు నితరుల మనస్సులయందుఁ ప్రవేశించి వారి యం దల్పముగనుండు పరోపకారబుద్ధి, భూతదయ లోనగు వానిని వృద్ధిచేసి వారి మనస్సులందు నట్టి సంకల్పములఁ బుట్టించును. ఆ సంకల్పము లన్నియు సూక్ష్మలోకములు మూర్తీభవించి యనేకులలోని సత్సంకల్పములను బలపఱ చును. మనస్సు చంచలస్వభావమగుటంబట్టి యెడతెగక పని చేయుచుండును గాన జీవుల మనస్సులనుండి సత్సంకల్పములు గాని దుస్సంకల్పములు గాని నిరంతరము బయలువెడలుచునే యుండును. వీనివలనఁ బ్రతిమనుష్యుఁడును లోకమున కపార క్షేమమునుగాని యెన్నరాని కీడునుగాని కలుగఁజేయుచునే యుండును. దానంజేసి ప్రతిమానవుఁడును తన మనస్సును విచ్చల విడిగ విడువక స్వాధీనము చేసికొనుట యెంత యావ

శ్యకమో చూడుఁడు. అట్లుచేసికొనినచోఁ దన మనస్సునందు యోగ్యములగు సంకల్పములను మాత్రము పుట్టించుటయే గాక యితరుల దుస్సంకల్పరూపములం బ్రవేశింపనీయకుండును. వాని మనస్సు శుద్ధమగును. వాఁడు నిరంతరము శుద్ధ సంకల్పముల సంకల్పించుటచే నితరులకుఁ బెక్కువిధంబుల మేలు చేయఁగలుగును. మనుష్యుల మనస్సులం బొడము సంకల్పములు దృఢములుగ నుండినచో వానినుండి యుత్పత్తియగు సంకల్పరూపములు సైతము అంచులు చెక్కినట్లు స్పష్టములుగను, దృఢములుగను నుండును. మఱియు నా సంకల్పములను బూనికతో దీర్ఘకాలము నిలిపినయెడల నారూపములకు నెక్కుడుకాలము స్థితి గలిగి శక్తి యధికమై మేలు కీడులఁ జేయఁజాలి యుండును. అట్లు లేక సంకల్పము లదృఢములుగ నుండినను, అల్పకాల నిశ్చితములుగ నుండినను వాని నుండి యుత్పత్తియగు రూపములు సహితము మసకలై యదృఢములుగ నుండి యల్పశక్తి గలవియగును. మన కిష్టులగు నెవరికైన నద్దియే నొక్క మేలు చేయఁదలఁచినయెడల నావిషయము నేకాగ్రముగను దృఢముగను సంకల్పించిన నామేలు తప్పక కలుగును. ఇందును మనస్సు నిరోధము చేతను, ధ్యానాదులచేతను, వీర్యవంతముగఁ జేయఁబడిననే సంకల్పించిన ఫలము తప్పక సిద్ధించును. కావున మనుష్యుఁడు మనస్సును జక్కఁగ లోఁబఱచుకొని మనశ్శక్తిని ధ్యానము

మొదలగువానిచే వృద్ధిచేసిన లోకులకుఁ గోరిన మేలును జేయఁగలుగును. మనస్సు నేకాగ్రముగఁ జేసి చేయఁదలఁచిన మేలునుగుఱించి దృఢముగను, స్పష్టముగను సంకల్పించిన నాసంకల్పము రూపమును ధరించి యుద్దేశించిన మనుష్యునియొద్దకుం బోయి యామేలును ఘటింపఁ జేయును. గొప్పవియును, విశేషద్రవ్యసాధ్యములును నగు ధర్మకార్యములను జేయఁబూనుకొనిన లోకోపకారులు పలుమఱు నిఱుపేదలయి యుండియుఁ దాము చేయఁబూనిన కార్యము లెవ్విధముగనైన నెఱవేఱవలయునని దృఢముగ సంకల్పింపఁగా నా సంకల్పములు సూక్ష్మలోకముల రూపమును ధరించి యదృశ్యములుగ ధర్మబుద్ధి గల పురుషుల మనస్సులఁజొచ్చి యెవ్విధముననో యాకార్యములకుఁ దోడ్పడవలయునను బుద్ధి వారలయందుఁ బుట్టించి యాకార్యములకుఁ గావలసిన ద్రవ్యసహాయము గలుగునట్లు చేయును.

మఱియును యోగ్యులగు పురుషులు ఆయురారోగ్యైశ్వర్యములుగాని, పుత్త్రప్రాప్తిగాని కలుగునట్లాశీర్వదించినచో నయ్యవి తప్పక సిద్ధించునని గ్రంథములయందుఁ గనఁబడుటయు ననుభవమున నుండుటయు నెఱుంగుదుము కదా! ఇదియును సమాహితమైన మనశ్శక్తిఫలమేగాని వేఱుకాదు. మన దేశములో సమస్తకార్యములయందు యోగ్యులగు మహాజనుల యాశీర్వచనము లపేక్షించుటకుఁ గారణమిదియు. వేల

కొలఁది యోగ్యులగు బ్రాహ్మణులు ఏకవాక్యముగ మనఃపూర్తిగ నాశీర్వదించినఁ బూర్వకాలమున నట్టి యాశీర్వచనములు ఫలించుచుండెను. ఇప్పుడున్ననో ఆశీర్వదించువారు స్వప్రయోజనపరులును, మనస్థైర్యముగాని, మనఃపారిశుద్ధ్యముగాని లేనివారు నగుటంబట్టి యీ యాశీర్వచనములు చక్కఁగ ఫలింపఁజాలకుండుట యాశ్చర్యము గాదు. మఱియు భక్తులగు వారలు భగవద్ధ్యానానంతరమునను, గ్రంథకాలక్షేపాదుల పిదపను, లోకమునకుఁ మేలు నుద్దేశించి స్వస్తి వాక్యములు చెప్పునట్టి సంప్రదాయము కలదు కదా! ధ్యానముచేతఁ గాని, గ్రంథకాలక్షేపముచేఁ గాని మనస్సు పరిశుద్ధమై దివ్యతేజస్సు నాకర్షించుఁగాని వీర్యవంతమై యుండఁగా నాసమయముల సంకల్పించిన తలంపులన్నియు సిద్ధించును. కావునఁ బురాణకథనానంతరమును, సంధ్యావందనాదుల తుదను "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" అని యాశీర్వదించుచుండుటచే లోకములకు మేలు తప్పక సమకూరును. మఱియును పూర్వాచారప్రకారము దేశమునందలి భక్తులందఱును ప్రతిదినము బ్రాహ్మముహూర్తమున మేల్కాంచి శుచిర్భూతులై యేకాగ్రచిత్తమున భగవంతుని ధ్యానించి పరిశుద్ధమగు మనస్సుతో సర్వభూతహితమును గోరి యేక కాలమున గ్రింద నుదహరించిన రీతిని స్వస్తివాక్యములు పలుకుచుండిరి.

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతామ్
న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః ।
గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యమ్
లోకాస్సమస్తా స్సుఖినో భవంతు ॥
కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ ।
దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణాస్సంతు నిర్భయాః ॥
అపుత్రాః పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః ।
అధనాస్సధనా స్సంతు జీవంతు శరదాం శతమ్ ॥

ఇట్టికాలమున నిష్కాములై పరిశుద్ధ మానసులైన భక్తులందఱు వచింప వారియందఱి సంకల్పశక్తి యేకమై లోకమునం దపారమగు మేలుచేయును. సకాలమున వర్షములు కురియుటయు, సస్యములు ఫలించుటయు, జనక్షోభకరములగునట్టి యీతిబాధలు లేకుండుటయు నీ మొదలగు మేలులు లోకమునకుం గలుగును. ఆధునికుల కట్టి యనుష్ఠానమునందు శ్రద్ధనశించియు, జనులు కేవలస్వప్రయోజనపరులగుటచే ధర్మమునకు హానియు నధర్మమునకు వృద్ధియుఁ గలిగి, పాపఫలములగు ననావృష్టియు, జనక్షయకరములగు వ్యాధులును బలుమాఱు సంభవించుట కాస్పదమైనది. ఇప్పుడైనను జనులు ధర్మమునం దాసక్తి కలిగి యన్యోన్యద్వేషభావముల వదలి, పరోపకారపరాయణులై, నిష్కాములయి పైని జెప్పినరీతిని సకలజనుల మేలుకొఱకు ధ్యానించినచో భక్తజన సముదాయసంకల్పముల బలముచే లోకమునందలి సర్వా

నర్థములు నశించి లోకమునకు మేలుకలుగనే కలుగు నను టకు సందియ మావంతియు లేదు.

ఇతరుల మేలుకొఱకు మనశక్తి నుపయోగించుటయందు మఱియొక గొప్పరహస్యము గ్రహింపఁదగియున్నయది. దుర్మార్గమునం బ్రవర్తించుచు, సన్మార్గమును బోధించినను విననిచ్ఛయింపక తిరస్కరించు వారలకు వాక్కులచేఁ జేయఁ బడు నుపదేశము పథ్యముకాకపోవుటయే గాక విపరీతమగును గదా! మఱియు బాలురకును, మూర్ఖులకును నాజ్ఞలనుమన నుపదేశించుట యంత యుపయోగముగ నుండదు. అట్టివార లకు నిజముగ మేలుచేయవలె నన్న నొకయుపాయము కలదు. ఒక పురుషుఁడు ప్రతిదినమునను నిదురించు కాలమున వాని నుద్దేశించి వానిరూపమును స్పష్టముగ మనస్సున నిరూపించి నీ యెదుట నుండునట్లు కల్పించుకొని వాని దుష్ప్రవర్తనము వలని కీడులను గుఱించియు, నాదుష్ప్రవర్తనమును వదలి సన్మార్గమున వర్తించినఁ గలుగు మేలులనుగూర్చియు దృఢము నేకాగ్రము నగు మనస్సుతోఁ గొంతకాలము మానసముగ బోధించుచుండిన నాపురుషుని దుష్ప్రవర్తనము క్రమక్రమ ముగ మాఱును. ఆపురుషుఁడు జాగ్రదవస్థయందు మనోవ్యా పారము గలిగి విషయములయందు విహరించుచుండుటంబట్టి వానిమనస్సు ఇతరుల సంకల్పములను జొరనీయదు. కావున నాతఁడు నిద్రించుకాల మీకార్యమునకు సరియైన కాలము.

అట్టికాలమున నాజీవుఁడు జాగ్రదవస్థను వదలియుండుటచే నితరుల సంకల్పములకు లోనగు. ఇట్లు కొంతకాలము ప్రతి దినము నాతని నుద్దేశించి చేయు నుపదేశ మాతని మనస్సునం బ్రవేశించి క్రమక్రమముగ నదిఁ జెడుత్రోవ మార్గము పోనిని గలుగఁ జేయునదియనియుఁ గావున నది విడువఁదగినదనియు నిట్టి తలంపులు జాగ్రదవస్థయందు మనస్సునం దమంతట తాము స్ఫురించును. ఇతరుల హితవచనముల నలక్ష్యము చేయు వారికిని, ఆ మాటలమేలు తెలియనివారికిని వాక్కులచేఁగాని గ్రంథములచే గాని సన్మార్గమును బోధించుట దుర్లభమై యుండ నీ యుపాయమున వారలను సులభముగఁ ద్రోవకుఁ దేవచ్చును. వారలట్లు సద్గతికివచ్చి తమంతట తామే మంచి మార్గము నవలంబించువా రని యెన్నఁబడుదురు.

ఇందొక విషయము బాగుగ గమనించవలయును. మనము తలచినట్లు వారు చేయవలయునని, మనశ్శక్తితో వారి నిర్బంధ పెట్టరాదు. అట్లుచేసినచో వారాయొక్క దుష్కార్యమును విడువవచ్చునుగాని, వారి దుర్గుణము పోయినదని చెప్పుటకు వీలులేదు. అది వానిని మరియొక దుష్కార్యమునం బ్రవర్తింపఁ జేయును. నిర్బంధ మెంతమాత్రము చేయరాదు. మంచి మాటలతో సావధానముగ మంచిచెడ్డలను సాధక బాధకములను వానికి బోధించి వానిమనస్సునకే సరియయిన త్రోవ తెలియునట్లు చేయవలయును.

ఇట్లనేక విధములగు గొప్పకార్యముల సాధించుటకు మనస్సు ముఖ్యోపకరణముగ నున్నయది. మనస్సుచేత సదా లోకమునకు మేలుచేయఁదగు సంకల్పరూపముల నుత్పత్తి చేసి వానిమూలమున ననేకులగు మానవులకు మేలుచేయ వచ్చును. అటులనే దుస్సంకల్పములచేతఁ దదనుగుణము లును, పిశాచతుల్యములునగు రూపముల నుత్పత్తిచేసి వాని మూలమున ననేకులకు హానిచేయువచ్చును. మనస్సు సత్ప్రవర్తనమువలన లోకమునకు మహోపకారమును, దుష్ప్రవర్తనమువలన మహాపకారమును జేయఁగలిగియున్నయది. మనస్సు ఇతరులకు మేలుకీడులఁ జేయంజాలియుండుఁ దనకును బంధమోక్షములకుఁ గూడ ముఖ్యసాధనమనియును ముందే సూచింపఁబడియేఁ గదా! అట్టి మనస్సును చక్కఁగ నియమించి మంచిమార్గమునఁ బ్రవర్తింపఁజేసినవారు కాలక్రమమున నుత్కృష్టమగు పదమును జెంది లోకరక్షకులు కాఁజాలుదురు. యథార్థముగ నింద్రియములకు రాజుగానుండఁదగిన మనస్సు సామాన్యముగ మానవులయందు నింద్రియములకు లోఁబడి వర్తించుచున్నది కదా! అట్లు ఇంద్రియములకు లోఁబడి యింద్రియములు పోవుమార్గమునం బోయి జీవుని విషయసుఖములయం దాసక్తిగలవానిగఁ జేయుట యనునది ప్రభువు సేవకులకు లోఁబడి వర్తించు రీతియే కదా! అట్లు గాక జీవుఁడు మనశ్శక్తిని దృఢముగఁ జూపి యింద్రియము

లను వశములుగఁ జేసికొనినట్లాయెనా యుక్తాయుక్త వివేకము క్రమముగ వృద్ధియై మనస్సు విషయాసక్తముగాక యీశ్వరాసక్తమగును. అపుడు జీవుఁడు బంధములచే విడువఁబడి జనన మరణ రూపమగు సంసారమునుండి ముక్తుఁడగును. కాఁబట్టి యెల్లవారును నీయుత్తమోత్తమ సాధనమగు మనస్సును బక్కాఁగ శాసించి వీర్యవంతముగను, నిష్కల్మషముగను జేసి తాము తరించి యితరులకు సదా మహోపకారపరులగుదురు గాక.

ఎనిమిదవ యధ్యాయము

మరణము - మరణానంతరస్థితి

లోకమునందు సామాన్యముగ మరణమును గూర్చి విశేషముగ భయపడుట కలదు కదా! మరణశబ్దము నుచ్చరించిన మాత్రముననే పీడ కలుగుననియును, ఆ శబ్దమే యవాచ్యమనియు నెన్నఁబడుచున్నది. ఐనను జ్ఞానులగువారలు మరణమును గుఱించి యించుకయైనను భయపడక యుండుటయే గాక మరణకాలమునందుఁ బూర్ణశాంతమును దెచ్చుకొని మనస్సునం దెట్టివికారమును జెందక భగవద్ధ్యానపరులై బ్రహ్మానందభరితులై సంతోషమున శరీరమును వదలిపోవువారని గ్రంథములయం దుపపాదింపఁబడి యుండుటయే గాక లోకములో ననేకుల కనుభవవేద్యముగ నున్నయది. కావుననే "మంచివారిని మరణమునఁ జూడవలయు" నను నీలోకోక్తి ప్రసిద్ధమై యున్నయది.

మఱియును జీవుఁడు శరీరమును వదలుసమయమున నెట్టిభావమును గలిగి యుండునో దాని కనుగుణమగు జన్మము ముందు రాఁబోవునని శ్రీ గీతాశాస్త్రమునందు భగవంతుఁ డుపదేశించియున్నాఁడు.

యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరమ్ ।
తం తమేవైతి కౌన్తేయ సదా తద్భావభావితః ॥

(గీత. ౮ అ. శ్లో. ౬)

తా. మనుష్యుఁ డేయే విషయమును స్మరించుచుఁ గడపట శరీరమును వదలునో ఆయా భావమునే నిరంతర తద్భావాసక్తివలనఁ బొందునని తాత్పర్యము. ఈ మృత్యువు విషయమై యథార్థమును జక్కఁగ నెఱింగిన మానవుల కావిషయమై భయమును, దుఃఖమును, మనోవ్యథయును నశించుటయేగాక మరణకాలమున మనస్సును నిర్వికారముగ నుంచుకొనుటచే సద్గతి నొందుటకు సాధ్యమగును.

మరణమనఁగా జీవుఁడు స్థూలశరీరమును విడిచిపోవుటయే. స్థూలశరీరమును విడిచిన మాత్రమున జీవుఁడు లేకపోవుట లేదు. స్థూలశరీరమును మాత్రము వదలినవు డంతకంటె సూక్ష్మమును, చిరకాలముండఁ దగినదియు నగు సూక్ష్మశరీరమును ధరించి యూర్ధ్వలోకమున నుండును. శరీరము నశించునది యనియు జీవుఁడు నాశరహితుఁడనియును గ్రంథములయందు నొక్కి చెప్పఁబడియున్నది. నశించునది శరీరముగాని జీవుఁడు కాఁడు. జీవుఁడు నిత్యుఁడు. నిర్వికారుఁడు. ఆదియందల్పజ్ఞానము కలిగియుండి జ్ఞానము నభివృద్ధి చేసికొనుటకై యాయాలోకములఁ దదనుగుణములగు శరీరములను ధరించును. ఒక్కొక్క శరీరముచేఁ బొందదగు జ్ఞానమంతయు

రాఁగా నాశరీరమువలని ప్రయోజనము తుదముట్టుటచే దానిని వదలి జీవుఁడు మఱియొక శరీరమును గాల్రకమమునఁ బొంది జ్ఞానము నభివృద్ధిఁ జేసికొనుచుండును. మానవులు తాము ధరించు వస్త్రములు జీర్ణములు కాఁగా వానిని త్యజించి క్రొత్తవియగు నితరవస్త్రముల గ్రహించురీతిని జీవుఁడు జీర్ణములై నిష్ప్రయోజకములగు శరీరముల వదలి నూతనములును జ్ఞానసాధనములు నగు నితర శరీరముల ధరించును.

వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి ।
తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥
(గీత. ౨ అ. శ్లో. ౨౨)

జీర్ణవస్త్రములను త్యజించుట మానవులకు దుఃఖకారణము కాదు కదా! అట్లు ప్రయోజన హీనమగు శరీరమును వదలుచో జ్ఞానులగువారు మనోవ్యథను జెందరు. మానవుఁడు కార్యార్థమై యొకానొక దేశమునఁ గాని, యొక గ్రామమునఁ గాని, యొక కాలమునఁగాని నివసించి యాకార్యము పరిసమాప్తి కాఁగా నాయాస్థలములను వదలి దేశాంతరము నొందురీతిని జీవుఁడు నొకానొక దేశమున నొకానొక కాలమున నొకానొక జాతియందు దేహధారియై జన్మించి యాయా జన్మమువలనఁ బొందఁదగు జ్ఞానమునంతను బొందిన పిదప నాశరీరమును వదలి దేహాంతరమును గూర్చి పోవును.

అట్లు పోవుట మిక్కిలి యావశ్యకమని చెప్పవలయునా! మరణమనునది లేకయే యుండిన జ్ఞానాభివృద్ధి కవకాశము తక్కువగ నుండును. లోకమున నొక బీదగృహస్థువు తన యోగ్యతానుసారముగ నల్పమగు నొక గుడిసెను నిర్మించుకొని తనకుఁ గుటుంబవృద్ధియు, సంపదభివృద్ధియుఁ గానుకాను కాపురమునకుఁ జాలని మొదటి కుటీరమును విఱుగఁగొట్టి విస్తీర్ణమును సుఖప్రదమును నగు క్రొత్తగృహమును నిర్మించుకొనును గదా! అట్లే జీవుఁడు యోగ్యతానుసారముగ నొక శరీరమును బొంది యాశరీరమున సాధింపఁదగునంతటి జ్ఞానమును సాధించి పిదప నెక్కువ జ్ఞానమున కవకాశ మీయని యా దేహమును వదలి దానికంటెఁ బరిశుద్ధమును నుత్కృష్టమును, పాటవము కలదియు నగు వేఱొక శరీరమును ధరించకపోయిన వృద్ధి కవకాశమే లేదు. కావున నొకశరీరము వలని ప్రయోజనము తీరినతోడనే పరమ దయానిధియగు నీశ్వరుఁడు ఆశరీరమును విలయము నొందించి యెక్కువ జ్ఞానమునకు సాధకమగు దేహాంతరము నొనఁగూర్చును. ఆ కారణముననే జ్ఞానప్రదాతయగు మహేశ్వరుఁడు లయకర్తయని పిలువంబడుచున్నను యథార్థమున నుద్ధారకుఁడే యగు. ఇట్లు జన్మజన్మమున జ్ఞానము నభివృద్ధిచేసికొనుచుఁ గాలక్రమమున జీవుఁడు పరిపూర్ణజ్ఞాని యగువఱకు నిర్బంధముగ శరీరముల నొకదానివెంట నొకటిగ ధరించుచుండవలయును. కావున

మరణమున నొకశరీరము పోయి యద్దానికంటె శ్రేష్ఠమగు మఱియొక శరీరము వచ్చుటంజేసి చావు సంతోష కారణమే కాని దుఃఖహేతువు కాదు. కేవల దుష్ప్రవర్తనముగల జీవునకుంగూడ స్థూలశరీరవియోగము మేలొనర్చును. వాఁడా శరీర వియోగానంతరము భువర్లోకమునందలి యాతనానుభవముచే జ్ఞానమును సంపాదించి రెండవజన్మ మెత్తునుగాన మరణ మట్టివానికి శుభప్రదమే. కావున జీవుని యుత్క్రమణ కాలమునఁ బ్రక్కననుండువారలు జీవుని సుఖోత్క్రాంతి నుద్దేశించి జీవునకు సుఖముగ స్వర్గలోకప్రాప్తి గలుగవలయునని భగవంతుని ధ్యానించుచుండవలయునే గాని స్మృతి నొందువాని మనస్సు గలవిలపాటొందునట్లు దుఃఖపడరాదు. ప్రతిజీవునకు నుత్క్రమణ సమయమున జన్మప్రభృతి మరణ కాలమువఱకుఁ దాను జేసిన సమస్తకర్మములును నేకకాలిక ముగఁ జిత్రింపఁబడునట్లు మనోగోచరమగు. పోయిన జన్మ మందుఁ దాను జేసిన సమస్తధర్మాధర్మ కర్మములవలనఁ గలిగిన శుభాశుభ వాసనలు మరణకాలమున స్ఫుటముగఁ గనఁబడి యీ జన్మమున స్వభావము లగును. అనఁగా నీ జన్మమునఁ జేసిన కర్మముల వాసనలు మరణకాలమున యథార్థమూర్తులతోడఁ బ్రత్యక్షమై రాబోవు జన్మమునకు మూలముగ నేర్పడును. ఈ విషయము శ్రీ శంకరభగవత్పాదాచార్యులవారు గీతాభాష్యమునందు సూచించియున్నారు.

జన్మాంతరకృతో ధర్మాధర్మాదిసంస్కారో మరణకాలే
అభివ్యక్తస్స్వభావ ఉచ్యతే ॥ (గీత. ౧౭-౨, శం. భా.)

యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరమ్ ।
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥ (గీత. ౮-౬)

ఇదియే యంత్యప్రత్యయమని వేదాంతశాస్త్రమున వాడఁబడుచున్నయది. అంత్యకాలమున మనస్సున స్ఫురించు భావము జన్మాదినుండి స్మరణరూపముగ నభ్యసింపఁబడిన భావమేయగుఁగాని వేఱుభావ మాకాలమున స్ఫురించుట కవకాశము లేదు. కావుననే

తస్మాత్సర్వేషు కాలేషు మా మనుస్మర । (గీత. ౮-౭)

అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరమ్ ।
యః ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥
(గీత. ౮-౫)

అని చెప్పియున్నారు.

తా. అంత్యకాలమునందు నన్నుమాత్రమే స్మరించుచు దేహమును వదలి యెవఁడు ప్రయాణము చేయునో యట్టి జీవుఁడు నన్నే పొందుచున్నాఁడు. సందేహము లేదు. అట్లే మఱి యేయే భావములతో జీవుఁడు శరీరమునుండి వెడలునో యా భావమునే పొందును. అట్టి యంత్యప్రత్యయము జన్మాది నుండి యభ్యసింపఁబడిన మనోవృత్తుల ననుసరించియే యుండును. కావున సర్వకాల సర్వావస్థలయందును భగవంతుని

స్మరించుచున్నవాఁడు సదా తద్భావముగలవాఁడయి యంత్య కాలమునసైత మాభగవంతుని స్మరణమే గలిగి భగవంతుని జెందును. ఉత్క్రమణకాలమున రాఁబోవు జన్మగతిని నిర్ణ యించునట్టి ముఖ్యమగు వ్యాపారమున జీవుని మనస్సు లయించి యుండును. ఆకాలమునఁ జుట్టుప్రక్కల నుండువారు రోదన ధ్వనులచేతను దుఃఖవార్తలచేతను ఆ జీవుని మనస్సుఁ జలింపఁ జేయుట బహుదోషకరము. అట్టి సమయమున నాప్త బంధువులు మనస్సులను స్తిమితములుగఁ జేసికొని జీవుని పురోవృద్ధి కొఱకు ధ్యానించుచు, భగన్నామసంకీర్తనము చేయుచుండిననే బంధువు లనఁబడఁదగియుందురు.

జీవాత్మ భూలోకమున వర్తించుటకు స్థూలశరీరమును, దానియందంతట వ్యాపించి ప్రాణమున కునికిపట్టయిన స్థూలశరీర ప్రతిబింబమైయుండు ఛాయాశరీరమునఁదగు ప్రాణ మయకోశమును, ఊర్ధ్వములగు భువర్లోక స్వర్లోకముల యందు వర్తించుటకుఁ దదనుగుణములగు శరీరములను ధరిం చునని ముందే యుపపాదింపఁబడియెఁ గదా! ఈ లోకము లన్నియు భగవంతుని సృష్టియందుఁ జేరినవియే; ఇవి బ్రహ్మాం డమునందంతర్భాగములే యగుటంజేసి జీవుఁడు ఒక లోక మునుండి మఱియొక లోకమును బొందుచో నాబ్రహ్మాండము నందే వేఱువేఱు భాగముల వర్తించువాఁడు గాని నశించు వాఁడు కాఁడు. సామాన్యముగ లోకమున మానవుఁడు

మృతినొందె నన జీవుఁడు స్థూలశరీరమును వదలి సూక్ష్మశరీరమున వర్తించుచున్న వాఁడని యర్థము. జీవుని యుపాధులన్నింటిలోఁ గనిష్ఠమును, అల్పకాలికమును నగునది యీ స్థూలశరీరము. ఇది ప్రయోజనహీన మైనపుడు జీవుఁడు తనవగు ప్రాణములను, ఇంద్రియములను, మనస్సును, స్థూలశరీరమునుండి విడిపించుకొని భూలోకవ్యాయామము నుండి విరమించుకొనినవాఁడయి వానితోడ సూక్ష్మలోకమున వర్తించువాఁడు.

జీవుఁడు బహుకాలము స్థూలశరీరమునం దభిమానమున వర్తించి యుండుటంబట్టి దానిపై నభిమానము దృఢమై దానికిని దనకును గల సంబంధము వదలిపోయినను, దానిని విడిచి పోనొల్లక దానికి సమీపమునందే పైజెప్పిన ఛాయారూపముతోఁ దిరుగుచుండును. ఆ కారణముననే జీవుఁడు ప్రేతరూపమునఁ మృతినొందిన స్థలమును, శరీరసంస్కారములు జరిగిన స్థలమును ఆశ్రయించుకొని కొంతకాల ముండుననియును, బలుమాఱు ఆ స్థలములలోఁ గొందఱి కన్నులకు గోచరమగుననియును లోకరూఢిగ నున్నది. మఱియు స్థూలశరీరమును వదలిన మాత్రమున రాగద్వేషములు గాని, యితర మనోవృత్తులు గాని జీవుని విడువవు; కావున, జీవుఁడు తాను ప్రేమించువారలకుఁ గనఁబడవలయు నను నిచ్ఛచేతను, తన మనస్సునందలి కోరికలను గొన్నింటిని దెలుపవలయు

నను నాశచేతను, కొన్నిసమయముల నాస్థలములయందుఁ గనఁబడుటకును, అభిప్రాయములఁ దెలుపుటకును వృథా ప్రయత్నములు చేయును ; కాని భూలోకసంబంధమైన స్థూలావయవములు లేమింజేసి స్థూలశరీరధారు లగువారలకుఁ దెలియునట్లు మాటలాడుటకు శక్తి లేక యుండును. తాను భూలోకమును విడిచిపోయినను వారల కెద్దియో యొక విధమునఁ దనయిష్టము తెలియఁబడునట్లు చేయఁగోరి యసంగతములగు శబ్దములు చేయుటయుఁ గలదు. బ్రతికియున్నవారలకుఁ గనఁబడవలయునను కోరిక కొందఱియం దెక్కువగ నుండుటచే బహువిధప్రయత్నపూర్వకముగ రూపమెత్తి దృగ్గోచరమగుటయుం గలదు. ఇట్లు కనఁబడునది జీవుని కామమయశరీరము. అప్పుడు జీవాత్మ సూక్ష్మశరీరమును దాల్చి వర్తించుచుండును. అట్లు దృగ్గోచరమైనను అట్టి దర్శనములు భయహేతువులుగ నెంచరాదు. తఱుచుగ శరీరమును వదలిపోయిన జీవుఁడు దేహధారులుగ నుండు నిష్టులగు వారలయందుఁ గల మమకారముచేత వారలసమీపమునఁ దిరుగుచు, వారలకుఁ గనఁబడి తన మనోభీష్టములను దెలుపఁ జూచుటయేగాని వేఱుగాదు. అట్టి రూపములఁ బిశాచములనియు, భయహేతువులనియు, హానిచేయునవి యనియు నెంచుట పొరపాటు. చూచువారలు మనస్థైర్యము గలిగి యారూప మదృశ్యమగునట్లు దృఢముగ సంకల్పించిన నయ్యది యదృశ్యమగును.

పలుమాఱు అట్టి దర్శనములచేఁ గీడు పొందుదురని యెంచి భయపడుటచేతనే కీడుగలుగును గాని తెలుచుగ గతించిన వారలకు నట్టి హానిచేయుట కిష్టముగాని శక్తిగాని యుండదు. ఐనను గొందఱు ఈర్ష్యాక్రోధములతో నిండి మృతినొందినచోఁ దమక్రోధమును జూపు నుద్దేశమున భయంకరరూపమును ధరించి తమ కనిష్టులగు వారలకుఁ గనఁబడుట కలదు ; కాని అప్పు డితరులు స్థిరచిత్తులయి నిర్భయులై యుండినచో నెట్టి కీడును బొందఁజాలరు. అదృశ్యమగునట్లు దృఢముగ సంకల్పించినచో వార లదృశ్యులై పోవుదురు.

స్థూలశరీరము ఎంతవేగముగ నశించునో యంతవేగముగ దాని ననుసరించి ఛాయాశరీరము సహితము నశించును. కావు ననే శవములను భూస్థాపనము చేయుటకంటె దహించుట యుక్తమని శాస్త్రములయందు విధింపఁబడి యున్నది. స్థూల శరీరము (అనఁగా శవము) భస్మము కాఁగా ఛాయాశరీరము కూడఁ దనంతట యణురూపముగ విడిపోయి రెండును బంచ భూతములలోఁ గలిసిపోవును. ఉత్క్రమణ కాలిక క్రియలును, దహనకాలమునందుఁ జేయు కార్యములును, తదనంతరము చేయు నుత్తరక్రియలును జీవుని స్థూలశరీరమునుండి సులభముగ వెడలించుటకును, ఛాయారూపమును సులభముగ నశింపఁ జేయుటకును, జీవుని భూలోకవాసనలను వదలించి యాతనాశరీరమునందలి బాధల నుపశమింపఁజేసి వానినుండి

జీవుని వెడలించుటకును, ఊర్ధ్వలోకప్రాప్తి సుసాధ్యమగునట్లు చేయుటకును సహకారులుగ విధింపఁబడినవి. ఉత్తరకాలిక క్రియలు చేయువారీకర్మములవలని ప్రయోజనముల నెఱింగి దాఁటిపోయిన జీవుని దృఢముగ నుద్దేశించి యాజీవున కూర్ధ్వగతి సులభముగఁ గలుగుఁగాక యను నతిదృఢసంకల్పముతో నాకర్మములను జేసిన నాక్రియలు సఫలములగు. అట్లు సార్థకములగు క్రియలు చేసిన పుత్త్రుఁడే పుత్త్రుఁ డనఁదగు. "పుత్త్రిమంతే చ కర్మణి" యనియును, పున్నామ నరకము నుండి తరింపఁజేయువాఁడే పుత్త్రుఁడనియును జెప్పుట మరణకాలమునను తదనంతర మూర్ధ్వలోకప్రాప్తి కనుకూలముగను ఈ కర్మముల శ్రద్ధతో జేయుటవలని ప్రయోజనమును సూచించుటయే కదా! అట్లు శాంత మనస్సుతోడను జేయుక్రియలు సార్థకములై గతించినవారలకు సుఖప్రాప్తికరములు కావలయు నను నుద్దేశముతోడను క్రియలు చేయక, దుఃఖవ్యాకులితమనస్సులతోఁ జేయు పరలోకక్రియ లుద్దేశించిన ఫలముల నీయఁజాలవు. అట్టి క్రియలు చేసినను ప్రయోజనము లేనివగు.

మరణ మన గా స్థూలశరీరమునకును ఛాయాశరీరమునకును సంబంధమును గలుగఁజేసియుండు తంతువు తెగుట యని చెప్పఁబడెను గదా! (72 వ పుట చూడుఁడు.) అటు పిమ్మట త్వరలోనే జీవుఁడు ఛాయాశరీరమును సైతము వదలి భువర్లోకమున నుండును. ఐనను ఆ కామమయశరీరము జీవిత

కాలమున నుండిన రీతిన నుండదు. అందలిప్రకృతి స్థూల సూక్ష్మతారతమ్యము ననుసరించి యేడుపొరలుగ నేర్పడి, యాతనాశరీరమను పేరఁ బరగును. (76 వ పుట.)

జీవిత కాలములో పామరులు రాగద్వేషములకు లోనై కోరికలను, క్రోధాదులను స్వేచ్ఛగ పెంచుచు, వానిలో కొన్నియయినను తీర్చుకొనజాలక, యీరాగద్వేషములతో నిండియే మరణమును జెందుదురు. స్థూలశరీరము మాత్రము నశించెనుగాని రాగద్వేషము లన్నియును పూర్వమువలెనే దృఢముగ నిండియున్నవి. యాతనాశరీరములో నీకోరికలు బహిర్గతములై యుద్రేకించగా వాని నీడేర్చుకొన సాధనమగు స్థూలశరీరము లేమింజేసి వాని ననుభవింపఁజాలక జీవుఁడు పరితపించుచుండును. ఇందుకుఁ గొన్ని దృష్టాంతముల నిట ననువదింతుము. భూలోకమున జీవించియుండుకాలమున స్త్రీలోలుఁడుగా నుండి ఆయాశలతో మృతిబొందినచో శరీర పతనానంతరము ఆ కోరిక బహిర్గతమగును. సూక్ష్మలోకముల యందు సంకల్పములును, కోరికలును రూపములఁ దాల్చునని ముందే వచింపఁబడియెఁ గదా! (100 వ పుట) పైఁ జెప్పి నట్లు జీవునకుఁ గామ ముద్రేకముకాఁగా కామహేతువగు రూపము మనస్సున స్ఫురించును. అది యాలోకమున రూప మును ధరించి వానికి దృగ్గోచరమగు. ఆ రూపమును జూచి తనకోరిక నీడేర్చుకొన యత్నించునుగాని స్థూలశరీరము లేమిం

డుటంబట్టి యనుభవించుటకు సాధ్యముకాక యెక్కుడుగఁ బరితపించును. పరితాపము హెచ్చుచుండుకొలఁదిని ఆరూపము దృఢతరము కాఁగా తదనుగుణముగ నాసందర్శనము వలని పరితాపము వృద్ధియై కొంతకాలమున కాకోరిక దుఃఖమూలము కదా యను జ్ఞానము జీవునకు స్ఫురించును. మఱియు జిహ్వాచాపల్యము కలిగియుండిన యెడల మిక్కిలి మక్కువగల పదార్థముల నీయాతనాశరీరధారియగు జీవుఁడు పలుమాఱు చింతింప నాపదార్థములు రూపవంతములై యెదుటఁగనఁబడి వానియందలి చాపల్యమును వృద్ధిచేయ వాని భక్షించు నుపాయములేక రోగియగువాఁడు అపథ్యములగు మృష్టాన్నములఁ జూచి తినఁగోరి దుఃఖించునట్లు మఱిమఱి పరితపించును. అట్లే తనలోనుండిన యితరములగు కోరికయు నా సూక్ష్మశరీరమున బహిర్గతమై రూపముఁదాల్చి పరితపింపఁజేయును. ఇట్లు బహుకాలము ఫలింపని కోరికలవలన దుఃఖించి దుఃఖించి కోరికలకు లోఁబడుట తుదకు దుఃఖకారణమను జ్ఞానమును దృఢపఱుచుకొని రాఁబోవుజన్మమున నీ జ్ఞానము వాసనారూపముగఁ గలిగి జన్మించును. కనుక మరణానంతరము నరకదుఃఖ మనునది జీవుని యజ్ఞానమును బోఁగొట్టి యజ్ఞానకృతకార్యముల యందలి దోషములను జూపించి జ్ఞానమును బోధించుటకు దయానిధియగు భగవంతుఁడు విధించెను. కాని పాపుల నెవ్విధముననైన బాధించి తనయాగ్రహ

మును వెళ్ళవుచ్చుటకు విధించలేదు. తప్పుత్రోవలంబోవు బాలుని దయచేఁ దండ్రి శిక్షించి జ్ఞానమును బోధించి యభి వృద్ధికిం దెచ్చులాగునఁ బరమదయాస్వరూపుఁడును, జగదేక పితయునగు సర్వేశ్వరుఁడు తనబిడ్డలగు మానవులకు మొట్ట మొదటఁ గర్తవ్యాకర్తవ్యములను, బుణ్యాపాపములను, మంచి చెడుగులను నిరూపించు ధర్మములను దమ ప్రతినిధులగు మన్వాదులమూలమున బోధించి, యాధర్మమార్గమున నడు వని జీవులకు తత్ఫలముగ నీలోకమునఁ గలుగు దుఃఖముల వలనను, నరకమునఁ గలుగు పరితాపమువలనను దాము పోవుమార్గము దూష్యమను జ్ఞానమును బోధించును.

ఈ యర్థమునే శ్రీ భగవద్గీతాశాస్త్రమున సంక్షేపముగ రెండుశ్లోకములలో భగవంతుండు బోధించియున్నారు.

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।
కామః క్రోధః తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥
(గీత. ౧౬-౨౧)

నరకమునకు మూడుద్వారములు: కామము, క్రోధము, లోభము. కావున నీ మూడును విడువవలయును.

శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీరవిమోక్షణాత్ ।
కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥ (గీత. ౫-౨౩)

జీవించియుండు కాలములోనే అనగా స్థూలశరీరము నశిం చుటకు పూర్వమే, కామక్రోధములవలన గలుగు ఉద్రేక

మును ఎవడు అణచుకొనగలుగునో వాడే యోగి. వాడే సుఖి.

ఇట్టి జ్ఞానమును బొందుట నరకదుఃఖమువలని ప్రయోజనము. పరజన్మమునఁ బూర్వకర్మము ననుసరించి విషయవాసనలు బలముగ నుండియు నరకబాధనుండి పొందిన జ్ఞానము జీవునకు సహాయమై వాని నశుభవాసనలనుండి తొలఁగించి యుక్తాయుక్తవివేకమును వృద్ధిచేయును. అట్టి వాని నింద్రియములు విషయాసక్తుని జేయుచుండఁగా నది కీడని యీ జ్ఞానము తనలోనుండి హెచ్చరిక చేయుచుండును.

చదువరుల మనంబులయందొక సంశయము పుట్టవచ్చును. కామక్రోధలోభములవలనఁ మరణానంతరము స్వర్గలోకమున జీవునకు తాపము గలుగును గదా? మరుజన్మమున భూలోకమున సైతము పూర్వకర్మఫలములగు దుఃఖములు గలుగుట ఏల, యని జిజ్ఞాస పుట్టవచ్చును. కర్మ లెట్లు మనోవాక్కాయికములని మూడు తెరంగులో అట్లె వాని ఫలములు సైతము భిన్నములు. ఇంద్రియ కార్యములగు విషయేచ్ఛలు, వానినుండి యుత్పత్తియగు కామక్రోధలోభములు, సూక్ష్మశరీరమునందు బుట్టు వికారములు. అవి సూక్ష్మశరీరమునందుండి స్థిరములై పైన సూచించిన విధమున మరణానంతరము యాతనలుగ జీవున కనుభవమునకు వచ్చును. కామముగాని క్రోధముగాని లోభముగాని అంతఃకరణమున పుట్టి

యింతటితో నిలిచిపోయిన యెడల, వానిఫలము జీవునకు ఊర్ధ్వలోక యాతనానుభవముతో సమాప్తము కావచ్చును. సాధారణముగ కామక్రోధములు కేవల మానసికవృత్తులుగ నిల్చుట అరుదు. లోపల కామక్రోధములు పుట్టగనే అవి కార్యరూపముగ వెలువడును. అట్టి కార్యములు భూలోకమున నితరులకు సుఖమునో దుఃఖమునో పుట్టించును. కావున స్థూలశరీరముతో చేయు కార్యములు పరులకు సుఖదాయకములుగ నుండిన, వాని ఫలము తరువాతి జన్మములయందు సుఖరూపముగను, అవి యితరులకు దుఃఖమూలములైన యెడల, వానిఫలము దుఃఖరూపముగను పరిణమించును. ఈ రహస్యమును తెలిసికొనినవారు కర్మగతిని చక్కగ తెలిసికొని తదనుగుణముగ ప్రవర్తనమును సవరించుకొనజాలుదురు.

పైఁ జెప్పినరీతిగా భువర్లోకమునఁ గొంతకాలముండి తనయందలి రాగద్వేషములును, కామక్రోధములును, ఆశాపాశములును క్రమక్రమమున నశింప, భువర్లోకమునందలి యూర్ధ్వభాగమును బిత్రులోకమును జేరి కేవల విషయాసక్తికి సంబంధించిన పారలౌకిక సుఖముల ననుభవించగ నాలోక సంబంధమగు కామమయశరీరము అనఁగా యాతనాశరీరము నశించును. ఆ పిదప నంతకంటె సూక్ష్మమగు మనోమయశరీరమును దాల్చి తేజోమయమగు స్వర్గలోకమునఁ గేవల విషయాశక్తికి సంబంధించని పారలౌకిక సుఖము లనుభవించుచు,

భూలోకమునందు వాడుకచేసిన శ్రద్ధాభక్తులు నిర్వ్యాజ ప్రేమాదులు శాస్త్రవిచారముచేఁ గలిగిన జిజ్ఞాసయు నిట్టి యితర పారమార్థిక సంకల్పములు వెంటనంటిరాఁగా నాలోకమున జీవున కవియన్నియు మూర్తిమంతములై ప్రత్యక్షములుకాఁగా వాని ననుభవించుచు వానివలనఁ గలుగు సారభూతమగు జ్ఞానమును గ్రహించుచు జీవుఁడు సుఖానుభవమును జెందును. భూలోకమునఁ జేసియుండిన సత్సంకల్పముల నన్నింటి నిట్లు మానసికానుభవమునకుఁ దెచ్చుకొని యాయా వాసనలను దృఢపఱచుకొనును. ఎవ్వఁడేనియు జీవితకాలమునఁ బరోపకారబుద్ధి గలిగి పరులకు నానావిధములుగ సహాయము చేయఁబూని యుండినయెడల నాసత్పురుషుఁడు స్వర్గమున నట్లే పరోపకారతత్పరుఁడై యుండి యనేకులు బీదలు తన్నావరించియుండి వారలకుఁ బెక్కువిధముల సహాయము చేసి యానందించు నట్లు మానసికానంద మందును. మఱియు నొక్కఁడు జీవితకాలమునందు నెద్దియేని యొకశాస్త్ర వ్యాసంగముఁ జేయుచుఁ గాలము గడిపెనేని యతఁడు స్వర్గమున నాశాస్త్రమునే యెక్కుడుగ నభ్యసించుచుఁ దనకుఁ గల సందేహాదుల మననము చేతను స్వర్గవాసులైన శాస్త్రజ్ఞుల యుపదేశాదుల చేతను దొలఁగించుకొని యాశాస్త్రజ్ఞానము విశేషముగ నభివృద్ధిచేసికొని సుఖానుభవమును బొందుచుండును. భూలోకమున నెవ్విధమగు వ్యాసంగము నెంత పరి

పూర్ణముగఁ జేసి యుండునో యంతవిశేషముగ స్వర్గలోక మునఁ దత్సంబంధమగు జ్ఞానము నభివృద్ధిచేసికొని యనంతర జన్మమున నాశాస్త్రజ్ఞానమున కనుకూలమగు దృఢవాసనల తోడఁ బుట్టును. లోకమున జనులలోఁ గొందఱొక్కశాస్త్ర మునందు బాల్యమునుండి ప్రవీణులుగ నుండియు నితరశాస్త్ర ములయందు బుద్ధి యించుకంతయుఁ బ్రసరింపకుండ నుండుట యనుభవవేద్యము. ఒక్కొక్కరు అతిబాల్యమునుండియు సంగీతశాస్త్రప్రవీణులుగ నుండ మఱికొందఱు అధిక ప్రయ త్నముతో సహిత మాశాస్త్రమును గ్రహింపఁజాలక యున్న వారు. అట్లె కొందఱు గణితశాస్త్రమునందును, మఱికొందఱు వ్యాకరణాది శాస్త్రములలో నొక్కొక్కదానియందు బాల్య మునుండి ప్రవీణతఁ జూపుచుందురు. ఆ బుద్ధికుశలత యితర విషయములయందుఁ గనఁబడక యుండును. వారలందఱు పూర్వ జన్మముల నాయాశాస్త్రముల నధికముగ నభ్యసించి స్వర్గ మునఁ దత్సంబంధమగు వాసనల దృఢపఱచుకొని వానితోడ జన్మించియున్నవారని తెలియఁదగు.

ఇట్లు జీవుఁడు మనుష్యలోకమున జనన మొందుచుఁ బూర్వ కర్మానుసారముగ సుఖదుఃఖముల ననుభవించుచు, నవీన కర్మములఁ జేయుచు శరీరపతనానంతరము నరకసంబంధము లగు దుఃఖములను, ఆపిదప స్వర్గసుఖములను అనుభవించుచుఁ గ్రమక్రమమున జ్ఞానశక్తుల వృద్ధిచేసికొనుచున్నవాఁడు.

నరకమునం దనుభవించు దుఃఖమును, స్వర్గమున ననుభవించు సుఖమును బురుషార్థసాధనమగు జ్ఞానము వృద్ధియగుట కొఱకు నియమింపఁబడినవి గాని కేవల సుఖదుఃఖముల నిచ్చుట కొఱకుఁగాదని మరల మరల నొక్కిచెప్పఁదగు విషయము. బాలుఁడు పాఠశాలలో విద్యాభ్యాసము చేయు కాలమున బాలుని జ్ఞానాభివృద్ధి నుద్దేశించి యుపాధ్యాయులు శిష్యుని నొకప్పుడు దండించును. మఱియొకప్పుడు శిష్యున కుత్సాహము గలుగఁ జేయు బహుమతుల నిచ్చును. కాలానుసారముగ దండనయు బహుమతులును జ్ఞానము నభివృద్ధి చేయు సాధనములు గాని వేఱు స్వతంత్రప్రయోజన మొద్దియును గలవి గావు.

పాఠశాలకుం బోవు బాలుఁడు విద్యాభివృద్ధికొఱకుఁ బోవును గాని బహుమతులను బొందుటకుంగాని దండన ననుభవించుటకుంగాని కాదు. అలాగే నరకమున దుఃఖమును, స్వర్గమునందు సౌఖ్యములును బురుషార్థసాధనమగు జ్ఞానమును సంపాదించుటకు సాధనములు గాని వేఱు కావు. కావున జీవునకు భూలోకమును, నరకమును, స్వర్గము నను నీమూఁడు లోకములు జ్ఞానస్థానమగు పాఠశాలగ నున్నయవి. పరమ దయానిధియగు జగదీశ్వరుఁడు శిశుప్రాయులగు మానవుల యజ్ఞానము నివర్తింపఁజేసి పరిపూర్ణ జ్ఞానులుగఁ జేయుటకు ఒకప్పుడు నరకబాధను, ఒకప్పుడు స్వర్గసుఖము నొసంగి

జీవులను దరింపఁజేయు చున్నవాఁడు. ఎల్లయెడలను సుఖ దుఃఖములు గలుగుచో వానినుండి గ్రహింపఁదగు జ్ఞానము నూహించుకొని దాని నభ్యసింపనిచో నాసుఖదుఃఖాను భవము నిష్ప్రయోజన మగుచున్నయది. దానినుండి పొందఁ దగు జ్ఞానము పూర్ణముగ నొందువఱకు నా సుఖదుఃఖముల మాటిమాటికి ననుభవించియే తీరవలెను. ఆ జ్ఞానమును బరి పూర్ణముగఁ బొందిన నాపై నట్టి యనుభవ మనావశ్యకమే యగు.

ఈ రీతిని భూలోకమునఁ జేసిన వివిధకర్మముల నుండియు, త్రిలోకములందలి నానావిధానుభవములనుండియు సారభూత మగు జ్ఞానశక్తులను గ్రహించి తత్సంబంధములగు శుభవాస నల దృఢపఱచుకొనును. కాఁపువాఁడు కొంతకాలము భూమి యందు పాటుపడి వ్యవసాయముచేసి భూమినుండి ఫలమును గ్రహించి యిల్లుచేరి యాఫలమును సావధానముగ ననుభ వించి సుఖించు లాగున జీవుఁడు కొంతకాలము భూలోకమునఁ గర్మములను జేసి యాపిదప నూర్ధ్వలోకముల నాకర్మములను సావధానముగ మననము చేయుచు, తత్ఫలభూతములగు సుఖదుఃఖముల ననుభవించుచు, దాని సారభూతమగు జ్ఞాన శక్తులను గ్రహించుచున్నవాఁడు.

ఇట్లు భూలోకమునఁ జేసిన పుణ్యకర్మములను బట్టి బహు కాలము స్వర్గలోకమున నుండి యాపుణ్యము క్షీణింపఁగా

నా స్వర్గలోకమందలి మనోమయశరీరము సహితము నశించును. అపుడు జీవుఁడు విజ్ఞానమయకోశ ముపాధిగ మహర్లోకమున గొంతకాలముండి, యనేక జన్మముల కర్మఫలములు బీజరూపములుగ నా విజ్ఞానమయకోశమున నుండుటచే నవి యంకురింప సకాలమగుటం జేసి బహిర్ముఖుఁ డగుచున్నవాఁడు. కర్మానుసారమగు శుభాశుభ వాసనలఁ గలిగియుండు నవీనమగు మనోమయకోశమును సువర్లోక ప్రకృతితోడను, పిదప కామమయమగు సూక్ష్మశరీరము భువర్లోక ప్రకృతితోడను ఆకాలమునకు దేవతల సహాయముచే నిర్మింపఁబడును. మఱియును జీవుని కర్మానుభవమున కనుకూలములగు దేశకాలముల ననుగుణమగు కుటుంబమున స్థూలతనువును దాల్చును. కర్మఫల ప్రదాతలగు కర్మదేవతలు జీవుని యుత్తరజన్మమును ప్రారబ్ధానుభవమునకు ననుకూలమగు దేశము, కాలము, జాతి, కుటుంబము మొదలగువానిని విధించి జనన మొందింపఁ జేయుదురు. ఇట్లు విధింపఁబడిన దేశకాలాదులయందు జనన మొంది పూర్వకర్మానుసారమగు వాసనలం గలిగి ప్రవర్తించుచుండును. ఇట్లు జన్మజన్మమునఁ గర్మములను జేయుచుఁ గర్మఫలముల ననుభవించుచుఁ గర్మానుభవము వలన జ్ఞానము వృద్ధి కాను కాను ముందటి యశుభవాసనలకు లోఁబడక యధికప్రయత్నముతో నా యశుభవాసనలను దొలఁగించుకొనుచు శుభవాసనల వృద్ధి

పఱచుకొనుచు సకాలమున జ్ఞానవృద్ధుఁడై దేహేంద్రియ మనోమలంబులఁ దుదముట్ట నశింపఁజేసి సదా ధ్యానయోగ పరుడై పూర్ణుఁడై పరమేశ్వరాజ్ఞానుసారము భూతసేవ చేయుచు పరమపురుషార్థమును బెందుచున్నాఁడు.

అనేకజన్మసంసిద్ధ స్తతో యాతి పరాంగతిమ్ ।

(గీత. ౬-౪౬)

తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితేరతాః ॥

(గీత. ౧౨-౪)

తొమ్మిదవ యధ్యాయము

దేహబీజములు, భూతసూక్ష్మములు

జీవుడు యీశ్వరాంశమనియును, ఈశ్వరునియందు లీనస్థితి యనుపాదక తత్త్వమున నుండుననియును, పాంచభౌతికమగు ప్రపంచమున నభివ్యక్తమగుట కొక్కొక్క తత్త్వమునుండి యొక్కొక్క యణువును స్వీకరించుకొని దాని నాయాలోకమునందుపాధిగ నొనరించుకొనుచున్నాఁడనియును, అయణువులే జీవునకు రాఁబోవుకాలమునఁ గలుగఁబోవు శరీరములకు బీజములగు చున్నవనియును బూర్వాధ్యాయమున సూచింపఁబడియె. ఈవిషయ మిట నించుక విస్తరింపఁబడును.

మొట్టమొదట జగదీశ్వరుఁడు సృష్ట్యున్ముఖుఁడై "బహుస్యాం ప్రజాయేయ" అని సంకల్పించఁగా తదంశము లగు జీవులును బహిర్ముఖములై కాలక్రమమునఁ బాంచభౌతికమగు ప్రపంచమున నభివ్యక్తములై ఆకాశతత్త్వమున నొక భూతసూక్ష్మమును, వాయుతత్త్వమునందొక యణువును, తేజస్తత్త్వమునుండి యొకయణువును స్వీకరించుకొని, యభివ్యక్తమగు జీవాత్మలు అగుచున్నారు. ఈ యణు సముదాయమే జీవున కుపాధియై ముక్తిపర్యంతము జీవుని నంటి

యుండును. ఇదియే అనాదియగు అవిద్యయై జీవుని యంటి యుండును. మఱియు నిటులే పృథివీతత్త్వమునుండి యొక యణువును, అప్తత్త్వమునుండి యొక యణువును, తేజస్తత్త్వ స్థూలభాగమునుండి యొక భూతసూక్ష్మమును గైకొనుచు నన్నమయ కామమయ మనోమయ శరీరములకు బీజములుగఁ జేసికొనుచున్నాఁడు. ఈయణువులే జన్మజన్మమునను జీవుని నంటియుండి జీవుని శుభాశుభ వాసనల కునికిపట్టులై సమస్త శరీరములకు బీజరూపములై యుండును. కావుననే యివి వేదాంత గ్రంథములయందు దేహబీజములగు భూతసూక్ష్మము లని నిరూపింపఁబడి యున్నయవి. ఈ విషయము శ్రీ శంకర భగవత్పాదులవారి ముండకోపనిషద్భాష్యమునకు శ్రీమదా నందజ్ఞానులవారు టీకయందు విపులముగ వ్రాసియున్నవారు.

(ముండకోపనిషత్ ౩-౨-౭)

"మాయామయ మహాభూతానామంశా వష్టబ్ధ బీజ వావిద్యామయభూత సూక్ష్మైః ప్రాతిస్వికైరదృష్టసహకృతైః ప్రాతిస్వికాః ప్రాణాదయ ఆరభ్యంతే" అని.

ఈ యణువులు ముక్తిపర్యంతము వాయుతత్త్వప్రకృతి వికారమును, జ్యోతిర్మయము నగు నొక సూత్రముతో జీవా త్మకు గట్టఁబడి యుండునని దివ్యదృష్టిచేఁ జూచు మహాత్ములు చెప్పుచున్నారు. జీవుఁడు శరీరధారియైనపు డీయణువునుండి అయాయణు మార్గముగా తదనురూపములై జ్యోతిర్మయము

లైన చిన్నసూత్రము లనేకములు బయలువెడలి యాయా శరీరములను జ్యోతిర్మయమైన వలలవలె గట్టిగాఁ జుట్టియుండును. కనుక జీవితకాలమందు జీవుని యన్నమయ ప్రాణమయ కోశములఁజుట్టి పృథివి యను మార్గముగ నొక్క జ్యోతిర్మయమగు వలయును, భువర్లోకమందు కామమయ సంబంధమగు శరీరమును జుట్టి మఱియొక వలయును, సువర్లోకమందలి మనోమయ సంబంధమగు శరీరమును జుట్టి మూఁడవ వలయునుండును. స్థూలదేహ సంబంధమగు వల హృదయమునుండి బయలువెడలి "ఆపాదతలమస్తకము" వ్యాపించియుండును. ఈ విషయ ముపనిషత్తులయందును జెప్పఁబడినదియే.

పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయం చాప్యధోముఖం ।

* * * *

తస్య మధ్యే మహానగ్నిర్విశ్వార్చిర్విశ్వతోముఖః ॥
సోఽగ్రభుగ్విభజన్ తిష్ఠన్నాహారమజరః కవిః ।
తిర్యగూర్ధ్వమధశ్శాయీ రశ్మయస్తస్య సంతతా ॥
సంతాపయతి స్వం దేహ మాపాదతలమస్తకః ।
నీలతోయద మధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా ।
నీవారశూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా ॥
తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః ॥

(తైత్తిరీయారణ్యక నారాయణము)

ఈ స్థూలదేహసంబంధ మగు సూత్రము బంగారువర్ణమై కారుమేఘము మధ్యమున వెలుఁగు మెఱుపుఁదీగవలెఁ బ్రకా

శించునదియై, నీవారధాన్యపు ముల్లువలె నతిసూక్ష్మమై శరీరమునందంతట వ్యాపించి యాహారమును జక్కఁగ విభజించి శరీరమును దపింపఁజేయుచున్నయది. శరీరమునఁ గన్పడు నుష్ణమునకు నిదియే మూలమగుచున్నది. ఈ సూత్రము జీవితకాలమందు హృదయమునుండి పైభాగమునకు, అధోభాగమునకును, ప్రక్కలకును, ప్రసరించుచున్నది; మరణకాలమందు దేహమును వదలి దేహబీజమగు నణువునుమాత్రము కైకొని దానిని గట్టిగఁ జుట్టియుండును. అంత శరీరముష్ణహీనము కాఁగా మృతినొందిన దనఁబడును. ఇటులే యూర్ధ్వలోకమునందు యాతనా శరీరముతోడ భువర్లోకానుభవము పూర్ణము కాఁగా పూర్వమువలె నాదేహసంబంధమగు వల యాశరీరమును వదలి యాసూత్రము నప్పత్వ సంబంధమగు నణువును మాత్రము చుట్టుకొనియుండ యాతనాశరీరము సైతము జీర్ణమై నశించును. ఈ తీరుననే స్వర్లోకానుభవము తుదముట్ట నాలోకశరీరము నావరించియుండిన యీావల ఆ శరీరమునుగూడ వదలి యాదేహబీజమగు నణువును మాత్రము చుట్టి యాసూత్రము పైఁజెప్పఁబడిన యణువులుమూఁడింటితోడ విజ్ఞానమయకోశమునందుఁ జేరును. అంతట స్వర్లోకసంబంధమగు మనోమయశరీరము సహితము నశించును. జీవుఁ డీరీతిని కారణశరీరము (విజ్ఞానమయకోశము) ను జేరి ముందు జన్మమున నున్ముఖుఁడయి యుండునపుడు రాఁబోవు జన్మమునఁ

బొందఁదగు స్థూలసూక్ష్మశరీరములకు బీజములగు నణువులు గలవాఁడగుటచేఁ బూర్వకర్మానుసారముగ శరీరములఁ గాల క్రమమున మరలఁ బొందఁ గలుగును.

మానవులు ప్రతిజన్మమునందును వివిధములగు కర్మములఁ జేయుచున్నవారు కదా! అట్టి కర్మముల కనుగుణమగు వాసనలం గలిగి జీవుఁడు జన్మాంతరము నొందుచున్నాఁడు. ఆయా జన్మములయందలి స్థూలసూక్ష్మశరీరములు ఆయాజన్మాంతమున నశించుచుండఁగా పైనుదహరింపఁబడిన వాసనలు వాని యణువుల మూలమున జీవుని నంటియుండు. స్థూలశరీరముతోఁ జేయఁబడు సమస్తకర్మములును దానికిఁ గలుగు సకలానుభవములును, పృథివీతత్త్వసంబంధమగు నణువు నొకవిధముగ మార్చ, దానియం దొకవిధమైన చలనము గలుగును. ఆ యనుభవములు మరల మరలఁ గలుగను గలుగను దదనుగుణమగు చలనము దానియందుఁ బుట్టుటచే నారీతిని జలించు స్వభావము దృఢమగుచున్నది. ఇట్లు జీవితకాలమంతయు స్థూలశరీరముచేఁ జేయఁబడుకార్యము లన్నియు, అనుభవింపఁబడు సుఖదుఃఖములన్నియు నాయణువునందుఁ జలనముఁ గలుగఁజేసి దదనుగుణమగు స్వభావమును గలుగఁజేయుచున్నవి. మరణకాలమున స్థూలశరీరము నశింప నీ యణువు మాత్రము జీవుని నంటియుండు. భూలోకమునఁ బ్రవర్తింప నశక్తుఁడై జీవుఁడు యాతనాశరీరమున నూర్ధ్వలోకమున

వర్తించుచుండును. ఆ కాలమున నీయణువు ఎవ్విధమగు కార్యము లేక నిద్రించునట్లుండును. భువర్లోక స్వర్లోకాను భవము లగు పాపపుణ్యములు క్షీణింప జీవుఁడు మరలి భూలోకమున జన్మించుటకు రాఁగా నీయణువునందుఁ బూర్వ కర్మానుసారమగు చలనము మరలఁ బ్రారంభింప నాకర్మ మభివ్యక్తమగుటకుఁ దగిన ప్రకృతిసముదాయము భూలోక మునుండి యాకర్షింపఁబడి స్థూలశరీర ముత్పత్తియగుచున్నది. కావున జీవుని శుభాశుభ వాసనలన్నియు నీయణువునం దిమిడియుండి యనంతర జన్మమునం దభివ్యక్తమై స్వభావ మగుచున్నవి. శాస్త్రములయందు కర్మమనునది అపూర్వ రూపముగ నిలిచియుండునని చెప్పియుండుట యీయర్థమునే సూచించుచున్నది.

శ్రీ గీతాశాస్త్రమున మూఁడవ యధ్యాయమున :

> సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేర్జ్ఞానవానపి,
> ప్రకృతిం యాంతి భూతాని ।   (గీత. 3-33)

అను శ్లోకమునందలి ప్రకృతిశబ్దమును, ౧౭ వ అధ్యాయమున,

> త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా । (గీత. ౧౭-౨)
> కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥   (గీత. ౧౮-౪౧)

లోనగు వాక్యములయందలి స్వభావశబ్దము నీయర్థమునే బోధించుచున్నది.

శంకరభాష్యము :

ప్రకృతిర్నామ—పూర్వకృత ధర్మాధర్మాది (జ్ఞానేచ్ఛాది—ఆనంద గిరి) సంస్కారో వర్తమాన జన్మాదావభివ్యక్తః సా ప్రకృతిః, "జన్మాంతరకృతో ధర్మాది సంస్కారో మరణకాలేఽభివ్యక్తః స్వభావ ఉచ్యతే ॥"
(గీత. ౧౮-౫)

జన్మాంతరకృత సంస్కారః ప్రాణినాం వర్తమానజన్మని స్వకార్యాభిముఖత్వేనాభివ్యక్తస్స్వభావః ॥ అని (గీత. ౦౫-౪౧)

ఒక జన్మమునం దేవిద్యయందుఁగాని పరిశ్రమము ఎక్కుడుగఁ జేయఁజేయ ఆకాలమునం దంతట నీయణువు దానికనుగుణముగ జలించుచునే యుండును. అభ్యాసబలముచే మఱియెప్పుడైన నావిద్య నభ్యసింపఁ బూర్వాభ్యాస బలమున నావిద్య యతిసులభముగ నలవడును. జన్మము మాఱి వేఱొక శరీరము వచ్చినను భూతసూక్ష్మము జన్మజన్మమునకు శాశ్వతముగ నిలుచుటంజేసి పూర్వాభ్యాసవాసనాబలముచే నావిద్య యాజీవునకు సులభసాధ్యమగును. ఈరీతిని వివిధములగు ననుభవములు, కర్మములు నీభూతసూక్ష్మమునందు స్థిరముగ నిలిచి యనేక జన్మములకుం గారణము లగుచుండును. ఐనను జీవుఁడు సుఖదుఃఖానుభవముచే జ్ఞానముకలవాఁడై యైహిక విషయములయందు వైరాగ్యము నభివృద్ధిచేసికొనఁ గ్రమక్రమమున విషయవిముఖములగు వాసన లుత్పత్తియై వృద్ధియగును. పూర్వపు విషయవాసనలు కాలక్రమమున

క్షీణించును. ఈ విధమున వాసనాక్షయము కానుకాను జన్మ రాహిత్యమునకు హేతువగును.

మఱియు నిట్లు పురుషుఁడు కామక్రోధాదులకు లోఁబడి నప్పుడెల్లను సూక్ష్మశరీరమునందుఁ జలనమును గలుగఁజేయు నని ముందే వ్రాయఁబడియె. కావుననే, మనుష్యునందుఁ గామక్రోధాదులు, ఈర్ష్యాసూయలు లోనగునవి యుద్రేక మగుచో నా సూక్ష్మశరీరభాగమునఁ దదనుగుణములగు మార్పులు చలనవికారములుగఁ గలుగ నాచలనము సూక్ష్మ శరీర బీజమగు భూతసూక్ష్మమును సోఁకి స్వభావమై యాగుణ మును మరల మరల నంకురింపఁజేయును. కావున నవకాశము గలిగి నప్పుడెల్ల నట్టిగుణములు పూర్వమునకంటె నెక్కుడుగ నుద్రేకమై యాదుస్స్వభావము వృద్ధియగునట్లు చేయును. ఇది యిట్లుండఁగా స్థూలశరీరపతనానంతరము నరకమునఁ గలుగు దుఃఖానుభవము సైతము ఆయణువునందుఁ జేరి యుండును. కాలక్రమమున భువర్లోకమందలి శరీరము నశింపఁగా భూర్భువర్లోక భూతసూక్ష్మములతో స్వర్లోక సంబంధ మగు మనోమయ శరీరముతోడను, స్వర్గలోకమును జేరును. అచ్చట పూర్వాధ్యాయమునందు సూచింపఁబడియుండు రీతిని సుఖానుభవము ననుభవించుట ద్వారా ఆలోకజ్ఞానమును బొందును. ఆ యనుభవములన్నియు నాశరీరబీజమగు భూత సూక్ష్మమునందుఁ జలనము గలుగఁజేయుటచే నది ఆయా

మనోవృత్తులను, సంకల్పములను మరల మరల బుట్టించుస్వభావము గలదియగును. స్వర్గానుభవము తుదముట్ట నాశరీరము సైతము జీర్ణమై నశించును. ఆ స్థితియందు జీవుఁడు విజ్ఞానమయకోశమునుండి పృథివ్యప్తేజోతత్త్వముల సంబంధమగు దేహబీజములం గలిగి రాఁబోవు జన్మమున కున్ముఖుఁడై యుండును. మరల క్రమమున స్వర్లోక దేహబీజము కాలపరిపాకముచే స్వభావానుసారముగఁ జలింప స్వర్లోక ప్రకృతిని గొంతయాకర్షించుకొని రాఁబోవు జన్మమున మనోవృత్తుల కునికిపట్టగు స్వర్లోకశరీరమును కల్పించును. ఆమీఁద అప్తత్త్వ దేహబీజమటులే చలించి భువర్లోక ప్రకృతి నాకర్షించుకొనఁగా భువర్లోకశరీర ముత్పత్తియగును. ఆతీరుననే పృథివీతత్త్వభూత సూక్ష్మము సైతము ప్రారబ్ధకర్మానుసారముగ కర్మఫలముల విధించు దేవతలచే నిర్దేశింపఁబడిన దేశమునందును, కుటుంబమునందును, తల్లిదండ్రులయందును ప్రవేశించి రాఁబోవు స్థూలశరీరమునకు బీజమగుచున్నది. జీవుని స్వర్గానుభవము పరిపూర్ణము కాఁగా జీవుఁడు పైని సూచింపఁబడిన రీతిని పునర్జన్మమునకు వచ్చుమార్గము పంచాగ్నివిద్యయని యుపనిషత్తులు వర్ణించుచున్నవి. అందు జీవుఁడు ద్యులోకము, పర్జన్యలోకము, పృథివీలోకమున నోషధులు, ఆపైఁ దండ్రిదేహము, కడపట రేతోరూపమున మాతృగర్భమును వరుసగఁ బ్రవేశించి శరీరమును ధరించునని నిరూపింపఁబడియున్నది.

తస్మా దగ్ని స్సమిధో యస్య సూర్యస్సోమాత్పర్జన్య ఓషధయః పృథివ్యామ్। పుమాన్ రేతస్సించతి యోషితాయాం బహ్వీః ప్రజాః పురుషాత్సంప్రసూతాః ॥

(ముండకోపనిషత్తు ౨-౧-౫)

మఱియు,

అసౌ వావలోకో గౌతమాగ్నిస్తస్యాదిత్య ఏవ సమిద్రశ్మయో ధూమోఽహరర్చి శ్చన్ద్రమా అఙ్గారానక్షత్రాణి విస్ఫులింగాః ॥ ౧ ॥
తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా శ్రద్ధాం జుహ్వతి తస్యా ఆహుతేస్సోమోరాజా సమ్భవతి ॥ ॥ ౪ ॥
పర్జన్యో వావ గౌతమాగ్నిస్తస్య . . . . స్ఫులింగాః ॥ ౧ ॥
తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా స్సోమగ్ం రాజానం జుహ్వతి తస్యా ఆహుతే ర్వర్షగ్ం సమ్భవతి ॥ ॥ ౫ ॥
పృథివీ వావగౌతమాగ్ని . . . . విస్ఫులింగాః ॥ ౧ ॥
తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా వర్షం జుహ్వతి తస్యా ఆహుతేరన్నగ్ం సమ్భవతి ॥ ॥ ౬ ॥
పురుషో వావగౌతమాగ్నిస్తస్య . . . . విస్ఫులింగాః ॥ ౧ ॥
తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా అన్నం జుహ్వతి తస్యా ఆహుతేరేతస్సమ్భవతి ॥ ॥ ౭ ॥
యోషావావ గౌతమాగ్ని . . . . విస్ఫులింగాః ॥ ౧ ॥
తస్మిన్నేతస్మిన్నగ్నౌ దేవా రేతో జుహ్వతి తస్యా ఆహుతేర్గర్భస్సమ్భవతి ॥ ॥ ౮ ॥

(ఛాన్దోగ్యోపనిషత్తు, పంచమప్రపాఠకము, ౪, ౫, ౬, ౭, ౮ ఖండములు.)

ఇందు శ్రద్ధాశబ్దముచేఁ బూర్వవాసనాయుక్తమగు సువర్లోకదేహబీజమగు భూతసూక్ష్మము బోధింపఁబడుచున్నది.

కాలపరిపాకమున జీవుఁడు జన్మమున కభిముఖుఁడు కాఁగా ఈ సువర్లోక బీజమునందుఁ బైఁజెప్పినరీతిని జలనము కలుగ సువర్లోక ప్రకృతినుండి కొంతభాగము నాకర్షించుకొని దేవతల సహాయముచే నాసువర్లోకశరీరమును గల్పించుకొనును. ఇదియే రాఁబోఁవు జన్మమున మనోమయ కోశమున నొక భాగమగును. ఇదియే "దేవాశ్శ్రద్ధాం జుహ్వతి" అను వాక్యముయొక్క యర్థమని తత్త్వవేత్తలు వచించుచున్నారు. ఈ క్రొత్తస్వర్లోకశరీరమే "సోమోరాజా" యనఁబడునది. పిదప భువర్లోక దేహబీజమునందుఁ జలనము కలుగఁ బూర్వమువలె నాలోక ప్రకృతిసముదాయమున నొక కొంత యాకర్షించుకొని దేవతల సహాయముచేఁ గ్రొత్తశరీరమొకదాని (కామమయ శరీరము) నేర్పఱచుకొనును. ఈ రెండుభాగములు కలిసి మనోమయకోశమగు. ఈ తీరుననే పృథివీతత్త్వ సంబంధమగు స్థూలదేహబీజము వర్షబిందుమార్గమున భూమియందుఁ బడి యోషధులయందుఁ బ్రవేశించి కర్మదేవతల సహాయమున భవిష్యజ్జన్మహేతువగు పితృదేహమున నాహారముగఁ బ్రవేశించి రేతోరూపమునఁ దల్లి గర్భమునఁజేరి పిండ ముత్పత్తియగుచున్నది. అచ్చట నాపృథ్వీభూతసూక్ష్మము పై సూచింపఁబడిన రీతిని బూర్వసంస్కారము ననుసరించి చలింప దాని కనుగుణమగు ప్రకృతి సముదాయము ఆకర్షింపఁబడి దేవతాసహాయమునఁ గ్రొత్త శరీరము వృద్ధి

యగుచున్నది. తరువాత శిశువు క్రమముగ జన్మింపఁ గొంత కాల మగువఱకు జీవాత్మ సాక్షిమాత్రుఁడుగ నుండి శరీర స్థితికి వలయు తనశక్తిని మాత్రము నిచ్చుచుండును. జీవాత్మ సామాన్యముగ నేడేండ్లు గడచిన వెనుకనే శరీరములందు యథార్థముగఁ బ్రవేశించి వాని నుపాధులుగ గ్రహించును. అట్లు గ్రహించుటయే జీవునకు వాస్తవముగ ద్వితీయ జన్మము. ఆ కాల ముపనయనమునకు ముఖ్యకాలము. ఆ పిదపనే బాలుఁడు విద్యాభ్యాసమునకు సహితి మర్హుఁడు.

జీవుఁడు వాని యుపాధులతోఁ జేయు సమస్తకర్మములు రాఁబోవు జన్మములయందుఁ దన స్వభావమునకు హేతువు లగుచున్నవి. కావున నెల్లవారును దమతమ స్వభావములను నిష్పక్షపాతముగఁ బరిశీలించుకొని యశుభవాసన లించుక యైన నుండినచో వాని నధిక ప్రయత్నమున నశింపఁజేసి శుభ వాసనల వృద్ధిచేసికొనుటకుఁ బాటుపడవలయును. అట్లు చేసి దుస్స్వభావమును వదలించుకొని సత్స్వభావమును వృద్ధిచేసి కొనుచుఁ గ్రమమున నెల్లవారు నుత్తమమగు పురుషార్థమును సాధించుకొందురు గాక.

పదియవ యధ్యాయము

కర్మము

కర్మమనఁగా జేయఁబడునది. మానవుఁడు మనస్సుచేతను, వాగాదీంద్రియములచేతను, శరీరముచేతను జేయునది యంతయుఁ గర్మమనఁబడును. అట్టి కర్మము లన్నియుఁ దదనుగుణములగు ఫలముల నిచ్చుచుండు. కావునఁ జేయఁబడు కార్యముతో దాని ఫలము సయితము కర్మమనియే పిలువఁబడుచున్నది. యథార్థమునఁ జూడఁ జేయఁబడు కార్యమును, దాని ఫలమును ఒక్కటిగనే భావింపఁదగును.

లోకమున భూమియందు విత్తనము నాఁటినచో నద్దాని నుండి వృక్ష ముత్పత్తియై సకాలమునఁ బుష్పములు ఫలములు గలుగ నా ఫలములనుండి మరల బీజములు గలిగి యందొక్కొక్కటియుఁ దిరిగి వృక్షములకును ఫలములకును హేతువు లగుచున్నవి. ఎవ్విధమైన బీజము నాఁటిన నవ్విధమగు వృక్షములు, ఫలములును నుత్పత్తియగు. ముష్టివిత్తనము నాఁటి మధురములగు మామిడిపండ్లు కావలయునన్న దొరకునా? కర్మమస నిట్టిదియే. కాఁబట్టి మానవుఁ డెట్టి ఫలముల నపేక్షించునో అట్టి ఫలముల నీఁగలుగు కర్మములను

జేయవలయు. చేయఁబడు కర్మములు ఫలములనీయ నాఫలములు క్రొత్తకర్మములకు హేతువులగుచుండును. ఇట్లు కర్మములును ఫలములును, మరలఁ గర్మములును ఫలములును, అన్యోన్య సంబంధము గలవియై యుండును. ఈ సంబంధము కార్యకారణరూపమైనది. కారణము లేకయే కార్యము గలుగనేరదు.

> అకారణః కథం కార్యం సంసారేఽత్ర భవిష్యతి ।
>
> (దేవీభాగ.)
>
> న హి కారణంవినా కార్యస్యోత్పత్తిః ।
>
> (అని ప్రాచీనసూక్తి)

మానవులు అనుభవించు సుఖదుఃఖము లన్నిఁటికి హేతుభూతములుగఁ గారణములుండియే తీరవలెనుగదా! కారణములగు పూర్వకర్మముల నెఱుఁగక ప్రస్తుతపు సుఖదుఃఖానుభవములు విధికృతములనియు, దైవికములనియును, దామస్వతంత్రులనియును మానవులు విధిని దూఱుదురు. అట్లు దూఱుట యజ్ఞానముగాని వేఱుగాదు. ప్రపంచమంతయును గారణము లేక కార్యము గలుగనేర దను న్యాయమునకు లోఁబడియే యున్నది. కావునఁ గారణములను గలుగఁజేసిన తరువాత వాని ఫలముల ననుభవింపక తీరకపోయినను కారణములను గలుగఁ జేయుటయందు మానవులు స్వతంత్రులు. ఈ విషయమున మానవులకుం గల స్వాతంత్ర్య పారతంత్ర్య

ముల కొకదృష్టాంతము చెప్పనగు. ప్రపంచమంతయు భగవదాజ్ఞకు లోఁబడియున్న దనుటకు సందియమే లేదు. అగ్నిని స్పృశించిన హస్తము కాలును అనునది భగవదాజ్ఞయై యుండ నెవఁడుగాని నిప్పును దాఁకవలయు నను నిర్బంధము ఇంచుకయైనను లేదు. నిప్పును దాఁకుటకుఁగాని, తాఁకక యుండుటకుంగాని స్వతంత్రుఁడై యుండ స్పృశించిన పిదప దాని ఫలమును అనుభవింపక తీరదు. అలాగుననే శ్రుతిస్మృతులయందుఁ గొన్ని కార్యములు విధింపఁబడియు, మఱి కొన్ని నిషేధింపఁ బడియు నున్నవికదా! శ్రుతిస్మృతులు భగవదాజ్ఞను సూచించునవి కదా!

శ్రుతిస్మృతిర్మమైవాజ్ఞా యస్తాముల్లంఘ్య వర్తతే ।
ఆజ్ఞాచ్ఛేదీమమద్వేష్య స్సమేవద్యతేమామతః ॥

(శ్రీ మహాభారతము)

ఇందు నిషేధింపఁబడిన కార్యములు చేయఁబడినచో దుఃఖహేతువులగుటచే నిషిద్ధములును, సుఖదాయకము లగు కార్యములు కర్తవ్యములుగ విధింపఁబడినవియు నగు. అజ్ఞుఁడగు శిశువునకు నిప్పును దాఁకఁగూడదని తండ్రి నిషేధించి యుండ నట్టి యాజ్ఞోల్లంఘనముచే శిశువు బాధపడుట తాఁ జేసిన కార్యమునకుఁ గలిగిన ఫలముగాని తండ్రి యాగ్రహము వలనఁ గలిగిన బాధకాదుకదా! అలాగే శ్రుతిస్మృతి నిషిద్ధములగు కార్యముల నజ్ఞానముచేఁ జేసినను నిప్పును స్పృశిం

చిన శిశువువలెఁ దదనుగుణమగు ఫలము ననుభవించువాఁడే గాని వేఱు గాదు. మానవులీన్యాయమును దెలిసికొను నంత వఱకుఁ గర్తవ్యాకర్తవ్యముల నెఱుఁగక ప్రకృతిబద్ధులయి వర్తింతురు. ఈ న్యాయమును దెలిసికొనిన పిదప కోరు ఫలముల నీఁజాలు కర్మములను మాత్రము చేయుచు ననిష్టము లగు ఫలముల నీఁదగు కర్మముల విడుచుచుందురు. లోకమున మానవులందఱు సదా సుఖము నే కోరువారు గావున నెట్టికార్యములు తుదకు సుఖప్రదము లగుటచేఁ గర్తవ్యములో, ఎట్టి కార్యములు విడువఁదగినవో తెలిసికొనుట యావశ్యకము.

ఎట్టి కర్మమునైనను జేయుటయందు మూఁడవస్థ లుండును. మొట్టమొదట విషయేచ్ఛ కలుగఁగా దాని నీడేర్చుకొను విధమును మనస్సున సంకల్పించి యనంతరము కర్మమును బాహ్యముగఁ జేయును. కావుననే బృహదారణ్యక శ్రుతి (౪-౪-౫) యందు

> కామమయ ఏవాయం పురుష ఇతి. స యథా కామో భవతి తత్క్రతుర్భవతి. యత్క్రతుర్భవతి తత్కర్మ కురుతే. యత్కర్మ కురుతే తదభిసంపద్యతే ॥

అని చెప్పఁబడినది.

తా. ఈ పురుషుఁడు కామస్వరూపుఁడు. కామానుగుణముగ సంకల్పించువాడు. సంకల్పానుసారముగఁ గర్మమును జేయుచున్నాఁడు. కర్మానుసారముగ ఫలము నందుచున్నాఁడు.

ఈ రీతిఁ గామము, క్రతువు లేక సంకల్పము, క్రియ యని కర్మము మూఁడవస్థలు కలదగును. ఇందు ౧. కామము. ఇచ్ఛామాత్ర మనోవ్యాపారము. మానసిక కర్మము. ౨. సంకల్పము, విషయేచ్ఛ స్ఫుటమై దానిని గ్రియాదులచే నెఱవేర్చువిధమును బన్ని క్రియను జేయఁబూనుట. ఇదియే వాచిక కర్మము. వాక్కనునది సర్వేంద్రియములను సూచించును. కామసంకల్పములు వ్యక్తములు కాఁగా వాక్కుతో వచించునట్లు సర్వేంద్రియములతోను బనిచేయుట యింద్రియ కర్మమని చెప్పఁబడును. ౩. క్రియ, బాహ్యమగు కర్మము, అనఁగా బయటచేయుపని, కాయిక కర్మము. ఇది మూఁడవది. ఇట్లు మనస్సుచేతను, ఇంద్రియములచేతను, స్థూలమగు కాయముచేతను జేయఁబడు వ్యాపారము లన్నియును మనోవాక్కాయ కర్మములని చెప్పఁబడు. వీనియం దొకొక్కటియుఁ దదనుగుణమగు ఫలము నీయఁజాలియుండును. మానవుఁడు వాచికకాయిక కర్మములవలెఁ గేవల మనోవృత్తులచే నితరులకు మేలుకీడులు చేయఁగలిగియుండునని పూర్వాధ్యాయమున విస్తరించి వ్రాయఁబడి యున్నది. అట్లు ఇతరులకు మేలుకీడులు కలుగఁజేయుటచే వారితోఁ గర్మానుబంధమును గల్పించుకొను చుండును. వాని ననుసరించియే పురుషుఁడు సుఖదుఃఖముల ననుభవించు చుండు.

జీవుఁ డీశ్వరాంశమగుటచే సచ్చిదానంద స్వరూపుఁడు. ఈశ్వరునివగు నిచ్ఛాజ్ఞాన క్రియాశక్తులు జీవునియందునుఁ బ్రతిబింబించియే యున్నయవి. ఇవి భూరాద్యధోలోకముల యందుఁ గామములు, సంకల్పములు, క్రియలు అను మూఁడు దశలుగఁ గన్పడుచున్నయవి. కావున మానసిక, వాచిక, కాయికములగు కర్మములు జీవాత్మయొక్క మూఁడులక్షణ ముల ననుసరించి యుండు.

ఈ మూఁడు కర్మములు ఎట్టి యెట్టి సందర్భముల నేయే ఫలముల నీఁజాలునోయని యెఱుఁగవలయు నన్న ముఖ్యముగ మూఁడున్యాయముల నెఱుంగవలయును.

౧. పురుషుఁడెయ్యె కామములకు లోఁబడునో యాయా కామవిషయములకు బద్ధుఁడై యవి యుండు ప్రదేశముల కాకర్షింపఁబడును.

తదేవసక్తస్సహకర్మణైతి లింగం మనోయత్ర నిషిక్తమస్య ।

(బృహదారణ్యకము)

అనఁగా, మనస్సు ఏవిషయమునందు మగ్నమగుచుండునో ఆ విషయమును గూర్చి కర్మానుసారముగ జీవుఁడు పోవు చున్నాఁడు.

కామముగల జీవునకును, ఆయా విషయములకును దృఢ మగు ననుబంధము కలుగుచున్నది. ఆ విషయములు కర్మ ఫలరూపములుగ ననుభవించుట విధియై యవి యుండుచోటికి

విధివశముగ నీడువఁబడుచున్నవాఁడు. ఇట్లు కామము బంధమగుచున్నయది.

కామాన్ యః కామయతే మన్యమానః స కామభిర్జాయతే తత్ర తత్ర ।
(ముండకోపనిషత్తు ౩-౨-౨౦)

ఏయే కామములను మనసా చింతించి కోరునో, ఆయా కోరికలతో ఆయా కామ్యవిషయములుండుచోట్ల, అనగా ఆ కోరిన విషయములతో చుట్టఁబడినవాఁడై పుట్టును.

అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే । (గీత. ౫-౧౨)

ఇంద్రియమనస్సులను స్వాధీనముగ చేసికొననివాడు కామముచేత ప్రేరేపింపఁబడి, ఫలాపేక్షగలవాఁడై బద్ధుఁడగును. ఆ ఫలము సుఖదాయకమైనను దుఃఖదాయకమైనను అనుభవింపక తీరదు. మానవుఁడు సార్వకాలిక సుఖమునే కోరుచున్నను అజ్ఞానముచేతఁ దాత్కాలికమగు నల్పసుఖమును గోరి పర్యవసానమునఁ రాఁబోవు దుఃఖమును గమనింపమిచేఁ గాలక్రమమున నాయల్పసుఖము తుదముట్ట దానిననుసరించియుండు దుఃఖమును బొందుచున్నవాఁడు. కర్మఫలము సుఖరూపముగ నుండిన నాకర్మము పుణ్యకర్మమనియు, దుఃఖరూప ఫలమునిచ్చు కర్మము దుష్కర్మమనియు సామాన్యముగ నెఱుంగఁబడు చున్నయది. ఈ న్యాయమును జక్కఁగ దెలిసికొని, మానవుఁడు తనయందుఁబొడము కామములను జక్కఁగఁ బరిశీలించి శాశ్వతసుఖదాయకములగు

విషయములనే కోరుచు ననిత్యములగు కామముల వర్జింపఁదగు. వాఁడు కోరినవిషయములు పరజన్మములయందు దమంతట తాము ప్రాప్తించుచుండును.

౨. మనస్సు కల్పనాశక్తి కలది. మనుష్యుఁ డెట్టి సంకల్పములను భావించుచుండునో ఆవిధముగ నగుచుండును. "యద్భావం తద్భవతి" ఎట్టి సంకల్పముల నిహాజన్మమునఁ గలిగియుండునో పరజన్మమున నవి జీవునకుఁ గలుగును.

> అథ ఖలు క్రతుమయః పురుషః యథాక్రతు రస్మిన్లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి ।
>
> (౩-౧౪-౧ ఛాందోగ్యము)

తా. పురుషుఁడు క్రతుమయుఁడు — సంకల్పరూపుఁడు. ఇహాజన్మమున నెట్టి సంకల్పములు గలవాఁడగునో శరీరపతనానంతర మట్టి స్వభావముగలవాఁడగును.

ఈశ్వరునియందు జ్ఞానశక్తివలె జీవునియందు మనస్సు క్రియాశక్తి ప్రతిబింబమగును. బ్రహ్మ తపస్సు చేసి ప్రపంచముల సృజించిన రీతిని జీవుఁడు తన సంకల్పములచేతఁ దన్నుఁ జుట్టియుండు సందర్భములను గల్పన చేయుచున్న వాఁడు. జీవుఁడు తనమనస్సున నెట్టి గుణములను మననము చేయునో అట్టి గుణములుగలవాఁ డగు. కావున మనుష్యుని స్వభావము సంకల్పములచేఁ గల్పింపఁబడినది. పలుమాఱు సత్యము, భూతదయ, శాంతము లోనగు సద్గుణములను మననము

చేయఁ గాలక్రమమున సత్స్వభావము కలవాఁ డగును. అటు లనే యీర్ష్యాసూయలు, పరాపకారము మొదలగు దుర్గుణములను మననముచేయఁ గ్రమక్రమమున దుస్స్వభావము కలవాడగును. దీనిని దెలిసికొనిన మానవుఁడు తన స్వభావమును గోరినట్లు మార్చుకొనుటకు శక్తిగలవాఁడగును. ఎట్టి గుణములను దనస్వభావమునందు దృఢపఱచుకొన నిచ్ఛయించునో అట్టి గుణములను మనమున నెల్లప్పుడు మననము చేయ నాగుణములు జీవుని స్వభావముగ దృఢపడును. అటులే తనయందలి దుర్గుణములను విడువవలయు నను సంకల్పము దృఢముగఁ జేయ నాదుర్గుణములు సైతము కాలక్రమమున వదలిపోవును. జీవుఁడు పరిశుద్ధములును, యోగ్యములును నగు విషయములను, గుణములను, గార్యములను బలుమాఱు చింతించి సత్స్వభావమును వృద్ధిచేసిన మరలమరల నట్టి సంకల్పములనే సులువుగఁ జేయుచు రాఁబోవు జన్మములయందుఁ గూడ నట్టి శుభవాసనలు దృఢముగఁ గలవాఁ డగును. అటులే హేయములును, వర్జ్యములు నగు నీచగుణములను మననము చేయఁ దదనుగుణములగు నశుభవాసనలత్రోట్టి ముందు జన్మించును. ఈ శుభాశుభవాసనలే పూర్వకర్మమని యెన్నఁబడును.

3. మఱియు జీవుఁడు చేయు క్రియల ననుసరించి బాహ్యములగు సందర్భాసందర్భములు కలుగుచున్నవి. జీవుఁడు

చేయు కార్యము లితరుల సుఖదుఃఖములకు హేతువులగును గాన నితరులకు సుఖము గలుగఁజేయుచుండిన మానవుఁడు పరజన్మమునందును సుఖము ననుభవించు సందర్భములు గల్గి పుట్టును. అట్లుకాక లోకులకు బాధను గలుగఁజేయువాఁడు దుఃఖమును బొందు సందర్భములు గలిగి పుట్టును.

యథా యథా కర్మగుణం ఫలార్థీ
కరోత్యయం కర్మ ఫలే నివిష్టః ।
తథా తథా యం గుణసంప్రయుక్త
శ్శుభా శుభం కర్మఫలం భునక్తి ॥ (శాంతిపర్వము)

తా. ఫలమును గోరి జీవుఁడెట్టి యెట్టి కార్యముల నొనరించునో రాఁబోవు జన్మమున నట్టి శుభాశుభరూప కర్మఫలముల ననుభవించును.

నా బీజాజ్జాయతే కించిన్నాకృత్వా సుఖమేధతే ।
సుకృతై ర్విందతే సౌఖ్యం ప్రాప్య దేహక్షయం నరః ॥

(శాంతిపర్వము)

తా. విత్తనములు చల్లక చెట్లు మొలవనియట్లు తానేమియుఁజేయక యేసౌఖ్యమును బొందఁడు. సత్కార్యములచే దేహాంతమునందు సౌఖ్యము కల్గును.

ఈ న్యాయములను దెలిసికొనిన జీవుఁడు మంచి చెడ్డలను జక్కఁగ విమర్శించి నడుచుకొనుచు రాఁబోవు జన్మముల యందుఁ గోరినట్లనుకూల ప్రతికూలములను గల్పించుకొనఁ

జాలియుండును. అనఁగా సత్సంకల్పములచేత మంచిస్వభావమును, దుస్సంకల్పములచేత దుష్టస్వభావమును జీవుఁడు కల్పించుకొనిన రీతిని సత్కార్యములచేత ననుకూల సందర్భములను గల్పించుకొనును.

లోకమునం దనేకులు బాల్యమునుండి నైజముగ మంచి గుణములు గలిగి యుండుటను, మఱికొందఱు దుర్గుణములు గలవారుగ నుండుటను జూచుచున్నాము కదా! అట్టి సుగుణ దుర్గుణములు పూర్వజన్మములయందు వారుచేసిన మానసికములగు కర్మముల ఫలములని యెన్నఁదగి యుండును. మఱియుఁ గొందఱు జీవులు యోగ్యత యుండినను లేకుండినను, నిరంతరసుఖము ననుభవించుటయును, మఱికొంద ఱెంత ప్రవీణులుగ నుండినను విఫలమనోరథు లగుటయును గన్నులారఁ గాంచుచున్నాము. ఇద్దియును బూర్వజన్మములయందలి కాయికమగు కర్మఫలమేయని యెఱుంగదగు.

ఇట్టి మూఁడున్యాయములును జీవుని యిచ్ఛాజ్ఞాన క్రియాశక్తుల ననుసరించునవి. ఈ మూఁడుశక్తులును జీవునకుఁ బ్రతి జన్మమునందును కోరికలుగను, సంకల్పములుగను, బాహ్యకార్యములుగను గన్పడుచుండును. పైసూచింపఁబడిన మొదటి న్యాయము ననుసరించి కోరికలవలనఁ గోరునట్టి జీవునకు, కోరఁబడు పదార్థమునకును దృఢమగు ననుబంధము కలుగుచున్నది. అటులనే సంకల్పమువలన జీవునిస్వభావము నిరూ

పింపఁబడుచున్నది. కాయికములగు కార్యముల ననుసరించి బాహ్యములగు ననుకూల ప్రతికూలనిమిత్తము లేర్పడుచున్నవి. ఇట్లు మూఁడువిధములగు కర్మముల ఫలములు జీవుని ననుస రించియే యుండును.

జీవుఁడు ఎల్లప్పుడును క్రొత్తదియగు కర్మమును జేయుచుఁ బూర్వకర్మఫలము ననుభవించుచునేయున్నవాఁడు. పూర్వపు రాగద్వేష వాసనలతోడ జన్మింపక తీరదు. పూర్వపు సంక ల్పములచేతఁ గల్పింపఁబడిన స్వభావమునకు సామాన్యముగ లోఁబడి వర్తించుచుండును. పూర్వపుఁ గార్యముల వలని ఋణానుబంధరూపములగు ననుకూల ప్రతికూలముల నిర్బంధ ములకు లోనై యుండక తీరదు. ఐనను జీవాత్మ యీశ్వరాంశ మగుటచే స్వతంత్రుఁడుగ నున్నవాఁడు. పూర్వ మేరీతి నిచ్ఛ యించెనో, సంకల్పించెనో, బాహ్యములగు కార్యముల యందుఁ బ్రవర్తించెనో ఆలాగుననే వేఱువిధముగ నిచ్ఛ యించుటకును, సంకల్పించుటకును, కర్మములను జేయుటకును స్వతంత్రుఁడై యుండును. పూర్వపుఁ గర్మబంధములకు లోనై వర్తించుచుండినను తన స్వతంత్రమును గొంతవఱ కుపయో గించుటచే నాపూర్వపుబంధములఁ గ్రమక్రమమున వదలించు కొనుటకు శక్తికలవాఁడయియుండు. పూర్వకర్మానుసారమైన దుర్వాసనలు, దుస్స్వభావములు దృఢముగ నుండినను ఈ జన్మమునఁ బురుషప్రయత్నముచే నాస్వభావమునకు లోఁబ

డక మంచిమార్గమునఁ బ్రవర్తింపఁ గలిగియుండును. జీవుఁడు పూర్వజన్మాంతమున నరకానుభవముచే విషయవాంఛలకు విశేషముగ లోఁబడుట బాధకరమను జ్ఞానము కలిగి వానిని వదలవలయు నను నిశ్చయ మొక్కింతయైనను గలవాఁడయి యుండును. కావునఁ దరువాతి జన్మమునఁ బూర్వ కర్మానుసారములగు దుర్వాసనలు దృఢతరములయి యుండినను, తనకుండిన స్వల్పజ్ఞానముచే నైనను మంచిమార్గము నవలంబింప యత్నముచేయుచుఁ గ్రమక్రమమున నశుభవాసనలను నశింపఁజేసికొనఁజాలును. కృషిచేయువాఁడు భూమిపై మొలచియున్న బీజాంకురములలో మంచి మొలకలను వృద్ధిచేయు ప్రయత్నములు చేయుచు, నితరములగు నంకురములను గ్రమముగ నశింపఁజేయుటకుఁ దగిన ప్రయత్నములు చేసి తుద ముట్ట వాని నశింపఁజేయునట్లు జీవుఁడొక్కొక్క జన్మము నందును దనశుభవాసనలఁ గ్రమక్రమముగ నభివృద్ధి చేసికొనుచు, అశుభవాసనల నమూలముగ నశింపఁజేయ వలయును. ఇదియే విద్యాభ్యాసమువలని ముఖ్యప్రయోజనము. ఉపాధ్యాయులు విద్యార్థి స్వభావమును గుర్తించి పరిశీలించి శుభవాసనలను లాలనపాలనములచే వృద్ధిపఱుచుచు, నశుభవాసనలుండిన వానిని వృద్ధికానీయక పోగొట్టుచుండవలెను. అట్లు చేయుటచేఁ బూర్వపుఁ గర్మబంధముల నతిక్రమించుటకు జీవునకు శక్తి గలిగియుండును. "శ్రద్ధానుసారిణీ విద్యా బుద్ధిః

కర్మానుసారిణీ” అను లోకోక్తి యర్థమింతియ. ఇందలి పూర్వార్థమును నిరాకరించు రెండవభాగమును మాత్రము పలుమరు ప్రమాణముగఁ గైకొనుచుఁ దమతమ కార్యముల యందుఁ దమకు స్వతంత్రము లేదని భావించుచున్నారు. ఇయ్యది పొరపాటు. ప్రతిజీవుఁడును బూర్వకర్మానుసారము గనే నడుచుకొనుట విధియైనచో శాస్త్రములయందలి విధి నిషేధములన్నియు నిష్ప్రయోజనములగును గదా! శాస్త్ర ములయందుఁ గొన్ని కార్యములు కర్తవ్యము లని విధింపఁబడి మఱికొన్ని నింద్యములని నిషేధింపబడి యుండుటచే నింద్య కార్యములయందుఁ బూర్వకర్మానుసారముగ బుద్ధి ప్రసరించు చుండినను అట్లు ప్రకృతిబద్ధులయి వర్తింపక శాస్త్రములఁ బరిశీలించి శాస్త్రచోదితములగు కార్యములయందే వర్తింప వలయునని గ్రహింపవలయును గదా! లేనిచో శాస్త్రముల వలని ప్రయోజనము లేదు. స్వభావము శాస్త్రమునకు విరు ద్ధముగ నుండినపుడెల్ల దానిని మార్చి శాస్త్రానుసారముగ జీవుఁడు వర్తింపవలయును.

యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః ।
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ ॥

తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే కార్యాకార్య వ్యవస్థితౌ ।
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి ॥

(గీత. ౧౬. అధ్యా.)

తా. ఏ పురుషుఁడు శాస్త్రనియమమును మీఱి (పూర్వకర్మ జనిత) యిచ్ఛానుసారము వర్తించునో వాఁడు ఫలసిద్ధి నొందఁడు. సుఖపడఁజాలఁడు. పరమగతి వానికి లభించదు. కావున నిది చేయఁదగినదా, చేయఁదగనిదా యను సందియము గలిగినపుడు శాస్త్రమే ప్రమాణము. కాఁబట్టి యర్జునా! నీవు శాస్త్రములోఁ జెప్పియుండుదాని నెఱింగి కర్మము చేయఁదగి యుందువు.

ఈ యర్థమే శ్రీ మహాభారతమునందును విపులముగ నిరూపింపఁబడి యున్నయది. పురుషప్రయత్నము లేక యే కార్యసిద్ధి కానేరదు. కావునఁ బురుషప్రయత్న మెక్కుడుగ నుండవలయు. కార్యసిద్ధి నొనఁగూర్చుటయందుఁ బురుష ప్రయత్న మాఱుభాగము లనియును దైవిక మొక్కభాగ మనియును పురాతన గ్రంథములయందు నిరూపింపఁబడినది.

షడ్భిర్మనుష్యయత్నైశ్చ సప్తమం దైవచింతనమ్ ।

కాపువాఁడు పొలమును దున్ని విత్తి కలుపుతీసి మఱియు ననేక విధముల ప్రయత్నముచేయని యెడల దైవికమగు కాలవర్షములు కురిసియు సస్యములను ఫలింపఁజేయఁజాలవు గదా! పురుషప్రయత్నము లేనిచో దైవసహాయమువలని ఫలమెట్లు సిద్ధించును?

మఱియు హితోపదేశమునందు నీయర్థమే యెక్కుడుగ సిద్ధాంతీకరింపఁబడి యున్నది.

యథా హ్యేకేన చక్రేణ న రథస్య గతిర్భవేత్ ।
తథా పురుషకారేణ వినా దైవం న సిధ్యతి ॥
పూర్వజన్మకృతం కర్మ తద్దైవమితి కథ్యతే ।
తస్మాత్పురుషకారేణ యత్నం కుర్యా దతంద్రితః ॥

ఉద్యోగినం పురుషసింహ ముపైతి లక్ష్మీ
ర్దైవేన దేయ మితి కాపురుషా వదంతి ।
దైవం నిహత్య కురు పౌరుషమాత్మశక్త్యా
యత్నే కృతే యది న సిధ్యతి కోఽత్రదోషః ॥

తా. ఒక్కచక్రముతో బండి సాగదు. అట్లే పురుష ప్రయత్నములేక దైవముచేతనే ఫలసిద్ధి గలుగదు. తొలిజన్మమునఁ జేసికొనిన కర్మమే దైవమని చెప్పఁబడును. కావునఁ బురుషప్రయత్నమును పూనికతోఁ జేయవలయును.

పురుషప్రయత్నముచేయు పురుషునికి ఫలప్రాప్తి గలుగును. దైవముచే ఫలమియ్యఁబడు ననుమాట అజ్ఞానులు చెప్పునది. దైవమును చంపి, యాత్మశక్తితోఁ బౌరుషము చేయుఁడు. యత్నము చక్కఁగ జేసియు ఫలించనిచో దోషములేదు.

శాస్త్రములును, శాస్త్రార్థములును దెల్పు నితర గ్రంథములును నీరీతి నుద్ఘోషింపుచుండ విధికృతము జరుగుచున్నదనియును, దానిని దాఁటుటకు మానవులకు శక్తిచాలదనియును, మానవులు ప్రవాహకాష్ఠములవలెను, గాలిచేఁదూలిపోవు తృణమువలె నున్నారనియు నెంచుట యెంతటి పొరపాటు?

జీవుఁడు ధీరుఁడై యాత్మశక్తిని వినియోగించి యత్యుత్తమమగు కార్యముల సాధింపవలయు. అట్లసాధ్యములని యెన్నఁబడిన ఘనకార్యముల సాధించిన మహాపురుషులయొక్కయు, మహాపతివ్రతలయొక్కయు, వృత్తాంతములు పూర్వగ్రంథములలో నిండి యున్నవికద! మార్కండేయుని యాయువు పదాఱుసంవత్సరములు మించదని పుట్టినపుడే విధినిర్దిష్టమై యుండినను స్వప్రయత్నము చేతనే పూర్ణాయువు నొందుట మాత్రమే గాక చిరాయువును సైతము సంపాదించెను గదా! మఱియును పతివ్రతాశిరోమణియగు సావిత్రి తన పూనికచేతను, ధైర్యముచేతను, యమునిచేఁ జిక్కిన ప్రాణనాథుని ప్రాణముల మరలించి దుస్తరమగు విధిలిఖితమును దరించునట్లు జేయలేదా!

కావున నుత్సాహము గలిగి పూనికతోడ నుద్యమించువారల కసాధ్యమెద్దియు నుండదు.

కర్మణేంద్రో భవేజ్జీవో బ్రహ్మపుత్రిస్స్వకర్మణా ।
స్వకర్మణా హరేర్దాసో జన్మాదిరహితో భవేత్ ॥
స్వకర్మణా సర్వసిద్ధి మమరత్వం లభేద్ధ్రువమ్ ।
లభే త్స్వకర్మణా విష్ణో స్సాలోక్యాది చతుష్టయం ॥
సురత్వం చ మనుత్వం చ రాజేంద్రత్వం లభేన్నరః ।
కర్మణాచ శివత్వం చ గణేశత్వం తథైవ చ ॥

(శ్రీ దేవీభాగవతము, ౯ స్కం., ౨౭ అధ్యా.)

మఱియు యోగవాసిష్ఠమునందు,

పౌరుషేణ ప్రయత్నేన సహాసాంభోరుహాస్పదం ।
కశ్చిదేవ చిదుల్లాసో బ్రహ్మతా మధిగచ్ఛతి ॥
సారేణ పురుషార్థేన స్వేనైవ గరుడధ్వజః ।
కశ్చిదేవ పుమానేవ పురుషోత్తమతాం గతః ॥
పౌరుషేణ ప్రయత్నేన లలనాకలితాకృతిః ।
శరీర కశ్చిదేవేహ గతశ్చంద్రార్ధచూడతామ్ ॥

తా. జీవుఁడు స్వకర్మవశమున నింద్రుఁడును, బ్రహ్మపుత్రుఁడును గావచ్చును, మఱియు హరిదాసుఁడునుఁ జన్మరహితుఁడును గావచ్చును. ఇంకను సకలసిద్ధులను బొందనగు. అమరత్వమును బొందఁజాలును. సాలోక్యాది చతుర్విధముక్తులను జెందఁగలుగును. దేవత్వమును, మనుత్వమును రాజేంద్రత్వము మొదలగువానినెల్లఁ బొందఁజాలియుండును. స్వకర్మబలముననే శివత్వమును, గణేశత్వమును బొందనగు. పురుషప్రయత్నముచేతనే యొకానొక జీవుఁడు బ్రహ్మత్వమును బొందును. అటులనే శుద్ధమగు పురుషకారముచేతనే విష్ణుత్వమును బొందును. పురుషప్రయత్నముచేతనే యొకానొక పురుషుఁడు శివత్వమును బొందును.

కర్మవిషయమున నింకొకవిధమగు దురభిప్రాయముగూడఁ బలువుర మనస్సులయందుఁ బొడముచుండును. ఎవ్వఁడేని దారిద్ర్యముచేఁ గాని, రోగాదులచేతఁగాని బాధపడుచుండ

వానిం జూచువారు వానిని దైవోపహతునిగ భావించి వానికి సహాయముచేసిన నది దైవోద్దేశ్యమునకు విరుద్ధమగుననియు నెంచుట గలదు. అట్లెంచుట యజ్ఞానము. కర్మఫలానుభవము ఎపుడారంభమైనదియు నెపుడు పరిపూర్ణమగునదియును నజ్ఞులగు మనుష్యులకు సమగ్రముగఁ దెలియ సాధ్యము కాదు కదా; బాధితుల బాధలను దొలఁగింప యత్నించుట మానవుల ధర్మమయియుండ నవకాశము గలిగినపు డట్టి యత్నముచేయక యుండుట యధర్మము. బాధపడుచుండు వారిని జూచినపుడు వారికి సాయముచేయుటకుఁ బ్రతిమానవుఁడును యత్నింపవలయును. బాధపడువాని కర్మము పరిపక్వము కానిచో నా సహాయము లభింపకపోయినను పోవచ్చును. సహాయము నొందుటకుఁ గర్మము పరిపక్వమయినదియు, కానిదియు సర్వజ్ఞులగు మహానీయులకును, దేవతలకును నెఱుంగనగుఁ గాని యితరుల కెఱుంగ నసాధ్యము. కావునఁ బ్రతిమానవుఁడును దుఃఖితులగువారిని జూచునపు డెల్లఁ దన ధర్మమును విడువక నడుపవలయును. అనుభవించు వాని కర్మము పరిపూర్ణము కానిచో సహాయము చెందకుండఁ జేయుట కర్మదేవతల ధర్మము. దేవతలద్దానిని జేయఁజాలి యుందురు.

ఇదియునుంగాక మఱియొక సందియ మీ విషయమునఁ బొడముటయుం గలదు. ఒక్కొక్క జన్మమునందును జీవుఁడు

చేయుకార్యములు గ్రహములచారము ననుసరించి యుండుననియును, తమకు స్వతంత్రమేమియు లేదనియును, గ్రహములు కార్యములను జేయించువారనియును మనదేశమున విశేషముగ వాడుక గలదు. ఇంచుకయేని యాలోచించి చూచినచో నీయభిప్రాయము తప్పని స్పష్టమగుచున్నది. జననకాల గ్రహసంపత్తి జీవుని పూర్వపుఁగర్మఫలమును సూచించునదియేగాని గ్రహములు ఫలముల నిచ్చువారు గారు. సాధారణముగ జన్మపత్త్రిక వ్రాయునప్పు డాదియందు వ్రాయఁబడు శ్లోకము లీయర్థమునే విస్పష్టముగఁ దెలుపుచున్నయవి.

> శ్రుతాసతీ సాధుజనానురంజకా పిత్రంతరంగోత్పల చారుచంద్రికా ।
> భావ్యర్థసంసూచనసచ్ఛకుంతికా విలిఖ్యతే సంప్రతి జన్మపత్త్రికా ॥
> జననీ జన్మసౌఖ్యానాం వర్ధనీ కులసంపదామ్ ।
> పదవీ పూర్వపుణ్యానాం లిఖ్యతే జన్మపత్త్రికా ॥

"భావ్యర్థ సంసూచన సచ్ఛకుంతికా," "పదవీ పూర్వపుణ్యానాం" అను పదములవలనఁ బూర్వకర్మఫలములను గ్రహములు సూచించునవియేగాని ఫలముల నిచ్చునవి గావని స్పష్టమగుచున్నది. కావునఁ గొందఱు మానవులు అకృత్యములం జేసి తమజాతకరీతిచే గ్రహము లట్టి కృత్యములను జేయించిరని చెప్పుట యశాస్త్రీయము. పూర్వకర్మానుసారమగు శుభాశుభవాసనలను, మనశ్శక్తులను, జాతకమువలనఁ దెలిసికొనఁదగుఁ గాని జీవుఁడా ఫలములఁ దన ప్రయత్న

ముచే మార్పఁజాలఁడని చెప్పరాదు. జాతకమునుబట్టి జీవున కెద్దియేని యశుభవాసన లున్నట్లు తెలియవచ్చినచో వానిని నశింపఁజేయు విద్యను బూనికతో నభ్యసించి యాదుష్టవాసనల నశింపఁజేసికొనవలయు. ఇందుకు దృష్టాంతముగ నొక పురాతన కథ గలదు. తొల్లి యొక రాజసంస్థానమునఁ నొక్క జ్యోతిష్కుఁ డుండెను. అతనికిఁ బుత్త్రజననము కాఁగాఁ దత్కాలమును బరికించి జాతకము వ్రాయుచుండఁగా శిశు విరువది వత్సరముల ప్రాయము గలవాఁడైనపుడు చోరుఁ డగునని తెలిసెను. దానికిం జింతించి యా చౌర్యవృత్తి పుత్త్రున కలవాటు పడకయుండఁ దొలఁగింపవలయు నని యుద్దేశించి దీర్ఘముగ యోచించి విద్యాభ్యాసమువలనఁగాని దానిని దొలగింపరాదని నిర్ణయించి యది మొదలు విద్య చెప్పు చున్నపు డనేకనీతులను బోధించుటలోఁ జౌర్యవృత్తి నీచ మనియుఁ బాపహేతువనియు, నపకీర్తికరమనియు నిట్లనేక విధముల లక్ష్యలక్షణ పురస్సరముగ బోధించుచు నేయే పదార్థముల నపహరించిన నేయేదోషములు రాఁగలవో, యెట్టి శిక్షలు గలుగఁగలవో వానినెల్ల నొక్కొక్క చెప్పుచు వచ్చెను. ఆబాలుఁ డాసంగతినే దృఢముగ నేర్చుకొని క్రమముగ విద్వాంసుఁ డయ్యెను. కాని పూర్వకర్మవశమున నా కాలమురాఁగా దొంగిలించవలయు నను బుద్ధి యుదయించెను. ఆ రాత్రి యొరులెఱుఁగకుండ రాజమందిరమును జొచ్చి

యచ్చటచ్చట వెదకి ధనాగారమును బ్రవేశించి దానియందలి వస్తువుల నొక్కటొక్కటి చూచుచురాగాఁ దనకుఁ దండ్రి బోధించిన విషయములు జ్ఞప్తికి వచ్చెను. రత్నాదు లపహరించుటవలనఁ గలుగు పాపములు శిక్షలు తలంపునకు వచ్చినందున నదోషములని వానినెల్ల నపహరించుట మాని మరలి వచ్చుచు నొకమూల రాసిగాఁ బోసియున్న వరిపొట్టును జూచి దానియం దేమియుఁ దండ్రి దోషమును జెప్పియుండలేదు కావున దోషములేదని యపహరించి యింటికిం బోవుచుండెను. రాజగృహము వెడలుతఱిఁ గావలియున్న సేవకుఁ డాతనిం బట్టుకొని కట్టిపెట్టి యుదయమున రాజు సమ్ముఖమున నిలిపెను. రాజు తన యాస్థానపండితుని పుత్త్రుఁ డిట్టిపని చేసినందుల కాశ్చర్యపడి యేమి యిది యని నడుగ నతఁడు నిజస్థితిని జెప్పెను. నిశ్చయవార్త నెఱుఁగఁగోరి యాతని నొకచోట నునిచి తండ్రిని బిలుపించి రాత్రివృత్తాంతమును నెఱిఁగించెను. జ్యోతిష్కుఁడు జాతకదోషమును జెప్పుచు స్తేయదోషమునే విద్యాభ్యాసకాలమునఁ బలుమాఱు నొక్కిచెప్పితి ననియు నతఁ డా విషయము నెఱిఁగియున్నవాఁడు గావున నావృత్తికిఁ బోఁడని నిశ్చయించితి ననియుం జెప్పెను. రాజు సత్యము నెఱింగి విప్రకుమారుని విడిచిపెట్టెను. దీనినుండి పూర్వకర్మానుగుణములను నశుభవాసనలను విద్యాభ్యాసము వలన విశేషముగ మార్చి కాలక్రమమునఁ బూర్ణముగ నశిం

పఁజేసికొ౯న సాధ్యమగునని స్పష్టమగుచున్నది కదా! ఉపాధ్యాయు లగు వారలు విద్యార్థి జాతకలక్షణముల నెఱింగి యుండుట యెంత ప్రయోజనకారియైనదియు, నెంత యావశ్యకమైనదియు నీ యితిహాసమునుండి స్పష్టమగుచున్నది. పాఠశాలలయం దుపాధ్యాయులు పైని సూచించిన రీతిని విద్యార్థుల నొక్కొక్కరిని ప్రత్యేకముగఁ బరిశీలించి వారియందలి యశుభవాసనల నెఱింగి యా యశుభవాసనలఁ బుదముట్ట నశింపఁజేయుటకును, శుభవాసనల బీజావాపము సేయుటకును, బీజరూపముగ నుండు శుభవాసనల దిన దిన ప్రవర్ధమానములుగఁ జేయుటకును సదా యత్నింపవలయును. విద్యాభ్యాసమువలని ప్రయోజనము లౌకికజ్ఞానము నభివృద్ధి చేయుటమాత్రమే గాదు. విద్యార్థిని సుశీలునిగఁ జేయుట ముఖ్యోద్దేశ్యము. పూర్వము గురుకులవాసము వలన నిది సమకూరుచుండెను. ఇప్పుడు పాఠశాలలయందుఁ బెక్కండ్రు బాలు రొక్కయుపాధ్యాయుని యొద్దఁ గొద్దికాలము మాత్రము విద్యను గ్రహించుచుండుటచే నాముఖ్య ప్రయోజన మంతగ సమకూరుట గానము.

అయినను విద్యార్థివసతిగృహముల నేర్పాటుచేసి పాఠశాలాధికారుల విచారణలో నుంచి, విద్యార్థులకు గురువుల సాంగత్యము ఎల్లపుడు గలుగునట్లుచేయుట ద్వారా వారల ప్రవర్తనమును చక్కగ చేయదగు. ఈ విషయము ౧౧ వ

అధ్యాయమున బ్రహ్మచర్యాశ్రమధర్మముల క్రింద విస్తరింపఁ బడియున్నది.

కర్మములు ఫలమునిచ్చు శక్తినిబట్టి మూఁడు విధములుగ విభజింపఁబడియున్నవి. ప్రారబ్ధము, సంచితము, క్రియమాణము అని. ప్రారబ్ధమనఁ జక్కఁగ నారంభమయినది. అనఁగా ననుభవమునకు వచ్చిన పూర్వకర్మము. సంచితమన ననుభవమునకు రాశి చేరియుండు ప్రాక్కర్మము. ఇది సాధారణముగ జీవుని స్వభావముగను, శుభాశుభవాసనలుగను, మనశ్శక్తిగను గన్పడుచున్నయది. క్రియమాణమనునది వర్తమాన కర్మము. అనఁగా నీజన్మమునందుఁ జేయఁబడుచుండునది.

> అనేకజన్మసంజాతం ప్రాక్తనం సంచితం స్మృతమ్ ।
> క్రియమాణం చ యత్కర్మ వర్తమానం తదుచ్యతే ॥
> సంచితానాం పునర్మధ్యాత్సమాహృత్య కియత్కిల ।
> దేహారంభే చ సమయే కాలః ప్రేరయతీవ తత్ ॥
> ప్రారబ్ధం కర్మవిజ్ఞేయమ్ ।

(దేవీభాగవతము, ౬ స్క., ౧౧ అధ్యా.)

సంచిత కర్మమన ననేకకోటి జన్మములయందుఁ జేసిన కర్మఫల మనుభవించగా మిగిలియుండు కర్మశేషము. ప్రారబ్ధమన్న నట్లు శేషించియుండు కర్మమునుండి యీజన్మమునందు ననుభవమునకు వచ్చుభాగము. గృహాకర్త దీర్ఘకాలానుభవ

మునకుఁ దగినట్లు సేకరించిన పదార్థతుల్యము సంచితము. దానినుండి యప్పుడప్పు డుపయోగముకొఱకు విభజించి తీసి కొనఁబడు పదార్థమువంటిది ప్రారబ్ధము. అనేక జన్మముల యందనేకులతో సంసర్గము గలిగి వారితోఁ గర్మానుబంధము లేర్పడి యుండును. అట్టి జీవులందఱు నేకకాలమునందు జన్మిం చుటయు, జన్మించినను భిన్నభిన్న ప్రదేశములయం దుండుటచే నొకరితో నొకరు కలియుట కవకాశముండుటయును దటస్థిం పదు. ఇదిమొదలగు దేశకాల నిమిత్తములచే నొక్కొక్క జన్మమున నేయేజీవులతోటి ఋణానుబంధములను దీర్చుకొను టకు సాధ్యమగునో అట్టి జీవుల నొకచో జన్మించునట్లు చేయుట చేతను, లేక మఱి యేవిధముననైనను వారలు గలి యునట్లు చేయుట చేతను, కర్మశేషమునందుఁ గొంతభాగ మనుభవమునకు వచ్చితీరునట్లు కర్మఫలప్రదాతలగు దేవతలు నిరూపింతురని చెప్పియున్నాము కదా! అట్లొక్కొక్క జన్మ మునందు ఫలానుభవమునకు వచ్చిన కర్మభాగము ప్రారబ్ధ మనఁబడును. అనఁగాఁ జక్కఁగా ఫలమునిచ్చుట కారంభ మైనది. అనఁగా ఫలభూతమగు కర్మము. జీవునకుఁ గలుగు శరీరసౌష్ఠవము, మాతాపితలు, దేశకాలములు లోనగునవి యన్నియు నా ప్రారబ్ధకర్మము ననుసరించియే కలుగును. వింటి నుండి విడువఁబడిన బాణమువలెఁ బ్రారబ్ధ మనుభవమునకు రాక తప్పదు. ప్రారబ్ధమును మార్చుట కెవ్వరికిని సాధ్యము

కాదు. తనఫలమును దానిచ్చియే తీరును. "ప్రారబ్ధకర్మణాం భోగా దేవక్షయః" అని. ఇదియుఁగూడఁ బ్రయత్నముచే మార్ప సాధ్యముకావచ్చును గాన ప్రారబ్ధఫలమును, పురుష ప్రయత్నఫలమును రెండును గలిసి ఫలరూపముగఁ బరిణమించును. ఒక తూయిని ఉవ్వి దానిని నిరాటంకముగాఁ బోనిచ్చినచో నది పోఁదగు స్థానమునకుఁ బోవక నిలువదు. అట్లు గాక దానికడ్డముగా మఱియొక తూయిని ఉవ్విన నా రెండును నొకటితో నొకటి దగిలినచో మొదటితూయి తాఁ బోఁదగు స్థలమును బొందదు. రెండవతూయి స్వేచ్ఛగాఁ దాను బోదగు స్థలమునకుఁ బోదు. రెండును తమ మార్గములు విడిచి మఱియొక మూలగాఁ బోవును. ఈరీతినిఁ బ్రారబ్ధము తనఫలము నియ్యక తీరకయుండినను, పురుషప్రయత్నముచే దాని మార్ప నసాధ్యమని యెంచక పురుషప్రయత్నము చేసి నచోఁ బ్రయోజనము కలుగకపోఁజాలదు. ప్రయత్నము లేనిచో దాని ఫలము తానే వచ్చును. కొన్ని ప్రారబ్ధములు మనకుఁ దెలియకయే పైఁబడ వచ్చును. వానిని నిలువ బ్రయత్నము చేయను మన కవకాశమే కలుగదు. సంచితకర్మ మిట్లుగాదు. సంచితకర్మము ఫలస్వరూపముగఁ బరిణమించనిది. దానిని ప్రయత్నముచేత ననఁగా వర్తమానకర్మముచేత మార్పఁదగు. సంచితకర్మమున స్వభావరూపముగఁ గన్పడఁ దగినదంతయు నారూపముగఁ గన్పడుచున్నదనియు, వర్త

మానజన్మమునందుఁ జేయు ప్రయత్నముచే నాస్వభావమును మార్పఁదగుననియును నిరూపింపఁబడి యున్నయది కదా! ఇంతియగాక సంచితకర్మ ముత్తమమగు నాత్మజ్ఞానమువలన నశించును.

> యథైధాంసి సమిద్ధోఽగ్నిర్భస్మసాత్కురుతేఽర్జున ।
> జ్ఞానాగ్నిస్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥ (గీత. ४-3७)

తా. దీప్తాగ్ని కట్టెలను ఎట్లు భస్మముగఁ జేయునో అట్లే యర్జునా! జ్ఞానపావకుఁడు సర్వకర్మములను భస్మముచేయును.

చేయఁబడు కర్మమంతయు ఫలమునీయక తీరదను సిద్ధాంత మొకటి యుండ జ్ఞానముచేత మాత్రము కర్మ మెట్లు నశించునని యడుగవచ్చును. సంచితకర్మము ఫలము సుఖదుఃఖము కాక యుండుటచే నింకను బీజరూపముగనున్న దనఁదగు. ఇంద్రియములచేతను, మనస్సుచేతను జేయఁబడు కర్మమంతి యును జీవునకు స్వభావరూపముగ నుండుటచే నెల్లప్పుడును మార్పఁదగియే యున్నయది. కాయికకర్మము మాత్రము ఇతర జీవులకు సుఖదుఃఖకారణమై యుండియుండుటంబట్టి యాయా జీవులు భూలోకమున జన్మించి యుండుకాల మా ఋణానుబంధములఁ దీర్చుకొనుట కవకాశముల నిచ్చును. తనతోఁగూడ జన్మించియుండు జీవుల ఋణములు మాత్రము ప్రారబ్ధమునందుఁ జేరియుండుటచే నాజన్మమునఁ దీర్పఁబడును. ఇతర జీవులు భూలోకమున జన్మించియుండమిచే, వారల

బాణము లక్ష్యవేగముచే నాపరాక పోయి యాగోవును జంపును.

పైని వ్రాయఁబడినదంతయు నాయాజీవుని ప్రత్యేక కర్మ మును గుఱించినది. ఇదిగాక జనసముదాయముచే ననుభ వింపఁబడు కర్మము సంఘాతకర్మ మనఁబడుచున్నది. ఒకా నొక సమయమున గొప్ప జలప్రవాహముచేతఁగాని, భూకం పముచేతఁగాని, లేక ధూమశకటము లోనగువానికి హాని కలుగుటచేతఁగాని పెక్కు జను లేకకాలమున బాధనొందు టయు, నశించుటయును గని వినియున్నాము. అటులనే యొకా నొకప్పుడు ప్రభుసందర్శనాది కాలములఁ బెక్కండ్రు జను లనేక మహోత్సవములఁ జూచుట మొదలగు సుఖములఁ జేరి యనుభవించుటయుఁ గలదు. ఈ సుఖదుఃఖములన్నియు సంఘాతకర్మ మనఁబడుచున్నవి. ఎప్పుడేనియుఁ బెక్కండ్రు జీవులొక్కవిధమైన కర్మానుభవమునకుఁ బాత్రులు కావలసి నట్లుండినఁ గర్మఫలప్రదాతలగు దేవతలు ఆ జీవుల నందఱు నొక్కస్థలమునఁ జేరునట్లు సమకూర్చి యట్టి సుఖదుఃఖముల ననుభవించునట్లు చేయుదురు. అట్టి యనుభవమునకు బాత్రుఁ డుకాని జీవుఁ డొక్కఁ డా సముదాయమునం దుండినను, ఎద్దియో యొక కారణముచేత నాసంఘాతకర్మమునుండి దైవి కముగాఁ దొలగింపఁబడును. ఓడయందుఁ బ్రయాణముచేయు జనులలో నొకఁ డెచ్చటనేని దిగిపోయిన మఱునిముసమందే

యా యోడ మునిగిపోవుట గలదు. అప్పుడు పూర్వక్షణమున దిగిపోయినవాఁడు ఈ సంఘాతకర్మమునకుం బాత్రుఁడై యుండలేదని యెన్నవలయును. అట్లే కొందఱు పోగబండి ప్రయాణము నుద్దేశించి పయనమై దైవికముగ నేదియో యొక యసందర్భముచే నిలిచిపోయి, నాఁటిదిన మాపోగబండి కపాయము పోఁకి యాబండి నశించినయెడల నా పయనము చేయక నిలిచిపోయినవారు సంఘాతకర్మమునకుం బాత్రులు గామిచేఁ గర్మదేవతలవలనఁ దొలగింపఁబడిరని యెన్నఁదగు. ఆలాగుననే మార్గమున నొకానొక స్థలమునఁ గొందఱు జను లాబండిలోఁ బ్రవేశించి సంఘాతకర్మ ఫలమగు మరణము నొంది యుండవచ్చును. ఇట్లే భూకంపముచే నొక్క స్థలమున వేలకొలఁది జనులు స్వల్పకాలముననే నశింపఁగా ముందుదినమున నెందఱో యా స్థలమును విడిచిపోయి యుండుటయు, మఱికొంద ఱచ్చటికిఁ బూర్వక్షణముననే వచ్చియుండుటయుం జూడఁ గర్మఫలప్రదాతలగు దేవతలు కర్మానుసారముగఁ గొందఱిని దొలఁగించి కొందఱ నచ్చటకుం జేర్చియున్నవారని స్పష్టమగుచున్నది.

జీవుఁడు కర్మముల నెల్లప్పుడు చేయుచుండియుఁ గర్మబంధములనుండి యెట్లు విముక్తుఁడగు ననువిషయము విచారింపఁదగియున్నయది. సామాన్యముగా నొక బ్రహ్మాండమునందుండువఱకు నీశ్వరుని యాజ్ఞ నతిక్రమించుటకు బ్రహ్మములకు

నైతము శక్యముగాదు. ఈశ్వరాజ్ఞకు లోఁబడియే వర్తింప వలయును. అంతమాత్రము జీవులకు పారతంత్ర్యమున్నట్లు చెప్పవలసియే యున్నది. ఆయాజ్ఞ నతిక్రమించక బ్రహ్మాండ మునందు వర్తించుటలో జీవునకుం గల స్వాతంత్ర్యవిషయ మిదివఱకె విశదీకరింపఁబడి యున్నది. సంచిత ప్రారబ్ధకర్మ ములు జీవునిచేఁ బూర్వము చేయఁబడిన మనోవాక్కాయ కర్మములేగాని నిర్బంధముగ జీవుని బంధించు భిన్నమగు విధి కృతములు గావు. విధియనఁగా చట్టము. కర్మమునకుఁ దగిన ఫలము తప్పక కలుగుననునది యీకర్మవిధి. కావున విధిశబ్ద ముచేత జీవుని పురాకృత కర్మములే తెలుపఁ బడుచున్నవి గాని యితరము గాదు. కావుననే యోగవాసిష్ఠమను వేదాంతగ్రంథమున సంచిత ప్రారబ్ధకర్మములు ప్రాక్తన పౌరు షేయములని నిరూపింపఁబడి యున్నవి.

"కర్మణా బధ్యతే జంతుః" అను వాక్యము సామాన్య ముగ లోకమున వాడుకలో నున్నదియేకదా! కర్మము చేయు నంతకాలము కర్మబంధములనుండి విముక్తియే లేదా యను సందియము వాపుటకు శ్రీ భగవద్గీతయందు

> యజ్ఞార్థాత్కర్మణోన్యత్ర లోకోయం కర్మబన్ధనః ।
> తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగ స్సమాచర ॥ (గీత. ౩-౯)

అని యుపదేశింపఁబడి యున్నది. అనఁగా నీశ్వరార్పణ బుద్ధితో స్వప్రయోజనము నత్యల్పమైనను అపేక్షింపక

కర్మమం దభిమానము లేక చేయఁబడు కర్మము తప్ప తక్కిన కర్మములు జీవులను బంధించుచుండును. కావున నీశ్వరార్పణ బుద్ధితో రాగద్వేషములు లేక కర్మము చేయవలయునని తాత్పర్యము.

ఏ ప్రయోజనము నుద్దేశించి జీవుఁడు కర్మమొసరించు వాఁడో ఆ ప్రయోజనమును భగవంతుఁ డనుగ్రహించుచున్న వాఁడు.

"యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్" ఫలార్థుల కిష్టభోగములను, జిజ్ఞాసువులకు జ్ఞానమును, ముముక్షువులకు మోక్షము ననుగ్రహించును. కావున జీవుఁడు ఫలాభిసంగ రహితముగఁ జేయు కర్మములు బంధరూపములు గావు. అట్లు చేయఁబడు కర్మములు యథార్థముగఁ గర్మములనఁబడఁజాలవు. అట్టివాఁడే కర్మమం దకర్మమును జూచు వాఁడని యెన్నఁదగు. అతఁడే నిజమైన సన్న్యాసియు, యోగియు నని భగవంతుఁడు బోధించియున్నాఁడు.

> కర్మణ్యకర్మ యః పశ్యే దకర్మణి చ కర్మ యః ।
> స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ ॥
> (గీత. ४-౧८)
>
> అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।
> స సన్న్యాసీ చ యోగీ చ ననిరగ్నిర్నచాక్రియః ॥ (గీత. ౬-౧)

ఇవ్విధమగు కర్మము జీవుని బంధింపదు. లోకసంగ్రహార్థము చేయఁబడునది. అట్టి కర్మములు సంపూర్ణముగ కామ

వివర్జితములై యుండుటచే బంధరూపములు కాకపోవుటయే గాక బ్రహ్మప్రాప్తికరములుగూడ నగుచున్నవి.

యదా సర్వే ప్రముచ్యంతే కామాయేఽస్య హృదిస్థితాః ।
అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే ॥
(కఠోపనిషత్తు. ౨-౬-౧౪)

ఎప్పుడైతే హృదయగతమగు కామము లన్నియు వదలిపోవునో అపుడు మర్త్యుడు అమృతత్వమును పొందును. ఇచ్చటనే (అనఁగా జీవించియుండగనే) బ్రహ్మమును పొందును.

ఈయర్థమే శ్రుతులయందచ్చటచ్చట విశేషముగ నొక్కి చెప్పఁబడి యున్నది. గీతాశాస్త్రమునందును బెక్కుమాఱు లుదాహరింపఁబడి యున్నది.

యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥
త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కించిత్కరోతి సః ॥
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ।
సమ స్సిద్ధావసిద్ధౌచ కృత్వాపి న నిబధ్యతే ॥
గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థిత చేతసః ।
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥
బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥
(గీత. ౪ అధ్యా. ౧౯, ౨౦, ౨౧, ౨౨, ౨౩, ౨౪)

బ్రహ్మణ్యాధ్యాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।
లిప్యతే న స పాపేన పద్మపత్త్రమివాంభసా ॥ (గీత. ౫-౧౦)

ఇట్లు ఫలాపేక్ష లేక చేయఁబడు కర్మములు ఆదియందుఁ జిత్తశుద్ధిసాధనములై యాపిదప నాత్మజ్ఞానహేతువులై మోక్ష సాధనము లగుచున్నవి. చిత్తశుద్ధికాకపూర్వమే కర్మములను విడుచుట సైతము బంధకారణమే యగు. చిత్తశుద్ధిగలిగి కామమును సంపూర్ణముగ జయించి భగవంతుఁడు లోకానుగ్రహార్థము నిర్హేతుక కరుణతో లోకమునందు వర్తించురీతి లోకమునఁ బరమేశ్వరప్రీతికొఱకు స్వామిభృత్య న్యాయమునఁ గర్మములను జేయుచు వర్తించు మహానుభావుఁడు బంధవిముక్తుఁడై పరమపురుషార్థమును జెందును. అట్టి మహాత్ముని గుఱించియే “అత్ర బ్రహ్మసమశ్నుతే” అని చెప్పఁదగు. అనఁగా నిక్కడనే (ఈ శరీరమునం దుండఁగానే) బ్రహ్మానందము ననుభవించుచున్నవాఁడు. వీరలే జీవన్ముక్తులనఁబడువారలు. అట్టి పదవిని బొందినపిదప నాయానందము ననుభవించుచు నుండిన నుండఁగలరు. లేక బ్రహ్మాండమునందు నీశ్వరుఁడు వర్తించునట్లు నిర్వ్యాజకరుణతో లోకోపకారము కొఱకుఁ గర్మమును జేయుచు నుండఁగలరు.

న మే పార్థాస్తి కౌన్తేయ త్రిషు లోకేషు కించన ।
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥ (గీత. ౩-౨౨)

అని భగవంతుఁడు తన దృష్టాంతముచే నర్జునుని గర్మమం దుత్సాహముగల వానినిగాఁ జేసెనుగదా!

ఈ కాలమునందును స్వప్రయోజనపరులు గాక లోకోప కారమునకొఱకుఁ బాటుపడఁ బెక్కండ్రు మహాత్ములు కావలసి యున్నవారు. కావున జిజ్ఞాసువులగు నెల్లవారును లోకహి తార్థము కర్మముల జేయుచుఁ దాము పరిశుద్ధులై పరమపురు షార్థము జెందుటయేగాక యెల్లరకు నట్టిపదవి గలుగఁ జేయు నంతవఱకు శ్రమపడి భగవదుద్దేశ్యమును సఫలము చేయు దురు గాక.

పదియవ యధ్యాయము

ధర్మము

ధర్మమన జీవుఁ డేకాలమునందుఁ గాని యుండు స్థితినుండి యంతకంటె నుత్కృష్టమగు స్థితికిఁ దేఁదగు నుపాయము. లోకమునందలి భూతము లన్నియు ననేక తారతమ్యములు గలిగి యుండును. ధర్మము లోకమును ధరించుచున్నది. అనఁగా ధర్మానుష్ఠానముచేతనే లోకము సుఖతరముగ వృద్ధి యగుచున్నయది.

ధారణా ద్ధర్మ మి త్యాహు ర్ధర్మో ధారయతి ప్రజాః
ప్రభవార్థాయ భూతానాం ధర్మప్రవచనం కృతమ్ ।
య స్స్యా త్ప్రభవసంయుక్తః స ధర్మ ఇతి నిశ్చయః
ధారణా ద్ధర్మ మిత్యాహుః ధర్మేణ విధృతాః ప్రజాః ।
య స్స్యా ద్ధారణసంయుక్త స్స ధర్మ ఇతి నిశ్చయః ॥

(శాంతిపర్వము)

అను వచనము లీయర్థమునే స్పష్టపఱచుచున్నవి. సమస్త భూతములు వానివాని ధర్మములను జక్కఁగ ననుష్ఠించుచుండుటచే లోకవ్యాపారము సమంజసముగ నెఱవేఱుచుండ సందఱును బురుషార్థములఁ జెందఁజాలుదురు. లోకమునందలి జీవుల తారతమ్యముల కనుగుణముగ నిరూపింపఁబడిన ధర్మ

ములే వర్ణాశ్రమధర్మములని యెఱుంగఁబడుచున్నవి. పరికించి చూడ ధర్మమెల్లప్పుడును సుఖము నిచ్చునదియును, అధర్మము దుఃఖప్రదమును నగు. భరతఖండమున వర్ణాశ్రమధర్మములు ప్రత్యేకముగ నిరూపింపఁబడి యుండినను, ఇతర దేశముల నట్లు లేమిచే నాదేశస్థులయం దిట్టితారతమ్యములు లేవని యెంచ రాదు. సనాతనధర్మ శాస్త్రకర్తలు దృశ్యాదృశ్య ప్రపంచ తత్త్వములను జక్కఁగ నెఱింగినవా రగుటంబట్టి జీవుల నుత్తమస్థితికిఁ దేఁదగు నుపాయముల నిశ్చయముగఁ దెలిసి నిరూపించియున్నవారు. ఇతర దేశములయం దిట్టి ధర్మనిరూపణము పరిశీలించి చేసియుండమిచే జీవులు తమయోగ్యతకుఁ దగిన ధర్మమును బాగుగ నిశ్చయింపఁజాలక యనేక కష్టములఁ బడుచున్నవారు. ఐనను హిందూశాస్త్రములలో నిరూపింపఁబడిన ధర్మము లన్నియు మానవకోటి యందఱచే నను ష్ఠింపఁబడ దగినవియే.

సామాన్యముగఁ బరిశీలించి చూచిన జీవులలోఁ గొంద ఱజ్ఞానమున మునిఁగి, జడత్వమును బొంది, నిద్రాలస్యములే స్వభావముగఁ గలిగియున్నవారు. మఱికొందఱు ప్రతికార్యమునందు నతిప్రవృత్తి కలిగి, యుక్తాయుక్త వివేకజ్ఞానము విశేషముగ లేక స్వప్రయోజనపరులై కామక్రోధాదులకు లోఁబడి వర్తించువారు. మఱికొందఱు జ్ఞానస్వరూపులై శమ దమాది సద్గుణసంపన్నులై విజితమత్సరులై శాంతాత్ములై

యున్నవారు. ఈ తారతమ్యముల ననుసరించియే చాతుర్వర్ణ్య విభాగము చేయఁబడియె. ఈ విభాగము సృష్ట్యాదినుండి ఏర్పడినదేగాని మధ్యకాలమున మనుష్య మాత్రులచేఁ జేయఁబడినది కాదు. ఉత్తమపురుషార్థ సాధనముగ నేర్పడినదిగాని యైహిక ప్రయోజనము మాత్రము నుద్దేశించి చేయఁబడినది గాదు.

> చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః।
>
> (గీత. ౪-౧౩)

అని భగవంతుఁడు గీతోపనిషత్తునందు వక్కాణించియున్న వాఁడే కదా!

ఈ మూఁడు తరగతుల జీవులు తమోగుణ ప్రధానులనియు, రజోగుణ ప్రధానులనియు, సత్త్వగుణ ప్రధానులనియు నెంచఁగఁబడుదురు. ఈ గుణవిభాగము లన్ని దేశములందుండు జీవులందఱకును సామాన్యమే కదా! ధర్మము లన్నియును మొట్టమొదటఁ దమోగుణ ప్రధానులుగనుండు జీవులయందలి తమస్సును అనఁగా జడత్వమును, నిద్రాలస్యములను తొలఁగించి రజోగుణ ప్రధానులుగఁజేసి కడపట సత్త్వగుణ ప్రధానులుగ జేయుటకు సాధనములుగ నున్నయవి. ఆదియందు జీవులు కేవల పశుప్రాయులుగనుండి జ్ఞానహీనులై శరీరపోషణమునకు వలయు నిద్రాహారములను, గ్రామ్యక్రియయుం దప్ప నితర వ్యాపారము లేవియు లేక జడస్వరూపులుగ నుందురు. పూర్వా

నుభవస్మృతిగాని రాఁబోవు కాలమును గుఱించిన చింతగాని వారియందే మాత్రమును గానము. అట్టి జడస్వరూపులను జ్ఞానవంతులుగఁ జేయవలసినచో మొట్టమొదట వారి తమస్సును పోఁగొట్టు నుపాయము లావశ్యకములు. కావుననే భగవంతుఁడు ప్రపంచమునం దెల్లయెడలను సుఖకరములును, రుచికరములును, మనోహరములును, సుందరములును నగు పదార్థజాలముల నిండింపఁజేసియున్నాఁడు. రుచిర పదార్థానుభవమున సుఖించుచు నా సుఖస్మృతిచే నావస్తువుల నాశించుచు వానికై పాటుపడుదురు. పశుప్రాయులగు వారలకు తాత్కాలిక విషయానుభవము తప్ప వేఱు చింత యుండదు. వారికి విషయానుభవమువలనఁ బ్రపంచజ్ఞానము వృద్ధి కాఁదగి యుండును. ఆహారమునందుఁగాని చేష్టలయందుఁగాని నియమములు లేవు. ఇష్టానుసారము వర్తించుటయే వారల ముఖ్యలక్షణము. అట్టివారలకు ధర్మాధర్మముల కట్టుబాట్ల నేర్పఱచుటకు సాధ్యమే కాదు. మంచిచెడుగులు వారల కిట్టి యనేకానుభవములవలనఁ గలుగవలసినదియే కాని వేఱువిధమునఁ గానేరదు. ఐనను ఇష్టానుసారముగ వర్తించుచో కొన్ని కార్యములు దుఃఖమును గలుగఁజేయుట చేతను, మఱికొన్ని సుఖకారణము లగుటచేతను, ఈ సుఖకరములగు కార్యములే చేయఁదగినవనియును, దుఃఖహేతువు లగు కార్యములు చేయరానివనియును, నెఱుంగుదురు గదా ; అట్టి జ్ఞాన మంకురించు

చురాఁగా, పెద్దలగువారు కొన్ని కార్యములు ధర్మవిరుద్ధము లగుటచేఁ జేయరానివనియును, మఱికొన్ని ధర్మము ననుసరించియుండుటచే గర్తవ్యములనియును బోధింపఁ దమ యనుభవమునకును, పెద్దల యుపదేశమునకును, సమన్వయము చేసికొని యా పెద్దల వాక్యమునందు విశ్వాసబుద్ధిగలవారగుదురు. జడులగువారికి యుక్తాయుక్తజ్ఞానము విశేషముగ లేకపోవుటచే నాప్తులగు పెద్దలవాక్యమునందు భక్తివిశ్వాసములును వారియందు గురుత్వబుద్ధియు గలిగి వారి యనుమతికి లోఁబడియుండి వారలకు శుశ్రూష చేయుటయు ముఖ్యధర్మములగు.

ఈ ధర్మములవలనఁ దమోగుణజాతములగు జడత్వమును, నిద్రాలస్య ప్రమాదములును క్రమముగ క్షీణింప విశేషముగఁ గార్యప్రవృత్తి గలవారలగుదురు. తమోగుణ ప్రధానులగు జీవులకు విధింపఁబడిన ధర్మములన్నియుఁ దమోనివృత్తిసాధనములుగ నుద్దేశింపఁబడినవి. తమోగుణము నివృత్తియగుటకు సేవకావృత్తి ముఖ్యసాధనము. ఆ వృత్తియందితరులకు లోఁబడియుండుట, ఇతరుల యిష్టానుసారము వర్తించుట, కాలము నతిక్రమించక విధింపఁబడిన కార్యముల నెఱవేర్చుటయు నీ మొదలగు ధర్మములచేతను, ఈకృత్యము లొనరించుటయందించుకయైనను లోపము గలిగినచో దానికి విధింపఁబడు దండన విధులచేతను, పైకృత్యములను సకాలమున నేర్పాటొఁ

జేయఁబడినపుడు గలుగు సన్మానములు, బహుమతులు మొద లగువానిచేతను, పూర్వపు నాలస్యము, సోమరితనము, మైమఱపు లోనగునవి క్రమక్రమమున నశించును. ఇట్లు సన్మానమునందలి ప్రీతిచేతను, దండమునందలి భీతిచేతను, దమోగుణము తగ్గి రజోగుణము వృద్ధియగుచుండును. ఇట్టి జీవులకు నాచార వ్యవహారములయందును, ఆహారవిహారముల యందును విధినిషేధములు శాస్త్రములలో విశేషముగఁ జెప్పఁబడి యుండలేదు. వీరే శూద్రజాతియందు జన్మించువారని స్మృతులయందు వక్కాణింపఁబడి యున్నది. ధర్మశాస్త్రముల యందు వారలకు విధింపఁబడియుండు ధర్మములు పైనుదహరింపఁబడిన ప్రయోజనమును గలిగించునవిగా యున్నవి.

పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ।

(గీత. ౧౮ అధ్యా.)

రెండవ తరగతి జీవులు రజోగుణ మెక్కువగాఁగలవారు. తమస్సంబంధములగు గుణములనుఁ గ్రమక్రమమున జయించిన జీవుఁడు పూర్వముకంటె నించుక యుత్తమజన్మమున కర్హుఁడగుచున్నాఁడు. అట్టి స్థితియందు జీవునకు ద్రవ్యమును సేకరించుటయం దుత్సాహము స్వాభావికముగ నుండు. జగమంతయు ధనమూలము గావునఁ గృషి, వాణిజ్యము, గోరక్షణము మొదలగు వృత్తులు ధనార్జనమునకే ముఖ్య సాధనము లగుటచే నవి వారికి ముఖ్యకర్మములుగ విధింపఁబడియున్నవి.

ద్రవ్యము సుఖసాధనమై యుండుటచే దానికొఱకు నెక్కుడగు ప్రయత్నములు చేయుచు నార్జింపఁబడిన ద్రవ్యమునందు విశేషమోహము గలిగి సదా ద్రవ్యకాముఁడై వర్తించుచుండును. ధనమునందుఁ గామము, ధనార్జనమునందుఁ బ్రతికూలములు సంభవించినచోఁ గోపము మొదలగు గుణములు ఈ జీవునకు సహజములుగ నుండు. ఇతఁడు స్వాభావికముగ ధనార్జనమే పరమార్థముగా గ్రహించి దానికై యితరుల సుఖదుఃఖముల నించుకయేని విచారింపక బహువిధప్రయత్నములు చేయుచుండును. అట్టి ప్రవర్తనమువలనఁ గేవల స్వప్రయోజనపరత్వము, ఇతరులతో విరోధము, మాత్సర్యము లోనగునవి యన్నియుఁ గొంతకాలము వృద్ధియగుచుండును. ఈ రీతి ధనార్జనమువలని సుఖము గలిగినను, బహువిధములుగ నితరులకు దుఃఖహేతువులగు కార్యములు చేయుటచేఁ దనకును దత్ప్రతిఫలములగు కష్టములు కొన్ని సంభవింపక తీరవు. అట్టి సుఖదుఃఖానుభవములవలనఁ గొన్ని కార్యములు దుఃఖహేతువులనియును, మఱికొన్ని సుఖహేతువు లనియును గ్రమక్రమముగ నెఱుంగఁగలఁడు. కామక్రోధాదులవలనఁ గలుగు కీడులను దెలిసికొని వానిని జయించుటకు శాస్త్రమునందు సూచింపఁబడిన ధర్మము అనుసరింపఁదగిన దనియు ననుభవమువలన నెఱుంగును. ఈ తరగతి జీవులకు నైజముగ నర్థకామములు ముఖ్యపురుషార్థములుగఁ దోఁచుచుండ వారు కుటుం

బములందును, జనసంఘమునందును, అన్యోన్య సుఖప్రదముగ నుండుటకుఁ గొన్ని కట్టుబాటులకు లోఁబడి వర్తింపవలసి యుండుటావశ్యకము. కావున ధర్మము మొదటి పురుషార్థముగ నేర్పడుచున్నది. జీవుఁడు తా నుత్తమస్థితిని బొందుచు నితర జీవులకు సుఖప్రదముగ నుండునట్లు ప్రవర్తించుటయే ధర్మమార్గము. అధర్మమువలన జీవుఁడు మునుపటికంటె నీచ స్థితి నొందుటయేగాక యితరులకు హింసచేయును.

ఈ జీవులకు ధనము సంపాదించుటయు, సుఖముల ననుభవించుటయు, గోరికల నీడేర్చుకొనుటయు, ముఖ్యధర్మములని చెప్పఁబడియెను, గాని యీ ధనార్జనమునందును, సుఖానుభవమునందును, ధర్మము ననుసరించి కొన్ని విధినిషేధములు ఆవశ్యకములగుచున్నయవి. ద్రవ్యమును సేకరించుటయం దితరులకు నష్టమును గలుగఁజేయకుండవలయును. సుఖముల ననుభవించుటయందును, ఇతరుల సుఖములకుఁ బ్రతిబంధము లేకుండునట్లు నడచుకొనవలయును. ఇట్టి నిబంధనల ననుసరించుటచేఁ గ్రమక్రమమున జీవుఁడు కేవల స్వప్రయోజనపరత్వమును వదలి యితరుల సౌఖ్యమునుగూడ గమనించి ధర్మమార్గమున నడువవలయునని తెలియునట్టి స్థితికి వచ్చును. పిదపఁ గాలక్రమమునఁ బరోపకారబుద్ధి వృద్ధియై "పరోపకారార్థ మిదం శరీరం" మ్మను న్యాయము ననుసరించును.

ఈ రీతి నాజీవుఁడు కేవల అర్థకామములకు లోఁబడక యుండునటుల ధర్మము మొదటి పురుషార్థముగ నిరూపింపఁబడియున్నది. ధనము నార్జించుటయందు ధర్మమును దప్పక ఆర్జింపవలయును. సుఖము లనుభవించుటయందును ధర్మమార్గమును మీఱక యుండవలయును.

ధర్మాఽవిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ । (గీత. ౭-౧౧)

ఈ స్థితియందుండు జీవులకు ధర్మవిరుద్ధముకాని కామము మిక్కిలి యావశ్యక మగుటచే నది తన స్వరూపమేయని భగవంతుఁడు గీతాశాస్త్రమునందు వక్కాణించి యున్నాఁడు. కాఁబట్టి ధనార్జనమునందును, కామోపభోగమునందును జీవులిష్టానుసారము వర్తింపక యుండుటకు ధర్మము నతిక్రమింపక యుండవలయు నను నిర్బంధము మొట్టమొదటిది. మఱియును ఆర్జితద్రవ్యమునందుఁ గొంతభాగమైనను బరోపకారమునకు వినియోగించుట యీజీవులకు ముఖ్యధర్మము. ద్రవ్య మార్జితపఱచుట ముఖ్యవ్యాపారముగ నుండునపు డార్జితవిత్తము తనకు మాత్రమే యుపయోగింపవలయుననుట యంత మంచిది గాదు. అతిజాగరూకతతో ధనమును భద్రపఱచుట, వ్యయ మొనరించుటయం దిష్టము లేక యుండుట యట్టి జీవులకు సహజగుణములుగ నుండు. ఐనను అట్టివారికి పరోపకారము కొఱ కల్పముగ నైన ధనవ్యయము చేయఁబడినచో భగవంతుఁడు ప్రీతినొంది పెక్కుమడుంగులు ద్రవ్యమును ప్రతిఫల

ముగ నిచ్చుచుండును. దేశకాలపాత్రము లెఱింగి భగవదర్పణముగ దానము లోనగునవి చేసినచో నిహపరసుఖములు గలుగునను ధర్మము లనుభవజ్ఞులును, తత్త్వవేత్తలు నగువారు శాస్త్రములయందుఁ బ్రతిపాదించి యుండుటచేఁ బరోపకారమున నెక్కుడాసక్తి కలుగును. ఈ రీతి గ్రమక్రమమునఁ బరోపకారబుద్ధి వృద్ధియగుచుండును. కాలక్రమమునఁ బరోపకారబుద్ధి వృద్ధి కానుకాను ధనమునం దభిమానము, మమత్వబుద్ధి వదలుచువచ్చును.

మఱియు శరీరసుఖమును గొంతవఱకు వదలినం గాని ధనార్జనమునందు నేర్పఱి కాఁజాలఁడు. కాఁబట్టి దేహసుఖమునంతగాఁ గోరక కార్యనిర్వాహణమందు జాగరూకతను, పూనికను అభ్యసించి పరిజనుల విషయమై యేయే మనుష్యులచే నెట్టిపను లెంతెంత యెప్పుడెప్పుడు చేయించవలయునో, హెచ్చుతక్కువలు లేక యెంతమాత్రము వారికి వేతన మీయవలయునో తెలిసి యప్రమత్తతో వర్తింపవలయును. ఇతరులతోఁ జేయు క్రయవిక్రయాది వ్యాపారమునందు న్యాయమును మీఱరాదు. ఆర్జించిన ద్రవ్యమును సద్వినియోగము చేయవలయు. ఈ మొదలయినవి యీ జీవులయందు వృద్ధి కాఁదగిన లక్షణములు.

ఇట్టి జీవులు వైశ్యజాతియందు జన్మించువార లని హిందూమత గ్రంథములయందు నిరూపింపఁబడి యున్నది. ఏ దేశము

నంద్జైనను జీవులు రజోగుణప్రధానులయి ద్రవ్యమును సేకరించుటయే ముఖ్యవృత్తిగ నుండువారలు వైశ్యజాతివారని భావింపఁదగు. ధనము నార్జించి యార్జితము చేసి యుచితమగు మితవ్యయము చేయుటయు, పరోపకారముకొఱకును, దేశక్షేమము కొఱకును, విద్యాభివృద్ధికొఱకును, ఆర్జితద్రవ్యమును వినియోగించుటయు క్రమక్రమముగ ధనమునం దున్న మోహమును వదలి కొంత నిస్పృహత్వము నొందుటయే దీనికి ముఖ్యపురుషార్థము.

ఈ జ్ఞానము కొంతవఱకు వృద్ధి కానుకాను జీవులు ఇంతకంటె నుత్కృష్టమగు జన్మము నొంద నర్హులగుచున్నారు. ద్రవ్యమునందున్న మోహ మించుక క్రమక్రమమున వదలుచుండినపుడు దేహాభిమానము వదలియుండదు గాన దేహము సహితము పరుల మేలుకొఱకు వినియోగము చేయఁదగినదను జ్ఞానము వృద్ధి కావలయును. అట్టి స్థితియందు జీవుఁడు క్షత్రియజాతియందు జననమొందఁ దగియున్నవాఁడు. క్షత్రియులు ధనమునం దభిమానము కొంత తగ్గియు నెక్కుడుగఁ గీర్తికాములై ప్రజలఁ దమ యాజ్ఞావశవర్తులను జేయు నిష్టము గలవారగుదురు. ప్రజాపరిపాలనను చేయుచు ధర్మరక్షణముసఁ బ్రజల మేలును ఎల్లప్పుడు కోరుచుఁ దమమహిమ వృద్ధిగ నుండవలయునను నభిలాష గలిగియుందురు. క్షత్రియులు శౌర్యధైర్యౌదార్యములు లోనగు వానియందుఁ

దావహాన్నత్యమున నుండఁ దలంతురు. ప్రజలను రక్షించుట యం దధికాభిమానము గలిగి వారలకించుకయేని యపాయము గలిగిన దానిని దొలఁగించుచు, ఒకప్పుడు వారికై ప్రాణత్యాగము చేయవలసి వచ్చినను వెనుదీయక వర్తింతురు. ఇందును గ్రమక్రమమున ధనమునం దభిమానము వదలిన రీతినే శరీరమునం దభిమానముకూడ వదలించుకొనుట యీ ధర్మమువలని ముఖ్యప్రయోజనము. ఈ స్థితియం దుండుజీవులు తమకుఁ గల యధికార గర్వముచేతఁ దమ యాజ్ఞకులోఁబడిన ప్రజలను క్షోభింపఁజేయుచుఁ దమ సంపత్తునంతయు స్వప్రయోజనమునకే వినియోగించుచుఁ దమ యున్నత ధర్మమును మఱచినను, బహువిధానుభవములచే నామార్గము అధర్మమని తెలిసికొని ప్రజాక్షేమము కొఱకే భగవంతునిచే సృజింపఁబడితిమని యెఱింగి సర్వస్వము బరులకై యుపయోగము చేయుచుఁ గట్టకడపట దేహమునందలి యభిమానమును యుద్ధాదులయందు వదలుచు, నంతకంటె నెక్కుడగుజన్మము నొందుటకు నర్హులగుచున్నవారు.

ఆదియందు జీవుఁడు కేవల విషయాసక్తుఁడుగనుండి యుక్తాయుక్తము లోకించుకయైన నెఱుంగకవర్తించి, వివిధానుభవములచే నల్పముగ జ్ఞానమునొంది, పిదప సేవకావృత్తియందుఁ దనకంటె నుత్తములగు జీవులకు శుశ్రూషచేయుచు వారి యాజ్ఞకు లోఁబడి వర్తించుచుఁ దమోగుణజాతములగు నిద్రా

లస్యప్రమాదములను దరించి, స్వతంత్రవృత్తి కర్తృండై, రజో గుణవశవర్తియై, ధనార్జనమున కనుకూలమగు వృత్తులయం దుం బ్రవర్తిల్లుచు నర్థమే పురుషార్థముగ భావించుచు, దానికై పాటుపడుచు, ద్రవ్యమునందు విశేషమగు నాశయు మోహా మును గొంతదనుక కలిగియుండి కాలక్రమమున వివిధాను భవముల వలన నాయర్థమువలనం గలుగు సౌఖ్యములు నశ్వ రములను జ్ఞానము దృఢము కాను కాను క్రమక్రమమున ధనము నందలి మమకారాదుల వదలించుకొని, యంతకంటె నుత్తమ మగు జన్మమున జన్మించి, ప్రజాపరిపాలనము మొదలగు ధర్మ రక్షణ కార్యములలో వర్తించుచు శౌర్యధైర్యాదులు గలిగి తన మేలుకంటెం బ్రజారక్షణము నెక్కువగ భావించుచు, తన శౌర్యధైర్యములను, శరీర పాటవమును శక్తిహీనులను గాపాడు కొఱకే యుపయోగించుచుం దనయధీనమగు ద్రవ్యము ప్రజల మేలుకొంటె వినియోగించుచు, తన శరీరమును సహితము ప్రజారక్షణమునకై త్యజించుట కుత్సాహము గలవాండగు చుం, గ్రమక్రమమునం బూర్వము ద్రవ్యమునందలి యభిమా నమును వదలినట్లే దేహాభిమానమును గూడ వదలి, పూర్వ జన్మంబు లన్నింటికంటె నుత్తమమును, సత్త్వగుణ ప్రధానము నగు జన్మమును బొందుటకు, జీవుం డర్హుండగుచున్నవాండు.

యథార్థముగ ఇంతమట్టుకు పరిపక్వమయిన జీవుంపు విషయసుఖములయం దాశయు, నైహికసుఖసాధనమగు ధన

మునం దభిమానమును, దేహాభిమానమును గొంతవఱకు జయించియే యుండును. ఇట్టి లక్షణములతోఁ గూడిన జీవుఁడితర జీవులకు జ్ఞానమును బోధించుటకు సర్హుఁడు. జీవుఁడు నిద్రాలస్యాదులవలని సుఖంబును, ధనార్జనమువలని మోదమును, దేహాభిమానమువలని సంతోషమును నస్థిరములని దెలిసి, స్థిరసుఖ మెద్ధియో యని వెదకుచు నది జ్ఞానసాధ్యమని తెలిసి, జ్ఞానార్జనమునం దత్యుత్సాహము గలవాఁడై యుండు. మొదట మొదట విద్యావంతుఁడ నను నభిమానము కొంత గలిగియుండినను గ్రమక్రమమునఁ దనజ్ఞానమంతయుఁ బరుల మేలుకొఱ కుపయోగించుటకు నేర్చుకొనును. బహుకాలము నానావిధములగు శాస్త్రములు మొదలగు నపర విద్యల నేర్చి సకల విద్యాపారంగతుఁడై యావిద్యలన్నియు స్థిరసౌఖ్యమున కాధారమగు పరమార్థ తత్త్వమును బూర్తముగ బోధింపఁజాలవని తెలిసి "సకలవిద్యా ప్రతిష్ఠ" యగు పరవిద్య యొకటి యుండవలయును గదా యని యెఱింగి, యా పరవిద్యను గురుముఖమున స్వీకరించుటకు యత్నించును. ఇపుడు జీవునకు వేదశాస్త్రములను జదువుటయు, నితరులకు వానిని జెప్పుటయు, లోకహితము నుద్దేశించి దేవయజ్ఞములు మొదలగువానిని జేయుటయు, ఇతరులచేఁ జేయించుటయు ముఖ్యములగు బాహ్యధర్మములు. మఱియు నింద్రియములను విషయాసక్తములను గాకయుండ నియమించు కొనుటయు,

ఇంద్రియములతోఁ జేరి వానికి లోఁబడి వర్తింపక యుండు నటుల మనస్సును మరల్చుకొనుటయు, ఇంద్రియములను దమ కధిపతియగు మనస్సునకు లోఁబడి వర్తించునట్లు చేయుటయు నివి పట్టుదలతో నభ్యసింపఁదగిన యంతరంగ ధర్మములు.

ఇట్టి పదవింబొందిన జీవుఁడు జ్ఞానమును అభివృద్ధి చేసికొని భగవద్భక్తిని, క్షమ (అనఁగా నితరులయందున్న లోపముల నోర్చుస్వభావము) ను, సర్వభూతహితత్వమును ముఖ్యముగ ననుష్ఠింపవలెను. పూర్వజన్మములయందు విత్తము మొదలగు వానియం దభిమానమును, దేహాభిమానమును, కామ క్రోధ ములను కొంతవఱకు జయించియుండుటచే నిప్పుడు సర్వభూత హితుఁడగుట కర్హుఁడై యున్నవాఁడు. కామక్రోధములను సంపూర్ణముగ జయింపఁ బ్రయత్నము చేయవలయును. ఎల్లప్పుడును శరీరమును, ఇంద్రియములను, మనస్సును స్వాధీ నము చేసికొనుచు విషయవిముఖుఁ డగుచుండవలయును. వేగిరపడి యేకార్యమునైనఁ జేయరాదు. సదా శాంతిస్వరూ పుఁడుగను, శుద్ధుఁడుగను నుండఁదగు. ఉత్తమజ్ఞానమును బురుషార్థసాధనముగ భావించుచు నద్దానికంటె శ్రేష్ఠమగు విత్తము వేఱొకటి లేదను మనోనిశ్చయము గలిగియుండవల యును.

శమోదమ స్తపశ్శౌచం క్షాంతి రార్జవ మేవ చ ।
జ్ఞానం విజ్ఞాన మాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్ ॥ (గీత. ౧౮-౪౨)

నైతాదృశం బ్రాహ్మణస్యాస్తివిత్తమ్
యథైకతా సమతా సత్యతా చ
శీలం స్థితి ర్దండనిధాన మార్జనమ్
తత స్తపశ్చోపరమః క్రియాభ్యః ॥ (పురాణవాక్యము)

తా. ఏకత్వము, సమత్వము, సూనృతోక్తి, సదాచారము, స్థిరత్వము, మొదలగు వానితో సమానమగు ద్రవ్యము బ్రాహ్మణునకు వేఱొండు లేనేలేదు.

ఈ లక్షణములతోఁగూడిన జీవుఁ డుత్తమజాతి జీవుఁ డనిపించుకొనును. ఏదేశమునందు జన్మించినను ఇట్టి లక్షణములుగల జీవులే యగ్రజాతి జీవులని యెన్నఁదగుదురు. ఈ లక్షణములు ఆర్యసంఘమునందలి బ్రాహ్మణులయందు స్వాభావికముగ నుండవలయును. ఇవి లేకపోయినయెడల వాని నభివృద్ధి చేసికొనుటకు వలయు ప్రయత్నము చేయవలయు. అట్లు కానిచో బ్రాహ్మణజాతియందు జన్మించినను బ్రాహ్మణుఁడని యెన్నఁబడుట కర్హుఁడు కాఁడని స్మృతులయందును, పురాణములయందును దృఢముగ జెప్పఁబడి యున్నయది.

ధర్మములను నివి జీవుని నుత్తమస్థితికిం దెచ్చుటకుఁ దత్త్వవేత్తలగు మహర్షులచే విధింపఁబడిన మార్గములు. జీవుని పూర్వజన్మ సంస్కారమును దెలిసి గుణకర్మ విభాగములు నేసి ఆర్యసంఘమునఁ దొలుతఁ జాతుర్వర్ణ్య విభాగము చేయఁబడినదని భగవద్గీతయం దుదాహరింపఁబడి యున్నది.

పూర్వకాలమున మానవులు శాస్త్రములయందు విశ్వాసము గలిగి శాస్త్రవిధులగు స్వధర్మముల నుల్లంఘింపక యనుష్ఠించుచుండుటంబట్టి సామాన్యముగ జీవుని యంతరంగస్వభావము ననుసరించియే బాహ్యమగు జన్మము లభించుచుండెను. అనఁగాఁ దమోగుణ ప్రధానులుగనుండు జీవులు శూద్రజాతి యందును, రజోగుణ ప్రధానులుగనుండు జీవులు వైశ్య క్షత్రియ జాతులయందును, సత్త్వగుణ ప్రధానులుగ నుండు జీవులుమాత్రము బ్రాహ్మణవర్ణమునందును జన్మించుచుండిరి. వారియందుఁ గామము హెచ్చను హెచ్చను వారు స్వప్రయోజనపరులై ధర్మము నతిక్రమించుటచే వర్ణసంకరము కలుగ సాగెను.

జీవుఁడు తాఁబుట్టిన వర్ణమునకు విధించిన బాహ్యధర్మముల ననుష్ఠింపక పోవుట వర్ణసంకరమని సామాన్యముగాఁ జెప్పుచున్నను, చక్కఁగ విచారించినచో జీవుఁడు తన స్వభావమునకు సరిపోని వర్ణమునందుఁ బుట్టుటయే వర్ణసంకరమని యెఱుంగవలయును. కామములకు లోనై శాస్త్రవిహితములగు ధర్మముల నతిక్రమించి విచ్చలవిడిగ వర్తించుటచే ననేక వర్ణములవారితో నానావిధములగు ఋణానుబంధములు కల్పించుకొనుటచే నీ సంకరము ప్రాప్తించుచున్నది. ఐనను కర్మాధి దేవతలు ముందు సూచించిన రీతి నేయేకాలమున నేయే ధర్మముల ననుష్ఠించుట యేయేజీవులకు నిశ్శ్రేయఃకారణ

మగునో వానిని జక్కఁగ జూచి వారి కనురూపమైన వర్ణముల యందు వారిని బుట్టునట్లు చేయుచున్నారు. కావున స్థూలముగాఁ గనఁబడు బాహ్య సంకరమును మాత్రము పాటించి శాస్త్రసమ్మతముగను, యుక్తియుక్తముగను జేయఁబడిన వర్ణ విభాగమును బొత్తిగా ననాదరణచేయుట సమంజసముగాదు.

ఇక్కాలమున నీదేశమున నాయావర్ణములయందు జన్మించి యుండు జీవులు వర్ణధర్మములఁ జక్కఁగ ననుష్ఠింపకుండుట చేత వర్ణవిభాగమునం దాదరణము తగ్గననియును, ఈ విభాగము యుక్తియుక్తమనియు నెఱింగి దానివలని ప్రయోజనముల నుపలక్షించి యెల్లవారలు తమతమ వర్ణధర్మములను సాధ్యమగునంత శ్రద్ధతో ననుష్ఠించుచు, స్మృతికర్తలగు మహాత్ముల యుద్దేశముల నెఱవేర్చి వర్ణవిభాగము నిర్దుష్టముగ నుండునటులఁ జేయుటకు మహాప్రయత్నము చేయవలయును.

పైనుదహరింపఁబడిన ధర్మములన్నియుఁ బరిశీలించి చూడ ముఖ్య విషయ మొక్కటి గానవచ్చుచున్నది. ఒక్కొక్క వర్ణమునకును ధర్మములు విధింపఁబడి యున్నవి. అనఁగా నొక్కొక్కవర్ణమువారును జేయవలయు కర్మములును, వారి యం దుండవలసిన గుణవిశేషములును విధింపఁబడియున్నవి గాని యాజాతివారికిం గల యధికారమును గుఱించి యించుక యైనను శాస్త్రములయందుఁ జెప్పఁబడియుండలేదు. ఒక్కొక జాతివారును వారి వారికి విధింపఁబడిన కార్యముల నించుక

యేని లోపము లేకుండఁ జేయుచు, నిషేధింపఁబడిన పనులను బొత్తిగ వదలుచు, వారివారియం దుండఁదగిన యంతరంగ లక్షణముల నభివృద్ధి చేసికొనుటకు యత్నించుచుండిరి గావున దేశమునందలి ప్రజలందఱును సమరసభావము గలిగి శరీరమునం దంగములువలె జనసముదాయమునకు క్షేమము నొనఁగూర్చుచుండిరి. శరీరమందలి యంగము లన్నియు నన్యోన్యానుకూల్యము గలిగి శరీరసౌఖ్యముకొఱకుఁ బాటుపడుచుండిననే శరీరమునకును, ఒక్కొక యంగమునకును క్షేమము గలుగును గాని యొక్కొక్క యంగము ఇత రాంగముల కొఱకుఁ బాటుపడఁదలంపనిచో సమష్టిశరీరమునకు క్షేమము లేకపోవుటయే గాక యొక్కొక్క యంగమును గృశించి నశించును గదా! అట్లే జనసముదాయము శరీరమునకును, జనులు ఆ శరీరమందలి యవయవములకును బోల్పఁదగినవారు. జనులందఱు వారివారి యోగ్యతానుసారముగఁ దమతమ ధర్మముల నెఱింగి చక్కఁగ నాచరింప సమష్టిరూపమగు జనసముదాయమునకు సేమము గలుగుటయేగాక జనులకు సహితము సుఖంబొనఁగూడును. అట్లు అన్ని వర్ణములవారును దమతమ ధర్మములఁ జక్కఁగ నాచరించుచు, నితరులయందలి దోషదర్శనపరులు గాకుండునంతకు హిందూ దేశమున జనసంఘము అసమాన సుఖము ననుభవించుచుండెను. అట్లుగాక నొక్కొక్కరును తమతమ ధర్మములం దశ్రద్ధచేసి, బరులను మాత్రము

వారి ధర్మముల నాచరించునట్లు చేసి దానినుండి తమకు రాఁదగు లాభమును మాత్రము కోర నారంభించుటచే నిప్పటి దురవస్థ గల్గెను. ఈ రీతి సర్వజనులును తమతమ ధర్మములను వదలి పరస్పర స్పర్ధలతోఁ జెడిపోయిరి. జనసముదాయమునకును దదంగములగు జీవులకును క్షేమము క్రమక్రమమునఁ దగ్గిపోయెను. శరీరమునందలి యవయవము లొక్కొక్కటియు శరీరపోషణమునకుఁ బాటుపడుటలోఁ దమతమ కార్యముల నేమఱక చేయుచుండవలయునే గాని తమవృత్తులం దుత్తమ మధ్యమ నీచములను భావములఁ జర్చింపరాదు. అట్లే చాతుర్వర్ణ్య విభాగమునందును ఒక్కొక్క జాతివారును వారివారి ధర్మములను బరిపాలించుటకు బహువిధముల యత్నింపవలయునుగాని, కొందఱుత్తము లనియు, మఱికొంద ఱధము లనియు భావించుటగాని, కొందఱుమాత్రము పూజ్యులనియు, తక్కినవారు వారిని బూజించుచుండవలయుననియును ఎంచుట శాస్త్రసమ్మతము గాదు. ఎవరికిఁగాని తమ ధర్మములను లోపములేకుండ నాచరించుటచేఁ బూజ్యతయున్నది గాని జన్మమున మాత్రము పూజ్యత నొందఁజాలరు. శమదమాదిగుణసంపన్నుఁడై లోకోపకారపరాయణుఁడై సత్కర్మనిరతుఁడై యుండు బ్రాహ్మణుఁడును, స్వప్రయోజనము నించుకయేని గోరక ప్రాణమునం దభిమానము సైతము విడిచి, ప్రజారక్షణ తత్పరుఁడై యుండు భూపాలుఁడును, ధర్మము నతిక్రమించక

యర్థము నార్జించుచు గుటుంబమునందుఁ గోశాధిపతివలె జన సముదాయమంతయు నొక్క కుటుంబముగ భావించి యా కుటుంబమునందుఁ దాను గోశాధిపతినని యెంచి నిష్పక్షపాతముగ యోగ్యత ననుసరించి పాత్రత నెఱింగి యెల్లర క్షేమము కొఱకు ధనమును వ్యయించుచుండు వైశ్యుఁడును, జాగరూకుఁడై ప్రమాద మొకించుకేని లేక తనకు విధింపఁబడిన కార్యములన్నింటిని యథావిధి నెఱవేర్చుచుండు శూద్రుఁడును బూజింపఁబడదగుదురు గాని యోగ్యత లేకయున్నను జన్మమున మాత్ర ముత్తమజాతివార మనియు, పూజ్యులమనియు నెన్నువారందఱు పూజ్యులు కాఁజాలరు.

యథా కాష్ఠమయో హస్తీ యథా చర్మమయో మృగః ।
యశ్చ విప్రోఽనధీయాన స్త్రయస్తే నామధారకాః ॥
యోఽనధీత్య ద్విజో వేద మన్యత్ర కురుతే శ్రమమ్ ।
స జీవన్నేవ శూద్రత్వ మాశు గచ్ఛతి సాన్వయః ॥

(మనుస్మృతి)

యథోక్త గుణసంపన్నుఁడుగాని బ్రాహ్మణుఁడు బ్రాహ్మణుఁడు కాఁడు, గ్రానితోఁ జేయఁబడిన యేనుగు ఏనుగు కాదు. చర్మ నిర్మితమగు జింక జింక కాదు. ఇవియన్నియు నామ మాత్రములే. అధ్యయనము చేయని బ్రాహ్మణుఁడు యథార్థముగ బ్రాహ్మణశబ్దవాచ్యుఁడు కాఁడని మనుస్మృతి యందు స్పష్టముగఁ జెప్పఁబడియున్నది. ఈ యర్థము స్మృతు

లయందును బురాణములందును ఇతిహాసములందును వివరింపఁ బడియున్నది.

శ్రీ మహాభారతమున నరణ్యపర్వమునందు యుధిష్ఠి రాజగర సంవాదమున నిట్లు వివరింపఁబడి యున్నది.

సత్యం దానం క్షమా శీల మానృశంస్యం తపో ఘృణా ।
దృశ్యంతే యత్ర నాగేంద్ర స బ్రాహ్మణ ఇతి స్మృతః ॥
శూద్రే తు యద్భవే ల్లక్ష్యం ద్విజే తచ్చ న విద్యతే ।
నైవ శూద్రో భవేచ్ఛూద్రో బ్రాహ్మణో న చ బ్రాహ్మణః ॥
యత్రైత ల్లక్ష్యతే వృత్తం స బ్రాహ్మణః స్మృతః ।
యత్ర నైతద్భవే త్సర్ప తం శూద్ర మితి నిర్దిశేత్ ॥

(మహాభారతము, వనపర్వము, ౧౮౦ అ., ౨౧-౨౫-౨౬)

న యోని ర్నాపి సంస్కారో న శ్రుతం న చ సంతతిః ।
కారణాని ద్విజత్వస్య వృత్తమేవ చ కారణమ్ ॥

(మహాభారతము, వనపర్వము, ౩౧౩ అ., ౧౦౮)

తా. సత్యము, దానము, ఓర్పు, శీలము, సౌమ్యభావము, తపస్సు, భూతదయ యివి యన్నియు నెవనియం దున్నవో అతఁడు బ్రాహ్మణుఁ డనఁదగును. ఈ గుణసముదాయము శూద్రునియందు గోచర మయ్యేనేని యతఁడు శూద్రుఁడు కాఁడు. శూద్రాధికుఁ డనుట. ఇవియన్నియు బ్రాహ్మణుని యందు గోచరములు కావేని యతఁడు బ్రాహ్మణుఁడు కాఁడు. శూద్రతుల్యుఁ డని భావము . . . . . పుట్టుకయు,

సంస్కారములును, పాండిత్యము, గోత్రము నను నివి బ్రాహ్మణత్వమునకుఁ గారణములు కావు. సద్వృత్తియే ముఖ్యహేతు వని భారతవచనాభిప్రాయము.

మఱియు శ్రీ విష్ణుభాగవతమునందు,

యస్య యల్లక్షణం ప్రోక్తం పుంసో వర్ణాభివ్యంజకం ।
యదన్యత్రాపి దృశ్యేత తత్తే నైవ వినిర్దిశేత్ ॥

(భాగవతము, ౭-౯-౩౫)

తా. పురుషునకు జాతిసూచకముగ నేలక్షణములు చెప్పఁబడినవో యవి యితరునియందుఁ గూడఁ గనఁబడు నేని యతఁ డాజాతివాఁడని విష్ణుభాగవతాభిప్రాయము.

ఇట్లగ్రజాతివారు పూజ్యుల మని యితరులనుండి సన్మానమును బలాత్కారముగఁ గోరుట ధర్మము గాసట్లు, వారల యందు దోషారోపణము చేయుటయు నీర్ష్యాసూయలు గలిగి యుండుటయు నితరులకును ధర్మముగాదు. అన్ని జాతులవారును సోదరభావమును గలిగి పరస్పర మైత్రి నభివృద్ధిచేసికొనుచుఁ దమతమ ధర్మముల లోపములు లేక జరుపుచుండిన యెడల జనసముదాయ మంతయు క్షేమమును బొందఁగలదు.

ఆశ్రమధర్మములు

పై సూచించిన వర్ణవిభాగమున జీవునకు మనుష్యజన్మము ప్రాప్తించినది మొదలు ముక్తిప్రాప్తి పర్యంతము జీవునియాత్ర

నాల్గు భాగములుగ విభజింపఁబడి యున్నది. మఱియును ప్రతి జన్మమునందును జీవితకాలము, అనగా, స్థూలశరీరముతో భూలోకమునందు వర్తించుకాలమంతయు, పై విభాగమున కనురూపముగనె నాల్గుభాగములుగ నేర్పడుచున్నది.

ఆదియం దేలాటి నియమములకు లోఁబడక యిచ్ఛాను సారము వర్తించుచుఁ దలిదండ్రుల పోషణమునకుఁ బాత్రుఁడై శైశవము గడపి పిదప కొంతకాలము విద్యాస్వీకారము సేయుచు, గురుగృహమునందు నివసించుచు, గురువునాజ్ఞకు లోఁబడి వర్తించుచు, గురుశుశ్రూషచేయుచుఁ బూర్వమున శూద్రసమమగు జన్మమునందు జీవుఁ డుండినకాలమునఁ బొందిన జ్ఞానమును మరలఁ బ్రతిక్రొత్తజన్మమునందును, దృఢ పఱచుకొనుచుండును. ఇదియ ఆర్యధర్మములందు బ్రహ్మ చర్యాశ్రమధర్మమని పిలువఁబడుచు దేశాంతరములందు విద్యార్థి ధర్మమనఁబడుచున్నది. గురుగృహమునందుఁగాని లేక దేశాంతరములయం దుండురీతిని బాఠశాలాధికారుల విచారణకు లోఁబడిన నివాసములయందుఁగాని విద్యార్థి నివ సించుచు, ఉపాధ్యాయుల యాజ్ఞకు లోఁబడియుండి కాల నియమము తప్పక కాలోచిత కార్యముల నెఱవేర్చుచు, సదా గురువుల సత్సాంగత్యమునఁ గలుగు మేలు నొందుచు నుండుటచేఁ గ్రీడాసక్తి, ప్రమాదము లోనగు బాలుని నైజగుణము లను దరించి యుక్తవయస్కుఁడైనపుడు పారతంత్ర్యమునం

చుండి వదలి స్వతంత్రముగఁ గార్యనిర్వాహకము చేసికొను టకు వలయు సుగుణసంపత్తిని బొందఁగలిగియుండును. ఇట్టి యేర్పాటులు పశ్చిమదేశములయందుఁ జేయఁబడుచున్నవి. పూర్వకాలమున హిందూదేశమునందును గురుకులవాసముచే నీ ప్రయోజనము లెక్కుడుగ సిద్ధించుచుండెను. ఇక్కాలమున గురుకులవాసము గానరాదు. బాలురు స్వగృహములయందు నివసించుచుఁ దలిదండ్రులయు బంధువులయుఁ బ్రేమాతిశయ ములకుఁ బాత్రులగుచు, నతిసుకుమారముగఁ బెంపఁబడుచు, లేక యితర గ్రామములయందు విక్రయాన్నభోక్తలయి, యింటియందలి నిబంధనలు సైతము లేక, పాఠశాలలకుఁ బోవు నల్పకాలమునందుఁ దప్ప తక్కినకాలముల విచ్చల విడిగ వర్తించుచుఁ గాలోచితకార్యములఁ జేయించి విచారిం చువారు లేక, యున్నవారు. కాఁబట్టి పూర్వులయందున్న సుగుణసంపత్తి యిక్కాలపువారియందు లేకయున్నది. బాలు నకు నడఁకువ, అలోలత, విద్యాసక్తి, సుఖేచ్ఛ లేకయుండుట, పాటుపడుట, ఇవి ముఖ్యలక్షణములుగ నుండఁదగు. ఈ లక్ష ణముల నభ్యసించి దృఢపఱచుకొనినచో స్వతంత్రముగఁ గార్యభారమును వహించుట కర్హుఁడగు. ఇవ్విధమున గురు కులవాసముచేసి సంసారభారమును వహించుటకు నర్హుఁడై నచో, వివాహితుఁడై గృహస్థాశ్రమ ధర్మముల ననుష్ఠింపఁ దగియుండు.

ఇవ్విషయమున ముఖ్యముగ గమనించఁదగిన విషయ మొకటి యున్నది. పూర్వకాలమున నీయాశ్రమధర్మములు ఒకటివెనుక నొకటి వరుసగ ననుష్ఠింపఁబడుచుండెను గదా! బ్రహ్మచర్యము పూర్ణముగ జరిపి, విద్యాభ్యాసము గురుగృహమున సలిపి పూర్తి అయినపిదప గురువునాజ్ఞవడిసి, కొంతవరకు తీర్థయాత్రలమూలమున నానాదేశసంచారము చేసి, తద్ద్వారా తన జ్ఞానమును అభివృద్ధి చేసికొనిన యనంతరము యుక్తవయస్కుడైన పురుషుడు వివాహితుఁడై గృహస్థధర్మానుష్ఠానమును ప్రారంభించుచుండెను. ఇపుడన్ననో బ్రహ్మచర్యము నామమాత్రమై యున్నది. విద్యాభ్యాసము ప్రారంభించిన అల్పకాలములోపలనే వివాహము అసనేమో అర్థమైనను తెలిసికొనజాలని బాలునకును, అంతకంటె చిన్నదియగు కన్యకును వివాహము చేయఁబడుచున్నది. అదియును నామమాత్ర కన్యాదానముతో నిలువక, విద్యాభ్యాస కాలములో, తరుచుగ గర్భాధానము సైతము జరుపుచున్నారు. శరీరమనశ్శక్తుల నంతయు విద్యాస్వీకారమున నుపయోగించుచుండవలసిన కాలములో, బాలుఁడు పూర్ణగృహస్థధర్మమునం ప్రవేశించి కుటుంబభారము వహించుటవలన శరీరపాటవమునకును, మనశ్శక్తికిని రెంటికిని కీడుకలుగును. విద్యాభ్యాసమునకు భంగము గలుగుటయే గాక పురుషులును, స్త్రీలును, పూర్ణయౌవనమున నుండదగు వయస్సు రాకపూర్వమే

సంతానము కలవారగుటవలన బలహీనులై వార్ధిక్య దశయం దుండు స్థితిని చెందుచున్నారు. పూర్వముకంటె నిపుడు జనులకు సరాసరి ఆయుర్దాయము తక్కువ అయి యున్నది. హైందవజనాంగమున కిట్టిదురవస్థ వచ్చియుండుటకు సనాతనములగు ఆశ్రమధర్మములను ఉపేక్ష చేయుటయే కారణము. దేశాభిమానులందరు, ఈ విషయమును బాగుగ యోచించి, పూర్వమువలె బ్రహ్మచర్యధర్మమును చక్కగ రక్షించి, బాలురును బాలికలును, యుక్తవయస్కులై పూర్ణయౌవనమును చెందినందాక గృహస్థధర్మమునం బ్రవేశించక యుండ చేసినచో, శీఘ్రకాలముననె యువకులును యువతులును శరీరపాటవమును, ఇంద్రియనిగ్రహము మనశ్శక్తియు గలిగి, వీర్యవంతులై, దృఢగాత్రులగు సంతానము నుత్పత్తి చేయ గలుగుదురు. ఇది దేశాభివృద్ధికి మిక్కిలి అవశ్యము. ఇవ్విషయమున శ్రద్ధగొనువారు యథార్థముగ దేశసేవాతత్పరు లగుదురు.

గృహస్థునకుఁ గుటుంబమును భరించుట మొదటిధర్మమగుచున్నది. ఇందును అనుష్ఠింపఁబడు సర్వధర్మములును, చేయఁబడు సర్వకర్మములును జీవులకు బరమార్థసాధనమగు జ్ఞానమును వృద్ధిచేయు నుద్దేశము గలవియే. వివాహము కేవల మైహిక సుఖసాధనముగ నెంచరాదు.

ధనము నార్జించుటయు, ధర్మవిరుద్ధము కాక యుండు నైహిక సుఖముల ననుభవించుటయు, ఆర్జించిన ద్రవ్యమును కేవల

స్వశరీరపోషణమునకు మాత్రముగాక క్రమక్రమమునఁ బరో
పకారముకొఱకు వినియోగించుటయు, గృహస్థువున కభివృద్ధి
కారణము లగుధర్మములు. మొదట మొదట తనకు సుఖమూ
లకములగు దారసుతాదుల సుఖమును ఆత్మసుఖమువలె
భావించుటయు, క్రమక్రమమున బంధుమిత్రాదుల సుఖమును
గోరుటయు నీ మొదలగునవియు వానికి నైజమగు స్వప్రయో
జనపరత్వమును వదలించి పరోపకారబుద్ధిని వృద్ధిచేయును.
కాలము గడువను గడువను గామసంకలితముగాని ప్రేమ
యభివృద్ధి యగు. గృహస్థధర్మమునం దుస్వతంత్రముగ నార్జ
నము చేయు సామర్థ్యము గలిగియుండుటచేత గృహస్థు వనేక
లగు నితరజీవులకు నాధారమగుచున్నాఁడు. ధనార్జన చింత
లేక విద్యాస్వీకారము చేయుచుండు బ్రహ్మచారికిని, సంసార
తాపత్రయమునుండి విరమించుకొని లౌకికవ్యాపార విము
ఖుఁడై వైదికకృత్యములయందుఁగాని, లేక స్వప్రయోజన
మును మాని లోకహితముకొఱకు చేయు లౌకిక కార్యముల
యందుఁగాని కాలము గడుపుచుండు వానప్రస్థునకును, సర్వ
సంగపరిత్యాగియై యైహికముగాని ఆముష్మికమునుగాని స్వ
ప్రయోజనము నించుకయేని యభిలషింపక సదా లోకోపకార
పరాయణుఁడై ధ్యానయోగపరుఁడగు సన్న్యాసికిని గృహ
స్థువు ముఖ్యాధార మగుచున్నాఁడు. ఇట్లెల్లవారికిని సహా
యము చేయుటచేత ధనమునం దభిమానము వదలును. తన

కంటె నుత్తములగు ననేకుల సాంగత్యము పలుమరు కలుగు చుండుటచే నహంకారము నశించి భక్తిజ్ఞానములు వృద్ధియగు. చిన్నలగు విద్యార్థులు మొదలగువారలకు సహాయము చేయు నవకాశము గలుగుటచేత కరుణ వృద్ధియగు. ఇట్లు సర్వభావ ముల నిష్కామప్రేమ దినదిన ప్రవర్ధమాన మగుచుండును.

ఈ గృహస్థధర్మమును జక్కఁగ ననుష్ఠించుటచే ధనము నార్జించుశక్తిగలవారియందు సామాన్యముగఁ గన్పట్టు స్వప్ర యోజనపరత్వము, అహంకారము, కామక్రోధలోభములు క్రమక్రమముగా మార్పునొంది పైన సూచింపఁబడిన భక్తి ప్రేమానురాగములు కరుణ లోనగునట్టి సుగుణములు అభ్యు దయ మొందుచుండును. కాఁబట్టి యీధర్మము జీవునకుఁ గాలక్రమమున నుత్తమపురుషార్థసాధన మగుచున్నదియేగాని మోక్షమార్గమునకుఁ బ్రతిబంధము కానేరదు. జీవుఁడు పరమ పురుషార్థమును సాధించుటకు వలయు నానావిధానుభవములు గృహస్థధర్మమునందే పొందఁదగియున్నవి. ఆ యనుభవము లును, వానినుండి పొందఁదగిన జ్ఞానమును గృహస్థువుగ నుండి పొందనిచో నాస్తికన్న నుత్తమములగు వనస్థ యతి ధర్మముల ననుష్ఠించుట కర్హుఁడు కాఁజాలఁడు.

మొట్టమొదట గృహస్థువు కుటుంబభారమును వహించి యుండు వాఁడగుటచేఁ దనపోషణమునం దుండువారి సౌఖ్య మును నిత్యము సమకూర్చుటయే ప్రధానకార్యము గలవాఁ

డగుటంబట్టి కుటుంబ సంరక్షణమునందు మనఃపూర్తిగ స్వ ప్రయోజనపరత్వము వదలక తీరదు. తాను ప్రేమించు దార సుతాదులను, తన గృహము నాశ్రయించి వచ్చు బంధు మిత్రాతిథులను, సంతృప్తిపఱచనిచోఁ దాను బరిపూర్ణసౌఖ్య ము నొందఁజాలఁడు. కాఁబట్టి కుటుంబియగువాఁడు తనకోరి కను గొంత క్లుప్తపఱచుచు, నితరులకు సుఖమును గోరుచుం డుటచే వానియందు నిష్కామ ప్రేమ యభివృద్ధియగుచుండు.

మఱియుఁ గుటుంబమున కంతకు నధిపతియై యుండుట చేతఁ దన్నాశ్రయించియుండు వారియందుఁ గరుణ వర్ధిల్లుట కాస్పదముగలిగి క్రమక్రమమున బీదలయందును, శక్తిహీనుల యందును, మరి యేవిధముననైన తనకంటె దక్కువగ నుండు వారియందును, దయయు, అనుకంపయు వృద్ధియగు. మఱియు నితరుల యందలి లోపముల విషయమున సహనముగూడ వృద్ధియగుట కవకాశము గలుగు. ఇట్టి సుగుణములు కుటుం బిగ నుండియే యభ్యసింప సాధ్యముకాని యితరాశ్రమము లలో నుండి వీని నభ్యసింప నవకాశము చాలదు. ఇంతియ గాదు. గృహపతి యగువాఁడు ఇంటియందుండు వారినంద అను, సేవకులనుగూడఁ బోషించుటమాత్రము గాక వారలను మంచిమార్గమున నడపుచు శిక్షించుచు వారల నందఱ నుత్తమ గతిని బొందించుట యతని ధర్మము. ఇంటియందుఁ బలువు రతో వసించియుండుటచే ననేకములగు నిర్బంధనల నోర్చు

కొనవలసి యుండును. ఏకాకియగు వాని కవి యుండవు. దినదిన మట్టి యిబ్బందులను సహించుకొనుచు మనస్సమాధానము నభ్యసించుటచే తితీక్షయు, నుపరతియు నలవాటు చేసికొనుటకు గొప్పయవకాశము గలుగు.

ఒకానొక సమయమున తొందరపడి తెంపుచేసి సన్న్యసించిన వానికి గృహవస్తువాహనాదులు ఒక్కటియైన లేమిం జేసి వానియందలి సంగమున కవకాశము లేకుండ వచ్చును. కాని యంతమాత్రమునఁ దాను నిజముగ విరాగినైతినని భ్రమించరాదు. ఏలయన నెప్పుడేని విషయస్పర్శము కలుగ వైరాగ్య భంగమైనను గాఁదగు. అట్లుగాక గృహస్థుడుగ నుండి ధనము నార్జించుచు, భోగ్యములు గలిగి యుండియు వానిపై నాసక్తి క్రమక్రమమున తగ్గించుకొనుచు నిస్సంగము నభ్యసించుటచే నిజమగు వైరాగ్యము వృద్ధియగును. అట్టి వాఁడు "అంతస్త్యాగీ బహిస్సంగీ" యనిపించుకొనును. అటువంటి త్యాగము మోక్షసాధనమగును గాని యంతస్సంగము గలిగి "బహిస్త్యాగి" యై నంతమాత్రమున పూర్ణుఁడు కాఁజాలఁడు. ఈ కారణమును బట్టి పరిపక్వముగాని జీవునకు సన్న్యాసముకంటె గృహస్థ ధర్మమున నిష్కామమగు కర్మయోగ మభ్యసించుట నిజముగ మోక్షసాధనము.

గృహస్థ ధర్మానుష్ఠానమువలన వేఱొక ప్రయోజనము గూడఁ గన్పట్టుచున్నది. దినదినము గృహమును గూర్చి వచ్చు

చుండు నతిథ్యభ్యాగతులను బ్రీతిపూర్వకముగ సత్కరించు టచేఁ గ్రమక్రమమున సంపూర్ణమగు నౌదార్యము వృద్ధియగుచున్నది. అతిథి భగవత్స్వరూపుఁడని శాస్త్రములయందు నిరూపింపఁబడియున్నది కదా! గృహమునకు వచ్చిన యభ్యాగతులకు గృహస్థువు ఉదకము, ఆసనము, ఆదరముతోఁ గూడిన మృదు మధురోక్తులు, ఇంతమాత్రమైన సమర్పించవలయు నని స్మృతు లుద్ఘోషించుచున్నవి. కావున గృహస్థువు అతిథ్యభ్యాగతులను సత్కరించుటకు ధనవంతుఁడుగా నుండుట సైత మనావశ్యకము. ప్రీతిపూర్వకమయిన సంభాషణము వలన వారు తృప్తులయినట్లు ఆదరణము లేని యన్నాది దానములచేఁ దృప్తులు కాఁజాలరు. "అన్నంబు జీర్ణమగు, ఆదరణంబు శాశ్వతంబు" అన విందుము కదా! ఇవ్విధమున నొకఁడు నిష్కామముగ సత్కరింపఁబడినచో, నాతఁడు మానవకోటికిఁ బ్రతినిధియగుటచే, మానవకోటి యంతయు సత్కరింపఁ బడినదని యెన్నఁదగు. ఇదియు భగవత్ప్రీతికరము. మఱియు నతిథ్యభ్యాగతులు మాత్రము గాక గృహస్థుని యింటిచుట్టుఁ దిరుగుచుండు కాక శునక బిడాలులు[1] సహితము ఆయింటి నాశ్రయించి జీవించుచునే యున్నవి. ఆర్యధర్మము ప్రకారము ద్విజులగువారలు దినదినము చేయు బలిదానము శునక వాయసాదుల సంరక్ష

[1] పిల్లి.

ణము నుద్దేశించియే చేయఁబడు చున్నదనుట శాస్త్రముల నుండి స్పష్టమగుచున్నది. ఇవ్విధమున బీదలయందును, పరదేశీయులయందును, అల్పజంతువులయందును, ప్రీతియు, కరుణయు నభివృద్ధి యగుటయేగాక జీవుని నానావిధములగు ఋణములు సహితము తీఱుచున్నవి.

ఇక్కాలమున మనభరతఖండమున గృహస్థధర్మమువలని ముఖ్యప్రయోజనముల కొన్నింటిని మరచియున్నారు. కుటుంబమునందలి వారందరు అన్యోన్య ప్రేమానుబంధములతో కట్టఁబడి యుండదగును గదా! పెద్దవారు చిన్నవారియందును, చిన్నవారు పెద్దవారియందును జూపదగు ప్రేమ యెట్లుండవలెనో కొంచెము యోచింప దగు. భార్యయందు భర్తకును, బిడ్డలయందు తండ్రికిని ఉండదగు ప్రేమ యెట్లుండవలయును? ప్రేమవలన ఉభయుల మనస్సులు కలిసి, ఒండొరులయెడ పూర్ణమగు నమ్మకము పుట్టవలయును. ఇపుడు తరుచుగ అట్లు కానరాదు. భర్త, భార్యవిషయమునను, తండ్రి పుత్రులవిషయమునను అధికారమును సాగించుచు, భయమును పుట్టించుచున్నారుగాని, నిష్కల్మషమగు ప్రేమరూపమగు భక్తిని కలిగించుట కానము. కుమారునికి తండ్రికంటె నాప్తుడు వేఱొకరుండరు గదా! పిల్లవాడు తన కష్టదుఃఖములను తండ్రియొద్ద మనసువిచ్చి చెప్పుకొనుటకు మారుగ, భయపడి, తండ్రిని చేరక, దుస్సాంగత్యమునకు పాలుపడుట సామాన్యముగ

నున్నది. బాలురును యువకులునునగు పుత్రుల మనోభావములను, వాంఛలను ప్రీతితో నూహించి, వారలకు దగు ప్రోత్సాహము చేసి యుక్తమగు బోధచేసి, దుస్సాంగత్యము నుండి ప్రీతితో మరలించి వారికివలయు సహాయముచేసి, సౌఖ్యము నొనగూర్పవలయును. అట్లుచేయక, చిన్నవారిని దూరముగ నుంచి, భయముతో పెంచుటవలన అనేకానర్థములు కలుగుచున్నవి. బాలురయెడ పెద్దవారు నిష్కల్మషమగు ప్రేమచూపుచోట్ల బాలురకును పెద్దవారియందు పూర్ణముగ భక్తిరూపమగు ప్రేమ అభివృద్ధియయి, తమ మనోభావములను, వాంఛలను జంకులేక పెద్దవారికి తెలుపుకొందురు. అట్టివేళల నవి సదోషములుగ నుండినచో, పెద్దవారు దానిం జూపి తగినబోధచేసి మంచిమార్గమును చూపగలుగుదురు. ఇట్టి సంకోచములేని ప్రేమ అభివృద్ధి గావలెను. లేనిచో నిజముగ గృహస్థధర్మము పూర్వపు ఉన్నతస్థితికి రాజాలదు.

ఈ విషయము కర్మయోగాధ్యాయమున విస్తరించి వ్రాయఁబడును.

ఈ రీతిని జీవుఁడు పూర్వము వైశ్యధర్మమనుష్ఠించు కాలమునఁ బొందిన జ్ఞానమునంతయు నీజన్మమున గృహస్థాశ్రమమున మరలఁ బొందుచున్నవాఁడు. జీవుని దీర్ఘయాత్రయందు వైశ్యధర్మ మెట్టి జ్ఞానమును వృద్ధిచేయఁదగునో, ఎట్టి సద్గుణ

ముల నెక్కొల్పఁ జాలునో, ఆ జ్ఞానమును, ఆ గుణములను బలపఱచుటయందు గృహస్థ ధర్మము సమర్థముగ నున్నది.

ఈ ధర్మమునఁ బొందఁదగిన జ్ఞానమునంతయుం బొంది యైహిక సుఖములయందును, లౌకిక కర్మములయందును గొంత వైరాగ్యము గలుగ నా సుఖములనుండియు, ఆకార్యములనుండియు విరమించుకొనఁదగిన సమయము కావున నపుడు లౌకిక వ్యవహారములనుండి విరమించుకొని సంసార భారమును యుక్తవయస్కులగు సుతులయం దునిచి యహంకార మమకారములను విడనాడి జ్ఞానమునందుఁగాని వయస్సునందుఁగాని తనకంటెఁ జిన్నలగువారలకు బోధచేయుచు, వారలచే ధర్మంబుల ననుష్ఠింపఁజేయుచు, వారియందు యుక్తాయుక్త జ్ఞానము వృద్ధిచేయుచు, తాను భగవద్ధ్యానము మొదలగు సత్కార్యములయందుఁ గాలము గడపుచుఁ గ్రమక్రమమున సంసారమునుండి సంపూర్ణముగ విరమించుకొనుట కర్హుఁడగుచున్నవాఁడు. ఇదియె యార్య ధర్మమునందుఁ దృతీయాశ్రమమగు వనస్థధర్మము. ఇందు జీవుఁడు లౌకిక కార్యములనెల్ల విడిచి వివాహకాలమున స్వీకరించిన యగ్నిహోత్రాదులతోడ భార్యయుఁ దానును పట్టణ గ్రామ వాసములను వదలుకొని యడవులయందుఁ గాని, గిరిగుహాలయందుఁ గాని నివసింపననువగు నాశ్రమమును గల్పించుకొని వసించుచు, వైదికకర్మములను మాత్రము నడుపుచు, వన్యము

లగు శాకలములను, కందమూలములను, ఫలములను ఆహార ములుగఁ బరిగ్రహించి కాలము గడుపుచుండఁ దగు. ఇక్కా లమున నీ ధర్మమాచరణమునఁ గన్పడదు. కాలానుసార ముగ జనులెక్కుడుగ విషయాసక్తులై యంత్యకాలము వఱకు విషయేచ్ఛలయందే కాలము గడుపుట సాధారణముగ నున్న యది. పుత్రులకు సంసారభారమును వహింపఁజాలు వయస్సు రాగా, లేక పౌత్రులు కలుగగ, మఱియు తనకు "వలీపలిత ములు" అనగా సరిసిన వెండ్రుకలు చర్మమున ముడతలు లోనగు అపరవయస్సు చిహ్నములు కనుపడగానే గృహ స్థువు వనస్థధర్మము నవలంబింప సమయమని మనుస్మృతి బోధించుచున్నది.

> గృహస్థస్తు యదా పశ్యేత్ వలీపలిత మాత్మనః ।
> అపత్యస్య తథా పత్యమ్ తదారణ్యం సమాశ్రయేత్ ॥

(మనుస్మృతి ౬-౨)

ఈ ధర్మమును జక్కఁగ ననుష్ఠించుటయందు ముఖ్యమగు నుద్దేశ మెద్దియనఁగా జాయాపతు లొక్కప్రదేశమున వసిం చుచుండియు, విషయసుఖముల నభిలషింపక గురుశిష్యన్యాయ మునను, సోదర సోదరీ న్యాయమునను ప్రవర్తించుచు, స్త్రీ పురుషులు విషయసాన్నిధ్యమున నుండియు భోగేచ్ఛ లేక యుండుట నభ్యసించుటయే. ఈ యభ్యాసము యథార్థ సన్న్యాసమునకు జీవుని పక్వపరచుటకు మిక్కిలి యావశ్యక :

మని చెప్పనేల? ఈ ధర్మమున నరణ్యగమనమే ముఖ్యాంశము కాదు. విషయసాన్నిధ్యమున విషయేచ్ఛ లేకుండుటయు, సంసారమున నుండియుఁ దాపత్రయ రహితుఁడుగ నుండుటయు, భగవద్ధ్యానము చేయుచుఁ బరతత్త్వమును బోధించు గ్రంథములఁ బఠించుచు, మననిదిధ్యాసములు చేయుచుఁ గాలము గడుపుటయే ముఖ్యాంశము. కావునఁ బరమార్థ చింతగల వారెల్లరు నపరవయస్సు ప్రాప్తించగనే విషయేచ్ఛలను వదలుకొని భగవద్ధ్యానాదుల నభ్యసించుటకు విశేష ప్రయత్నము చేయఁదగు.

క్రమక్రమముగ ద్రవ్యార్జనమునందాశ వదలదగు. గృహమునందు యాజమాన్యము (అధిపత్యమును) వదలి యుక్త వయస్కులగు పుత్రులయందుగాని యోగ్యులగు మరి యితరులయందుగాని సంసారభారమును నిలిపి గృహస్థువు వీనినుండి విరమించుకొని నివృత్తిమార్గమున ప్రవర్తించుటకు యత్నింపవదగు. అట్టి స్థితియందు తాము సంసారతాపత్రయములనుండి విముక్తులై, పారమార్థిక విషయములయందు మనస్సు వినియోగించుచు, శ్రవణ మనన నిదిధ్యాసములయందును, భగవద్ధ్యానమునను కాలము గడపుట ద్వారా తాము పూర్ణులగుటకు యత్నించుచు, లౌకికవ్యవహారములయందు తమకు ఇంచుకయైన నాసక్తి లేకపోవుటబట్టి స్వార్థత్యాగులును, లోకసంగ్రహ పరాయణులును, కేవల ధర్మకాములు నగుటచే లౌకిక

మగు తమ పూర్వానుభవజన్యమయిన జ్ఞానమును తమకంటె బిన్నలగు గృహస్థులకు బోధచేయుచు, వారలకు మార్గమును చూపుచు, పెక్కువిధముల లోకక్షేమమునకొఱకు పాటుపడవలయును. వానప్రస్థ ధర్మ మివ్విధమున, కాలానుసారముగ పైని సూచించిన విధమున పునరుద్ధారణము చేసినచో భరతఖండ మెంతయు అభ్యుదయమును పొందును.

ఇది వర్ణధర్మములయందు క్షత్రియధర్మమును బోలినదై యున్నయది. పిదప జీవుఁడు సర్వసంగపరిత్యాగము చేసి సన్న్యసింప నర్హుఁడగుచున్నాఁడు.

అంతట వైరాగ్యము దృఢము కాఁగా సంసార సంస్పర్శ మించుకయైనను లేక సదా భగవద్ధ్యానపరుఁడై యుండుట కవకాశముగల వాఁడగును. ఐహికములగు విషయముల నొక్కటియైనను గోరఁడు. ఐహికసుఖములందువలె స్వర్గసౌఖ్యముల యందు సహితము దృఢవైరాగ్యము గలిగి స్వర్గసుఖమునకంటె నుత్తమమగు ముక్తిపదమును గూర్చి బహుప్రయత్నమును జేయుచుండును. అప్పుడు భిన్నభావము సంపూర్ణముగ వదలుచు, సర్వభూతములయందు నాత్మస్వరూపమును జూచుచు, సర్వభూతములయందున్న యాత్మయు, తనయందుండు నాత్మయు నొక్కటియేయని తెలిసికొని సదా ఆత్మతత్త్వమును బోధించు గ్రంథముల నాలోచించుచు, శ్రవణ మనన నిదిధ్యాసముల నభ్యసించుచు, ప్రపంచమునందుఁ

గన్పడు నానాత్వమునం దేకత్వమును జూచుచుఁ గడపట "సర్వం ఖల్విదం బ్రహ్మ" "నేహ నానాస్తి కించన" అను మొదలగు మహావాక్యసారమును స్వానుభవమునఁ దెలిసికొనుచు, నాత్మావలోకన పరాయణుఁడై యుండు. అట్టివారి యందు "అహం" మ్మను ప్రత్యయము లేశమైన నుండదు. సర్వమునం దేకత్వమును జూచుచుండుట చేతను, భిన్నభావ మించుకయైనను లేమిచేతను, అట్టివారు కర్మమార్గమున కతీతులైన వారనఁ దగియుందురు. అట్టివారికి శోకమోహాదులు సంపూర్ణముగ నశించినవియే.

> యస్మిన్ సర్వాణి భూతా న్యాత్మై వాభూ ద్విజానతః ।
> తత్ర కో మోహః క శ్శోక ఏకత్వ మనుపశ్యతః ॥

(ఈశావాశ్యము)

తా. ఏ పదవియం దేకత్వమునే చూచు జ్ఞానికి సకల భూతములు ఆత్మగనే యగునో అట్టి స్థితియందు మోహ శోకము లెట్లు కలుగును?

ఈ స్థితిని బొందిన జీవుఁడు సర్వత్ర ఏకత్వమును జూచువాఁ డగుటంబట్టి జాతిభేదముల నతిక్రమించినవాఁ డనఁదగు. ఎవ్విధమగు ఫలాపేక్ష లేమింజేసి యీ పురుషునకుఁ గర్మము లెవ్వియును విధింపఁబడి యుండలేదు. లోకసంగ్రహము నుద్దేశించి పరోపకారసాధకములగు కర్మములఁ జేయుచుండినను ఆ కర్మములచే బద్ధుఁడు కాఁడు. నశ్వరమగు పదార్థమం

దభిమానము నుంచుకొనఁడు. శరీరము ధర్మసాధనములలో మొదటిదగుటచే శరీరపోషణము మాత్రము భిక్షాన్నభోజనముచేఁ జేసికొనును. అందునుగూడ యదృచ్ఛాలాభ సంతుష్టుఁడై యుండఁదగు. ఈ ధర్మమును జక్కఁగ ననుష్ఠించువారే పరమార్థ సన్న్యాసులు. ఇదియ ఆర్యధర్మమునఁ దురీయాశ్రమమను యత్యాశ్రమము. ఇందు ఇంద్రియములను, మనస్సును జక్కఁగ నియమనము చేసికొనుటకు సర్వప్రయత్నములు చేయుటయే ముఖ్యలక్షణము.

ఈ యాశ్రమమునందును యోగాభ్యాసాదులచేఁ బొందఁబడిన యాత్మజ్ఞానమునందలి తారతమ్యములను బట్టి యతులయందును తారతమ్యములు గ్రంథములయందు సూచింపఁబడి యున్నవి. వీరు కుటీచక బహూదక హంస పరమహంసలను భేదముల నొప్పుచుండు వారు. వీరి పరిపక్వస్థితిననుసరించి ధర్మములు సహితము భిన్నభిన్నములుగ నుపనిషత్తులయందు విధింపఁబడి యున్నవి. ఐనను అందఱును నివృత్తిమార్గమునే యనుసరించువారు. ఎల్లప్పుడు భగవద్ధ్యానపరులై తపస్సంపన్నులై తపోధ్యానముల ఫలములను సహితము లోకమునకు మేలుచేయుటయందు వినియోగము చేయుచుందురు. యోగ్యులగు శిష్యులను వెదకుచు నట్టివారు దొరకిన వారల కాత్మజ్ఞానమును బోధించుచు భగవంతునివలె లోకమునందుండు సర్వభూతముల శ్రేయోవృద్ధిని గూర్చి లోకమునందు లోక

సంగ్రహార్థము భగవంతుని ప్రతినిధులుగ వర్తించుచుందురు. వీరలే భగవంతుని జన్మకర్మముల స్వరూపమును యథార్థముగ నెఱింగి జీవించియుండు కాలముననే ముక్తిసుఖము ననుభవించు జీవన్ముక్తులని పిలువఁబడువారు. ఇట్టివారి నుద్దేశించియే గీతాశాస్త్రమునందు

> జన్మకర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః ।
> త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మా మేతి పాండవ ॥ (గీత. ౪-౯)

అని శ్రీ కృష్ణుఁడు చెప్పియున్నాఁడు. ఇట్టి మహనీయులే జన్మరాహిత్యమున కర్హులగుచున్నవారు. యథార్థముగ వారు సర్వభూతసేవా తత్పరులు. దానియందే పూనికతో వర్తింతురు. కేవలమజ్ఞానదశయందు శూద్రుడు తన పురోవృద్ధికై ఇతరులకు పరిచర్యచేయుననియును, అట్లే బ్రహ్మచారి తన యభివృద్ధి నుద్దేశించి గురుశుశ్రూష చేయుననియును ముందు చెప్పఁబడియె. పరమార్థసంన్యాసి స్వార్థమును పూర్ణముగ త్యాగము చేసినవాడుగానను సర్వభూతాత్మ భూతుడైయుండుటఁ బట్టియు, తనకై కోరునది యొక్కటియు లేమిం జేసియు, సర్వభూతహితేరతుడై వర్తించువాఁడు, కాన యథార్థముగ లోకసేవకుడు. శూద్రధర్మమగు సేవ ఉత్తమ సంన్యాసియందు పరిపూర్ణముగ శోభించును. శ్రీమద్భాగవతమున తృతీయ స్కంధమున శ్రీ కపిలుడు దేవహూతికీ యర్థమును నొక్కి వక్కాణించియున్నాఁడు.

అహం సర్వేషు భూతేషు భూతాత్మా వస్థితస్సదా ।
త మవిజ్ఞాయ మాం మర్త్యః కురు తేర్చా విడంబనమ్ ॥
యో మాం సర్వేషు భూతేషు సంత మాత్మాన మీశ్వరం ।
హిత్వాఽర్చాం భజతే మౌఢ్యాత్ భస్మ న్యేవ జుహోతి సః ॥

(భాగవతము)

అనిశము సర్వభూత హృదయాంబుజవర్తి యనం దనర్చు
నీకునను నవజ్ఞచేసి మనుజుండొగి మత్ప్రతిమార్చనావిడం
బనమున మూఢుఁడై యుచితభక్తిని నన్ను భజింపడేని న
మ్మనుజుడు భస్మకుండమున మానక వ్రేల్చినయట్టివాఁడగుఁ ॥

(ఆ. భాగవతము)

శివాయ లోకస్య భవాయ భూతయే
య ఉత్తమ శ్లోకపరాయణా నరాః ।
జీవంతి నాత్మార్థ మసౌ పరాశ్రయం
ముమోచ నిర్విద్య కుతః కళేబరమ్ ॥

(శ్రీ భాగవతము ౧౮-౧౨)

ఉత్తమ కీర్తులైన మనుజోత్తము లాత్మహితంబులెన్నడుఁ
చిత్తములందు గోరరు హసించియు లోకులకెల్ల నర్థ సం
పత్తియు భూతియుఁ సుఖము భద్రము గోరుదురర్థ్యరక్షణా
త్యుత్తమ మైన మేను విభుడూరక యేల విరక్తిబోసెనో ॥

ప్రవృత్తినివృత్తిమార్గములు

జీవుఁ డభ్యసించు ధర్మములలోఁ గొన్ని ప్రవృత్తిధర్మము
లనియుఁ గొన్ని నివృత్తిధర్మములనియు ధర్మములు రెండువిధ

ములు. మొదట జీవుఁడు వాంఛాప్రేరితుఁడై సర్వత్ర స్వప్రయోజనమును గోరుచు, నితరుల లాభముకంటె తనలాభ మెక్కుడుగ భావించుచు, స్వప్రయోజనమునకై పాటుపడును గదా! ఇది యంతయుఁ బ్రవృత్తిమార్గ మనఁదగు. మనుష్య జన్మము ప్రాప్తించినది మొద లనేక జన్మములందు వివిధ సుఖదుఃఖానుభవములు గలిగి వానినుండి పొందఁదగు జ్ఞాన మభివృద్ధియై నిజమగు వైరాగ్యము దృఢమగు నంతవఱకును బ్రవృత్తిమార్గముననె జీవుఁడు తిరుగుచుండును. ఐహికములగు సుఖముల నెక్కుడుగ వాంఛించి వానికొఱకు బహుప్రయత్న ములు చేయును. ఆ సుఖములు లభించినపుడు సంతోషించుచు వానియందే రమించును. వానియం దత్యంతానురాగము గలిగి వాని వియోగము నించుకయైన నోర్వక దృఢములగు నను బంధములచే వానికి బద్ధుఁడై యుండు. ఐనను కాలక్రమమున నందెద్దియేని నశింప విశేషముగ శోకముతోఁ దపించి దీన భావమును జెందు. ఈ యనుభవము మాటిమాటికిఁ గలుగను దనకు నుత్తమ సుఖసాధనములని భ్రమించి ప్రేమించుచుండిన విషయము లన్నియు నంతములు గలవియగుటచే క్షణభంగు రములనియును, నశ్వరము లనియును జ్ఞానము కలిగి వైరాగ్య మించుక యంకురించును. కాలయాపనమున దుఃఖము క్షీణింప నా విషయములయందు మరల మమకారము క్రమక్రమమున వృద్ధియై బీజమాత్రముగ నున్న వైరాగ్యము మఱుఁగుపడి

పోవును. ఇట్టి వైరాగ్యమే ఔత్సుక్యమాత్ర వైరాగ్యమని పిలువఁబడును. ఇట్టివియె పురాణవైరాగ్యము, శ్మశానవైరాగ్యము నని లోకమునఁ బ్రసిద్ధముగ నుండునవి. అనేకజన్మములం దిట్టి యనుభవములు మరల మరల గలుగను గలుగను వైరాగ్యము మరల మరల నంకురించి ప్రతిపర్యాయము క్రమక్రమమున దృఢతరమగుచు, నైహికములగు సుఖములన్నియు దుఃఖమూలములను జ్ఞానము దృఢతమమగును. అప్పుడు గలుగు వైరాగ్యము స్థిరమై తీవ్రమై మోక్షమార్గమునఁ బాటుపడుట కుత్సాహమును గలిగించునదియగు.

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।
ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ॥ (గీత. ౫-౨౨)

ఈ వైరాగ్యము గలుగునంతకమున్ను తెలిచుగ స్వప్రయోజనముకొఱకుఁ బాటుపడుటయు బాహ్యములగు విషయములను గ్రహించుటయు ననుభవించుటయు జీవుని ముఖ్యలక్షణములు. అట్లనుభవించుట చేతనే అప్పటికి జీవుఁడు వృద్ధికాఁదగు. అజ్ఞానదశయందు గడుచు జన్మములందును బిదప ప్రతిజన్మమున బాల్యయౌవనములందును బైఁ సూచించిన రీతిని బాహ్యవిషయముల గ్రహించి యనుభవించుట జీవుని యభివృద్ధికి హేతువగుచున్నది. వీని ముఖ్యప్రయోజనమేమనగా భూలోకమునందలి సుఖదుఃఖములు జ్ఞానవృద్ధికి హేతువులనియు నందలి ప్రకృష్టసుఖములకంటె మిగుల సార

వంతములు శాశ్వతములు నగు సుఖము లున్నవనియును దెలిసి యథార్థవైరాగ్యము దృఢపడుటయే.

ఈ జ్ఞానము గలుగునంతవఱకు ప్రవృత్తిమార్గము జీవున కభివృద్ధి కారణము. విషయసుఖములను సంపూర్ణముగ ననుభవించి వానియందలి దోషములను జక్కఁగ నెఱింగి తీవ్ర వైరాగ్యము వృద్ధియగునంతవఱకుఁ బ్రవృత్తిధర్మమును వదలక యుండవలయును. అంతకుఁ బూర్వమే ప్రవృత్తిధర్మమును విడుచుటచేఁ బరిపక్వముగాని కాయను పండవేయ ఫలింపక చెడిపోవురీతిని జీవున కధోగతి ప్రాప్తమగునుగాని యుత్తమ గతి కది సాధనము గానేరదు. ఇక్కాలమున హిందూదేశమునఁ బలువురు యుక్తవయస్కులు గాకయు, పరిపక్వజ్ఞానులు గాకయు, నిజమగు వైరాగ్యములేకయు సన్న్యసించుటచే నుత్తమమగు తురీయాశ్రమమునకు నపవాదము కలిగియున్నది. తీవ్రవైరాగ్యము కలుగకమున్నె సన్న్యసించుటచే యథార్థముగ యతిధర్మముల ననుష్ఠించుట యసాధ్యము కావున "కామిగాక మోక్షగామి గాడు" అను లోకోక్తి ప్రసిద్ధముగ నున్నయది. సన్న్యసించిన పిదప శరీరపోషణముకొఱకు నితరుల నాశ్రయించియుండుట విధియైయుండఁ దన్నుపచరింపఁ దగు గృహస్థులు లోనగువారికిఁ బెక్కుమడుంగు లెక్కువ మేలుచేయు సామర్థ్యము గలిగియుండినఁగాని యాయాశ్రమ స్వీకారము సార్థకము కానేరదు. ఏలయనఁగా సదా భగవ

ధ్యానపరుఁడై సర్వభూతహితరతుఁడై సర్వభూతహితము కొఱకే భగవంతుని బ్రార్థించుచు నెల్లరకు జ్ఞానదాతయై మార్గదర్శియై యితరులకు మేలుచేయు సామర్థ్యము కలిగి యా సామర్థ్యమును జక్కఁగ వినియోగింపనిచో నితరులనుండి తాఁ గొను భిక్షాన్న కౌపీనాదులు నూతనములగు ఋణానుబంధ హేతువులగుటచేఁ గర్మబంధములగుచున్నవి. కావున నిజమైన వైరాగ్యము గలిగినపిదప ప్రవృత్తిమార్గమును వదలి నివృత్తిమార్గమున వర్తింపఁదగు.

నివృత్తిమార్గమున స్వప్రయోజనము నపేక్షింపక పరోపకారమును గోరుచు నితరులనుండి తాను గ్రహించు ప్రయోజనములకంటె నితరులకు నెక్కుడగు మేలుచేయుట ముఖ్యలక్షణము. మొదట నితరులవలనఁ దానుబొందు లాభములమేలును, ప్రయోజనములను దెలిసికొని వానికి సమానముగనైనఁ బ్రత్యుపకృతి చేయుట యావశ్యకమని నివృత్తిమార్గమునఁ బ్రవర్తించువాఁడు కొంచెమైనను లోపములేక న్యాయమును బరిపాలించుచుండును. జ్ఞానము వృద్ధి కానుకాను అజ్ఞానదశయందును, బాల్యయౌవనములయందును నెక్కుడుగ నితరులనుండి తాఁ బొందినమేలును ఈక్షించి తద్వారాగలిగిన ఋణానుబంధములను దీర్చుకొనవలయునని యెక్కుడుగఁ బరోపకారబుద్ధికలవాఁ డగు. అవు డితరులవలనఁ దనకుఁ గలిగిన మేలుకంటె నెక్కువగ నితరులకు మేలుచేయుచుఁ

గాలక్రమమున స్వప్రయోజనము నించుకేని గోరక పరుల కుపకృతి చేయుటయే ముఖ్యధర్మముగ నభ్యసించును. ఈ రీతి నాదియందుఁ దాఁజేసికొనిన ఋణములన్నియుఁ గొంచె ముగూడ లోపములేక వృద్ధితోఁగూడఁ దీర్చి తుదకు ఋణ విముక్తుఁడగుటకుఁ బ్రయత్నించును.

ఈ విధమున మనుష్యజన్మము గలిగినదిమొదలు ముక్తుఁడ గునంతవఱకు జీవుని కాలమంతయుఁ బూర్వభాగము ప్రవృత్తి మార్గమనియు, రెండవభాగము నివృత్తిమార్గమనియు నెఱుం గఁదగు. పూర్వభాగమున నీశ్వరుని మాయాశక్తి జీవుని నవి ద్యారూపమునఁగప్పి ప్రకృతిబద్ధునిగఁ జేయుచుండును. రెండ వభాగమున నా మాయాశక్తియే విద్యాస్వరూపిణియై జీవుని సంసారమునుండి మరలించి యాత్మాభిముఖునిగఁ జేయు. ఈరీతి జీవునియాత్రయంతటను ఒక్కొక్క జన్మమునను ఒక్కొక్క యాత్ర మమునను బ్రవృత్తినివృత్తిమార్గములు రెండును జూపింపనగు.

ఎల్లవారును ఈ ధర్మస్వరూపమును జక్కఁగఁ దెలిసికొని తమతమ ధర్మములను జక్కఁగ ననుష్ఠించుచు, యథాశక్తిగ నితరులకుఁ బోధించుచుఁ దాము కృతార్థులగుటయేగాక యిత రులను గృతార్థులను జేయుచు, సనాతనములగు నీ ధర్మములఁ బరిపాలించుట ద్వారా ఆదియందు నీ ధర్మములం బ్రతిపాదిం చిన మహర్షుల ఋణమును దీర్చుకొనినవారగుదురు గాక.

పండ్రెండవ యధ్యాయము

మోక్షమార్గత్రయము

జీవుఁ డీశ్వరాంశమనియు, ఈశ్వరశక్తులన్నియు జీవుని యందు బీజరూపముగ నున్నవనియు, ఆ బీజరూపముగ నుండు శక్తులన్నియు సంపూర్ణముగ నభివ్యక్తమగుటకొఱకు జీవుఁడు పాంచభౌతికమగు ప్రపంచమునఁ బ్రవేశించి సంసారచక్రమునఁ బరిభ్రమించు చున్నాఁడనియును దాని ప్రయోజనము మోక్షముఁ బొందుటయే, అనగా పరిపూర్ణుఁడగుటయే యనియు, పూర్వాధ్యాయముల సూచింపఁబడినది. ఆదియం దీశ్వరాంశమగు జీవాత్మ క్రమక్రమమున స్థూలము, స్థూలతరము, స్థూలతమమునగు ప్రకృతియందుఁ బ్రవేశించి యనేకలోకములయందు నాయాలోకసంబంధమగు ప్రకృతిలో నొకకొంత భాగమును జేర్చుకొని దాని నుపాధులుగ నొనర్చుకొనుచు నన్నిటికంటె స్థూలమగు భూలోకమునఁ బ్రవేశించి కొంత కాల మచేతనము లగు మృత్పాషాణాదులయందును, మఱి కొంతకాల మోషధి వనస్పతులయందును, పిదప జంగమములగు తిర్యగ్జంతువులయందును నివసించి యనేకవిధానుభవములఁ బొంది కట్టకడపట మనుష్యశరీరమును ధరించు

చున్నాఁడు. జీవాత్మ సచ్చిదానంద స్వరూపుఁడయ్యు మృత్పాషాణాదులయందు సత్తామాత్రముగ నావిర్భవించి యున్నవాఁడు. స్థూలమగు ప్రకృతియందుఁ బ్రకాశరహితముగ నుండుటవలన వీనియందాత్మ యున్నదా యనుసందియ మొందఁదగినంత యంతర్భూతుఁడై యున్నవాఁడు. ఈ స్థితి యందు యథార్థముగ జీవత్వ మున్నదా అని చెప్పుట కవకాశము చాలకయుండు. ఐనను గాలక్రమమున మృత్పాషాణాదుల నతిక్రమించి యోషధివనస్పతులయందుఁ బరిణమించు కాలమున వానియందు ద్రవసంచారముచే నవి ప్రాణభృత్తులనఁదగియున్నవి. తిర్యగ్జంతువులయం దుశ్వాసనిశ్వాసరూపమగు ప్రాణము కన్పడును. చిత్తమంతగాఁ గానరాదు. జంతువులయందును బ్రవృత్తిరూపకసంచారముచేతను, క్రోధహార్షాదులచేతను జిత్తము కొంచెము కనఁబడుచుండును. ఐనను మనుష్యశరీరధారియైనప్పుడే మనశ్శక్తి స్పష్టముగాఁ గనఁబడుచున్న యది. అపు డింద్రియములచేత బాహ్యప్రపంచమును దెలిసికొనుటకును, తెలిసికొన్న విషయములను వాక్కుతో వివరించుటకును గడచిన విషయముల స్మరించుటకును రాఁబోవు విషయముల నూహించుటకును సమర్థుఁడగు. ఈ మనశ్శక్తి యుదయించిన పిదపనే జీవాత్మ మనుష్యలోకమున నున్నవాఁడనియు, చేయుకర్మములయందు స్వాతంత్ర్యము గలిగియుండుటచే ఫలానుభవమునకు బద్ధుఁడై వివిధసుఖదుః

ఖానుభవములచే జ్ఞానము నభివృద్ధి చేసికొని బీజరూపముగ నున్న యాత్మశక్తులను గ్రమక్రమముగ నభివ్యక్తములుగఁ జేసికొనుచున్నవాఁడనియు గ్రహించుటొప్పు. సంసారచక్రమునందుఁ దిరుగునంతకాలము జీవాత్మకుఁ గలుగు బహువిధ సుఖదుఃఖములును, మఱియు జీవుని యోగ్యతానుసారము విధింపఁబడియుండు విధినిషేధరూపములగు ధర్మములును, బీజరూపముగనుండు నాత్మశక్తుల నభివ్యక్తములుగఁ జేయుటకొఱకుద్దేశింపఁబడినవి.

మానవజన్మము ప్రాప్తించినది మొదలు ముక్తిసాన్నిధ్యమును బొందువఱకు జీవుఁ డనుష్ఠించు మార్గములలో ముఖ్యముగ మూఁడుమార్గములు గానంబడుచున్నవి. ఈ మార్గములన్నియు గడపట జీవాత్మకుఁ బరమాత్మ సంయోగమును గావించుటకు సమర్థములయినవి. ఈ సంయోగమునకే యోగమని పేరు. ఈ యోగము నొనఁగూర్చుటకు సాధనమగుటంజేసి యీ మార్గత్రయము యోగసాధనముగ నెన్నఁదగియున్నయది. ఆ మార్గములు కర్మమార్గము, భక్తిమార్గము, జ్ఞానమార్గ మనునవి. ఒక్కొక్కమార్గము తుదినొక్కొక్క యోగము సిద్ధించుచున్నయది. కర్మమార్గము తుదిఁ బొందఁదగినది కర్మయోగము, భక్తిమార్గము కడపట నొందఁదగినది భక్తియోగము, జ్ఞానమార్గము కడపట జెందఁదగినది జ్ఞానయోగము.

ఇట్లు మార్గములు మూడైయున్నను గమ్యస్థాన మొక్కటియే. ఏ మార్గమున నడిచినను తుద కీశ్వరసాన్నిధ్యమును జెందుటయే దానికి ఫలము. ఈ మార్గములు మూడును సమములే. వానిలో హెచ్చుతక్కువలు లేవు. ఆయాజీవుల స్వభావమును బట్టి ఆయామార్గము వారవలంబించి శ్రేయః ప్రాప్తిని జెందుదురు. ఈ మర్మము తెలియనివారు తమతమ మార్గమే శ్రేష్ఠమనియు తక్కినవి దానికంటె తక్కువయనియు భ్రమించి వృథావివాదములతో కాలహారణము చేయుదురు. కర్మమార్గమునఁ బ్రవర్తించు కర్మి కట్టకడపటఁ గర్మయోగముచే పరిపూర్ణుఁడుకాఁగా భక్తిజ్ఞానములు వానియం దభివ్యక్తములయి ప్రకాశించును. భక్తిమార్గమునఁ బ్రవర్తించు భక్తునకు భక్తి హెచ్చను హెచ్చను బాహ్యములగు నైహికసుఖములయందుఁ బ్రీతితగ్గును. అట్టి భక్తుఁడు సర్వకర్మములను భగవంతునియం దర్పించి సదా భగవత్సాన్నిధ్యమును గోరుచు సాయుజ్యము నొందును. అపుడు జ్ఞానము తనంతటఁ దాను వానియందుఁ బ్రకాశించి భక్తిజ్ఞానములు రెండును బరిపూర్ణములు కాఁగాఁ సర్వభూతహితము గోరి జనకాదులవలెఁ గర్మములందుఁ బ్రవర్తించును. మఱియు జ్ఞానమార్గమున బోవు జ్ఞాని విచారముచేత నిత్యానిత్యవివేకజ్ఞానము గలిగి క్రమక్రమమున నశ్వరములగు విషయముల నన్నింటియందు వైరాగ్యము నభివృద్ధి చేసికొనుచు, నావిషయముల నన్నింటి

ననాత్మగా నెఱింగి శరీరమును నింద్రియములను, మనోబుద్ధ్యహంకారములను వరుసగ ననాత్మగ నెఱుంగుచుఁ గట్టకడపట నొక్కటియగు నాత్మస్వరూపమును దెలిసికొనియు నాత్మేతర పదార్థ మొక్కటియు లేదని నిశ్చయించిన నాస్థితియం దుత్తమోత్తమమగు పరమభక్తియు నభివ్యక్తముకాక తీరదు. అట్టి జీవుఁడు లోకానుగ్రహ తత్పరుఁడై కర్మములందు సహితము ప్రవర్తించును. ఇట్లొక్కొక్కమార్గమును వేఱువేఱుగఁ గన్పడినను సమగ్రస్థితియందు మార్గములన్నియు నొకటియగుచున్నవి. కావున సంపూర్ణయోగి కర్మికంటెను, జ్ఞానికన్నను, భక్తునికన్నను శ్రేష్ఠుఁడు.

తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥

(గీత. ౬-౪౬)

పదుమూడవ యధ్యాయము

కర్మ మార్గము

జీవునియందు బీజరూపముగనుండు నాత్మశక్తుల నభివ్యక్తములుగఁ జేయుటయే యీమార్గమువలని ప్రయోజనము. ప్రపంచమునందలి మతము లన్నింటియందును విధింపఁబడి యుండు బాహ్యములగు కర్మములన్నియు సామాన్యముగ లోకమునఁ జేయఁబడు లౌకికకార్యములన్నియు నాప్రయోజనమును లభింపఁజేయుటకు సాధనములుగ నుద్దేశింపఁబడినవియ. మొట్టమొదట జీవుఁడు తమోగుణమునకు లోఁబడియుండ నా తమోగుణమును బోఁగొట్టి రజోగుణప్రధానునిగఁ జేసి తుదకు సత్త్వగుణమునఁ బ్రతిష్ఠితునిగఁ జేయుటకు వివిధకర్మములను శాస్త్రములయందుఁ దత్త్వవేత్తలగు మహాత్ములు విధించియున్నవారని పూర్వాధ్యాయమున విస్తరింపఁబడియున్నది కదా! అందు నెక్కుడగు నజ్ఞానమున మునిఁగి తమోగుణ ప్రధానులుగ నుండు జీవులు తమకంటె నుత్తములగు వారలకు లోఁబడి వర్తించుటయు, వారిని సేవించుటయుఁ దప్ప నితరములగు కర్మములు ఎవ్వియు విధింపఁబడి యుండ లేదు. అంతకంటె శ్రేష్ఠులగు జీవులకు వివిధకర్మములు విధిం

పఁబడియే యున్నవి. జీవుని పరిపాకావస్థ ననుసరించి యంత కంటె నుత్కృష్టస్థితికిఁ దేఁదగు ధర్మముల ముందుఁ జర్చించితిమి. ఇపుడు మతములయందు విధింపఁబడియుండు కర్మములఁగూర్చి విచారింతము.

విహితములగు కర్మములన్నియును, వర్ణాశ్రమధర్మములన్నియును, శరీరధారణమునకు సాధనములగు వృత్తులన్నియును బూర్వాధ్యాయమున సూచింపఁబడిన రీతిని బీజరూపములగు నాత్మశక్తుల నభివ్యక్తములుగఁ జేయుటకు జీవుని స్థూలసూక్ష్మశరీరముల మాలిన్యమును బోఁగొట్టి బరిశుద్ధముగఁ జేయ సమర్థములైనవి. నిత్యనైమిత్తికములగు యజ్ఞములు దానములు మొదలగునవి జీవుని పలువిధములగు ఋణములనుండి విముక్తునిగఁ జేయ సమర్థములయి యున్నవి. వర్ణాశ్రమధర్మముల విషయము పూర్వాధ్యాయమున విస్తరింపఁబడియున్నది. ఇఁకఁ బై సంస్కారములను గుఱించియు, యజ్ఞములను గుఱించియు మాత్రము విచారింతము.

జీవుని యుపాధులయందుండు మాలిన్యమును, బోఁగొట్టి వానిం బరిశుద్ధములుగఁ జేయుటకొఱకు కన్నిమతములవారలు ననేక సంస్కారములు విధించి యున్నవారు కదా! ఒక్కొక్క మతమునందు నొక్కొక్క పేరుచేఁ బరఁగుచున్నను మత సంబంధములగు క్రియలన్నియు నాయుద్దేశము నొనఁగూర్చునవియే. ఈ సంస్కారములు జీవుని ప్రతిజన్మమునందును ఆది

నుండి యంతమువఱకును గాలానుసారముగఁ జేయఁబడునట్లు విధింపఁబడియున్నవి. వీని యన్నింటియందును గ్రహింపఁదగిన ముఖ్యాంశములు కొన్ని గలవు.

౧. జీవాత్మ యుపాధులు గలిగి యాయుపాధుల మూలమున భూరాదిలోకములతోడను, ఆ లోకవాసులతోడను సంబంధము గలిగియున్నవాఁడు. ఒక్కొక్క యుపాధిమూలమున నొక్కొక్కలోకముతో సంబంధము గలిగి యాలోకమును స్పృశించుచుండు. ఒక్కొక్క యుపాధియు నొక్కొక్క లోక ప్రకృతితోఁ జేయఁబడి యాలోకానుభవమునకు సాధనమగుచుండును.

౨. లోకమునందలి సమస్త ప్రకృతిసముదాయము ఎల్లపుడు చలనము గలిగియేయుండును. ఇది ప్రకృతి శాస్త్రజ్ఞులు పరిశీలించి చెప్పియున్నారు. ఈ రీతినే జీవుని శరీరములయందున్న ప్రకృతిసముదాయమును స్వాభావికముగఁ జలనము గలిగియే యుండును.

కావున నాశరీరముల ధరించిన చైతన్యమునందు వృత్తులు మారినట్లెల్ల నా యుపాధులయందును తదనుగుణముగ జలనము గలుగుచుండును. అట్లె బాహ్యస్పర్శలవలన నుపాధులయందు చలనము పుట్టినట్లెల్ల చైతన్యమునందును అనురూపములగు వృత్తు లుత్పత్తియగును. అనగా నొక్కొక్కలోకమునఁ గల యితర శరీరములు మొదలగు ప్రకృతిసముదాయ

ముల సంస్పర్శవలన నాయాలోకములయందు నాజీవునికిఁగల శరీరములయందు జలనము గలుగును. ఈ చలనములచే నా జీవుని యుపాధులయందుండిన ప్రకృతిసముదాయము కొంత వదలిపోయి యితర ప్రకృతి సముదాయము వానియందు చేరుట ద్వారా శరీరము లెల్లప్పుడును మాఱుచునే యుండును. ఆయాయుపాధుల కాయా లోకములనుండివచ్చు బాహ్యస్పర్శములచేఁ గలుగు చలనమువలనే జీవునకు ఆయాలోక జ్ఞానము గలుగును. అట్లు జ్ఞాన మభివృద్ధి కానుకాను జీవుని జ్ఞానానుభవమువలన లోపలనుండి ప్రేరణము కలిగి వృత్తులు మారగా నాయాశరీరములయందును జలనము గలిగి చైతన్య వృత్తి బహిర్ముఖమగును. ఇట్లు జీవుఁ డెల్లప్పుడు చేయు కర్మములచేతను జీవుని యుపాధులయం దనవరతము చలనము గలిగి యది మాఱుచునే యుండును. జ్ఞానము వృద్ధి కానుకాను ఈ మార్పులు విశేషమగుచుండును.

3. ఒక్కొక్క లోకసంబంధమగు శరీరమును జీవాత్మ క్రమక్రమముగఁ బరిశుద్ధముగను, జ్ఞానసాధనముగను జేసికొనుచుండు. జీవాత్మ సదా తన యుపాధులను లోఁబఱచుకొని తన యిష్టానుసారము చలించునట్లు చేయ యత్నించుచుండినను ఉపాధులు పూర్వకర్మవాసనాబలముచే లోఁబడక వేఱువిధముగఁ జలించుచుండు. కావున జీవుఁడు పురుషార్థ సాధనమునకుఁ జేయు ప్రయత్నములు సఫలములు కాకపోవు

టయుం గలదు. ఐన నెద్దియేని యుపాయమున నుపాధులను మంచిమార్గమునc జలింపc జేయc గలిగెనేని జీవుc డొనరించు ప్రయత్నములు సఫలములగును.

ఉపాధులయందలి దుష్టచలనమును నిలిపి సద్వృత్తుల కను కూలమగు వర్తనమును గలిగించుటయందు మంత్రములు మొదలగునవి మిక్కిలి సహకారములు. మంత్రముల నుచ్చ రించుటచే జీవుని స్థూలసూక్ష్మ శరీరములు సౌమ్యముగc జలించి తమయందలి మాలిన్యమును గ్రమక్రమమునc బోc గొట్టుకొనును. జీవుcడు మంచిమార్గమునc బ్రవర్తించుటకుc బూనినపు డుపాధులు అనcగా స్థూలసూక్ష్మ శరీరములు అట్టి సత్ప్రవర్తనమునకుc బ్రతిబంధములుగ నుండినచోc దత్త్వ వేత్తయగు గురువువలనc బొందcబడిన మంత్రము నుచ్చరిం చుటచే నా యుపాధులయందలి స్వాభావిక చలనము నిలిచి యవి జీవునకు లోcబడి యనుగుణముగc జలించు. కావున సంస్కారము లన్నింటియందును మంత్రములు వినియోగింపc బడుచున్నవి. మఱియును గొన్ని ముద్రలును, కొన్ని ద్రవ్య ములును ఉపయోగింపcబడుచున్నవి. ఆ మంత్రముల యుచ్చా రణము చేతను, ఆ ముద్రల ప్రయోగముచేతను, నా పరిశుద్ధ పదార్థముల నుపయోగించుట చేతను, జీవుని స్థూలసూక్ష్మ శరీరములయందలి మాలిన్యము తుదముట్ట నశించి యా దేహములు పరిశుద్ధములగుచున్నవి.

మంత్రము లన నేమి? వాని నుచ్చరించుటచే శరీరము నందలి మాలిన్యము నశించుటెట్లు? లోకమున నొక్కొక్క శబ్దము నుచ్చరించుటచే గలుగు ధ్వని సామాన్యముగ నదృశ్యప్రపంచమునను, పలుమాఱు స్థూలమగు దృశ్యప్రపంచమునను, ఒక్కొక్కరూపముగఁ బరిణమించును. నానావిధశబ్దములు నానారూపముల నుత్పత్తి చేయుచుండ నందుఁ గొన్ని మంచిగుణములు గలవియు, మఱికొన్ని చెడుగుణములు గలవియునై యుండు. ఇదిగాక యారూపము లొక్కొక్కటియు నొక వర్ణము కలదగు.

సూక్ష్మలోకము లన్నింటియందును ఆయాలోకవాసులగు దేవకోటులున్నవారు కదా! ఒక్కొక్క లోకమునందలి దేవతలును నానావిధవర్ణములు గలవారుగ నున్నవారు. కొందఱు దేవతలు రక్తవర్ణముగలవారని, కొంతమంది పీతవర్ణముగలవారని, మఱికొందఱు నీలవర్ణముగలవారని యిట్లనేకవిధముల వర్ణములుగలవారని గ్రంథములవలనఁ దెలియవచ్చుచున్నది.

ఉచ్చరింపఁబడు శబ్దమున కనురూపమగు శుక్లకృష్ణాది వర్ణములతో నొప్పురూపము సూక్ష్మప్రపంచమునఁ గలుగు నని ముందే యనువదింపఁబడియె. ఆ రూపము తదనురూపమగు వర్ణముగల యొక దేవత నాకర్షించును. ఆ దేవత యారూపమునందుఁ బ్రవేశించి యాశబ్దము నుచ్చరించు పురుషునితోడ సంబంధముగలది యగు.

సూక్ష్మదృష్టిగల తత్త్వవేత్తలు వివిధములగు శబ్దములఁ జక్కఁగ పరిశీలించి శబ్దముల సంయోగమువలనఁ గలుగు రూపములను, వానివర్ణములను, బరీక్షించి యుపాసకుని కను కూలమగు వర్ణమును, రూపము నుత్పత్తిచేయగలిగి తదను రూపులగు దేవతల నాకర్షింపఁగలుగు శబ్దములను సంయోగ ముచేసి మంత్రములుగ నిరూపించియున్నవారు. కావున సూక్ష్మలోకవాసియగు నొక్కదేవత కుపాధికాఁదగి తదను రూపములగు వర్ణరూపముల నుత్పత్తిచేయఁగలిగి తత్త్వవేత్త లగు మహర్షులచే సంయోగము చేయబడిన యక్షరసముదా యము మంత్రమనఁబడు. మంత్రము లితర శబ్దజాలములవలె నర్థమాత్రప్రయోజనము గలవిగావు. అక్షరముల లోపము లేక, వరుస తప్పక, విధింపఁబడిన స్వరము నతిక్రమింపక యుచ్చరింపఁబడవలయు, లేనిచో మంత్రాధిదేవత నాకర్షించు శక్తిలేక వాంఛితఫలము నీయఁజాలదు.

మంత్రో హీనః స్వరతో వర్ణతో వా
మిథ్యా ప్రయుక్తో న తదర్థమాహ ।
స వాగ్వజ్రో యజమానం హినస్తి
యథేంద్రశత్రు స్స్వరతోఽపరాధాత్ ॥

మంత్ర ముచ్చరింపఁబడినపుడెల్ల సూక్ష్మలోకమున రూప ముత్పత్తియగుచుండును. ఆ రూపమునుండి మేలుగలుగునా, లేక కీడుగలుగునా, అది మంచిచేయు దేవత నాకర్షించునా,

లేక హానికరములగు పిశాచముల నాకర్షించునా యను నివి మంత్రముల యందలి యక్షర పద స్వర క్రమముల ననుసరించును. మఱియు మంత్రము నుచ్చరించు వాని పారిశుద్ధ్యము, భక్తి, జ్ఞానము, చిత్తైకాగ్ర్యము వీని ననుసరించి యది యుద్దిష్ట ఫలము నిచ్చుటయందు వీర్యవంతమగును. కావుననే మంత్ర జపము చేయుటయందుఁ బారిశుద్ధ్యము, భక్తిజ్ఞానచిత్తైకాగ్ర్యములు లేనిచో మంత్రసిద్ధి కాఁజాలదు.

మంత్రముచ్చరించుచో సూక్ష్మశరీరమున సౌమ్యమైన చలనము గలిగియుండును. ఆ మంత్రమును మరల మరల నుచ్చరించుటచే నా సౌమ్యచలన మెక్కుడై చిత్తైకాగ్ర్యమునకు సహకారి యగును. కావుననే మంత్రము నుచ్చరించువారలకును, శ్రద్ధతో వినువారలకును మనశ్శాంతి కలుగును.

మంత్రమునం దుదహరింపఁబడిన దేవత నామోచ్చారణ మాత్రమున నాదేవత శరీరస్వభావానుగుణమగు చలన మా మంత్ర ముచ్చరించువారియొక్కయు, వినువారియొక్కయు నుపాధులయం దుత్పత్తి యగు. మంత్రమును పునశ్చరణము చేయుటవలన నా చలనము బలపడి స్థూలసూక్ష్మశరీరముల యందు సమరసభావ మభివృద్ధిచెందునట్లు చేయును. ఆ దేవత తేజస్సు, శక్తియుఁ బునశ్చరణము చేయువారి శరీరములయందుఁ బ్రవేశించి వానిని బరిశుద్ధములుగఁ జేయును.

ఇట్లు మంత్రపునశ్చరణము చేయుకాలమునఁ జేయువారి శరీరములు మంత్రాధిదేవత తేజస్సుతో నిండియుండుటచే భూతములవలని బాధ లాజీవుని సమీపింపఁజాలవు.

మంత్రము లుచ్చరించుటయందు మంత్రాధిదేవత యుపాధులయందలి స్వాభావిక చలనమునకు ననురూపమగు చలనము దాని నుచ్చరించువాని శరీరమునఁ గలుగుటచే నట్టి తీక్ష్ణమగు చలనమును భరింపఁజాలని మలిన ప్రకృతి సముదాయము వాని శరీరమునం దుండినచో నాశరీరము ఆ చలనమును భరింపఁజాలక బాధపడును. ఒకానొకప్పు డుపాధి నశించినను నశించును. కావున దుస్స్వభావము గలవారు తేజోభరితమగు గొప్పమంత్రము నుచ్చరించినను, వినినను, జపముచేయువారి సమీపమున నుండినను వారలకు విశేషబాధ కలుగును. అట్లుగాక సద్గుణప్రధానులయి వారి యుపాధులయందుఁ బరిశుద్ధమగు ప్రకృతిసముదాయము విశేషముగ నుండి యపరిశుద్ధప్రకృతిసముదాయ మల్పముగ నుండినచో మంత్రోచ్చారణమువలనఁ బరిశుద్ధమగు భాగము తీవ్రమగు చలన మొంది, యపరిశుద్ధభాగమునందలి ప్రకృతిసముదాయము క్రమక్రమమున విడఁదీసి వెలుపలికిఁ ద్రోసివేయును. దానిస్థలమునఁ బరిశుద్ధాణువు లాకర్షింపఁబడి చేర్చుకొనఁబడును.

ఇట్లు పరిశుద్ధమంత్రములను మరల మరల నుచ్చరించుటవలనను, వినుటవలనను, స్థూలసూక్ష్మోపాధులు క్రమక్రమ

మునఁ బరిశుద్ధములగును. మఱియు దుస్స్వభావము లేకుం డియు, జ్ఞానాభివృద్ధి తక్కువగాఁగల సామాన్యజీవుల యుపా ధులు స్థూలమును మలినమునునగు ప్రకృతిసముదాయము నెక్కు వగఁ గలిగియుండుటచే దుస్స్వభావముగలవారి వలె వీరు మంత్రముల నుచ్చరించినను, వినినను నవి బాధకరములగును.

ఇవిగాక ప్రపంచమునందలి పదార్థములన్నియు స్వాభావిక మగు తేజస్సు గలిగియున్నవనియును, ఆ తేజోగుణము నను సరించి సాత్విక రాజస తామసములని విభజింపఁబడియున్న వనియును పూర్వాధ్యాయమున సూచింపఁబడియె. ఆయా వస్తువుల నుపయోగించుటవలన వాని సంసర్గముగల యితర వస్తువుల తేజస్సుగూడ మాఱును. కావున సమస్త వైదిక కర్మములయందును ఉపాధులను బరిశుద్ధముచేయు శక్తిగల పదార్థముల నుపయోగింపవలసినట్లు తత్త్వవేత్తలగు మహా త్ములు విధించియున్నవారు. కనుక జీవుని యుపాధుల నన్నిం టిని బరిశుద్ధము జేసి జీవునకు సద్గతిని గలుగఁజేయుటకు విధిం పఁబడిన సంస్కారము లన్నింటియందును, మంత్రములును, యంత్రములును, కొన్ని పరిశుద్ధ పదార్థములును ఉపయోగిం చునట్లు సర్వ మతగ్రంథములందును నిర్ణయింపబడి యున్నది.

పైన సూచింపఁబడిన ముఖ్యాంశములను జక్కఁగ గ్రహిం చినచోఁ గర్మములు చేయుటయందుఁ బ్రతిపాదితములగు విధి నిషేధములు సార్థకము లగుచున్నవి. ఎట్టివారు మంత్రము

లుచ్చరింపనర్హులో, ఎట్టివారనర్హులో, ఎట్టివారియెదుట నుచ్చరింపనగునో, ఎట్టివారియెదుట నుచ్చరింపరాదో, ఏయేపదార్థములు హోమములకును, దానములకును యోగ్యములో యీ మొదలగు విధినిషేధము లన్నియు సప్రయోజనములుగఁ గన్పడు. ఈ విషయముల నెఱుంగనిచో నన్నిమతముల యందును విధింపఁబడిన నానావిధ కర్మములు నిరర్థకములుగఁ దోఁచు. అన్నిమతములయందు విధింపఁబడిన సంస్కారము లన్నియు జీవుని యుపాధులయందున్న మాలిన్యమును దొలఁగించి పరిశుద్ధములుగఁ జేసి జీవునియందు బీజరూపములుగ నుండు నాత్మశక్తులనన్నిటి నభివ్యక్తములుగఁ జేయుటకును, ఆ మార్గమునం గలుగు నంతరాయములను దొలఁగించుట కును విధింపఁబడినవని తెలిపితిమి గదా!

మతసంబంధములగు క్రియలయం దన్నిటియందును, జలములు, ధ్యానములు, పుష్పములు లోనగు పదార్థము లుపయోగింపఁ బడుచున్నవి కదా! మంత్రము లుచ్చరింపఁబడు నపుడు కలుగు దివ్యమును, తేజోవంతమును నగు చలనము ఉచ్చరించువాని శరీరమునందుఁ గలిగి యుపాధుల నన్నింటిని బరిశుద్ధముగఁ జేయును. మఱియును, మంత్రము లుచ్చరించు కాలమున మంత్రశక్తియును, మంత్రాధిదేవత తేజస్సును జలమునందుఁగాని మఱి యితరవస్తువునందుఁగాని ప్రవేశింప వల యునని దృఢముగ సంకల్పించినచో నాశక్తి యా జలముల

యందుఁ బ్రవేశించి యా జలములను బరిశుద్ధ తేజస్సుగల వానిగఁ జేయును. ఇంతియకాదు. క్రియలయందుఁ గొన్ని యంత్రముల నుపయోగించుట కలదు. కొన్నికొన్ని చక్రములును, వానియందుఁ గొన్ని బీజాక్షరములును, పంచదశాష్ట దళపద్మములు మొదలగు యంత్రములను వ్రాయుటయు, ముగ్గులు వేయుటయు గలదుగదా! ఇవియన్నియు శక్తియుక్తములగు యంత్రములు. మంత్రములుచ్చరించుచు నట్టి యంత్రములను లిఖించినను, లిఖించిన యంత్రమునందు మంత్రాధిదేవతను ఆవాహనము చేసినను, అనఁగా నాదేవతశక్తి యా యంత్రమున నిండి. దాని తేజోవంతముగఁ జేయవలయునని చిత్తైకాగ్ర్యముతో సంకల్పించినను, ఆ మంత్రాధిదేవత సంబంధమగు దివ్యతేజస్సు ఆ యంత్రమునం బ్రవేశించి, దానిని వీర్యవంతముగఁ జేసి యా యంత్రమును ధరించువారల శరీరమునం దపరిశుద్ధ చలనమును బోఁగొట్టి పరిశుద్ధ తేజస్సును నించి ఆ శరీరమునందలి మాలిన్యమును బోఁగొట్టి పరిశుద్ధముగఁ జేయును. రోగములుండిన నవి నివారణములగు. పిశాచములు లోనగు వాటిచే గలుగు బాధ లుండినచో నవి వదలిపోవును. ఉపాధులు పరిశుద్ధములు కానుకాను అంతఃకరణము పరిశుద్ధమై, శాంతమై, ఏకాగ్రమై ప్రకాశించును. అట్లే మంత్రములచేతను, యంత్రములు లేక ముద్రల చేతను, జలములు, తండులములు, పక్వాన్నము, ఫలములు

లోనగువానిని అభిమంత్రించినచో నామంత్రముయొక్కయు మంత్రాధిదేవత యొక్కయు దివ్యతేజస్సు ఆ పదార్థముల యందుఁ బ్రవేశించి వానిఁ బరిశుద్ధముగఁ జేయును. అపుడా జలముల నితర పదార్థములపైఁ బ్రోక్షించినను, ఇతరుల శరీరములపైఁ జల్లినను, వానియందలి దుష్టచలనము శమించి యాయుపాధులు పరిశుద్ధములగును. ఇట్లభిమంత్రింపఁబడిన పదార్థములను భక్షించినను, జలములఁ ద్రావినను బరిశుద్ధులగుదురు.

కావునఁ గ్రియలయం దన్నింటియందు జలముల నభిమంత్రించుటయు, నా జలముచే, బరిశుద్ధములగు పదార్థములను హోమము మొదలగు కార్యముల కుపయోగించుటయు, హుతముచేయఁగా మిగిలిన శేషమును దేవతా ప్రసాదముగ భక్తులగువారు గ్రహించుటయు విధింపఁబడియున్నవి. గృహస్థువగువాఁడు స్నానము సేయునపుడు జలముల నభిమంత్రించి యా జలములతో స్నానము సేయనగు. భగవంతుని ధ్యానముచేసి మంత్రములతో నభిమంత్రించిన జలములతోఁ బరిశుద్ధముగఁ జేయఁబడి, దేవునకు నివేదనము చేయఁబడిన యన్నాదులను భుజింపనగు. ఇట్లు సంస్కరింపఁబడిన యన్నము మేధ్యము (అనఁగా దేవతారాధనముచేఁ బరిశుద్ధమైనది) అనియును, అమృతమనియుఁ బిలువఁబడుచున్నది. అట్టి యమృతమును భుజించువారు. సమస్తపాప నిర్ముక్తులగుదురనియును, బ్రహ్మాత్వమును సహి

తము నొందువారనియును శాస్త్రములయందు నిరూపింపఁబడి యున్నది.

యజ్ఞశిష్టాశిన స్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ॥
(గీత. 3-13)

యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ ॥
(గీత. 4-31)

మఱియు సనాతనధర్మశాస్త్రమునందు సమస్తకార్యములకు నాదియందుఁగాని, యంత్యమందుఁగాని పుణ్యాహవాచనము సేయవలయునని విధింపఁబడియున్నది కదా! మంగళకరములగు మంత్రములఁ బఠించి యామంత్రములచేఁ బవిత్రములగు జలములను, అక్షతలను గృహవస్తువాహనములపైఁ జల్లుట యెల్లరకుఁ దెలిసినవిషయమే. ఇందును మంత్రములచేత స్థలశుద్ధియుఁ బదార్థశుద్ధియుఁ గర్తలు భోక్తలు శుద్ధులగుటయు నివియ ముఖ్యోద్దేశ్యములు. సామాన్యముగఁ గొందఱు మాత్రము మంత్రములఁ బఠింప నర్హులనియును, కొందఱు నర్హులనియును జెప్పఁబడియుండుట కొందఱకు నప్రియముగ నున్నయది. ఐనను దానికిఁ గారణము ముందే సూచింపఁ బడెను. పరంపరానుష్ఠితమగు నాహారనియమము, ఆచారనియమము గలిగి కొంచెము పరిశుద్ధములగు శరీరములు గలవారు మాత్రము మంత్రములఁ బఠించిన మేలుపొందుదురనియు, ఆహార వ్యవహార విహారనియమములకు లోఁబడక

యిష్టానుసారముగ వర్తించువారలకు మంత్రపఠనము హాని కరమేయనియు నెఱింగి యపారదయాసముద్రులగు మహాత్ములు వారలకు మంత్రపఠనము నిషేధించిరిగాని వేఱుకాదు. స్వప్రయోజనపరులై యట్లు చేసిరనుకొనఁదగదు. సదా పరోపకార తత్పరులై "ఆత్మవత్సర్వభూతాని" యను నియమము ననుసరించువారియందు స్వప్రయోజనపరత్వము నారోపించు టెట్లు? అనర్హులకు మంత్రపఠనమువలనఁ గలుగు కీడెఱింగి మంత్రపఠనము గూడదనిరి గాని యెవరికైనను సత్కార్యనిషేధము చేయవలయునని కాదు. మంత్రములకు మాఱుగ భగవంతుని నామమంత్రములను, పురాణవాక్యములను ఉపయోగించుచు సమస్తకార్యములు చేయవలయుననియే విధించియున్నారు.

ప్రపంచమునందలి మతములన్నింటియందును గొన్ని సంస్కారములు విధింపఁబడియే యున్నవని ముందే సూచించితిమి. ఐనఁ గొన్ని మతములయందు విస్తారముగ విధింపఁబడి యున్నయవి. ఆర్యజనములకు ముఖ్యముగఁ గొన్ని సంస్కారములు నియమింపఁ బడియున్నవి. ముఖ్యముగా గర్భసంస్కారములు అనఁగా జీవుఁడు ప్రతిజన్మమునందును మాతృగర్భమున నుండు కాలమునఁ జేయఁబడు సంస్కారములు వారియందు విస్తరింపఁబడి యాచరణమున నున్నవి గాని యితర మతములయం దంతగాఁ గానరావు.

హిందూమత గ్రంథములయందు సంస్కారములు పెక్కులు పేర్కొనఁబడియుండినను వానియందు ముఖ్యములయినవి యిందుదాహరింపఁబడు చున్నవి.

౧. గర్భాధానము	౬. అన్నప్రాశనము
౨. పుంసవనము	౭. చూడాకరణము
౩. సీమంతోన్నయనము	౮. ఉపనయనము
౪. జాతకర్మము	౯. సమావర్తనము
౫. నామకరణము	౧౦. వివాహము

ఇందు మొదటిమూఁడును గర్భపోషణ సంస్కారములు. మొదటిదగు గర్భాధానము జన్మించఁబోవు శిశువునకుఁ బ్రథమ సంస్కారము. స్త్రీపురుషులు కామమునకులోఁబడి యిష్టానుసారముగ భోగములలో విహరించుట వివాహము వలని యుద్దేశ్యము కాదు. గృహస్థు సత్ప్రజాభివృద్ధికొఱకు దేవతలను బ్రార్థించుచుఁ దదర్థబోధకములగు మంత్రముల నుచ్చరించుచుఁ గాలనియమములు దప్పక పర్వము మొదలగు నిషిద్ధ తిథులను విడిచి సుపుత్ర ప్రాప్తికై గర్భాధానము చేయుచున్నాఁడు. ఇక్కార్యము పరిశుద్ధమగు మనస్సుతో భగవంతుని ప్రతినిధియై ప్రజావృద్ధ్యర్థము మాత్రము చేయఁ బూనవలయును గాని విషయేచ్ఛతోఁ గ్రీడింపరాదు.

సర్వాత్మకో వాసుదేవః పురుష స్తు పురాతనః ।
ఇయం హి మూలప్రకృతి ర్లక్ష్మీ స్సర్వజగత్ప్రసూః ॥

పంచపంచాత్మతృప్త్యర్థం మైథునం క్రియతే తరామ్ ।
ఇయ మంబా జగద్ధాత్రీ పురుషోఽహం సదాశివః ॥
పంచవింశతి తత్త్వానాం ప్రీతయే మథ్యతేఽధునా ।
ఇతి మంత్రానుభావస్యో న్మథనా క్రియతే యది ॥
తా వుభౌ పుణ్యకర్మాణౌ న దోషో విద్యతే తయోః ।

(బ్రహ్మాండపురాణము)

జగత్సృష్టికిఁ బ్రకృతిపురుషులువలె స్త్రీపురుషులు సత్ప్రజాభివృద్ధికొఱకుఁ జేరువారలు. ఇట్టి భావముతోఁగూడి మనోవికారములఁ జెందక స్త్రీపురుషులు గూడినచో నుత్తమమగు జీవుఁడాకర్షింపఁబడి సత్ప్రజ యుత్పత్తియగుచున్నది. దీని నొక పరమధర్మముగా భావింపనగు.

ఇట్లు వర్తించు స్త్రీపురుషుల గర్భమునకువచ్చు శిశువునకు వలయు నన్నమయ ప్రాణమయకోశములు పెరుగుచుండును కావున మూఁడవ మాసమున గర్భమునను౦డు పిండమును బరిశుద్ధముగఁ జేయుటకును, బుంస్త్వము గలుగఁ జేయుటకును బుంసవనమను సంస్కారము మంత్రములతో జరుపఁబడును. ఆ పిదప నాలవమాసము గడువఁగా సీమంతోన్నయన మను సంస్కారము సమంత్రకముగ జరుపఁబడు. గర్భము సంరక్షించునట్లును, పీడాపరిహారము కొఱకును, గర్భమునఁ బెరుగుచుండు శిశువునకుఁ బరిశుద్ధమగు తేజస్సు గలుగుటకును, అన్నమయ ప్రాణమయకోశములను సన్యోన్యసామ

రస్యము గలిగి పరిశుద్ధచలనము గలుగునటుల నీ సంస్కార మొనరింపఁబడును. ఇమ్మూఁడును గర్భపోషణ సంస్కారములు. శిశువు గర్భమున వర్ధిల్లుచుండఁగాఁ దల్లి సాత్వికాహారములను గొనుచు మంచి శీలము గలిగియుండవలయును. భయక్రోధములకు నెడమీయక యుండునట్లామెను జక్కఁగ సంరక్షించవలయును. చుట్టుప్రక్కలనుండువారు పరుషవాక్యము లుచ్చరింపక క్రూరసంకల్పముల సంకల్పించక భయమును గలిగించు కార్యములు చేయక యుండవలయును. చుట్టుప్రక్కల నుండువారు, ముఖ్యముగ నామెభర్త, బరిశుద్ధ మనస్సు గలిగి యుండదగు. ఇట్లుండిన గర్భముననుండు శిశువు మంచి యారోగ్యమును, పరిశుద్ధ తేజస్సును గలిగి యుండును. ఈ ముఖ్యసంస్కారములు విడచిన కారణమున నిక్కాలమునఁ బుట్టు శిశువులయం దారోగ్యలోపము, తేజోబలహీనతయుఁ గనఁబడుచున్నయవి.

ఆవలి సంస్కారము జాతకర్మము. ఇది శిశువు భూపతనము కాఁగానే చేయఁబడునది. శిశువునకు దీర్ఘాయువు, సూక్ష్మబుద్ధి, జ్ఞానము కలుగునటులఁ బ్రార్థించుచు మంత్రములఁ బఠించుచు, సువర్ణముద్రికతో దధిమధుఘృతములను గలిపి మధుపర్కము తండ్రి శిశువున కిచ్చును. జాతకర్మహోమము సూతికాగృహమునకు దుష్టగణముల వలని బాధలఁ దొలఁగించి కాపాడును.

పదునొకండవ దివసంబునఁ జేయఁబడు సంస్కారము నామకరణ మనఁబడు. ఈ మూఁడింటిలో జాతకర్మము సకాలమున జరుపఁబడుట లేదు. నామకరణమైనను విధ్యుక్తముగా నెల్లరు జరుపుట కానము. బంధువులు రాకపోవుట మొదలగు కారణములచేత సకాలమున నామకరణము చేయక కాలము గడుపుట గలదు. అట్లుకాలమున జరిపిన సంస్కారము మంచిఫలము నీయఁజాలదు.

అయిదవ మాసముసఁగాని యా పిదప వత్సరాంతము లోపలఁగాని యన్నప్రాశన మనునది జరుపఁనగు. ఇదియును సమంత్రకముగ జరుపఁబడవలయును. ప్రప్రథమమున నన్నము, ఓషధుల రసము, శిశువు భక్షించునట్లు చేయుచు నీయోషధులసారము శిశువునకు సదా మంగళకర మగుగాఁక యని దేవతలను మంత్రములతోఁ బ్రార్థించుచు, మధురాహారమును బెట్టవలయును. వత్సరాంతమునఁగాని, మూఁడవ సంవత్సరమునఁగాని బ్రాహ్మణులకును, క్షత్రియుల కైదవ సంవత్సరమునందును, వైశ్యులకు సప్తమసంవత్సరమందును, చూడాకరణము చేయుట వాడుక. అనఁగా శిఖ యుంచవలయు. దీనితోడఁ గర్ణవేధనము చేయుటయు వాడుకగలదు. ఈ సంస్కారమువలన శిశువు దేహము సదా సంరక్షింపఁబడుచున్నది. మఱియును తలిదండ్రులనుండి వచ్చిన పాపపుంజ మీ సంస్కారములవలనఁ దొలఁగుచున్నది.

ఏవ మేవ శ్శమం యాతి బీజగర్భసముద్భవమ్ ।

(యాజ్ఞవల్క్యస్మృతి)

జాతకర్మము మొదలు కర్ణవేధాంతిముగల కర్మములు శైశవమునందు జరుఁపదగినవి. ఆపై సంస్కార ముపనయన సంస్కారము, దీనితో శిశువునకుఁ గౌమారావస్థ యారంభ మగు. అపుడు క్రీడాసక్తి వదలి విద్యాగ్రహణము చేయుటకు యత్నించు. ఉపనయనమనఁగా గురువు సమీపమున చేరుట యని యర్థము. దీనికి ప్రారంభము గురువునొద్ద గాయత్రీ మంత్రోపదేశమును పొందుట, ఆపైన యనుష్ఠించదగిన ధర్మ ముల సూచించు యజ్ఞసూత్రము (యజ్ఞ ఉపవీతము) మొద లగు చిహ్నములను స్వీకరించుటతోఁగూడిన సంస్కారము. ఇదియే ద్విజత్వమునకుఁ గారణము. వేదవేత్తయగు నాచా ర్యునిచే గాయత్రీమంత్రోపదేశమును బడయుటయే నిజమగు జన్మము. ఈ జన్మము జరామరణములు లేని జన్మము. అనఁగాఁ దల్లిగర్భమునుండి గలిగిన జన్మము జరామరణము లకు లోఁబడునది. వేదవేత్తయగు నాచార్యునివలన గాయ త్ర్యుపదేశమువలనఁ బొందఁబడిన యీ జన్మము నిజమైన దియు, జరామరణముల కతీతమైనదియు నగు.

కామా న్మాతా పితా చైనం య దుత్పాదయతో మిథః ।
సంభూతిం తస్య తాం విద్యా ద్యద్యోన్యా వభిజాయతే ॥

ఆచార్య స్త్వస్య యాం జాతిం విధివ ద్వేదపారగః ।
ఉత్పాదయతి సావిత్ర్యా సా సత్యాసాఽజరామరా ॥

(మనుస్మృతి)

[ఉపనయన మనఁగా నుత్తమోత్తమమగు గాయత్రి మంత్రోపదేశము ద్వారా వటువు ఆచార్యుని సమీపమునకుఁ దేఁబడుటయని యర్థము.] ఉపనయనమున వటువునకు మంత్రముల నుచ్చరించుట కధికారము గలుగు. ఉపనయనమునకు ముందుఁ జేయఁబడు సంస్కారములయం దితరులు మంత్రోచ్చారణము చేసి బాలుని శరీరమును సంస్కరింతురు. ఉపనయనము మొదలు బాలుఁడు తానే మంత్రముల నుచ్చరించుటకును, వేదముల స్వేచ్ఛగాఁ బఠించుటకును అధికారము నొందుచున్నాఁడు. ఇది మొదలు బాలుఁడు ఆచార్యుని యధీనుఁడై విద్యాభ్యాసము చేయుచు కాలము గడుపవలయు. ఈ స్థితియందు బాలుఁడు బ్రహ్మచారియనబడు. అనఁగా వేదములను బఠించుటయందే ప్రవర్తించువాఁడని యర్థము. బ్రహ్మచారి కౌపీనమును, మౌంజి, కృష్ణాజినము, జన్నిదము, దండము వీనిని ధరించవలయు. ఇవి యొక్కొక్కటియు బ్రహ్మచారిధర్మములను బోధించునవియై యున్నవి. కౌపీనధారి యగుటచేత నింద్రియవ్యాపారములయందు మనస్సు పోనీయక యుండఁదగుననియు, మౌంజిని తన నడుముచుట్టు మూఁడు చుట్లు చుట్టుటచే వేదములయందలి సంహిత, బ్రాహ్మణము,

ఉపలిపత్తులు వీనిఁ బఠించవలయు ననియును, కృష్ణాజినధార ణముచే విషయవాంఛలను వదలి వైరాగ్యముగలిగి యుండ వలయుననియు బోధించుచున్న యవి. యజ్ఞోపవీతము తంతు త్రయరూపము (మూఁడు పోఁగులు) గ నుండి యొకటిగ జుట్టఁబడియుండుటచేత బ్రహ్మాండమునందలి మూర్తిత్రయము, ఇచ్ఛాజ్ఞానక్రియలగు శక్తిత్రయము, సచ్చిదానందలక్షణ ములు, సత్త్వ రజస్తమస్సులను గుణత్రయము, మనోవాక్కా యికములగు కర్మత్రయము లోనగు త్రితయముల నన్నింటిని సూచించుచున్న యది. దండము వాగ్దండ మనోదండ కర్మ దండములను త్రిదండములను సూచించును, అనఁగా మనోవా క్చేష్టలను మూఁడింటిని నియమనము చేసికొనవలయునని బోధించును.

ఈ రీతిని గురుగృహమునందు విద్యాభ్యాసము చేయుచు సకల విద్యాపారగుఁడై గురుసాన్నిధ్యమునందు సద్గోష్ఠిచే సంస్కరింపఁబడి పరిశుద్ధుఁడై గురువునాజ్ఞనుబడసి ఆ పైని సమావర్తనమను సంస్కారమును బొంద నర్హుఁడగుచున్నాఁడు. అపుడు గురువునకు దక్షిణను గృతజ్ఞతాసూచకము నొసంగి తదనుజ్ఞవడసి స్నాతకుఁడగుచున్నాఁడు. ఆ మీఁది సంస్కా రము వివాహము.

వివాహమైనది మొదలు గృహస్థుఁడై, వైదిక కర్మముల నొనర్చుట కధికారియై, ఆ కర్మములవలన ఋణత్రయమును

బాపుకొనుచున్నాఁడు. వివాహ సంస్కారమును, గృహస్థువు చేయు సమస్తకర్మములును జీవుని బరిశుద్ధుని జేయుటకు సమర్థములై యున్నవి. వివాహము జీవునకు గర్భాధికారమును గలిగించుచుఁ బరిశుద్ధునిగఁ జేయు వైదికసంస్కారముగాని భోగార్థమును వేడుకకొఱకును జేయఁబడునది కాదు. అది మొదలు భార్యాభర్తలు గృహాధిపతులై వియోగమునొందక గృహస్థధర్మమును జరుపుచు గురుశిష్యన్యాయమున నన్యోన్యానురాగముగలవారై అన్యోన్య సహకారులై పరిశుద్ధులై పరిపూర్ణులగుటకు విధింపఁబడినది వివాహము. మఱియు గృహమునందు జాయాపతులు సదయహృదయులై గృహము నాశ్రయించియుండు నెల్లభూతములకు సుఖప్రదాతలగుచు, ధర్మమును బరిపాలించుచు నుత్తములగు పుత్త్రపుత్త్రికలను గని వారలను సన్మార్గమున శిక్షించి పెద్దవారలఁజేసి సంప్రదాయమును దప్పక యుండునటుల ధర్మమును బ్రవర్తింపఁ జేయవలయును. భార్యాభర్తలు ఇరువురును జ్ఞానముగలిగి ధర్మజ్ఞులై ధర్మము నించుకయైన నతిక్రమించకయుండుటచే నట్టివారి గర్భమున నుత్తములగు జీవులు జననమొందుదురు. అట్లుగాక స్త్రీ పురుషులు కేవలకాముకులై, ఇంద్రియారాములై, ధర్మము నతిక్రమించి వర్తించుచుండినచో సత్సంతానము గలుగఁజాలదు. క్రమక్రమమున నావంశమున నజ్ఞులగు జీవులు జన్మించుటవలన నధర్మము వృద్ధియగుటకుం గారణ

మగు. బ్రాహ్మణులు విద్యావిహీనులు జ్ఞానహీనులు నగు టయు క్షత్రియులు తేజోహీనులును బలహీనులును సాహస వర్జితులు నగుటయు, వైశ్యశూద్రులు తమ తమ వ్యాపార ములయందు నేర్పరులు కాకపోవుటయు వివాహసంస్కారము వలని యుత్తమప్రయోజనము గమనించక పోవుటవలననే కలిగినవని దృఢముగఁ జెప్పనగు. ఎల్లవారును వివాహము ధర్మసాధనముగ నెఱింగి గృహస్థధర్మమును యథాశాస్త్ర ముగ జరిపినచోఁ దాము కృతార్థులగుటయుకాక జ్ఞానవంతు లును, తేజోవంతులును, ప్రాగల్భ్యము గలవారును, సూక్ష్మ బుద్ధులును నగు జీవులకుఁ దగిన శరీరముల నుత్పత్తిచేయఁదగి తమ దేశమునకును, లోకమునకును, విశేషముగ మేలు గలుగఁజేయఁదగిన వారగుదురు.

ఆప్త సంస్కారములలో ముఖ్యమైనది మరణానంతర క్రియ. ఆ క్రియలు జీవుని శరీరమునుండి సుఖముగ వెడలిం చుటకును, సుకరముగ ప్రేతత్వము దొలగించి పితృలోక గతు నిగఁ జేయుటకును గాలక్రమమునఁ బితృలోకమునుండి స్వర్గ లోకప్రాప్తునిగఁ జేయుటకును సమర్థములయినవి. ఈ విష యము ప్రాగుక్తమే కాఁబట్టి యిచ్చట సంక్షేపముగ వ్రాయఁ బడెను.

ఇట్లు సనాతనధర్మశాస్త్రమున గర్భోత్పత్తి మొదలా మరణము నానావిధ సంస్కారములచే జీవుఁడు ప్రతిజన్మమునఁ

బరిశుద్ధుఁడగునట్లు విధింపఁబడి యున్నది. ఈ సంస్కారము లన్నియు నుపాధులను బరిశుద్ధముచేయుట ద్వారా జీవుని గృతార్థుని జేయఁదగియున్నవి.

యజ్ఞములు

ప్రపంచమునందుఁగల చేతనరాశియంతయు నైదుగణము లుగ భాగింపఁదగు. ఎట్లనిన, దేవతలనియు, ఋషులనియు, పితృదేవతలనియు, మనుష్యులనియు, నితరభూతకోటియనియు నైదు గణములుగ నున్నయవి. జీవుఁడు పాంచభౌతికమగు ప్రపంచమున బ్రవేశించి యనేకకోటి జన్మములనెత్తి మానవ జన్మమును బొంది సంసారచక్రమునందుఁ బరిభ్రమించు కాల మంతయు నీయైదు గణములకు నానావిధములైన ఋణములకు లోనై యున్నవాఁడు. ప్రతిజన్మమునందును దనకుఁగలుగు స్థూలశరీరమునకుఁ గారణభూతులగు తల్లిదండ్రులు మొదలగు పెద్దలకును, మనుష్యజన్మము రాకపూర్వమును వచ్చిన వెను కను బహుకాలము తన స్థూలసూక్ష్మోపాధులను నిర్మించుచు వాని నభివృద్ధిచేయుచునుండు సోమసదులు నగ్నిష్వాత్తులు బర్హిషదులు హవిర్భుక్కులు లోనగు పితృదేవతలకును ఋణ స్థుఁడై యున్నవాఁడు. మఱియుఁ బ్రపంచస్థితిని బహువిధము లుగ వృద్ధిచేసి ప్రజాసౌఖ్యము కొఱకుఁ బాటుపడిన పూర్వు లందఱును గృతజ్ఞతకుఁ బాత్రులగుచున్నవారు. అనఁగా

లోకముఁ వాసయోగ్యములు కాని యరణ్యక్షేత్రములను జక్కఁజేసి పట్టణగ్రామముల నిర్మించి వాసయోగ్యములుగఁ జేసినవారును, బాటసారుల యుపయోగముకొఱకు రాజమార్గములను నిర్మించి గమనసౌకర్యమును గల్గించినవారును, గ్రామములందును రాజమార్గముల చెంతను జనోపయోగముకొఱకు వాపీతటాకములను సత్రములను నేర్పఱచిన పుణ్యాత్ములును, పాంథుల యలజడినిదీర్చి విశ్రాంతిసుఖమునొసఁగ రాజమార్గముల ప్రక్కన ఛాయావృక్షపఙ్క్తులను నాటి యభివృద్ధిచేసిన సత్పురుషులును, ధూమశకట తంత్రీవార్తాయంత్రముల నిర్మించి యుపకారము నొనర్చిన మహనీయులును, పాఠశాలలు వైద్యశాలలు దేవాలయములు మొదలగువానిని నిర్మించి ప్రజలకు శాశ్వతమగు మేలుచేసినవారును, నానావిధములగు శిల్పవిద్యలను గల్పించి యభివృద్ధినొందించి తమ వెనుకటివారలకుఁ బరంపరగా విచిత్రకార్యరచనా చమత్కృతిని గలుగఁజేసిన మహోపకారులును, కృషి వాణిజ్యముల యభివృద్ధికొఱకుఁ బాటుపడినవారును, వేయేల తమ వెనుకటివారలకు సర్వవిధముల నైహికసుఖముల నొసంగుటకుఁ బాటుపడినవారునునగు నందఱకును బ్రతిమానవుఁడును ఋణస్థుఁడై యున్నవాఁడు. ఇది పితృఋణ మనఁబడుచున్నది.

లోకములను బరిపాలించుచుఁ గాలానుగుణముగ వృష్టి, తుషారము (మంచు), గాలి, వేఁడిమి నిచ్చి సస్యములను,

ఓషధివనస్పతులను రక్షించి వృద్ధిచేయుచు, లోకులకు గర్మానుసారముగ ఫలముల నిచ్చుచు, నానావిధముల జనులకు మేలుచేయు నదృశ్యములగు దేవగణములకును మానవులు ఋణము తీర్పవలసినవారగుచున్నవారు. ఇది దేవ ఋణము.

మఱియు నాదినుండి పామరుల నుద్ధరించుటకు స్మృతులు, ధర్మశాస్త్రములు, పురాణములు లోనగు శాస్త్ర గ్రంథముల నపారకరుణచే రచించి బోధించి సంప్రదాయమును పరంపరగ ప్రవర్తింపఁజేసిన మహర్షులును, కాలక్రమమున నా యుత్తమజ్ఞానము నశింపకయుండునట్లు గాపాడి లోకుల కుపదేశించుచుఁ గాలవశమున నంతరించిన ధర్మములను బునరుద్ధారణము చేయుచుఁ గాలానుసారముగను ప్రజల యోగ్యతానుసారముగను సనాతన ధర్మములను బోధకములగునటుల నవీనమార్గముల వివరించి గ్రంథముల రచించి లోకమునందలి ప్రజలకెల్లరకు జ్ఞానదాతలగు మహనీయులకును మనము ఋణస్థులమగుచున్నారము. ఇది ఋషిఋణము.

ఇవి మూడును ఋణత్రయమని శ్రుతులయందు నిరూపింపఁబడి యున్నది. ఈ ఋణత్రయమును బాపుకొనుట ప్రతిమానవునకు ప్రథమకర్తవ్యమని శ్రుతి బోధించుచున్నయది.

ఇవికాక యేకాలమునందుఁగాని మానవుల కన్యోన్య సహాయములేక సుఖ మెంతమాత్రము సిద్ధింపదు. కావున

నొక్కొక్కఁడును మానవకోటికి సప్వదీర్పవలసినవాఁడే యగుచున్నాఁడు. ఇది మనుష్య ఋణము.

ఇంతియ గాదు. బహువిధములగు పశు పక్ష్యాదులు సహితము మానవులకు సుఖము నొనఁగూర్చుచున్నవి. గోవులు మొదలగు జంతువులు దధిక్షీరఘృతంబుల నొసంగుటచేతను, వృషభములు అశ్వములు లోనగునవి ప్రయాణములందును, గృషియందును సహాకారములుగ నుండుటచేతను, హేయములగు ననేకజంతువులు సహితము భూమియందలి ముఱికిని దొలఁగించుటచేతను, మత్స్యములు మొదలగునవి బహువిధముల జలములను బరిశుద్ధము చేయుటచేతను, పక్షులు వృక్షములయందలి ఫలములను దిని బీజములను బహుప్రదేశముల వెదజల్లుటవలన వృక్షోత్పత్తిని జేయుటచేతను, మధుర స్వరములచేతను నివి యన్నియు మనుష్యుల ఋణగ్రస్తులనుగఁ జేయుచున్నవియే. ఇది భూత ఋణము.

ఇట్లు ప్రతిమానవునకును అయిదువిధములగు ఋణములు సంసారమునుండి తరించి సన్న్యాసియగువఱకును వెంటనంటియే వచ్చును. ఈ ఋణవిముక్తికొఱకు నైదువిధములగు యజ్ఞములు విధింపఁబడి యున్నయవి. ఇవియే పంచమహాయజ్ఞములని యెఱుంగఁబడుచున్నయవి. ఇవి నిత్యకృత్యములు, అనఁగాఁ బ్రతిదినమును జేయఁదగినవి. ౧. బ్రహ్మయజ్ఞము లేక

వేదయజ్ఞము. ౨. దేవయజ్ఞము. ౩. పితృయజ్ఞము.
౪. మనుష్యయజ్ఞము. ౫. భూతయజ్ఞము.

ఋషయః పితరో దేవా భూతా న్యతిథయ స్తథా ।
ఆశాసతే కుటుంబిభ్య స్తేభ్యః కార్యం విజానతా ॥
స్వాధ్యాయే నార్చయేత ర్షీ& హోమై ర్దేవా న్యథావిధి ।
పితౄ& శ్రాద్ధేన నౄనన్నై ర్భూతాని బలికర్మణా ॥

(మనుస్మృతి)

తా. మునులు, పితృదేవతలు, దేవతలు, భూతములు, అతిథులు గృహస్థులకొఱకు ఆశీర్వచనములను జేయుచుందురు. అనఁగా మేలుకోరుచుందురనుట. జ్ఞానియగువాఁడు వారి ఋణమును తీర్చుకొనవలయును. ఎట్లనఁగా వేదపఠనముచేత ఋషులను, హోమములచే దేవతలను, శ్రాద్ధము లొనరించుటచేతఁ బితరులను, అన్నదానమున మనుష్యులను, బలిదానంబున భూతంబులను దృప్తిచేయవలయు నని తాత్పర్యము.

బ్రహ్మయజ్ఞము

"స్వాధ్యాయేనార్చయేతర్షీ&"; "అధ్యాపనం బ్రహ్మయజ్ఞః," అను స్మృతివాక్యములవలన బ్రహ్మయజ్ఞ మనఁగా వేదశాస్త్రములను విధ్యుక్తముగాఁ బఠించుటయు, నితరుల కుపదేశించుటయు నని స్పష్టమగుచున్నయది. సనాతనములగు వేదములవలని మహోపకారమును వివరింపవలసినది లేదు కదా!

మహనీయులగు ఋషులును పామరజనోద్ధారణార్థము స్మృతులను ధర్మశాస్త్రములను బరతత్త్వబోధకము లగు సూత్రములను భాష్యములను నేర్పఱచి జనులకు మహోపకారమును జేసియున్నారు. వారికి మనము ప్రత్యుపకృతిగాఁ జేయునది యొక్కటియును లేదు. కల్పాంతముదాఁక జనుల యోగక్షేమముల గోరుటయే కాని వారికి స్వార్థ మొక్కటి యును లేదు. వారు ప్రతిపాదించిన జ్ఞానము నశింపకుండునట్లు తామభ్యసించుటయు, నభ్యసించిన దానిని ఇతరులకు బోధించుటవినా వారి ఋణమును దీర్చుమార్గము వేఱుగ లేదు. కావున గురువు శిష్యుల కనుజ్ఞ యిచ్చి పంపునప్పుడు సంప్రదాయ ప్రవచనమున నప్రమత్తుఁడై యుండునట్లు లాజ్ఞాపించి పంపుట యాదినుండి సంప్రదాయముగ నేర్పడియున్నది.

స్వాధ్యాయ ప్రవచనాభ్యాం నప్రమదితవ్యమ్ ॥

(తైత్తిరీయోపనిషత్. ౧-౧౧-౧)

ఎల్లవారును దాము వేదములను, వేదరహస్యములను బోధించు వేదాంతగ్రంథములను బఠించుటయు, వానియందు బోధింపఁబడియుండు విషయముల నభ్యసించుటయు, నాధర్మముల నితరులకు బోధించి ధర్మముల ననుష్ఠించునట్లు చేయుటయు, వీనిరూపముగ సనాతనములగు ధర్మముల గాపాడుటయు నీ మొదలగునవియే జ్ఞానదాతలగు మహర్షుల ఋణమును దీర్చుకొను మార్గములు. దినదినము మధ్యాహ్నకాల

మున నాలుగైదు వేదమంత్రములఁ బఠించి యుదకముల విడిచిన మాత్రమున బ్రహ్మయజ్ఞము పూర్తియాయె ననుకొనఁ గూడదు. మఱియు బ్రహ్మయజ్ఞమన అధ్యయనము. అధ్యాపనము అని నపుడు కేవలము సంహితలు మాత్రము పఠించుట చాలదు. వేదరహస్యములగు వేదాంతార్థ ప్రతిపాదకములగు నుపనిషత్తులును, భాష్యములును, సూత్రములును మొదలగు గ్రంథములంగూడ గ్రహింపవలయు నని ప్రాజ్ఞులగువారి యభిప్రాయము. ఈ రీతిని జ్ఞానమును బోధించు గ్రంథములఁ జదువుటవలనను, జదివినవిషయముల నభ్యసించుట వలనను, ఇతరులకు బోధించుటవలనను, జనుల జ్ఞానవృద్ధికొఱకు పాటుపడిన మహర్షుల ఋణమును దీర్చికొనఁజాలుదు గాని వేఱు విధముల గాదు. ఇదియ బ్రహ్మయజ్ఞము. దీనికంగముగఁ జేయఁబడునవి దేవర్షి పితృతర్పణములు.

పితృయజ్ఞము

"పితృయజ్ఞస్తు తర్పణమ్" "పితౄన్ శ్రాద్ధేన చార్చయేత్"; "ప్రజాయా పితౄన్" అను వాక్యములచే పితృఋణము తీర్చికొను మార్గములు విధింపఁబడియున్నయవి. పితృదేవతలు ఆదినుండి ప్రజావృద్ధికొఱకును, ప్రజాక్షేమము కొఱకును, పాటుపడి ధర్మముల నడిపి లోకము నభివృద్ధిచేసిన వారలు. ప్రతిమానవుఁడును మానవకోటిసౌఖ్యము కొఱకు

పాటుబడుచు, ధర్మకార్యములఁ జేయుచు, తాను ప్రారంభించిన ధర్మకార్యముల నెఱవేర్చుటకును, కొనసాగించుటకును, అభివృద్ధి చేయుటకును దగిన సత్ప్రజ నుత్పత్తిచేయుచుఁ బితరులఋణములఁ దీర్చుకొనవలయును. దీనికై వివాహము చేసికొనుటయు, భార్యాభర్తలు యథావిధి గృహస్థధర్మము నడుపుచు, భక్తిజ్ఞానముల నభ్యసించుచు, ధర్మస్వరూపులగుచు, ఉత్తములగు జీవులఁ దమగర్భమున జన్మించుటకుఁ దగిన మార్గమున నడచుచు వర్తించవలెను. తమ పూర్వులారంభించిన సత్కార్యమును శ్రద్ధతోడ కొనసాగించి వారల మనోభీష్టములఁ దీర్చుచు, వారల మరణానంతరము నందును వారలఁ దృప్తులం జేయుచురావలెను. అట్లు వారలకు మరణానంతర క్రియలు సలిపి ఊర్ధ్వలోకయాత్రకుఁదగిన యుత్తరక్రియలు చేసి సుఖముగఁ బితృలోకప్రాప్తియు, తదనంతరము క్రమమున స్వర్గలోకప్రాప్తియుఁ గలుగునటుల శ్రాద్ధక్రియలు జరుపవలెను. నిత్యమును బితరుల నుద్దేశించి వారలకుఁ బరలోకసుఖప్రాప్తి సాధనముగఁ దర్పణములను నైమిత్తికములగు మాసికాబ్దికములగు శ్రాద్ధములఁ జేయు సత్ప్రజను గనుచు రావలయు. ఈ రీతిఁగాని పితృఋణము తీరదు.

దేవయజ్ఞము

దేవఋణము : "హోమైర్దేవాన్యథావిధి" హోమములవలన దేవతల నర్చింపవలయును. గృహస్థధర్మము ప్రారం

భించినది మొదలు జీవుఁడు వైదికకర్మముల నొనర్చుట కర్హుఁడగు. వివాహకాలమున స్వీకరించిన యగ్నులను గృహమున వేల్చుచు గృహమేధి యగుచున్నాఁడు. నిత్యమును సర్వదేవతలకుం బ్రతినిధియగు నగ్నిదేవునియందు హోమము సలిపి దేవతలం దృప్తులుగఁ జేయు. అగ్నియందు వేల్పఁబడిన హోమద్రవ్యము తప్తమై సూక్ష్మరూపముగ మాఱి యదృశ్యులగు దేవతల కాహారమగుచున్నయది. కావున నే యగ్నికి దేవముఖుఁ డనియును, దేవతలకు బర్హిర్ముఖులనియును నామములు గలవు. హోమము చేయఁబడిన ద్రవ్యముచేత దేవతలు దృప్తులయి సకాలమున వర్షము మంచు మొదలగు వాని నిచ్చి సస్యములు మొదలగువానిని వృద్ధిచేయుదురు. దేవతల యనుగ్రహముచేఁ గాని సకాలమున వలయునంత వర్షములు మొదలగునవి గలుగవు. వారి యనుగ్రహము లేనిచోఁ గొన్నికాలముల నతివృష్టియు, మఱికొన్నికాలముల ననావృష్టియు, కొన్నివేళల నతిక్రూరములగు తాపములు, కొన్నివేళల వలయునంత సూర్యరశ్మి లేకపోవుటయు, నొక కొన్నిసమయముల ఝంఝామారుతము వీచుటయు, మఱొక కాలమున గాలిలేకపోవుటయు నీమొదలగునట్టి యీతిబాధలు కలుగుచుండును. ఇక్కాలమున దేవతాప్రీతికరములగు హోమములు యజ్ఞములు విధ్యుక్తప్రకారమునఁ జేయుట యరుదగుటంబట్టియే లోకమున నానావిధములగు క్షోభలు

గానవచ్చుచున్నవి. దేవతలం దృప్తులంజేయు కార్యములచేఁ బ్రజాక్షేమమును, ప్రజాభివృద్ధియును గలుగునని భగవంతుఁడు గీతాశాస్త్రమునందు బోధించియున్నాఁడు.

సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।
అనేన ప్రసవిష్యధ్వ మేష వోఽస్త్విష్టకామధుక్ ॥

దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః ।
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।
తైర్దత్తానప్రదాయైభ్యో యో భుఙ్క్తే స్తేన ఏవ సః ॥

(భగవద్గీత. ౩-౧౦, ౧౨)

"ప్రజలను సృజించుకాలమున వారితోడ యజ్ఞములను గూడ సృజించి యీ యజ్ఞములవలన మీరు వృద్ధినొందుదురు గాకయని బ్రహ్మదేవుఁ డాదియందే పలికెను. దేవతలు యజ్ఞములచే దృప్తులయి మిమ్ముఁ దృప్తిఁజేయుదురు. పరస్పరము తృప్తులయి పరమశ్రేయమును బొందుదురు గాక! దేవతలు యజ్ఞములచేఁ దృప్తులై యిష్టభోగముల నిచ్చెదరు. వారల వలనఁ బొందిన భోగములలో నొకభాగము నా దేవతలకు నర్పింపక సర్వమును భుజించువాఁడు దొంగతో సమానుఁడు" అని తాత్పర్యము.

కావున దేవతానుకూల్యము లేక లోకమున సస్యములు మొదలగునవి యభివృద్ధి నొందజాలవు. దేవతలు సకలభోగముల నిచ్చువారలు గావున నిత్యనైమిత్తికములగు యజ్ఞములను జేయుటచే దేవతల ఋణమును దీర్పవలయును.

గృహస్థువు దినదినమునఁ జేయు నౌపాసనము, వైశ్వదేవము లోనగు హోమములు నిత్యకర్మములుగ విధింపఁబడినవి. ఇవి కామ్యకర్మములు కావు. ఇవిగాక మఱికొన్ని యజ్ఞములు, జ్యోతిష్టోమము లోనగునవి శ్రౌతయజ్ఞములని యెఱుంగఁబడుచున్నవి. వానిని గుఱించి ముందు విస్తరింపఁబడును.

ఇవియునుంగాక శ్రీభగవద్గీతాశాస్త్రమున నాల్గవయధ్యాయమున శ్రీ కృష్ణుఁడు పెక్కు యజ్ఞములను సూచించియున్నాఁడు. అందుఁ బ్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, నియతాహారము, స్వాధ్యాయము, జ్ఞానయజ్ఞము, ద్రవ్యయజ్ఞము, తపస్సు మొదలగునవి యన్నియుఁ జెప్పఁబడియున్నవి.

> ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణోముఖే ॥
> (గీత. ౪-౩౨)
>
> సర్వే ప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్షపితకల్మషాః ॥
> (గీత. ౪-౩౦)
>
> యజ్ఞశిష్టాశిన స్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ॥
> (గీత. ౩-౧-౩)

ఇవి యన్నియు శ్రుతిచోదితములైన యజ్ఞములేయని యును, ఈ యజ్ఞములం జేయుటచేత సమస్త పాపములనుండి విడువఁబడుదురనియు నొక్కి చెప్పియున్నారు. వీని యన్నిం టిలో జ్ఞానయజ్ఞము శ్రేష్ఠమనియును బోధించియున్నారు. తక్కిన యజ్ఞములన్నియు నల్పఫలముల నిచ్చునవియేగాని శాశ్వతమగు పరమపురుషార్థము నిచ్చునవిగావు. ఇవ్విష యము ముండకోపనిషత్తునందు స్పష్టముగ నిరూపింపఁబడి యున్నది. అందనేక క్రతువులను సూచించి వాని ఫలము లను జూపి, యా పిదప నాఫలములన్నియు నల్పములే యని వివరింపఁబడియున్నది.

> ప్లవా హ్యేతే అదృఢా యజ్ఞరూపా ।
> అష్టాదశోక్త మవరం యేషుకర్మ ॥ (ముండకము)
>
> శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।
> సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥ (గీత. ౪-౩౩)

ఈ యజ్ఞములవలనఁ గలుగు ఫలములు దృఢములు గాని తెప్పకొయ్యలతో సమానములు. అల్పఫలముల నిచ్చునవి. ద్రవ్యసాధ్యములగు యజ్ఞములకంటె జ్ఞానయజ్ఞము శ్రేష్ఠ ము. కర్మములన్నియును జ్ఞానమునందు పరిసమాప్తి చెందును.

జ్ఞానయజ్ఞము సంసారసముద్రమును దరించుటకు దృఢ మైన నావతో సమానము. ఇట్లు మూఁడువిధములగు యజ్ఞ ములను జేయుటవలన దేవర్షి పితృ ఋణములు దీరును.

మనుష్యయజ్ఞము

ప్రతిమానవుఁడును మానవకోటికి ఋణస్థుఁడై యున్న వాఁడని ముందే సూచించితిమి. మానవులందఱును అన్యోన్య సహాయములేక లోకమున జీవించుటయే యసాధ్యమైయుండ సుఖముగ నుండుట యసాధ్యమని చెప్పవలయునా ? ఇంతియ కాదు. మానవులును సమస్తభూతములును జగదేకపితయగు నీశ్వరునుండియే వెలువడిరనియు నా యీశ్వరుని విరాడ్రూప మునందలి యవయవము లన్యోన్య సహకారులై వర్తించు నటుల మానవులెల్ల ఇతరుల సుఖముకొఱకుఁ బాటుపడి పరస్పర ఋణములఁ దీర్చుకొనవలయుననియు యోగదృష్టి గల మహర్షులు విధించియున్నారు. "నృయజ్ఞోఽతిథిపూజనమ్" "నౄనన్నై రర్చయేత్" అనువాక్యములు మానవ కోటికిం గల ఋణముఁ దీర్చుకొనమార్గముల విధించుచున్న యవి. మనుష్యయజ్ఞమన నతిథిపూజనము. అతిథియన భోజనసమయమున నన్నార్థియై వచ్చిన మనుష్యుఁడు.

> ఇష్టో వా యది వా ద్వేష్యో మూర్ఖః పండిత ఏవ వా ।
> సంప్రాప్తో వైశ్వదేవాంతే సోఽతిథి స్స్వర్గసంక్రమః ॥

తా. మిత్రుఁడుగాని శత్రువుగాని మూర్ఖుఁడుగాని విద్వాంసుఁడుగాని వైశ్వదేవము కడపట వచ్చినవాఁడు స్వర్గసుఖము నీజాలును అని అన్నార్థులయి వచ్చు బీదలనందఱిని సోదరులుగ భావించి వారి కన్నదానము చేయఁదగు. దూరదేశము

నుండి మార్గము నడిచి శ్రమచెంది భోజనసమయమునకు వచ్చి చేరు మనుష్యుఁడు ముఖ్యముగఁ బూజ్యుఁడు. అట్టివాఁడే యతిథి యని యెఱుంగఁదగు. ముందువచ్చినవాఁడు గాదు.

దూరాధ్వోపగతం శ్రాంతం వైశ్వదేవ ఉపస్థితమ్ ।
అతిథిం తం విజానీయా న్నాతిథిః పూర్వమాగతః ॥

అట్టి పురుషుఁడుగాని, స్త్రీగాని ప్రత్యక్షపరమేశ్వరస్వరూపముగ భావింపఁదగును. అట్టి మనుష్యుని కులగోత్రములు సయితము విచారింప నక్కఱ లేదు.

న పృచ్ఛే ద్గోత్రచరణే న స్వాధ్యాయం శ్రుతం తథా ।
హృదయే కల్పయే దేవం సర్వదేవమయో హి సః ॥

"అన్నస్య క్షుధితం పాత్రమ్" అను పురాణోక్తి యెల్లరకుఁ దెలిసినదియే. తెలియఁదగినదియే. అట్లు ఇల్లుజేరిన యతిథిని ముందు పూజించి, ఉదకములిచ్చి, యాసనమునఁ గూర్చుండఁబెట్టి, ఆదరముతోడ మృదుమధురోక్తులఁ గుశల మడిగి, అన్నోదకముల నిచ్చి తృప్తునింజేసి పనుపఁదగు. ఇట్లొకరిని బూజించిన మానవకోటిని బూజించి తృప్తి జెందించి నట్లయగు. అన్నోదకము లీయవలయు నన్నఁ వచ్చినవాని కావశ్యకములగు నవియన్నియు నీయఁదగినవని గ్రాహ్యము. అనఁగా నన్నోదకములు మాత్ర మిచ్చినం జాలు ననుకొనరాదు. వస్త్రహీనుఁడై యుండిన యథాశక్తిగ

వస్త్రదానము చేయఁదగు. ఒకవేళ రోగార్తుఁడై యుండినచో నౌషధమునిచ్చి యుపచరించి పంపఁదగును. కేవల మావశ్యకములనఁదగు వాంఛలన్నియుఁ దీర్చి పంపఁదగునని యర్థము.

ఇట్లతిథిసత్కారము పంచమహాయజ్ఞములలో నొక్కటిగఁ జెప్పఁబడి యుండుటయేగాక అన్నిటిలో శ్రేష్ఠమనిగూడ నెన్నఁబడుచున్నది.

> స్వాధ్యాయే నాగ్నిహోత్రేణ యజ్ఞేన తపసా తథా ।
> న చా ప్నోతి గృహీ లోకాన్ యథా త్వతిథిపూజనాత్ ॥

ఇందు వర్ణభేదములుగాని, ఆశ్రమభేదములుగాని చూడ నవసరము లేకపోవుటయేగాక నిజముగ ఆఁకలిగొని దూరాధ్వగుఁడై వచ్చినవాఁడు అంత్యజుఁడైనను, పంచమహాపాతకులలో నొకఁడైననుగూడ నాదరింపఁదగినవాఁడని స్మృతులయందు దృఢముగ జెప్పఁబడియున్నది.

> పాపో వా యది చండాలో విప్రఘ్నః పితృఘాతుకః ।
> వైశ్వదేవే తు సంప్రాప్తే సోఽతిథి స్స్వర్గసంక్రమః ॥

ఇవ్విధమగు నతిథిపూజనము సోమయాగము మొదలగు వానితో సమానమనియు, నిక్కాలమునఁ దఱచుగ యోగ్యత చాలని ఋత్విక్కులు మొదలగు వారిని గొని విధిహీనముగను, మంత్రహీనముగను జాలినంత యన్నదానము లేకయు విధ్యుక్త దక్షిణల నీయకయుఁ జేయఁబడు యజ్ఞములకంటెను, పంచమహాయజ్ఞములు, వానిలో ముఖ్యముగ నతిథిపూజయే,

శ్రేష్ఠమనియును స్మృతులయందు స్పష్టముగఁ బ్రకటింపఁబడి యున్నది.

యత్ఫలం సోమయాగేన ప్రాప్నోతి ధనవాన్ ద్విజః ।
సమ్యక్పంచమహాయజ్ఞైర్దరిద్ర స్తద వాప్నుయాత్ ॥

ఈ సందర్భమున నొక్కవిషయము ముఖ్యముగ యోచింపఁదగియున్నది. దూరమునుండి వచ్చి యన్నార్థియగువాఁడు పూజ్యుఁడగు నతిథియని స్మృతులయందు నిరూపింపఁబడి యున్నది. ముందుగ నాహ్వానము చేయఁబడిన సత్పురుషుఁడు సయితము పూజ్యుఁడగు. అట్లు గాక

నైకగ్రామీణ మతిథిం సంగృహ్ణీత కదాచన ।
అనిత్యమాగతో యస్మాత్తస్మా దతిథిరుచ్యతే ॥

ముందు పిలువఁబడకయు, దూరమునుండి మార్గవశమున రాకయు, గ్రామమునందే యుండియు, దార్ఢ్యము గలిగియుండియు నుదరపోషణమునకైనను బనిచేయనొల్లక వృథాకాలయాపనము చేయుచు, గర్హ్యములగు వృత్తులం గాలముఁగడపుచు సోమరులై భోజనసమయమునకుఁ జక్కఁగ వచ్చి యతిథిపూజన మపేక్షింప, నట్టివారు పూజ్యులని వారినిఁ బూజించినచో, జను లనేకులు స్వధర్మచ్యుతినొంది భూభారహేతువులగుదురు. మఱియు యుక్తాయుక్తవిచారణము లేక దానములు సేయుటచేత నీదేశమునఁ బలువురు గృహస్థులుగ నుండియుఁ దమ కుటుంబపోషణమునకైనను బాటుపడరు.

కాలక్రమమున నిట్లు పెక్కండ్రు బ్రాహ్మణు లధ్యయనాధ్యాపనాదికర్మములను విడిచి శమదమాదిగుణసంపత్తియుఁ బరోపకారబుద్ధియు లేక గృహస్థవృత్తిని మాని భిక్షాటనము సలుపుదురు. దానంజేసియే యిప్పుడును బ్రాహ్మణవృత్తియన భిక్షాటనమని యనేకులచే నెన్నఁబడుచున్నది.

బ్రాహ్మణులు శాస్త్రీయమగు తమ వృత్తులను వదలి యాచించుచుండుటయు, మఱికొందఱు క్షత్రియులమనిపించుకొనుచు వందిమాగధులవలె నితరుల స్తుతిచేయుటయే తప్ప వేఱు వృత్తి లేక కుటుంబపోషణముకొఱ కితరుల నాశ్రయించియుండుటయు, వైశ్యశూద్రప్రముఖులగువా రనేకులు బిచ్చమెత్తుటయే వృత్తిగ నెన్నుటయు నీమొదలగు నధర్మ వ్యాపారములు కారణములుగా నీదేశము దురవస్థకు వచ్చెను. ఈ విషయమును దేశాభిమానులందఱును జక్కఁగఁ బరిశీలించి యన్నాది సమస్తదానములయందు యుక్తాయుక్త వివేచనము చేయందగు. అట్టి వివేచనము లేని దానమున సోమరితనము వర్ధిల్లును. కావున వారలయందుండు తమోగుణమును బోఁగొట్టి యుద్యోగవంతులుగఁ జేయుట వారికి నుత్తమమగు లాభముచేయుటయే గాని వేఱుగాదు. అట్టివారికి యుక్తమగు సాయము చేయుచు, నుదరపోషణసామర్థ్యముగూడ లేని యంగహీనులు రోగపీడితులు, అనాథలు లోనగువారికి వలయు సహాయము చేయుచు, దయార్ద్రహృదయులై,

దేశాభిమానులై, పరోపకారతత్పరులై, మనుష్య యజ్ఞమును జక్కఁగ జరుపవలయును.

భూతయజ్ఞము

"భూతాని బలికర్మణా" "బలిర్భూతేభ్యః" అను వాక్యములు భూతముల ఋణము తీర్చుకొను మార్గముల జూపుచున్న యవి. పశుపక్ష్యాదులు సహితము మానవకోటికుపయుక్తములుగ నున్నవనియును, సర్వభూతములు నాత్మస్వరూపములే యనియు, నాత్మేతరపదార్థమొక్కటియుఁ గానరాదనియును బెక్కుమాఱులు నిరూపింపఁబడియెఁ గదా! అట్టి సర్వభూతములతో నైక్యభావమును దృఢముగ మానవులకుఁ గల్గించి భూతతృప్తి చేయుటకొఱకు బలిప్రదానమును సర్వజ్ఞులగు మహర్షులు విధించియున్నవారు. పక్వమయిన యన్నమును ఇంటిచుట్టును నలుదిక్కుల నుంచవలయును. దీనివలన నింటిచుట్టును దిరుగుచుండు హీనజాతిజనులకును, శునక, వాయస, క్రిమి, కీటకాది సమస్తభూతములకు నుపయుక్తమగును.

శునాం చ పతితానాం చ శ్వపచాం పాపరోగిణామ్ ।
వాయసానాం క్రిమిణాం చ శనకైర్నిర్వపేద్భువి ॥

(మనుస్మృతి)

కుక్కలు, చండాలురు, శ్వపచులు, (కుక్కమాంసమును భక్షించు పరమహీనజాతులు), పూర్వపాపములవలనఁ బెద్ద

రోగముతో బాధపడు జనులు, వాయసములు, పురుగులు మొదలగు వానికొఱకు అన్నమును భూమిపై మెల్లఁగ నుంచవలయును. అనఁగా శ్రద్ధతోడను, భక్తితోడను, పరిశుద్ధస్థలమున నుంచవలయును గాని భూమిపై విసరివేసి యన్నము మంటిలోఁ గలిసి చెడిపోవునట్లు వేయఁగూడదు. ఇక్కార్యము సయితము భక్తిశ్రద్ధలతోడ భగవంతునకు నివేదనము చేయు రీతిని జేయవలయునని విధించుచు శాస్త్రములు సర్వభూతము లందును ఈశ్వరసాన్నిధ్యమును బోధించుచున్నయవి.

మనుష్యయజ్ఞమగు నతిథిపూజనము దీని యనంతరము చేయఁదగినది.

ఇట్లు మనుష్యులు తమ ఋణములం దీర్చుకొనుటకు నైదు మహాయజ్ఞములు విధింపఁబడి యున్నయవి. ఇవియన్నియు నిత్యకర్మములు. అనఁగా బ్రతిదినమును గృహస్థువగు పురుషుఁడు చేయవలసిన కర్మములు. ఇందెద్ది లోపించినను పాపహేతువని దృఢముగఁ జెప్పఁబడి యున్నది. ఈ యజ్ఞములను జరిపిన పిదప మిగిలిన యన్నము యజ్ఞశిష్టామృతమనియు మేధ్యమనియు నెఱుంగఁబడు. అన్న మిట్లు పరిశుద్ధముగానిచో నమేధ్యమని యెఱుంగఁబడును. ఈ యాహారము తామసాహారమనంబడు.

ఉచ్ఛిష్ట మపి చా మేధ్యం భోజనం తామసప్రియమ్ ॥

(గీత. ౧౭-౧౦)

అదృశ్యులై సంసారచక్రమును ద్రిప్పుచు నెల్లవిధముల నీశ్వరాజ్ఞాప్రవర్తకు లగు దేవకోటులకును, మానవకోటికిని, తిర్యగ్జంతువులగు పశుపక్ష్యాదులకును మఱియుఁ గ్రిమికీటకాదులగు సమస్తభూతములకుం గల నైక్యభావము నివ్వివాదముగఁ దత్త్వదర్శులగు మహర్షులు వెల్లడిగ బోధించియున్నారు. ఈ పరస్పర సంబంధమును దెలిసికొని సమానజనములం దన్యోన్యభావమును, ఉత్తములగు దేవతాదులయందు భక్తియు, హీనులయందు దయయుఁ గలిగి ఋణములం దీర్చి యెల్లవారును గృతార్థులుగాఁదగు.

సకలజనులును వర్ణాశ్రమవిభాగమునకు లోఁబడినవారయినను, కానివారైనను నీ ధర్మముల మనసునకుం దెచ్చుకొనఁదగు. ఈ కర్మములు హిందూదేశమున ద్విజులగువారికి మాత్రమే విధింపఁబడియుండ నెల్లవా రెట్టు లీకర్మముల నెఱవేర్చువారను సందియ మక్కర లేదు. ద్విజులగువారలు బహుకాల పరంపరానుష్ఠితములగు నాహారవిహార నియమములకు లోఁబడి కొంతవఱకుఁ బరిశుద్ధములగు నుపాధులం గలిగియుండువా రగుటంబట్టి స్వతంత్రముగ మంత్రములం బఠించుటకును, వినుటకును, దగియున్నవారని విధింపఁబడియున్నను ద్విజులు గానివారుకూడ వేదమంత్రములు లేక 'నమ' యను మంత్రమున నిక్కార్యము లన్నియుఁ జేయుట యావశ్యకమని విధింపఁబడియె యున్నయది.

శూద్రస్య సన్నతి శ్శౌచం సేవా స్వామి న్యమాయయా ।
అమంత్రయజ్ఞో హ్యస్తేయం సత్యం గోవిప్రరక్షణమ్ ॥

(భాగవతము)

నమస్కారేణ మంత్రేణ పంచయజ్ఞాన్ సహాపయేత్ ॥

(విష్ణుపురాణము)

భూతముల కొండొంటికిం గల ఋణముల నంగీకరించి ఋణములం దీర్చుకొనుటయు, సర్వభూతములయందు భ్రాతృభావము గలిగి వానికి హితముఁ గోరుటయు, యథాశక్తి భూతహితము చేయుటయు, ఎవ్వరినిఁగాని ద్వేషింపకుండుటయు ముఖ్యాంశములు. ఇవియే యజ్ఞములు. ఇవి లేనిచోట సమంత్రకముగఁ జేయు కర్మములు సహితము అల్పప్రయోజకములు. జన్మమాత్రమున ద్విజులుగ నుండియు, ఆహారాది నియమముల ననుష్ఠింపనివారలు మంత్రములతోడ నొనర్చుట కనర్హులేయని యెన్నఁదగు. నియమములఁ బూర్వముగ ననుష్ఠింపక పూర్వపు సద్బ్రాహ్మణులవలెఁ గొన్ని మంత్రములఁ బఠించుటచేతను, గొన్ని కర్మములు చేయుటచేతను అనేక లిక్కాలపు బ్రాహ్మణులు రోగపీడితులును దేజోహీనులును నగుటకుఁ గారణమై యున్నది.

మహర్షులు సూక్ష్మలోకములను జూచినవారు గనుక ఆ లోకములందును సూక్ష్మశరీరములయందును మంత్రపఠనము వలనఁ గలుగు ఫలముల నెఱింగినవా రగుటంబట్టియు నపార

కరుణచే మంత్రముల నుపయోగింప సర్హు లెవరో యనర్హు లెవరో యని విధించిరికాని వేఱు కారణముల నట్లు విధించి రని యెంచి వారియందు దోషము నారోపింపరాదు. మహాత్ములు 'మంత్రద్రష్టారః' అనగా మంత్రములను జూచువారని పిలువఁబడుటకుఁ గారణమిదియు. మంత్రోచ్చారణముచేఁ గలుగు ఫలములును, అనర్హు లుచ్చరించుటచేఁ గలుగు కీడును బూర్వము విస్తరింపఁబడినదియే. దయాసముద్రులగు నట్టి మహాత్ములయందు దోషారోపణము చేయక యీ జన్మమున మనస్సును, ఇంద్రియములను, కాయమును నియమించి కొని రాఁగల జన్మములయందుఁ బరిశుద్ధములగు నుపాధులను బొంద యత్నింపవలయు.

బ్రహ్మాండమున జన్మించిన మాత్రమునఁ బై నిరూపింపఁబడిన రీతిని బ్రతిమానవుఁడును సకలభూతములకు ఋణస్థుఁడై యుండఁగా వాఁ డుదరపోషణము కొఱకు జేయు కర్మములయందు ఇతర భూతములకుఁ గొన్నింటికైనను హానిచేయక తీరదు. గృహసమ్మార్జనమునందును, గృహోపకరణములు కడుగుటయందును, శాకములు మొదలగువానిని గత్తిపీఁటతో ఖండించుటయందును, బ్రొయ్యియం దింధనములు మంట చేయుటయందును, వడ్లు మొదలగు ధాన్యముల దంచుటయందును మఱియు ననేక కార్యములయందు ననేకభూతములకు హింసచేయక తీరదు. ఇట్టి పాపము సర్వజనుల సంటియే

యుండును. ఇవి ముఖ్యముగఁ బంచసూనము లని హిందూ ధర్మశాస్త్రములయందుఁ బిలువఁబడుచున్నవి.

ఖండినీ పేషిణీ చుల్లీ మార్జనీ చైవ కుంభినీ ।
పంచసూనా గృహస్థస్య నతై స్స్వర్గో విధీయతే ॥

ఈ పంచసూనముల పరిహారముకొఱకు వైశ్వదేవమను పేరంబరఁగు హోమము గృహస్థులకు విధింపఁబడి యున్నది. ఈ హోమమువలన సర్వభూతములఁ బోషించి యభివృద్ధిచేయు దేవతలు తృప్తులగుదురు. వారు తృప్తులగుట చేత వారిచేఁ బోషింపఁబడు భూతముల కభివృద్ధి కలుగును. ఇట్లు అల్పహింసలును బరిహరింపఁబడు.

ఇదియును గృహస్థునకు విధింపఁబడిన నిత్యకర్మములలో నొకటి.

గృహస్థు నిత్యకృత్యములు

దినదినమున గృహస్థు వాచరింపఁదగు దినచర్య యెట్టిదో చూతము.

బ్రాహ్మముహూర్తమున మేల్కాంచి ప్రాతఃకాల క్రియలం దీర్చుకొని స్నానం బొనరించి సూర్యోదయమునకు ముందే సంధ్యావందన మొనరించి భగవంతుని ధ్యానముచేయవలెను. వెనుక ప్రాతఃకాలమునఁ జేయఁదగు నగ్నిహోత్రమును నలిపి దేవతలను గురువులను బూజించి కొంతకాలము వేదములను వేదాంగములను బఠించవలెను. పిదప కుటుంబపోషణ

మునకు వలయు ద్రవ్యము నార్జించుటకుం బోవలయును. తలి దండ్రులు, ఉపాధ్యాయులు, ఆచార్యులు మొదలగువారికిని, దారసుతులకును, గృహమున కేతెంచు బంధుమిత్రులకును, అతిథ్యభ్యాగతులకును, నిరాధారులు రోగపీడితులునయి స్వోదరపోషణసామర్థ్యములేని బీదలకును మఱియు గృహము నాశ్రయించుకొని తిరుగుచుండు జంతువులకును శరీరసంరక్షణ మునకు వలయునంత మాత్రము సంపాదించి గృహమునకు మరలివచ్చి మాధ్యాహ్నిక క్రియలం దీర్పవలయును. మధ్యం దిన సంధ్యావందనమును వైశ్వదేవమును జేసి దేవర్షి పితృ గణములను దృప్తియగునట్లు చేసి యానమయమునకు వచ్చిన యభ్యాగతులం బూజించి యన్న మిడి తృప్తులం జేసి భూత బలియు నొసంగి పిదప దాను భుజింపవలయు. వెనుక కొంత తడవు పురాణేతిహాసములను ధర్మశాస్త్రములను బఠించి స్వతంత్రముగఁ జదువుకొనఁజాలని వారలకు వాని యర్థము లను బోధించి యనంతరము దేవతాగృహములనుగాని సత్పు రుషుల గోష్ఠినిగాని సందర్శించి మిత్రులతోడఁ గొంత తడవు ప్రొద్దుపుచ్చుకొని సాయంసంధ్యాకాలము నతిక్రమింపక యిల్లుసేరి సాయంసంధ్యావందనాగ్నిహోత్రముల నొసరించి భుజించి విశ్రమింపఁదగు.

భుక్త్వా తు సుఖ మాస్థాయ త దన్నం పరిణామయన్ ।
ఇతిహాసపురాణాని ధర్మశాస్త్రాణి చా భ్యసేత్ ॥

వృథా వివాదవాక్యాని పరివాదం చ వర్జయేత్ ।
నాఽసచ్ఛాస్త్ర వినోదేన సన్మార్గార్థవిరోధినా . . . . .
అహశ్శేషం సమానీత శిష్టైరిష్టైశ్చ బంధుభిః ॥

ఇట్లు దినమంతయును సత్కర్మముల నొనరించుటయందును, శరీరపోషణమునకు వలయు కృత్యమునందును గడప వలయును గాని దూష్యసంభాషణమునందుఁ గాని దూష్య వృత్తులయందుఁ గాని దుష్టజనుల సాంగత్యమునఁ గాని కాల క్షేపము చేయరాదు.

ఇక్కాలమునకుఁ దగినరీతిని పై సూచింపఁబడిన మార్గము నల్పముగ మార్చుకొని దినచర్యను జరుపఁదగు. బ్రాహ్మ ముహూర్తమున మేల్కాంచి సూర్యోదయమునకు మున్ను సంధ్యావందనము, భగవద్ధ్యానము వారివారి యాచార ప్రకారము చేయఁదగు. పిదప గొంత సేపు సద్గ్రంథములఁ జదివి యితరులకు బోధించుటయందు గడుపఁదగు. అనంతరము గృహకృత్యములయందుఁ గొంతకాలము గడపి మాధ్యాహ్నిక క్రియలను జరిపి భుజించి రాజకీయకార్యములు మొదలగు నుద్యమములకుఁ బోనవకాశమున్నది. కార్యాలయముల నుండి మరలి సాయంకాలకృత్యములం దీర్చికొని కొంతకాలము సద్గ్రంథములఁ బఠించి సద్గోష్ఠియందుఁ గాలము గడపి గృహకృత్యములం దీర్చి భుజించి యల్పకాలమైనను భగవంతుని మనస్సున నిలిపి ధ్యానించి నిదురింపఁదగు.

శయ్యా మధిష్ఠాయ రాత్రిసూక్తం జపిత్వా విష్ణుం నమస్కృత్య ఇష్టదేవతాస్మరణం కృత్వా సమాధి మాస్థాయ అన్యాన్ శైవవైదికాన్ మంత్రాన్ సావిత్రీం చ జపిత్వా స్వపేత్ ॥

నమస్కృత్వాఽవ్యయం విష్ణుం సమాధిస్థ స్స్వపేన్నిశి ॥

(విష్ణుపురాణము)

ఈ రీతిని గృహస్థుఁడు దనకుం గల కార్యములన్నియు ననఁగా స్వకార్యములు, స్వామికార్యములు, పారమార్థిక కార్యములు, దేశము మేలుకొఱకుఁ జేయఁదగు కార్యములు లోనగువానిని ముందుగ నిశ్చయించుకొని కాలనియమము నేర్పఱచి యేయే కార్యమున కెంతెంతకాలము వలయునో యదియు నిశ్చయించి దినచర్యకు ముందుగఁ బదకము నేర్పఱచి యా పదకము ననుసరించి కాలము నతిక్రమింపక యుండ వృథాకాలక్షేపము సేయక కార్యములన్నింటిని జాగరూకుఁడై నెఱవేర్చుచు దినమును గడుపవలెనే కాని ప్రవాహకాష్ఠమువలెను, గాలికి గొట్టుకొనిపోవు తృణముభంగిని ప్రారబ్ధబద్ధుఁడై వర్తింపరాదు. ధీరుఁడై పురుషప్రయత్నమున సందర్భముల నన్నింటి మార్చుకొనునట్లు ఆత్మశక్తిని వినియోగింపవలయు.

పైఁజెప్పిన వన్నియు నిత్యకర్మములని ముందే యనువదింపఁబడియె. ఇవిగాక పాకయజ్ఞములని కొన్నియు, శ్రౌతయజ్ఞములని కొన్నియు శాస్త్రములయందుఁ జెప్పఁబడి

యున్నవి. పాకయజ్ఞములయందు ముఖ్యములు పితృశ్రాద్ధములు. ఇవి గతించిన పితురులను బూజించుటకుఁ జేయు కర్మములు. ఇందు మరణానంతరము ప్రేతలోకమున నుండు జీవు నుద్దేశించి యాజీవున కూర్ధ్వలోకప్రాప్తి సులభముగఁ గలుగుటకొఱకుఁ జేయఁబడు కర్మములంగూర్చి పూర్వాధ్యాయము ననే వ్రాయఁబడినది. ఇవి యేకోద్దిష్టశ్రాద్ధములని యెఱుంగఁబడుచున్నవి. ఈ శ్రాద్ధములయందుఁ బ్రేతయొక్కఁడే పూజింపఁబడుచున్నాఁడు. వీనియం దావాహనముగాని హోమముగాని లేదు. విశ్వేదేవతలఁ బూజించుట లేదు. సపిండీకరణముతో ముగియును. సపిండీకరణకాలమునఁ బ్రేతలోకమును దరించి జీవుఁడు పితరుల లోకమును జెందును. సాధారణముగ మూఁడుతరములు గడచుకాలము జీవుఁడు పితృలోకముననుండును. కావున జీవుఁడు పితృలోకమునొందు సమయము నాల్గవపితరుఁడు స్వర్గలోకముచెందుకాలము కావున నాల్గవ పురుషునకు స్వర్గపాథేయము నిచ్చి స్వర్గమునకుఁ బంపఁబడును. అది మొదలు పితృశ్రాద్ధములయం దావాహ్వానము చేయఁబడఁడు. శ్రాద్ధములయందు మువ్వురు పితరులనఁగా మూఁడుతరములవారుమాత్ర మాహ్వానము చేయఁబడుదురు. ఇవియును రెండువిధములుగ నున్నయవి. అభ్యుదయిక శ్రాద్ధములని సాధారణ పితృశ్రాద్ధములని. అభ్యుదయిక శ్రాద్ధములనఁగా బుత్త్రినియొక్కయుఁ బుత్త్రికయొక్కయు

వివాహకాలములయందును, ఉపనయనకాలమందును జాత కర్మ నామకరణ కార్యములయందు నాహ్వానముచేయఁబడు నాందీముఖ పితరులనుద్దేశించి చేయఁబడు కార్యములు. నాందీ ముఖులనఁగా సంతోషముతోఁ గూడిన ముఖముగలవారు. వీరు పితృలోకమును దాఁటి స్వర్గలోకమును బొందినపితరులు. అనఁగా మూఁడు తరములకు ముందుగాఁ బోయిన పితరులు. వీరు స్వర్గలోకప్రాప్తులయినవారు కావున శ్రాద్ధ క్రియలచే వీరలకుఁ బ్రయోజన మంతగాఁ గానరాదు. వీరలు శుభకా ర్యములయం దాహ్వానము చేయఁబడి తమ సంతతివారల కభ్యుదయము ననఁగా నైహికమగు వృద్ధి ననుగ్రహింతురు.

పితృశ్రాద్ధములయందు సన్నిహితులగు మూఁడు తరముల పితరులు మాత్రము పూజింపఁబడుదురు. సామాన్యముగ మూఁడుతరములవారు పితృలోకమున నుండి భూలోకమున నుండు తమసంతతివారినుండి శ్రాద్ధరూపమగు సహాయమును దృప్తిని గోరుచుందురు. అట్టి పితరులనుద్దేశించి జేయఁబడు నిత్యనైమిత్తిక శ్రాద్ధములు వారలం దృప్తులంజేయు. ఈ శ్రాద్ధ ములయందుఁ బితరుల నావాహనము చేయుటయుఁ, బక్వా న్నము నగ్నియందు హోమము చేయుటయు, విశ్వేదేవుల నాహ్వానము చేసి పూజించుటయు, బ్రాహ్మణులకు భోజనం బిడుటయు ముఖ్యభాగములు. ఇం దాహ్వానము చేయం బడు బ్రాహ్మణులు విజ్ఞులుగను సుశీలురుగ నుండవలయును.

యథేరిణే బీజ ముప్త్వా న వప్తా లభతే ఫలమ్ ।
తథాఽనృచే హవిర్దత్త్వా న దాతా లభతే ఫలమ్ ॥
నశ్యంతి హవ్యకవ్యాని నరాణా మవిజానతామ్ ।
భస్మభూతేషు విప్రేషు మోహాద్దత్తాని దాతృభిః ॥

తా. ఊషరక్షేత్రమున విత్తనము వేయువాఁడు ఫలము నేలాగు పొందఁజాలఁడో యట్లనృచుఁ డనఁగా వేదాధ్యయనము చేసియుండని బ్రాహ్మణునకు దత్తము చేయఁబడిన హవ్యకవ్యములు ఫలము నీయఁజాలవు. అజ్ఞానులు మోహముచే బూడిదెతో సమానులగు విప్రులకు దత్తముచేయు హవ్యకవ్యములు నశించును.

బ్రాహ్మణులు వేదాధ్యయనముచేత శుద్ధులయి యగ్ని సమానులుగ నుండవలయును. అగ్నియందు వ్రేల్వఁబడిన హోమద్రవ్యము లాయగ్నియందుఁ దప్తములై సూక్ష్మరూపములుగ మాఱి దేవతలను జెందులాగున విజ్ఞాని యగు విప్రునియందు దత్తము చేయఁబడిన హవ్యకవ్యములు పితృదేవతలను జెంది వారలను దృప్తులుగఁ జేయు. అట్లుగాక బూడిదయందుఁ జేయఁబడిన హోమ మెట్లు దేవతలను జెందఁ జాలదో యటులనే బూడిదెవంటి విప్రులకు ననఁగా వేదమును జదువని బ్రాహ్మణులకు దత్తమగు హవ్యకవ్యములు పితరులను జెందఁజాలవు. చేసిన కర్మము ఫలముల నీఁజాలక నశించు.

బ్రాహ్మణో హ్య నధీయాన స్తృణాగ్ని రివ నశ్యతి ।
తస్మై హవ్యం న దాతవ్యం న హి భస్మని హూయతే ॥

అధ్యయనము చేయని బ్రాహ్మణుఁడు గడ్డి నిప్పువలె శీఘ్రముగఁ జల్లారిపోవును. ఎవ్వరుగాని బూడిదలో హోమము చేయరు గదా! అటులనే యనధీతుఁ డగు బ్రాహ్మణునకు హవ్యకవ్యములు దత్తము చేయరాదు. శ్రాద్ధములయందు యోగ్యులును, జ్ఞానవంతులు నగు విప్రులు భుజించి తృప్తులు కాఁగా వారలు పితరులకు శాశ్వత బ్రహ్మలోక నివాస సిద్ధి గలుగున ట్లాశీర్వచనములు చేయఁ బితరులు మేలు పొందుదురు. బ్రాహ్మణభోజనము వలని ముఖ్యోద్దేశ్య మిదియే. ఈ ఫలము పూర్ణముగఁ గలుగవలయునన్న బ్రాహ్మణులు పరిశుద్ధులుగను, జ్ఞానవంతులుగను, బండితులుగను, నుండవలయును.

అక్రోధనైః శౌచపరైః సతతం బ్రహ్మవాదిభిః ।
భవితవ్యం భవద్భి శ్చ మయా చ శ్రాద్ధకర్మణి ॥

క్రోధము లేనివారును, సదా పరిశుద్ధులును, సర్వదా బ్రహ్మవిచారము చేయువారును నగు మీవలన, నాచేఁ జేయబడు శ్రాద్ధకర్మ సార్థమగు గాక. అని శ్రాద్ధమునందు ఆమంత్రితులగు బ్రాహ్మణులను గూర్చి కర్తయగువాడు చెప్పుచున్నాడు గదా. అట్లుగాక యజ్ఞుల నామంత్రితులను జేసిన నా శ్రాద్ధము సార్థకముగ నుండజాలదు.

ఈ శ్రాద్ధములన్నియు భూలోకమును విడిచి ప్రేతలోకము నందుగాని పితృలోకమునందు గాని యుండు జీవుల కాయాలోక సంబంధములగు శరీరములను బరిశుద్ధిచేసి సంస్కరించుట కుద్దేశింపఁబడినవి. తక్కిన సంస్కారము లన్నింటి యందువలె వీనియందును మంత్రములును, ద్రవ్యములును బ్రయోగింపఁబడుచున్నయవి.

శ్రౌత యజ్ఞములు సహితము హవిర్యజ్ఞము లనియును, సోమయజ్ఞము లనియును రెండువిధములుగఁ బదునాలుగు యజ్ఞము లున్నయవి. వీని యన్నింటియందును, మంత్రములు విశేషముగ నుపయోగింపఁబడుచు నెయ్యి క్షీరములు పక్వాన్నములు పిష్టములు మొదలగునవియును హోమము చేయఁబడుచున్నవి. ఇవియన్నియు నగ్నియందు దహింపఁబడి దేవతల కాహారమగుచున్నవి. దేవతలు తృప్తులై యజమానున కైహికాముష్మిక సుఖముల నిత్తురు.

ఈ రీతిని విధింపఁబడిన కర్మము లన్నియు జీవుని సంస్కరించి వివిధ మాలిన్యములను దొలఁగించుటకును, వాని ఋణములను దీర్చుటకును సమర్థములు.

మొట్టమొదట బ్రహ్మాండమునందలి బ్రహ్మాది స్తంభపర్యంత సమస్తభూతములు నొకటితో నొకటి యవిచ్ఛిన్నములగు ననుబంధములచేఁ గట్టఁబడి యున్నవనియు, నన్యోన్యసహాయము లేనిది యొక్కటియును జీవింపఁజాలదనియు బోధిం

చుచు మనుష్యుని జీవితకాల మామూలాగ్రము యజ్ఞములతో నిండియుండునట్లు విధింపఁబడి యున్నది. భగవంతుఁడు యజ్ఞస్వరూపుఁడనియును, నామరూపముల కతీతుఁడగు బ్రహ్మము ప్రకృతితోఁ జేరి నామరూపాత్మక మగు ప్రపంచరూపముగఁ బరిణమించుటలో గొప్పయజ్ఞ మొనరించెననియును శ్రుతులు ఘోషించుచున్నయవి. పురుషసూక్తమునందు వర్ణింపఁబడి యుండు యజ్ఞమంతయు నిదియే.

యజ్ఞముచేఁ బ్రపంచ ముత్పత్తియై యజ్ఞముచే రక్షింపఁబడుచున్నది. ఒకవిధమగు జీవము మఱియొకవిధమగు జీవమునకు జీవనమగుచుండుట లోకమునఁ జూచుచున్నాము గదా! "జీవో జీవస్య జీవనమ్". ఇట్లు భూతములన్నియుఁ బరస్పరాశ్రయానుబంధములచేఁ గట్టఁబడి ప్రతిభూతము నితరభూతముల యభివృద్ధికొఱకు వినియోగపడుచున్నది. పాషాణాదులు, మృత్తు, మట్టియందలి వివిధపదార్థములు, తరుగుల్మలతాదుల కుపయోగించును. ఇవి నానావిధములగు పశుపక్ష్యాదులకును, మఱియు నివి కొంతమంది మానవులకును నాహారములగుచున్నవి. ఇవి యన్నియు మనఃపూర్తిగాఁ దమ్మిదా మితరుల యభివృద్ధికొఱకు కర్పణము చేసికొనుట లేదు. వానియన్నింటి యందుఁ జిత్తమంకురించియే యుండలేదు కదా! స్వభావముగ నొకజీవ మింకొక జీవమును హరించుటచే జీవించుచున్నయది. అజ్ఞానావస్థయందు మనుష్యుఁడు సహితము ప్రకృతిస్వ

భావము ననుసరించి యితర జీవములను దనజీవనమున కుప యోగించుకొనుచున్నాడు. మనస్సు వికసింపను వికసింపను జ్ఞాన మభివృద్ధి కానుకాను మనుష్యుని ధర్మము మాఱుదగి యున్నది. ప్రకృతిసంబంధములగు శరీరము లన్నియు నితర భూతముల హరించుటచే నభివృద్ధియగుచుండ శరీరియనఁగా జీవుఁ డితర భూతములకొఱకుఁ దనశరీరము నుపయోగించినం గాని యభివృద్ధి కాఁజాలఁడు. "పరోపకారార్థ మిదం శరీర" మ్మను నార్యోక్తి యీ యర్థమునే కదా ప్రతిపాదించుచున్న యది.

పై వివరింపఁబడిన కర్మములు, యజ్ఞములు, అన్నియు నీ యుపాధుల స్వభావమును గ్రమక్రమమున మార్చి జీవుఁడు క్రమముగ నివృత్తిమార్గమునం బ్రవేశించుటకు సాధనము లగునట్లు విధింపఁబడి యున్నవి.

జీవహింస

లోకేవ్యవాయామిషమద్యసేవా నిత్యాస్తు జంతోర్నహి తత్ర చోదనా ।
వ్యవస్థితిస్తాసు వివాహయజ్ఞ సురాగ్రహైరాసు నివృత్తిరిష్టా ॥

స్త్రీపురుషులయం దన్యోన్య భోగేచ్ఛయు, మాంసాహార మునం దిచ్ఛయు, మద్యమునం దిచ్ఛయు నివి జంతువులకు స్వభావజన్యములు. వీని విషయమున శాస్త్రచోదన మనా వశ్యకము. శాస్త్రములయం దీవిషయకమగు విధులన్నియు

వివాహము జ్యోతిష్టోమాది క్రతువుల మూలమునఁ గ్రమ క్రమమున నీ యిచ్ఛలనుండి జీవుని విరమింపఁ జేయుటకొఱకుఁ జేయఁబడిన నిబంధనలు గాని యెల్లరు విషయేచ్ఛలకు లోఁబడి విషయముల యందు రమింపవలయునని కాదు. విధి నిబంధనలు లేక స్త్రీపురుషు లిష్టానుసారము కామవశులై రమింపకుండునట్లు వివాహనిబంధనము విధింపఁబడినది. దీనిచే నొక్కపురుషునకును ఒక్క స్త్రీకిని మాత్రము సంబంధము గలుగు. వీరిద్దఱకును స్వేచ్ఛావిహారములు లేకుండునట్లు కాలనిబంధనముల విధించి విషయభోగములనుండి మనస్సులఁ గొంతమట్టుకు మరలింప నేర్పుటకై శాస్త్రములు ప్రవర్తించినవికాని ప్రతియొకండును వివాహితుఁడు గావలయునని కాదు. అటులనే మాంసాహారమునందలి యిచ్ఛ యెల్లవారలకు సహజముగ నుండ నిచ్ఛ గలిగినప్పు డెల్ల జీవహింస చేయక యుండునట్లు దేవపితృకార్యములయందు మాత్ర మామిసాహారమును వినియోగించి తత్ప్రసాదరూపముగ మితముగ యజమాను లద్దాని గొనవచ్చు నని సాస్త్రములయందు విధింపఁబడి యున్నదిగాని దేవతలకుఁ బితరులకు నామిసాహారము దత్తముచేయనిచో వారలు తృప్తులుగారని కాని, కర్మలోపమగునని కాని చెప్పుట కాదు. జనులు మాంసేచ్ఛ గలిగి యిష్టానుసారముగ నాహారముకొఱకుఁగాని వినోదమునకైగాని, జీవముల హింసించుచుండఁ గొన్ని కార్యముల

యందు మాత్రము జీవముల హింసింపఁదగు నని నియమించి యట్టి హింసతోఁగూడిన కర్మములను జేయుటయందును గష్ట సాధ్యములగు గొన్ని నియమముల ననుల్లంఘ్యములుగ విధించి జీవహింసనుండి మానవులను గ్రమక్రమముగఁ దొలగించుటకై శాస్త్రములు ప్రవర్తించియున్నవి కాని యిక్కాలమునఁ బట్టణములయందు నిరాక్షేపముగ వేలకొలఁది దినదినము హింసించి భక్షించుఁ నోరులేని జంతురాశి లెక్కకు మఱియు గొన్నింటిని జేర్పఁగాదు. శాస్త్రవిహితములగు కర్మముల యందు విధింపఁబడిన విధినిషేధము లన్నియు జీవుని సహజ వాంఛలన్నిటిని గ్రమక్రమమున జయించి విరాగమును వృద్ధి చేయునవి కాని విషయవాంఛల వృద్ధిచేయునవి కావు. మఱియు నీరీతి మద్యమునందలి యిచ్ఛయుఁ గ్రమముగ విడుచునట్లు విధ్యుక్తముగఁ జేయఁబడు సౌత్రామణియను యాగ మునందు దప్పఁ దక్కిన సమయముల మత్తును గలుగఁజేయు వస్తువులను గ్రహింపరాదని కట్టుబాట్లు చేయఁబడినవి. అట్టి కార్యములయందు పఠించు మంత్రము మొదలగువానిచేతను, వానిచే నాహ్వానము చేయఁబడు దేవతల దివ్యతేజస్సుచేతను, వానియం దుపయోగింపఁబడు వస్తువులు పరిశుద్ధములై తమ సహజ దుర్గుణమును గొంతపోఁగొట్టుకొని యుండును. క్రమక్రమమున జ్ఞాన మభివృద్ధి కానుకాను జిత్తశుద్ధి కాఁగా హింసారూప యజ్ఞములు గూడఁ ద్యజింపఁబడును. శాస్త్ర

కర్తల యుద్దేశ మిట్లుండ శాస్త్రనిబంధనలను బూర్తముగ గ్రహింపకయు ననుష్ఠింపకయు విషయేచ్ఛలు గలిగి కర్మ మార్గముల నుండు వారికి విషయభోగములు శాస్త్రములచే విధింపఁబడి యున్నవనుట పొరబాటు. మొట్టమొదట కర్మ ములవలన భూతకోటులకుంగల యన్యోన్య సంబంధమును సూచించి యన్యోన్య సహకారిత్వమును విధించుచు నొక్కొ క్కరును దనకుంగల భోగ్యవిషయములను బరోపకారము కొఱ కుపయోగించునట్లు శాస్త్రములు బోధించుచున్నవి.

యజ్ఞకర్మములయందు జీవుఁడు తనకుఁగల వస్తువుల నొక్కొక్కటియుఁ గొంత యితరభూతముల యుపయోగము కొఱకు దత్తము చేయ నేర్చుకొనుచు నీమూలమునఁ దాను ఇతర భూతములనుండి పొందిన మేలునకుఁ బ్రత్యుపకృతి చేయుచున్నవాఁడు. ఇక్కర్మములయం దెద్దియేని నల్పముగ నైనను జీవుఁ డర్పింపఁగాఁ బెక్కుమడుంగులు ప్రతిఫలము కాలాంతరమున రాఁగోరుటచే సద్యఃఫలమును వదలుకొని నిబ్బరము గలిగి రాఁబోవుఁ ఫలముల నిరీక్షించుచుండుట నేర్చుకొనును. ఆరీతిని వచ్చిన ఫలములన్నియు నశించునవియే కావున నశ్వరములను జ్ఞానము కాలక్రమమునఁ బొందును. పిదప దేవతానుగ్రహముచే నిహలోకమున గలుగు ప్రతిఫల ములఁ గోరక దీర్ఘకాల మనుభవింపఁదగిన పరలోకసుఖము లను గోరి యజ్ఞములు చేయును.

"జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత" యని శ్రుతి విధించుచున్నది కదా! పరలోక సుఖములనునవి యదృశ్యములును మరణానంతరము బొందఁదగినవియునై యుండుటచే వానిం గోరి ప్రకృతోపయోగములగు వస్తువులను ద్యాగము చేయఁగలుగుట యైహికసుఖములను గోరుటకంటె నుత్తమమగు స్థితి. ఈ రీతిని స్వర్గకాముఁడై బహువిధములగు యజ్ఞముల నొనరించి చిరకాల మిహలోకమునను, పరలోకమునను సుఖానుభవము నొందుచు భగవంతుఁడు తనశక్తిని దనబిడ్డలతో సమానులగు భూతకోటుల యభివృద్ధికొఱ కుపయోగించుచుండఁ బ్రతిమానవుఁడును దనకంటె శ్రేష్ఠులగు దేవకోటుల కొఱకుఁ దన భోగ్యపదార్థములను ద్యాగము చేయుట ధర్మమను జ్ఞానమును గ్రమముగఁ బొందును. మఱియు బహుకాలానుభవముచే స్వర్గసుఖములు సహిత మంతము నొందఁగా "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" యను న్యాయానుసారముగ స్వర్గమునుండి మరలి మర్త్యలోకమును బొందును. జన్మజన్మమున నిట్లు భూలోకసుఖముల నూర్ధ్వలోకసుఖముల ననుభవింపఁ దుదకు భూలోకసుఖములవలెనే స్వర్గలోకసుఖములు నయితము శాశ్వతములుగావను జ్ఞానమంకురించి దృఢమగును. స్వర్గలోకసుఖముకంటె నుత్తమమగు సుఖము నన్వేషించుచుఁ గడపట ఫలాపేక్ష యుండినంతవఱకు నిహపరలోకసుఖములగు ఫలానుభవములు తప్పవనియు నవి నశ్వర

ములనియు దానంజేసి యీభోగము లన్నియు దుఃఖయోను లనియు జ్ఞానము వృద్ధికాఁగా జీవుఁడు కర్మత్యాగము చేయఁ జూచును గాని యప్పుడును శాంతిరూపమగు సుఖమును గనఁ జాలఁడు. కర్మములను వదలుకొని తూష్ణీంభావము ననుస రించి యున్నను విషయభోగముల యందలి యిచ్ఛమాత్రము అరణ్యావాసమునందు నయితము వెంటనంటియే వచ్చుటం జూచి పరిపాకావస్థయందుఁ గేవల కర్మత్యాగమునఁ బొంద నసాధ్యమగు సుఖము కామముల విడుచుటవలన బొందనగు నను జ్ఞానము కలుగును.

న కర్మణా మనారంభా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే ।
న చ సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ (గీత.)

కుర్వ న్నేవేహ కర్మాణి జిజీవిషే చ్ఛతగ్ం సమాః ।
ఏవం త్వయి నాన్య థేతోఽస్తి న కర్మలిప్యతే నరే ॥

(ఈశావాస్యోపనిషత్తు)

కర్మములను విడుచుటచే శాంతిరూప మగు సుఖముఁ బొందఁజాలఁడు. కేవల సన్న్యాసముచేత మానవుఁడు సిద్ధిని బొందజాలఁడు. ఐతే జీవితేచ్ఛయునఁగా దేహాభిమానముండు నంతవఱకు నూఱుసంవత్సరములైనను గర్మములను జేయు చునే గడుపవలయును. కర్మములచే బద్ధుఁడుగాక యుండుట కిదియే మార్గము. వేఱు మార్గము లేదు.

కామముల విడుచుటయే యుత్తమమును, నాశరహితమును నగు సుఖకారణమని యెఱింగి ఫలాభిసంధిరహితముగ సంసార చక్రమును ద్రిప్పుటకొఱకే స్వధర్మము నాచరింపవలయు ననియుఁ దెలిసికొనును. మొదట నైహికఫలకాంక్షతోను, పిదపఁ గొంతకాలము స్వర్గకాముఁడయ్యును సకలభూతహిత ములగు కార్యములను జేయుచుఁ గడపట ఫలకాంక్ష యించు కయేనియు లేకయే లోకహితము నుద్దేశించి ప్రపంచ చక్ర మును ద్రిప్పుటయే ముఖ్యోద్దేశ్యముగ స్వధర్మమును జేయును.

సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।
కుర్యాద్విద్వాం స్తథాఽసక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్ ॥
(గీత. 3-౨౫)

విద్వాంసులుగాని మనుష్యులు కర్మలయం దాసక్తులై యెట్లు కర్మముల శ్రద్ధతో నాచరింతురో అట్లే విద్వాంసుఁడు ఫలాసక్తిలేక లోకసంగ్రహార్థము కర్మముల నాచరించు నని తాత్పర్యము.

స్వధర్మములగు కార్యములను జేయునుగాని ఫలముల విషయమగు విచారమున కించుకయైనను లోఁబడఁడు.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మాకర్మఫలహేతుర్భూ ర్మా తే సంగోఽస్త్వకర్మణి ॥
(గీత. ౨-౪౭)

త్రా. కర్మము చేయుటయే నీ యధికారముగాని కర్మఫలముల విషయ మగుచింత నీదికాదు. కర్మఫలములను గోరఁ గూడదు. అయినను కర్మముచేయక యుండవలయు నను కోరికయుఁ గూడదు.

ఇట్లు ఫలములను గోరకయే ప్రపంచమందలి సకలభూతముల మేలును బ్రపంచాభివృద్ధిని గోరుచుఁ గర్మములను జేయుచుండును.

పూర్వకర్మానుసారముగఁ బ్రాప్తించిన జన్మమునఁ జేయఁదగు కర్మము లన్నియుఁ జక్కఁగ నెఱవేర్చిన నాఋణవిముక్తి యగునుగాని కర్మములను విడిచి పాఱిపోవుటచే నైష్కర్మ్య సిద్ధి గలుగదు. కర్మములను జేయుచు మనోనిగ్రహము చేయవలయును గాని కర్మముల విడువరాదు. కాలము పరిపక్వము కాగాఁ గర్మములు తమంతట వదలిపోవును. బంధములు వీడిపోవలయును గాని వానిని ద్రెంపివేయరాదు. కర్మములను జేయుచు స్వప్రయోజనము నెంతమాత్రమును గోరక లోకము మేలునే కోరుచుండఁదగు. కడపటఁ దాను స్వధర్మమును విడువక విహితకర్మములను లోకసంగ్రహార్థము చేయుచున్నాఁడనను నహంకారమునుగూడ మాని కర్మమునందుఁగాని ఫలమునందుఁగాని యభిమానమును సహితము విడిచి భగవంతుని సేవకునిభంగి నీశ్వరుని ప్రతినిధిగ భావించుకొని లోకమునకు మేలుకొఱకై ప్రవర్తించుచుండును.

తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగ స్సమాచర ॥ (గీత. 3-౯)

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ॥

(గీత. ౫-౧౦)

విద్యావంతుఁ డైనచో నావిద్యను దనకుఁ బూజ్యతకొఱ కుపయోగింపక యజ్ఞులగువారలను గడ తేర్చుట కుపయోగించును. ప్రభుత్వాధికారము గలిగియుండినచో నాయధికారమును ప్రజలయభివృద్ధికొఱకే యుపయోగించునుగాని యజ్ఞానులవలె స్వకార్యధురంధరుఁడై తనభోగము కొఱకు వినియోగింపఁడు. ఎల్లప్పుడు ప్రజలయభివృద్ధిని సుఖమును వెదకుచుఁ బ్రజలయుపయోగము కొఱకుఁ గ్రొత్తక్రొత్తవగు కార్యములను జేయుచుఁ దండ్రి బిడ్డలకొఱకుఁ బాటుపడులాగునఁ బాటుపడును. ద్రవ్యార్జనముచేయు వాఁడుగ నుండినవాఁడు ధనము నార్జించుచు, నా ద్రవ్యముతో మానవకోటియను గొప్ప కుటుంబమునకుఁ జెల్లునదిగ నెంచుచుఁ దాను దై(ౖ)లోక్యకుటుంబియగు భగవంతునిచే నియమింపఁబడిన కోశాధిపతిగ భావించుచు జగత్కుటుంబ యోగక్షేమముకొఱకు ద్రవ్యమును వినియోగించుచుఁ గ్రొత్తక్రొత్త ధర్మకార్యములను బన్నుచుఁ గొనసాగించుచుఁ దనయొద్దనుండు ద్రవ్యమును, దన శరీరపాటవమును, మనశ్శక్తిని, బరోపకారము కొఱ కుపయోగించుచుండును. మఱియు నేయే పదవియందుండినను, చక్రవర్తిగ నుండినను, సేవకుఁడుగ నుండినను,

దన ధర్మమును భగవత్కైంకర్యముగ భావించుచు లోకోప కారకమగు నేకార్యమును గాని హేయముగ నెంచక యెల్ల కార్యములను బరిపూర్ణముగ నెఱవేర్చును. అన్ని కార్యములను సకలభూతముల మేలుకొఱకుఁ జేయుచు నొక్కొక్క కార్యము భగవంతుని పాదములయం దర్పింపఁబడు నొక్క పుష్పముగ నెంచి భగవంతుని నర్చించుచుండు.

స్వకర్మణా తమ భ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥ (గీత. ౧౮-౪౬)

స్వకర్మములను పుష్పములతో నాభగవంతుని నర్చించు మానవుఁడు సిద్ధి ననఁగా పరిపూర్ణత్వమును బొందుచున్నాఁడు.

తాను ప్రజల మేలుకొఱకు సత్కార్యములను జేయుచున్న వాఁడనియును, ప్రజలు తనకుఁ గృతజ్ఞులు గావలయుననియుఁ గోంచెము కోరిక మొదట గలుగునుగాని కాలక్రమమున నా కోరికయు విడిచి యీశ్వరప్రీతి నొకదానినే కోరుచుఁ గార్యములగు కర్మములను జేయును. ఇట్లు చేయ సర్వకర్మములును యజ్ఞస్వరూపుఁడగు జగదీశ్వరునిం జెందును. అట్లు యజ్ఞార్థము చేయఁబడు కర్మములు బంధరూపములు గాక మోక్ష సాధనము లగు.

యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః ॥
(గీత. ౩-౯)

స్వవర్ణాశ్రమధర్మేణ తపసా హరితోషనాత్ ।
సాధనం ప్రభవేత్పుంసాం వైరాగ్యాది చతుష్టయమ్ ॥

అపుడు జీవుఁ డేయేకార్యములను జేయుచుండినను నీశ్వర తాదాత్మ్యము గలవాఁడై యుండును.

రాగద్వేషవియుక్తైస్తు విషయా నింద్రియైశ్చరన్ ।
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥ (గీత. ౨-౬౪)
ఏషా బ్రాహ్మీస్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।
స్థిత్వాస్యా మంతకాలేఽపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥
(గీత. ౨-౭౨)

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే ॥
సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥
(గీత. ౧౮-౬౫, ౬౬)

ఎల్లప్పుడు నన్నే చింతించుచు నాకు భక్తుఁడవై నాకర్పణములుగఁ గర్మములను జేయుచు, నన్ను నమస్కరింపుము. నిస్సందేహముగ నన్నే చెందుదువని దృఢముగ నమ్ముము. అన్ని ధర్మములను విడిచి నన్నే శరణుపొందుము. సమస్తములగు పుణ్యపాపములనుండి తొలఁగించి మోక్షము నిచ్చువాఁడను. విచారపడకుము. అని శ్రీ కృష్ణభగవాను లభయదానమిచ్చి యెల్లవారికిఁ గడతేర్పఁజాలు మార్గమును బోధించియున్నవారు కదా ! అట్టి స్థితినిజెంది యేయేకార్యము చేయుచున్నను నీశ్వరుఁడే తన చేతఁ జేయించుచున్నవాఁడనియును ఈశ్వరునకు శరీరమాత్రుఁడుగ దాను నడుచుచున్నవాఁడని

యును దృఢముగ భావించుచుఁ గర్మముల వర్తించుచుండును. ఇదియే కర్మయోగము.

సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥
(గీత. ౨-౪౮)

ఈశ్వరునిచేఁ బ్రేరితుఁడై కార్యములను జేయుచుఁ జేసిన కార్యము జయించినను జయింపక పోయినను లెక్కింపక యీశ్వరుని కర్పణము చేయుచుండును. ఇదియే నిజమగు యోగము.

ఈ స్థితికిం దెచ్చుటకు సాధనముగనుండిన మార్గము కర్మమార్గము. మొట్టమొదట నైహిక ఫలములనుగోరి స్వప్రయోజనపరుఁడై కర్మములను జేసి పిదప స్వర్గసుఖముల కొఱకుఁ బాటుపడి యావల ఋణవిముక్తినే యుద్దేశించి కర్మములను జేసి తదనంతరము లోకహితముపొంటె స్వధర్మము ననుష్ఠించి కడపట నీశ్వరార్పణబుద్ధితోఁ గర్మములఁ జేయుచు నెల్ల యెడల నెల్లవేళల నెల్లకార్యములయందు నీశ్వరసాన్నిధ్యమును గల్పించుకొని యీశ్వరతాదాత్మ్యమును బొంది యీశ్వరసముఁడై వర్తించుచుఁ బరమయోగి యగుచున్న వాఁడు. ఇట్టివాఁ డెల్లకాలముల నీశ్వరసన్నిధానంబున నున్న వాఁడు కావున నుత్తమమగు భక్తియు నుత్తమ జ్ఞానమును దమంతట తాము వానియందుఁ బ్రకాశించును.

తత్స్వయం యోగసంసిద్ధః కాలే నాత్మని విందతి ॥ (గీత. ౪-౩౮)

ఇట్లు యోగముచేత సిద్ధులయినవారి హృదయముల యందు నాత్మజ్ఞానము తనంతన యభివృద్ధియై ప్రకాశించును. ఇట్లు కర్మ భక్తి జ్ఞానములు మూఁడు నీయోగియందుఁ బూర్ణముగఁ బ్రకాశించును. ఈ యోగి కర్మికంటెను, భక్తుని కన్నను, జ్ఞానికంటెను నధికుఁడని భగవంతుఁడు వచించి యున్నాఁడు.

తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।
కర్మిభ్య శ్చాధికో యోగీ తస్మా ద్యోగీ భ వార్జున ॥
(గీత. ౬-౪౬)

ఈ యోగము కర్మమార్గము తుదను జెందఁదగి యుండుటచేఁ గర్మయోగ మనఁబడుచున్నది. ఇదియే నిజమగు యోగము. ఇట్టి యోగమును బొందినవాఁడే నిజమగు యోగి. ఇట్టి మహాపురుషుఁడు శరీరధారియై యుండియు ముక్తుఁడే. వీరలే జీవన్ముక్తులని పిలువఁబడు మహానుభావులు. అట్టి మహాత్ముల యనుగ్రహమునకుం బాత్రులు కాఁగోరువారెల్లరును వారిచే ననుష్ఠింపఁబడి వారలచే లోకోపకారార్థము శాస్త్రములయందుఁ బ్రతిపాదింపఁబడిన యీ మార్గము నవలంబించి నిష్కాములై లోకహితార్థము సత్కర్మములను జేయుచుఁ దమ జన్మములను సార్థకములుగఁ జేసికొందురు గాక.

పదునాల్గవ యధ్యాయము

జ్ఞానమార్గము

పూర్వాధ్యాయమునఁ జెప్పిన కర్మమార్గము ప్రపంచమందలి జను లనేకులచే ననుష్ఠింపఁబడుటకు సుకరమై యనేకులచే ననుష్ఠింపఁబడుచున్నయది. ఈ యధ్యాయమున జ్ఞానయోగముం గూర్చియు, దత్సాధనమగు జ్ఞానమార్గముం గూర్చియు విచారింపఁబడును. ఇది కొద్దిమందిచే ననుష్ఠేయముగాని యెల్లవారికి సాధ్యము గాదు. ఈ మార్గము ననుసరింపఁదగినవాని లక్షణములు పుట్టుమొదటనుండియే తెలియఁదగు. వాఁడు ఆదినుండియు జ్ఞానమునం దిష్టము గలిగి జ్ఞానవృద్ధికొఱకే పాటుపడుచుండు. ఆ జ్ఞానమునైనను నిష్కామముగనే యభ్యసించును గాని యర్థాంతరము నుద్దేశించి యభ్యసింపఁడు. అనఁగా నర్థకాముఁడగువాఁడు తదార్జనమునకు సహకారియగు జ్ఞానమును బహుప్రయత్నముచే గ్రహించు. బాహ్యములగు విషయసుఖములం గోరువాఁడు తన మనశ్శక్తియును, జ్ఞానమును, ఆ విషయసుఖములను బొందుటకు సహకారములుగ నుపయోగించును. ఇక్కాలమున బహువిధములగు ప్రకృతిశాస్త్రము లభివృద్ధి కాను

గాను వానినన్నింటి నైహికములగు సుఖముల నభివృద్ధి చేసికొనుటకే యుపయోగించుచున్నారు కదా! అట్లుగాక క్రొత్తక్రొత్త జ్ఞానమును సంపాదించుటయే యుద్దేశ్యము గలిగి యా జ్ఞానమును సాధించుటయే పరమసుఖముగ నెంచుచు శరీరసౌఖ్యమును గాని, ద్రవ్యలాభమును గాని యించుకయైనను గోరక సర్వకాల సర్వావస్థలయందును గ్రొత్తక్రొత్తవగు విషయములఁ బరీక్షింపఁ బ్రయత్నించువాఁడు జ్ఞానమార్గమున కర్హుఁడని తెలియఁదగు. ఎద్దియేని యొక యుద్యమము గలిగినచోఁ దద్విషయకజ్ఞానము పూర్ణముగ సాధించుదాఁకఁ దృప్తుఁడుగాక తన శక్తినంతయు నా విషయముననే వినియోగించుచునుండు. ఎవ్వఁడే నొక నూతనశాస్త్రమును గల్పించి యభివృద్ధి చేయువలయు నన్నఁ దద్విషయకమగు బహువిధ ప్రయత్నములఁ జేయుచు, బహువిధములగు క్రొత్తక్రొత్త యేర్పాటులు చేయుచుఁ గ్రొత్తక్రొత్త నేర్పు చూపుచు నానా ప్రయత్నములచే నాయాసందర్భముల నెఱింగి జ్ఞానమును వృద్ధిచేసికొనును. నిద్రాహారముల సహితము గోరక పనిచేయుచుండును గదా! కృషిశాస్త్రము, వైద్యశాస్త్రము, ఖగోళశాస్త్రము నీమొదలగు శాస్త్రముల మొట్టమొదట నిర్మించి యభివృద్ధిచేసినవారల యోర్పును, నేర్పును, శ్రద్ధయు నెంతటివిగ నుండవలయునో యూహింపఁదగు. నక్షత్రములను బ్రతిరాత్రిని గమనించి వాని గతులను వీక్షించుచు నేండ్లకొలఁది

పాటుపడినఁగాని యొక్క గ్రహసంచారము నైనను దప్పలేక తెలియ సాధ్యమా! ఎన్నిసంవత్సరములు నిద్రాభంగముతో గ్రహనక్షత్ర గతులను బరిశీలించి జ్యోతిర్గణిత శాస్త్రమును బూర్వులు నిర్మించిరో యని మన కూహింపనైనను సాధ్యమా! అంత శ్రమపడి సాధించిన జ్ఞానముచే వారలకు లాభము వేఁకొక్కఁడాని నాశాస్త్ర మిఁగలిగెనా! ప్రతిఫలము నిను మంతయు నపేక్షింపక జీవితకాలమంతయు నా జ్ఞానమును సాధించుటయందే గడపిన మహాత్ములు జ్ఞానమునందే సకల పురుషార్థములను జూచుచుండిరి గాన యర్థకామముల నించుకయైనను గోరియుందురా! అట్టివారలు పూర్వ కర్మపరిపాకము వలన విషయవాంఛలను దరించి యెప్పుడు స్వాభావికముగ విషయేచ్ఛలు లేక జ్ఞానమునందే రమించుచుందురు. అట్టి వారల యోర్పును, బూనికయు గాంభీర్యము లనందగినవి. సదా నూతనములగు వస్తువులను శోధించుటయు, నూతనధర్మ ములం గనుఁగొనుటయు వారి కభీష్టముగాని వేఱు కోరికల నెఱుఁగరు. క్రొత్తక్రొత్త విషయములు మనోగోచరములు కాఁగా నత్యానందభరితు లగుదురు. క్రొత్తజ్ఞానమును సాధించుటకు వారిమనస్సుత్సహించును. అట్టివార లింద్రియములను మనస్సును జయించినవార లనియును, బుద్ధిసూక్ష్మత గలవార లనియును జెప్ప నక్కఱలేదు. అట్టివారలయందు సామాన్య జనులయందువలె రాగద్వేషము లుండునని యెంచుట కవ

కాశము లేదు. జ్ఞానమే లక్ష్యముగ భావించుచు జ్ఞానార్థము తమదగు సర్వస్వమును వినియోగింతురు. అట్టివారలే యీ జ్ఞానమార్గమున నభివృద్ధికాఁ దగుదురు గాని యింద్రియనిగ్రహములేక ద్రవ్యకాములై స్వప్రయోజనపరులై సదా లాభాలాభముల లెక్కించుచుండు వారలు జ్ఞానమార్గమునకుఁ దగరు. అట్టివారలు మొదటమొదట బాహ్యప్రపంచము నందుఁ బొందఁదగు జ్ఞానము లోపములేక గ్రహించుటకుఁ బాటుపడుదురు. వ్యక్తమగు నొక్కొక్క వస్తువును బరిశీలించి ప్రకృతిగుణములను శోధించి వస్తుధర్మముల నెఱుంగుదురు. ఒక్కొక్కవిధమగు జ్ఞానమును బొంది మఱియొక విషయమును బరిశీలించుచు నెంతటికి జ్ఞానమునఁ దృప్తులుగాక సూక్ష్మ, సూక్ష్మతర, సూక్ష్మతమములును, మహత్తులు, మహత్తరములును నగు వస్తుసముదాయము నెడ తెగక శోధించుచు, జ్ఞానము నభివృద్ధి చేసికొందురు. ఇట్లు భూలోకమున గ్రహింపఁదగిన జ్ఞాన మామూలాగ్రముగ గ్రహించినను, స్థూలములగు నింద్రియములచే గ్రహింపఁదగు విషయ మొక్కటియు లేకపోయినను సూక్ష్మములగు లోకముల దృష్టి యభివ్యక్తముకాఁగా నాయాలోకముల విషయమగు జ్ఞానము సాధింతురు. ఇంతకును జ్ఞానేచ్ఛ యొక్కటితప్ప వేఱు కారణము లేదు. ఇట్లు వ్యక్తప్రపంచమంతయుఁ బరిశీలింతురు గాని యీ పరిశీలనమునకుఁ బారము కానరాదు. బ్రహ్మాం

డను నంతయు శోధించినను దృశ్యాదృశ్యములగు లోకము లన్నియు నెఱింగినను మఱియు ననేకకోటి బ్రహ్మాండములు లెక్కకు మీఱియున్నవి. బ్రహ్మాండమునంటి బ్రహ్మాండమును బరిశీలించినను దుదముట్టదు. మహాదేవుఁ డొకానొక కాల మున జ్యోతిర్మయమగు నొక్క స్తంభముగఁ జూపట్ట బ్రహ్మయు విష్ణువు నాజ్యోతిస్స్వరూపమగు స్తంభమునకు నగ్రమును మూలమును గనుఁగొనఁ దలఁచిరి. చతుర్ముఖుఁ డగ్రమును కనుఁగొనుట కూర్ధ్వముగ వేయిసంవత్సరములకాలము పోయి నను గడపటిభాగమును జూడఁజాలక మరలెను. మూలమును గనుఁగొన నధోభాగమును వేయిసంవత్సరములు పోయి వెద కినను మూలమును గనఁజాలక విష్ణువు మరలెనను పురాణ గాధను వినరా!

I. వివేకము

ఇట్లు బాహ్యముగ వెదకుటచే సర్వేశ్వరుని సృష్టికిఁ దుదయు మొదలును గన సాధ్యముగాక కడపట సంతర్ము ఖుఁడు కాఁగాఁ బరమదయానిధియు సకలలోక గురువును నగు జగదీశ్వరుఁ డాతని యంతఃకరణమునందలి యజ్ఞాన మును గొంచెము తొలఁగింప

మత్తః పరతరం నాన్య త్కించి దస్తి ధనంజయ ॥ (గీత. ౭-౭)

న తదస్తి వినా య త్స్యా న్మయా భూతం చరాచరమ్ ॥

(గీత. ౧౦-౩౯)

కస్మిన్ విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతి ॥
(ముండకోపనిషత్, ౧-౧-౩)

ఈశ్వరునికంటె (నాత్మకంటె) భిన్నమగు తత్త్వ మొక్కటియు లేదనియు, ననంతములగు భిన్నరూపములుగఁ బ్రకాశించునవి యన్నియు నాత్మయే యనియుఁ బ్రకృతిసంబంధములగు నుపాధులయం దొక్కటియగు నాత్మ భిన్నభిన్నములుగఁ గన్పడుచున్నదనియు జ్ఞానమంకురించును. ఆత్మయొక్కటి యెఱుంగఁబడిన సర్వము విదితమగుననియు, నాత్మ నెఱుంగక వెలుపలినుండి యుపాధుల నెంతకాలము శోధించినను మూలమగు తత్త్వము నెఱుంగ శక్యము గాదనియును దెలిసికొనును. గొప్ప వృక్షమును జేరి మూలమును గనుఁగొనక యొక్కొక్కయాఁకును, రెమ్మను, బువ్వను వేఱువేఱుగ శోధించుచుండిన నొక దానికి మఱియొక దానికిం గల సంబంధము గానరాక యెన్నింటిని శోధించి చూచినను మఱియుఁ గొన్ని మిగిలి యుండునట్లు మూలమును వేద్యమును నగు నాత్మ నెఱుంగక యనాత్మస్వరూపము లగు నుపాధుల నెన్నింటిని బరిశీలించినను నెన్నిటిజ్ఞానమును బొందినను జ్ఞానము పూర్ణము కాదను నెఱుక కలుగును. అపుడు దేని నొక్కదాని నెఱుంగుటచే సర్వము విజ్ఞాతమగునో యాయాత్మతత్త్వము నెఱుంగుటకు బహుప్రయత్నములు చేయును. అపుడు ప్రపంచమున వ్యక్తమైయుండు పదార్థములన్నియుఁ, బుట్టుటయుఁ బెఱుగుటయు,

శుష్కించుటయు, వృద్ధినొందుటయు, బహువిధములగు మార్పు లనొందుటయు, నశించుటయు నీ మొదలగు వికారములను జెందుననియుఁ గావున నవియన్నియు ననిత్యము లనియు, నిట్టి మార్పులలో మార్పులేక యుండునదియు నిత్యమును నగునది యాత్మ యొక్కటి యనియు జ్ఞానమల్పముగ నైనను దోఁచిన నిత్యానిత్యవస్తు వివేకజ్ఞానము గలుగును. అపుడు ప్రతిరూప మందు నంతర్వ్యాపితమగు నాత్మస్వరూపమును జూచుటకు యత్నించుచు, నాత్మతత్త్వమును గూర్చిన యెఱిఁగిన జ్ఞాన మంతయు నజ్ఞానమని యెఱుఁగును. బాహ్యములగు వస్తువుల విషయమగు జ్ఞానమంతయుఁ, బ్రకృతిశాస్త్రము లన్నియు, దృశ్యములు నదృశ్యములు నగు లోకముల జ్ఞానమంతయుఁ గూడ నజ్ఞానమే యనియు, నీ జ్ఞానమంతయు నేనగాఁ జతు షష్టి కళలును, జతుర్వేదములును, వేదాంగము లన్నియు "నపరవిద్య" యనియు, నక్షరుఁడును, నిర్వికారుఁడును, నంత ర్యామియు, సర్వభూతముల కాధారభూతుఁడు నగు నాత్మ యొక్క తత్త్వజ్ఞానమే "పరవిద్య" యనియుఁ దెలిసికొనును.

II. వైరాగ్యము

ఈ రీతిని బ్రపంచమునం దెల్లయెడల నాత్మవస్తువును జూచుచు నాత్మయొక్కటియే నిత్యమను వివేకము నభ్యసించుచు రాఁగా ననిత్యమగు ననాత్మయందు విరాగమును, నిత్యమగు నాత్మయందుఁ బ్రీతియును నా విరాగముచే నిత్యా

నిత్యవస్తు వివేకమును, వృద్ధియగును. ఇట్లు నిత్యానిత్యవస్తు వివేకముచే విరాగమును, విరాగముచే నిత్యానిత్యవస్తు వివేకమును గ్రమక్రమముగ వృద్ధియగుచు రెండును దృఢమగును. అట్టివాఁడు నాశనమునకుఁ బాల్పడునవి యన్నియు విడువఁ దగినవనియు, నాశరహితమైనది యొక్కటియే పొందఁ దగిన దనియును దెలిసి యైహికములగు సుఖములన్నియు క్షణభంగురము లనియు, నైహికములువలెనే యాముష్మికములు, అనఁగాఁ బరలోకసుఖములును, అంతవంతములై యుండుటం బట్టి దుఃఖదాయకములై కోరఁదగినవి గావనియు నెఱింగి రాగద్వేషములను జయించును. ఆదినుండి యప్రియములును, దుఃఖహేతువులునగు విషయములయందు ద్వేషమును, సుఖకరములగు విషయములయందుఁ బ్రీతియు, జీవునకు సహజముగ నుండినను, వివేకము దృఢముకానుకాను సుఖదుఃఖములు నొక్కరూపుగఁ జూచుచు నొకదానిని ద్వేషించుటయు, మఱియొక దానిని బ్రేమించుటయు రెండు నజ్ఞానజాతములని రెంటిని జయించుటకు యత్నించును. ఈ వైరాగ్య మైహికాముష్మికములగు భోగముల రెండింటియందును గన్పడును. ఐహిక సుఖములయందు రాగ మెట్లాత్మజ్ఞానమునకుఁ బ్రతిబంధకమో యారీతినే స్వర్గసుఖమునందలి యిచ్ఛయు నాత్మజ్ఞానమునకుఁ బ్రతిబంధకమనియుఁ ద్యాజ్యమనియు నిశ్చయజ్ఞానము గలుగును. వివేకవైరాగ్యములు క్రమక్రమముగ

వృద్ధి కానుకాను జీవుఁడు ఆత్మజ్ఞానమును బొందు మార్గమును గనుఁగొని యీ జ్ఞానము పూర్ణముగ సాధించుటకు షడ్గుణ సంపత్తి యావశ్యకమనియు నది లేక యీ జ్ఞానము సాధ్యము గాదనియు నెఱుంగును. ఈ సంపత్తి శమాదిషడ్గుణసంపత్తి యని సముదాయముగఁ జెప్పఁబడుచున్నయది.

III. శమాదిషడ్గుణసంపత్తి

(౧) శమమనఁగా నంతరింద్రియనిగ్రహము. (౨) దమము అనఁగా బాహ్యేంద్రియ నిగ్రహము. (౩) ఉపరతి - అనఁగా కర్మములనుండి నివృత్తియు మిగుల గొప్ప తాలిమియుఁ నని జెప్పఁదగు. (౪) తితిక్ష - అనఁగా దృఢమగు నోర్పు. (౫) శ్రద్ధ - అనఁగా శాస్త్రమునందును, ఆచార్యోక్తియందును దృఢవిశ్వాసము. (౬) సమాధానము - అనఁగా సమచిత్తత్వము. ఈ యాఱును షట్సంపత్తియని యెఱుఁగఁబడు.

ఇందు శమము మొదటిది. అంతరింద్రియమగు మనస్సును స్వాధీనము చేసికొనుట. మనస్సు జీవునకుండు సాధనములలో నుత్తమమగునది. "కిమితరచ్ఛేత స్సమం సాధనమ్". మనస్సు బంధమోక్షముల రెండింటికిని గారణము.

> మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।
> బంధాయ విషయాసక్తమ్ ముక్త్యై నిర్విషయం మనః ॥
>
> (అమృతబిందూపనిషత్)

మనస్సు ఇంద్రియములతోఁ గూడి విషయములయందు రమించుచుండిన భంధహేతువగు. ఆ మనస్సు విషయముల నుండి విముఖమై యింద్రియములకు లోఁబడక యింద్రియములకు రాజై వానిని లోఁబఱచుకొని యాత్మవశ్యమై వర్తించునపుడు మోక్షహేతు వగుచున్నది. కావున మొట్టమొదట మనస్సు స్వాధీనముచేసికొనఁబడినఁ దక్కిన యింద్రియములన్నియు సులభముగ లోఁబడును.

యస్తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా ।
తస్యేంద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః ॥ (కఠోపనిషత్)

ఎవఁడు జ్ఞానవంతుఁడై మనస్సును స్వాధీనమునం దుంచుకొనునో అట్టివాని యింద్రియములు, చక్కఁగా శిక్షితములైన గుఱ్ఱములు సారథికిఁ లోఁబడియుండునట్లు స్వాధీనములుగ నుండును.

మనం బింద్రియములతోఁ జేరనిచోఁ నింద్రియములు స్వతంత్రవ్యాపారమున కశక్తములని యెల్లవారి కనుభవవేద్యముగనే యున్నయది. మనము మనస్సు నొకవిషయమున నేకాగ్రముగ నునిచినపు డితర విషయములు గోచరములు గావు. ఎవ్వఁడైనను విచిత్రమగు నొకవస్తువు నత్యాశ్చర్యముతోఁ జూచుచుండు కాలమున నెవ్వరుగాని పిలిచిన నా శబ్దమును వినఁజాలఁడు. స్పృశించినను గనుఁగొనఁడు. ఏ విషయముననైనను మనస్సు లయించియుండునపుడు మైమఱచి

యున్నవాఁడనుట ప్రసిద్ధము. దీనిచే మనస్సొక విషయమున లయించి మునిగియున్నదనియు నా సమయమున నితరేంద్రియములన్నియు నిర్వ్యాపారములై యున్నవనియుఁ దెలియ వచ్చుచున్నది. కావున మనస్సు స్వాధీనమై వర్తించుచోఁ దక్కిన యింద్రియము లన్నియు సులభముగ జయించుటకు సాధ్యములు. కావున "శమము" మొదట నభ్యసింపఁదగినది. మనస్సు నిగ్రహింపఁబడినచో బాహ్యేంద్రియము లన్నియు సులభముగ లోఁబడును గనుక రెండవది దమము. మూఁడవది యుపరతి. ఉపరతి యనఁగా నుపరమించుట, విడుచుట, సన్న్యాసము నగు. నిత్యకర్మములుగా విహితకర్మములను ద్యజించుట యని వేదాంతులు చెప్పుచున్నారు. సన్న్యాసమునకు లింగములు, అనఁగా బహిరంగములగు చిహ్నములు, అంత ముఖ్యములు గావు. కృతార్థతనిచ్చుశక్తి కేవల బాహ్యకర్మములందు లేదని దృఢముగఁ దెలిసి వాని యందు రాగమును బూర్ణముగ విడిచిన నంతస్సన్న్యాసము తప్పక సిద్ధించును. అట్టి విరాగము గలుగుటకు మనోదార్ఢ్యమే సారభూతమనియు దేశకాలనిమిత్తములనుబట్టి యితరులనుష్ఠించు కాయికకర్మములం దెంతభేదము లుండినను వానిఁ బాటింపఁ దగదనియును నిశ్చయము గలుగవలయును. సారము నొక్కదానినే చూచుచు బాహ్యధర్మములం దెన్ని భిన్నమార్గము లున్నను గమనించక మనోభావములమాత్రము

లెక్కించుచు నందఱియందును సమబుద్ధి గలిగి యాదరించ వలయును. సారహీనులందును సారము గలిగించు మార్గము లను వెదుకవలయును గాని బాహ్యవ్యాపారములను మార్ప వలయునని యంత పూనుకొనరాదు. ఎల్లెడలఁ బరమాత్మ యంతర్యామిగ నున్నవాఁడనియు, లోక వ్యవహార మనేక విధములుగఁ బరిణమించు ననియు, దానిచే నాయావిధముల ననుసరించియే వేర్వేఱుగ నాయావారికిఁ దరణోపాయము గలుగవలయుఁగాని యందఱకు నొక్క మార్గమే చాలదనియు వెల్లడిగఁ దెలియవలయును. కావున మతభేదములు ఆచార భేదములు మొదలగు భేదము లన్నియును గర్మానుసారము లగు రుచిభేదములను బట్టి కలిగినవికాని సారభూతములు గావని నిశ్చయించి వారివారి మార్గముల వారివారిని బోనిచ్చి సారమందే దృష్టియుంచి యందఱియందు నన్ని మార్గములం దును సమబుద్ధి గలిగి వానియందు సహనమును గలిగి వారి వారిని వారివారి మార్గములందే త్రిప్పి యుద్ధరించవలయు నను ననుకంపయు[1]ఁ గలుగవలయును. ఇట్టి సహనము గల వాఁడు కర్మములను జేసినను విడిచినను బాహ్యాలంబనములను గమనించక సారభూతమగు తత్త్వమునందే మనస్సును

[1] అనుకంపము అనగా ఇతరుల మనోభావముల గుర్తెరింగి వాని కనుకూల ముగ భావించుట. కంపమనగా చలనము. ఇచ్చట భావమని అర్థము. అనుకంపమన ఆభావమున కనుగుణమైన భావము.

ద్రిప్పును. వాఁడే నిజమగు సన్న్యాసి గావున నిట్టి సహన ముపరతియని తత్త్వజ్ఞులు చెప్పుచున్నారు.

నాల్గవది తితీక్ష - తితీక్షయన ద్వంద్వసహనము. సర్వ దుఃఖములను సహించుట. వైరాగ్యము గలిగినచో సుఖముల యందు రాగ మెట్లు వదలునో అటులనే దుఃఖములయందు ద్వేషముగూడ వదలును. ప్రాప్తించు సుఖదుఃఖము లన్నియుఁ బూర్వ శుభాశుభకర్మముల ననుసరించియే వచ్చునుగాని యెవ్వరికిఁగాని తాఁజేసికొనని సుఖముగాని దుఃఖముగాని సంభవింపదనియు, నివియన్నియు వివేకవృద్ధికి సహకారము లనియు దృఢముగ నెఱుంగును. కావున దుఃఖములెన్ని ప్రాప్తించినను దత్కాలమున నెంత దుర్భరములుగఁ గనుపించినను, నవి యన్నియును బూర్వకర్మానుసారముగనే వచ్చినవనియును, దుష్కర్మములు దుఃఖానుభవముచేతఁ బరిసమాప్తి నొందుననియు నిట్టి దుఃఖములచేఁ దప్తుఁడై పుటము పెట్టిన బంగారమువలెఁ దాను బరిశుద్ధుఁడై ప్రకాశింపఁ గలఁడనియు నెఱింగి దుఃఖములు రానురాను గర్మశేషము నశించును గదా యని యార్తినే మఱియుఁ గోరుచు నీ తితీక్ష యను గుణము నభ్యసించును. దుఃఖములును, గష్టములును రాకయే యీ సుగుణ మలవడుట దుస్సాధ్యము కాసఁ బరమ దయానిధియగు భగవంతుఁడు తనబిడ్డల నిశ్శ్రేయస్సాధనము లుగ దుఃఖజాలములను గర్మానుసారముగఁ గూర్చుచున్నాఁడు.

ఐదవది శ్రద్ధ—అనఁగా శాస్త్రములును, ఆచార్యులు చెప్పు వాక్యములును బరమపురుషార్థ సాధనములని దృఢముగ విశ్వసించి యనుష్ఠించుచుఁ దా నింకను దత్త్వమును జక్కఁగాఁ దెలియఁజాలకయున్నను దా ననుష్ఠించు మార్గమునందుఁ బూర్ణముగ నమ్మకము గలిగియుండుట.

శాస్త్ర ఆచార్యోక్తులయందెట్లు విశ్వాసముండవలెనో అట్లే తనయందుండు ఆత్మశక్తియందును గట్టి నమ్మక ముండవలెను. తాను కేవల శక్తిహీనుఁడనను భావముండినను, శాస్త్రాచార్యోక్తులయందు విశ్వాసము లేకుండినను పూనికతో నీ యోగమార్గము నభ్యసించుట కుత్సాహము గలుగదు. కావున నీ శ్రద్ధ నభ్యసింపవలయును.

ఆఱవది సమాధానము—అనఁగా నిష్టానిష్టము లొనఁగూడినపుడు మనస్సు నిర్వికారముగ నుండుట. సామాన్యముగ జనులకుఁ బ్రియము ప్రాప్తించినపుడు హర్షమును అప్రియ మొనఁగూడినపుడు విషాదమును దుఃఖమును గలుగుట సహజము. అట్టివారు రాగద్వేషములకు లోనై యుండువారు. రాగద్వేషములను జయించిన పిదప ఇష్టప్రాప్తియైనను, అనిష్టప్రాప్తియైనను వికారము చెందని మనస్సు గలిగియుండవలయు. కావున 'పరమగురుచరణసన్నిధి' అను గ్రంథమున యిది 'ఏకాగ్రత' యని వర్ణింపఁబడియున్నది.

ఈ యాఱుగుణములను గొంతయైన నభ్యసింపవలయును. ఈ గుణములను వరుసఁగా నొకదాని వెనుక మఱియొక్కటి యభ్యసింపఁదగు ననుట గాదు. వీని నన్నింటి నొక కాలముననే కొంచెము కొంచెముగ నభ్యసించి దృఢముగఁ జేసికొనవచ్చును. ఇవి యన్నియుఁ బూర్ణముగ సాధించిన మోక్షమును సాధించినట్లే యెన్నఁదగు. కొంత యభ్యసించిన జ్ఞానోపదేశమున కధికారియగు. ఆ పిదపఁ గాలక్రమమున నన్నియుఁ బరిపూర్ణములగును.

IV. ముముక్షుత్వము

నిత్యానిత్య వస్తువివేకము, ఇహాముత్రఫలభోగ వైరాగ్యము, శమదమాది షట్సంపత్తియు ననునీ సాధనత్రయము గాక నాల్గవది ముముక్షుత్వము. అది సంసారబంధములనుండి విముక్తుఁడను గావలయు ననుతీవ్రమగు నిచ్ఛ. తీవ్రమగు ముముక్షుత్వము లేక పై మూఁడింటినైనఁ బూనికతో నభ్యసించుట కుత్సాహము గలుగదు గదా!

ఇందుకొక దృష్టాంతమగు నితిహాసము గలదు. పూర్వ మొక శిష్యుఁ డొక తత్త్వవేత్తయగు గురువునొద్దకుం బోయి ముక్తిమార్గము నుపదేశింపుమని వేఁడెను. శిష్యుని మనోదార్ఢ్యమును బూనికను బరీక్షింప నా గురువు కాలము గడుపుచురాఁగాఁ బలుమాఱు శిష్యుం డాదేశికుని బ్రార్థించుచు

వచ్చెను. ఒక్క పర్యాయము దృఢమనస్సుతో శిష్యుఁడు గురువును బ్రార్థించెను. అతఁడాశిష్యునకు రాఁబోవు పర్వ కాలమును దెలిపి యానాఁడు సాగరసంగమమునకు రమ్మని యాజ్ఞాపించెను. అట్లే యచ్చటికి నాసమయమున కతఁడు వచ్చెను. దేశికుఁ డాతని మొలబంటి నీటిలోనికిం దీసికొని పోయి నీటిలోముంచి పైకి లేవకయుండఁ బట్టియుంచెను. నిశ్శ్వాసవాయువు బిగిసియుండ నతఁడు లోలోనఁ గొట్టుకొనుచుండఁగా బ్రాణమున కపాయము వచ్చుదాఁక ముంచి విడిచిపెట్టెను. శిష్యుఁడు పైకిలేచి యాయాసము పోఁగొట్టుకొని స్తిమితమనస్కుఁడు కాఁగా శిష్యునితో గురువు నీటిలో మునిఁగియున్నప్పుడు నీకేమి కోరికయుండెనో చెప్పుమని యడుగ నా కూపిరి తిరుగుటకుఁ గొంచెము గాలియున్న నీ సమయమున బ్రదుకఁగలనను కోరిక తప్ప వేఱొద్దియు లేదని విన్నవించెను. అప్పుడు గురువు శిష్యునితో నీటిలోనున్నప్పు డెంత దృఢమగు బ్రదుకుకోరిక గల్గెనో యంత దృఢముగ మోక్షాసక్తి గలిగెనేని నేనప్పు డుపదేశించెదను. పొమ్మని పంపెను. కాఁబట్టి తీవ్రమగు మోక్షాసక్తి గలిగియుండవలయు నని తెలియఁ దగు.

ఈ సాధనము, 'పరమగురుచరణసన్నిధి' యందు ప్రేమ అని వర్ణింపఁబడి యున్నది. యథార్థమగు ముముక్షుత్వమున కదియే అర్థము. మోక్షమనగా బంధములనుండి విముక్తి

కదా! ఆ బంధము లెవ్వి? జీవుఁడు, శరీరములతో తాదాత్మ్యము చెంది, శరీరము, ఇంద్రియములు, మనస్సు లోనగు కరణములే తానను భ్రాంతికి లోనై, తాను, పరులు అను భేద బుద్ధిగలవాఁడై, ఆ కారణమున తనయందును, తనవారియందును రాగమును, తదితరులయందు ఉపేక్ష, ఉదాసీనభావము, ద్వేషమును గలిగియుండుట. వీనినుండి విముక్తుఁడగుట యన, తనయందును, సకలభూతములయందును ఆత్మతత్త్వము అంతర్యామిగా నిండియున్నదని యెఱింగి, రాగద్వేషములను త్యజించి, సర్వభూత సమత్వము నభ్యసించుటయే గదా! ఇదియే ప్రేమరూపముగ ప్రకాశించును. కావుననే తత్త్వజ్ఞులు ముముక్షుత్వమన ప్రేమయని నిరూపించియున్నారు.

ఇవ్విషయము, 'పరమగురుచరణసన్నిధి' యందు విస్తరించి వ్రాయఁబడియున్నది. చదువరు లీ అధ్యాయముతో గూడ నా గ్రంథమును చదువదగు.

ఈ నాల్గును సాధనచతుష్టయమను పేర శ్రీశంకరాచార్యుల వారు జ్ఞానమార్గమున నడువ యత్నించువారలకుఁ బూర్వాధికారముగ విధించియున్నారు. సాధనచతుష్టయసంపత్తి లేని వారలు పరవిద్యాజ్ఞానమున కధికారులు గారు. వీని నన్నింటిని గొంతవైన నభ్యసించినవారలే బ్రహ్మజ్ఞానమును గ్రహించుట కధికారులు. అట్టివారికిఁ గాని యితరులకు జ్ఞానము పదేశింపరాదని తత్త్వజ్ఞులగు మహాత్ముల యుద్దేశ్యము.

"అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అనఁగా నిఁక మీఁద బ్రహ్మవిచారము అని వేదాంతసూత్రములలో మొదటిసూత్రము. అందు "అథ" అనఁగా నిఁకమీఁద ననుచో సాధనచతుష్టయము గొంతవైనను సాధించిన పిదపనే యని యర్థము. ఈ సాధన చతుష్టయసంపత్తి లేనివార లిక్కాలమున బ్రహ్మవిద్యారహస్యములను శబ్దమాత్రముగ నేర్చికొని మహావాక్యముల యర్థమును స్వానుభవముచే నిరూపించుకొనకయే యావాక్యములను నోట నుచ్చరించుచు బ్రహ్మవేత్తలమని నటించుచు నితరుల కుపదేష్టలయి యితరులను సహితము భ్రాంతులుగఁ జేయుచున్నవారు. "అంధేనైవ నీయమానా యథాంధాః" అనునట్లు తామంధులయ్యును నంధులగు నితరులకు మార్గదర్శులగుచుఁ దుదకు నుభయులును మార్గము తెలియక చిక్కులుపడుచున్నవారు. సులభమును నిరపాయమును నగు కర్మభక్తిమార్గములను వదలి దుస్సాధ్యమును, నపాయకరమును నగు నీ జ్ఞానమార్గము ననుష్ఠింపఁ బ్రయత్నించుటచే నుభయభ్రష్టులగుచున్నారు. కావున నెల్లవారును జిత్తశుద్ధి గలిగి నాలుగు సాధనముల దృఢముగఁ గొంతవైన నభ్యసింపక మున్ను జ్ఞానము దెసకు నుద్యమింపక యుండఁదగు. ఈ సాధనముల నభ్యసించి తేరి యధికారియగు మహనీయుఁడే జ్ఞానమార్గమున నడువఁజాలును.

నాయ మాత్మా బలహీనేన లభ్యో న చ ప్రమాదా

త్తపసో వా ప్యలింగాత్ ॥ (ముండకోపనిషత్)

ఈ నాల్గింటి నభ్యసించిన జీవుని బుద్ధి యతిశుద్ధమగు. అహంకార మమకారములు పూర్ణముగ నశించును. బుద్ధి మిక్కిలి సూక్ష్మమై యింద్రియములు మనోబుద్ధులకు వశవర్తులగు. ఆహారాది నియమములచే శరీరములు పరిశుద్ధములగు. ఇవి గలిగిన జీవుఁ డాత్మజ్ఞానమున కధికారియగును.

ఆ జ్ఞాన మెట్టిదియో శ్రీ కృష్ణభగవానులు గీతాశాస్త్రమునందు సంక్షేపముగ నిరూపించియున్నారు.

అహ మాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।
అహ మాదిశ్చ మధ్యం చ భూతానా మంత ఏవచ ॥

(గీత. ౧౦-౨౦)

సర్వభూతముల హృదయములయందుండు నాత్మస్వరూపుఁడను నేను. సమస్తభూతములకు మొదలనఁగా నుత్పత్తి కారణము నేను; మధ్యమనఁగా స్థితి కారణము నేను. అంత్యమనఁగా లయకారణము నేను; అనఁగా సమస్తభూతములు నానుండి వెలువడి యభివ్యక్తము లగుచున్నవి. నాయందే యున్నయవి. కడపట నాయందు లీనమగుచున్నవని తాత్పర్యము. మఱియు నాత్మజ్ఞానమును విపులముగ వర్ణించుచు జ్ఞానలక్షణములను నిరూపించియున్నారు.

అమానిత్వ మదంభిత్వ మహింసా క్షాంతి రార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మవినిగ్రహః ॥

ఇంద్రియార్థేషు వైరాగ్య మనహంకార ఏవ చ ।
జన్మమృత్యుజరావ్యాధి దుఃఖదోషానుదర్శనమ్ ॥
అసక్తిర నభిష్వంగః పుత్త్రదారగృహాదిషు ।
నిత్యం చ సమచిత్తత్వ మిష్టానిష్టోపపత్తిషు ॥
మయి చానన్యయోగేన భక్తిరవ్యభిచారిణీ ।
వివిక్తదేశసేవిత్వ మరతి ర్జనసంసది ॥
అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్ ।
ఏతజ్జ్ఞాన మితిప్రోక్త మజ్ఞానం యదతోఽన్యథా ॥

(గీత. ౧౩, ౭-౧౨)

అభిమానము లేకయుండుట యనఁగా నడఁకువ, దంభము లేకయుండుటయు, నితరుల కించుకయైన హానిచేయక యుండుటయు, నితరులయందలి దోషములను సహించి మన్నించునట్టి క్షాంతియు, న్యాయముతప్పక వర్తించుటయు, గురుశుశ్రూషయు, శౌచమును, స్థైర్యమును, నింద్రియములను మనస్సును స్వాధీనము చేసికొనియుండుటయు, విషయభోగములయందు వైరాగ్యము, నహంకారము లేకయుండుటయుఁ, బుట్టుట, చచ్చుట, ముసలితనము, రోగము మొదలగు వానియందలి దోషమును జూచుటయుఁ, బుత్త్రదారగృహాదులయందు రాగమును, దాదాత్మ్యమును లేకయుండుటయు, నిష్టము ప్రాప్తించినపుడు సంతోషముగాని యప్రియము సిద్ధించినపుడు దుఃఖముగాని లేక యెల్లపుడు చిత్తసమాధానము గలిగియుండుటయుఁ, బరమేశ్వరుఁడును, వాసుదేవుఁడును నగు నా

యందుఁ జలింపని యనన్యమగు భక్తియు, నేకాంతప్రదేశములయందుండ నిచ్ఛయు, జనసంఘమునం దుండవలయునను నాశలేక యుండుటయు, నాత్మవిషయజ్ఞాన మెల్లప్పుడు మఱువక యుండుటయుఁ, బరమాత్మతత్త్వమును స్వానుభవముచేఁ దెలిసికొనుటయు, నివియన్నియు జ్ఞానమనఁబడును. ఇవికాని దంతయు నజ్ఞానమని యెఱుంగఁదగు. పైనఁ జెప్పఁబడిన లక్షణములం గలిగియుండుటయే జ్ఞానమని భోధించి శ్రీ కృష్ణ భగవానులు మఱియు నీ జ్ఞానము గలుగుటవలని ఫలము సహితము వచించియున్నారు. 'యద్జ్ఞాత్వామృతమశ్నుతే' యని యీ జ్ఞానమువలన మర్త్యుఁ డమృతత్వమును బొందునని వివరించిరి.

జ్ఞానస్వరూపమును నిరూపించి జ్ఞానవిషయమగు జ్ఞేయము నిట్లు భగవంతుఁడు నిరూపించియున్నాఁడు.

అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాస దుచ్యతే ॥

సర్వతః పాణిపాదం తత్సర్వతోఽక్షిశిరోముఖమ్ ।
సర్వత శ్రుతిమ ల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి ॥

సర్వేంద్రియ గుణాభాసం సర్వేంద్రియ వివర్జితమ్ ।
అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ ॥

బహిరంత శ్చ భూతానా మచరం చర మేవ చ ।
సూక్ష్మత్వాత్త దవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్ ॥

అవిభక్తం చ భూతేషు విభక్త మివ చ స్థితమ్ ।
భూతభర్తృ చ తజ్జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥

జ్యోతిషా మపి తజ్జ్యోతిస్తమసః పర ముచ్యతే ।
జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥

(గీత. ౧౩, ౧౩-౧౭)

వేద్యమగు తత్త్వ మాదిమధ్యాంతరహితమును, సత్స్వరూపమును నసత్స్వరూపమును గాక యెల్లయెడల పాదములను, హస్తములను, చక్షుస్సులను గలిగి సర్వమును వ్యాపించియున్నది. ఆ తత్త్వము జ్యోతులలో నన్నింటిలో నెక్కుడు జ్యోతియు, నంధకారమునకు నతీతమగునదియు నయియున్నది. జ్ఞానమును, జ్ఞేయమును, జ్ఞానగమ్యము ననఁగా నెఱుకయు నెఱుఁగఁదగినదియు నెఱుకచేఁ బొందఁదగు ప్రాప్యస్థానమును నీ మూఁడు నొక్కటియై యున్నది.

ఇట్లు ప్రపంచమునందు వాఙ్మనసగోచరమగు నదియంతయు నా బ్రహ్మస్వరూపమే. అనఁగా నెద్దానిని జూచినను అవ్యక్తమగు బ్రహ్మముయొక్క వ్యక్తస్వరూపముగ భావింపఁదగునేగాని కేవలముపాధిని మాత్రము గమనించరాదు. అన్నింటియందంతర్యామియైన చైతన్యము నెఱుంగవలయును గాని యాచైతన్యము నావరించియుండు ప్రాకృతరూపమును మాత్రము నెఱుంగఁ బ్రయోజనము లేదు. అది యజ్ఞానము. ఆత్మవిషయమును బోధించునదియే విద్యయనఁబడును గాని

యాత్మవ్యతిరిక్తమగు పదార్థ మొక్కటియు లేమింజేసి యాత్మే తరవిషయములను బోధించు విద్యలును శాస్త్రములు నన్నియు నవిద్యలే. మొదటఁ బ్రకృతిబోధకములుగ నుండి కడపట నాత్మబోధకు సహకారము లగుటచే నపరవిద్యలన్నియు సనాతనమగు పరవిద్యాకళలుగ నెన్నఁబడు. కావుననే బయట చూచుటకు భిన్నభిన్నములుగఁ గన్పడు షడ్దర్శనము లొక్కొక్కటియు నా పరతత్త్వజ్ఞానమునకు సాధనములుగ నిరూపింపఁబడియున్నవి. అన్నివిద్యలు నన్నిమార్గములును భగవత్తత్త్వమును దెల్పుటకు సహకారములుగను భగవత్సన్నిధానమును జేర్చుటయందు సమర్థములునునై యున్నవి. ఆత్మతత్త్వమును నిరాకరించు విద్య యెన్నఁడును విద్యగా నెన్నఁబడదు.

చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడు గురుఁడు గురుఁడు
తండ్రి హరిఁజేరుమనిచెప్పు తండ్రి తండ్రి ॥

(ఆంధ్రభాగవతము. ౭-స్కంధము.)

లోకమునందు బహురూపములుగఁ బ్రాకృతములగు నింద్రియములకు గోచరములగు విషయము లన్నింటియందును నప్రాకృతమగు నాత్మతత్త్వ మంతర్యామిగ వెలుంగుచున్నది. ఇట్లు నానాత్వమునం దేకత్వమును జూడఁదగు.

ఆత్మ యేకము, నద్వితీయము, క్రియారహితము నగు. కనఁబడు వ్యాపారమంతయుఁ బ్రకృతిసంబంధమైనది. ఆత్మ

సర్వత్ర వ్యాపించియుండుటచేత నచలము. చలనమనఁగా నున్న స్థలమునుండి మఱియొక స్థలమునకు గమనముగదా! అంతట వ్యాపించియుండు తత్త్వ మెచ్చటనుండి యెచ్చటికి గమనము చేయును? ఆత్మలేని స్థలము సూదికొన మోపఁ జాలినంత గాని లేదు. చలన మనునపుడెల్ల నాత్మయే ప్రకృతిని జలింపఁజేయుచున్నదని యెఱుంగఁదగు. చలించునది ప్రకృతియే. ఎంత సూక్ష్మచలనమైనను ప్రకృతిసంయోగము లేక సంభవింపదు. కావున నాత్మ క్రియారహితము.

ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః ।
యః పశ్యతి తథాత్మాన మకర్తారం స పశ్యతి ॥ (గీత. ౧౩-౨౯)

మఱియు లోకమునఁ గన్పడు మార్పులన్నియును త్రిగుణాత్మకమగు ప్రకృతియందుఁ గన్పడునవిగాని యాత్మయందుఁ గానరావు. పుట్టుటయుఁ, గిట్టుటయు, వృద్ధిక్షయములు ప్రకృతి సముదాయములందుఁగాని యాత్మకు లేవు. ఇట్లు నిత్యమగు నాత్మకును ననిత్యములగు రూపసముదాయములకును గల భేదము వివేకముచే నెఱుంగఁ దగు.

యస్స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥ (గీత. ౮-౨౦)
వినశ్యత్స్వ వినశ్యంతం యః పశ్యతి స పశ్యతి ॥ (గీత. ౧౩-౨౭)

ఈ మొదలగు వాక్యములయందు నశించునది యనఁగా మాఱునది. ప్రకృతి మాఱుచుండు. రూపములయందెల్ల నాశ రహితమైనది యాత్మ.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి ॥ (గీత. ౧౮-౬౧)
సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ॥ (గీత. ౧౩-౨౮)
అహ మాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ॥ (గీత. ౧౦-౨౦)

ఈ యాత్మ సర్వభూతములయందు సమముగఁ బ్రకాశించు చున్నయది. సాత్త్వికములుగాని, రాజసములుగాని, తామసములుగాని, యీయన్ని రూపములయం దాత్మ సమముగఁ బ్రకాశించుచునే యున్నది. కావున ఆత్మవేత్త వీనినన్నింటిని సమబుద్ధితోఁ జూచును. ఆత్మవేత్త కాఁగోరువాఁ డట్లు సమబుద్ధి నభ్యసింపవలయును.

విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితా స్సమదర్శినః ॥ (గీత. ౫-౧౮)

ఉత్కృష్టములగు వస్తువులందును నికృష్టములగు రూపములందును సుందరములగు భూతములయందును, జూచుట కసహ్యములగు రూపములందును, బ్రహ్మవేత్తయందును, క్రూరచిత్తునందును, పాషాణమునందును, బ్రహ్మయందును సమముగ నాత్మ వ్యాపించియున్నది గావున వీనినన్నిటిని సమబుద్ధిచేఁ జూచుటయె జ్ఞానము. ఈశ్వరుఁడు సర్వభూతములయందును జీవకళగాఁ బ్రకాశించుచుండుటచేత సర్వభూతములకు దండప్రణామము లాచరింపవలయునని శ్రీ కృష్ణులు తన ముఖ్యశిష్యుఁడగు నుద్ధవునకు బోధించిరి. ఇదియె యుత్తమమగు జ్ఞానమని వచించిరి.

బ్రాహ్మణే పుల్కసే స్తేనే బ్రహ్మణ్యేర్కే స్ఫులింగకే ।
అక్రూరే క్రూరకే చైవ సమదృక్పండితో మతః ॥

* * * *

విసృజ్య స్మయమానాన్ స్వాన్ దృశం వ్రీడాం చ దైహికీం ।
ప్రణమేద్దండవద్భూమా ఆశ్వచండాలగోఖరం ॥

* * * *

యావత్సర్వేషు భూతేషు మద్భావో నోపజాయతే ।
తావదేవ ముపాసీత వాఙ్మనః కాయవృత్తిభిః ॥

(శ్రీ భాగవతము, ౧౧-౨౯, శ్లో. ౧౪, ౧౬, ౧౭)

బ్రాహ్మణుని, అంత్యజుని, దొంగను, మహాదాతను, సూర్యుని, మిణుగురును, శాంతుని, క్రూరుని, సమదృష్టితో చూచువాడె పండితుఁడు.

పరిహాసముచేయు స్వజనులను విడనాడి శరీరముతో పుట్టిన భేదదృష్టిని లజ్జను సైతము విడిచి, కుక్క, చండాలుఁడు, గోవు, గాడిదె మొదలగు సర్వభూతములకు భూమిపై సాష్టాంగదండప్రణామములు చేయవలయును.

ఎంతకాలమైతే సర్వభూతములయందు నాభావము (అనగా ఈశ్వరభావము) కలుగకయుండునో అంతవఱకు పైచెప్పిన విధమున మనోవాక్కాయములతో నన్ను ఉపాసన చేయవలయును.

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వ మాస్థితః ।
సర్వథా వర్తమానోపి స యోగీ మయి వర్తతే ॥ (గీత)

ఐనను సర్వభూతములయం దాత్మను జూచుట యెట్లు సిద్ధించును? అజ్ఞానియందును జ్ఞానియందును మోసగాని యందును బ్రహ్మఘాతకునందును, బ్రహ్మవేత్తయందును సమత్వ మెట్లనుష్ఠింపసగును? అని యడిగిన వీరియందఱి యందు నాత్మకళ యుండియే యున్నది. అందఱును నానా విధములగు ననుభవములను బొంది వానినుండి గ్రహింపఁదగు జ్ఞానము నంతయు గ్రహించి కడపట నాత్మవేత్తలు గాఁదగియే యున్నవారు. అందఱియందును నీరీతి నాత్మ బీజరూపములగు తన శక్తులను వికసింపఁ జేసికొనుచున్నది. వృక్షమందలి శక్తి యొకచో లేఁత మొగ్గగను, మఱియొకచోఁ బక్వమై వికసింప నాసన్నస్థాయియందు మొగ్గగను, ఇంకొకచోట వికసించిన పుష్పముగను, వేఱొకచో లేఁతపిందెగను, గాయగను, మఱి యొకస్థలమునఁ బక్వమగు ఫలముగను, నానావిధరూపములు గలిగియున్నను అన్నియు యథార్థముగ నొక్కవృక్షములోఁ బుట్టి యొక స్వభావము గలిగి సమముగనుండున ట్లాత్మకళ నానా నామరూపములు గల యన్ని భూతములయందు సమ ముగ నున్నది. అన్నింటియందును దుది నాత్మగుణము లన్నియుఁ గాలానుసారముగఁ బ్రకాశింపనున్నవియేగాని వేఱొకపదార్థ మొక్కటియు లేదు. కావున ఘోరరూప ముగ నున్నను, లావణ్యస్వరూపముగ నున్నను, జ్ఞానస్వరూ పుఁడుగ నున్నను, సజ్ఞానపుంజముగ నున్నను, దయాసము

ద్రుఁడుగ నున్నను, క్రూరచిత్తుఁడుగ నున్నను నందఱియందు నాత్మ ప్రకాశించుచున్నది. హేయముగఁ గనఁబడు పదార్థమునందుండు నాత్మయుఁ గాలక్రమమునఁ బరిణమించి యాత్మగుణములను బ్రకాశింపఁ జేయును. ఈ రూపములన్నింటియం దనుభవముపొంది జ్ఞానమును గ్రహింపవలయును. కావుననే కదా భగవంతుఁడు తన విభూతిని జెప్పుచో "ద్యూతం ఛలయతామస్మి" అని చెప్పుకొన్నాఁడు. బ్రహ్మవేత్తయందును, మూర్ఖునందును, గోవునందును, శునకమునందును, శ్వపచునందును సమత్వమును జూచి యాత్మభావన చేయవలయును. ఇట్లు చూచుటయే యథార్థజ్ఞానము.

అశ్లీకత్వమును జూచువాని కజ్ఞాన ముండనేరదు. అజ్ఞానము నశించి యజ్ఞానజాతములగు శోకమోహములు సయితము నశింప నానందస్వరూపుఁ డగు.

> యస్మిన్ సర్వాణి భూతాన్యాత్మైవా భూ ద్విజానతః ।
> తత్ర కో మోహః క శ్శోక ఏకత్వ మనుపశ్యతః ॥

(ఈశావాస్యము)

ఏ వస్తువును జూచిన నీవస్తువునం దాత్మ యేవిధముగఁ బరిణామము చెందుచున్నది? ఎట్టి జ్ఞానము నీరూపమునఁ జెందఁ జాలును? అని యోచించుచుండిన నొక్కొక్కరూపమును బ్రపంచమున సార్థకముగఁ గన్పడును. అట్లుగాక హేయగుణములను మాత్రము చూచుచు, ద్వేషించుచుండినఁ బ్రకృతి

సంబంధములగు గుణములు మాత్రము గనంబడునేగాని యాత్మజ్ఞానము బుట్టంజాలదు. అన్ని భూతములందు నాత్మ శక్తి వికసించుచుండుటను జూడను జూడను భూతము లన్నియు భగవంతుని మహిమను బ్రకటించునవిగఁ దెలియవచ్చునే గాని వేఱు కాదు. కావున నెల్లయెడల నాత్మనే సమముగఁ జూడఁదగు. ఇదియే సుజ్ఞానము. ఇట్లు చూచువాఁడే యాత్మ వేత్త. ఇదియే జ్ఞానయోగము.

జ్ఞానియగువాఁ డాత్మకళను సర్వమునఁ జూచుచుండును. అజ్ఞానియయిత మాత్మప్రకాశమునే యెల్లచోటులం జూచును గాని యాత్మప్రకాశమని యెఱుంగఁడు. లోకమున నొక్కొక్కఁడు ననేకములగు విషయములఁ బ్రేమించుచున్నాఁడు. ఆ విషయములయందు బ్రేమాస్పదమగున దెద్దియేని యొకటి యుండనిచో దాని నేల ప్రేమించును? ఒక్కొక్క విషయము నందును మనస్సును రంజింపఁజేయునదియును, సుఖము నీజాలు నదియు నెద్దియే నొకటి యుండవలయును గదా! అది యంతయు నాత్మతేజస్సే యని గ్రహింపఁదగు. పామరుఁడు రూపలావణ్యాది గుణసముదాయమును జూచి యొక రూపమును బ్రేమించినను, అచ్చట నాత్మలేనిచో నాగుణములు ప్రకాశింపవు. వానికిం గానరావు. లోకమునం గన్పట్టు సకల సౌందర్యములును, సకల ప్రకాశములును, నాత్మయునికిచేఁ గలుగునవిగాని వేఱువిధమునఁ గాదు. రూపములందుఁ

గానవచ్చు రమణీయత్వమంతయు వానియం దాత్మయుండుటచే వానియం "దారోపితరమణీయత్వము" గాని యారూపముల యందు నైజమగునదిగాదు. ఈ యర్థమును గీతాశాస్త్రము నందు

యద్య ద్విభూతిమ త్సత్త్వం శ్రీమ దూర్జిత మేవ వా ।
తత్త దే వావ గచ్ఛ త్వం మమ తేజోఽంశ సంభవమ్ ॥
(గీత. ౧౦-౪౧)

లోకమునం దైశ్వర్యవంత మైనదిగాని, ప్రకాశమైనదిగాని విశేషోత్సాహముతోఁ గూడుకొనునదిగాని వస్తు వెద్దియున్నను అది యొక్కొక్కటియు నా తేజస్సులోఁ గళామాత్రము దాని యందుఁ గలిగియుండునదిగఁ దెలిసికొనుమని భగవంతుఁ డర్జునునకు బోధించెను. కావున లోకములో నెద్దియేని రమణీయముగ నుండిన నద్దాని కారమణీయత్వమును గలుగఁ జేయునది యాత్మయేయని నిశ్చయము. ఈ విషయమునే మైత్రేయికి నామె భర్త యాజ్ఞవల్క్యమహర్షి సుందరవాక్యములతో నుపదేశించియున్నాఁడు.

న వా అరే జాయాయై కామాయ జాయా ప్రియా భవత్యాత్మన స్తు కామాయ జాయా ప్రియా భవతి. న వా అరే పత్యుః కామాయ పతిః ప్రియో భవ త్యాత్మ నస్తు కామాయ పతిః ప్రియో భవతి . . . . . . న వా అరే దేవానాం కామాయ దేవాః ప్రియా భవంత్యాత్మనస్తు కామాయ దేవాః ప్రియా భవంతి ॥
(బృహదారణ్యకము)

తా. భార్యకొఱకు భార్యను ప్రేమింపరు. భార్యయందలి యాత్మకొఱకు భార్య ప్రియమగు. భర్తకొఱకు భర్త ప్రేమింపఁబడఁడు. ఆత్మకొఱకే భర్త ప్రియుఁడగు. ఇట్లొక్కొక్క వస్తువును దసంతట బ్రీతిగొలుపదు. ఆత్మకొఱకుఁ బ్రియమగు. అట్లు దేవతలు నయితము దేవతలేయని ప్రేమింపఁబడరు. ఆత్మకొఱకుఁ బ్రియులగుచున్నారు. ఇట్లాత్మ పరమప్రియమై యుండనియెడల నొక్కటియు లోకమునఁ బ్రియరూపముగాఁ బ్రకాశింపఁజాలదు. స్థితిగూడ నసాధ్యము. సర్వేంద్రియములకు రమణీయములగు విషయములందు నంతర్భూతమగు నాత్మను గ్రహింపఁదగు. ఇట్లాత్మ నెల్లచోఁ జూచుచు, వినుచు, ధ్యానించుచు నాత్మసాన్నిధ్యమును జెందఁదగు.

ఆత్మా వా అరే ద్రష్టవ్య శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః ॥

(బృహదారణ్యకము)

ఇవ్విధమున నాత్మ నెందుఁ జూచుచుండఁ దనయం దుండు నాత్మయు సర్వభూతములయందుండు నాత్మయు నొక్కటి యను జ్ఞానము క్రమక్రమమునఁ బొడము. కాలకర్మపరిపాకముకాఁగా పరమదయానిధియగు మహాగురువు తత్త్వోపదేశము చేయును. "తత్త్వమసి" యను మహావాక్య ముపదేశించిన బ్రహ్మాత్మైక్యజ్ఞానము పరోక్షముగఁ గలుగు. యథార్థమగు నాత్మజ్ఞానము కాలక్రమమునఁ బ్రతిమనుజునకుఁ దనయందే గలుగవలయును గాని యితరు లెంతమహనీయులైనను

దానిని బుట్టింపజాలరు. "తత్త్వమసి" యను మహావాక్య మాచార్యోపదిష్టమై శిష్యుఁడు దానియర్థమును మననము, నిదిధ్యాసనము చేయఁ బిదప బహుకాలమునకు నాత్మయందు "అహం బ్రహ్మాస్మి" యను జ్ఞానము పుట్టుచున్నది.

తత్స్వయం యోగసంసిద్ధః కాలే నాత్మని విందతి ॥ (గీత. ౪-౩౮)

ఆ జ్ఞాన మాత్మయందే పుట్టుచున్నది. అట్టిజ్ఞానము పరోక్షమైనను మహాగురువులచేత నుపదేశింపఁబడును. అట్టి యుపదేశమును బొందుటకు జ్ఞానులును దత్త్వదర్శులునగు మహాత్ములను యోగ్యుఁడగు శిష్యుఁడు విధిపూర్వముగ సమీపించి శుశ్రూషచేసి పరతత్త్వమును గుఱించి ప్రశ్నచేయఁగా వారుపదేశించెదరని గీతాశాస్త్రమున శ్రీ కృష్ణులు వచించి యున్నవారు.

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః ॥ (గీత. ౪-౩౪)

అట్టి గురువులు శాస్త్రజ్ఞానము మాత్రము గలిగిన వారుగ నుండినఁ జాలదని "జ్ఞానిన స్తత్త్వదర్శినః" అని రెండు విశేషణములు నిరూపింపఁబడినవి. శాస్త్రజ్ఞానము గలిగియుఁ దత్త్వమును స్వానుభవముచే నెఱింగినవారుగ నుండవలయు. అట్టి జ్ఞానమును గురుముఖమునఁ బరోక్షముగ మొదటఁ బొందుటకైనను శిష్యునిలక్షణములు నయితము భగవంతుఁడే నిరూపించియున్నాఁడు.

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరస్సంయతేంద్రియః ।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరేణాధిగచ్ఛతి ॥

(గీత. ౪-౩౯)

యథార్థశ్రద్ధనఁగా గురువాక్యమునందు నిశ్చలమగు విశ్వాసమును గలిగియుండవలెను. జగదీశ్వరునియందు నిశ్చలమగు భక్తిగలిగి యీశ్వరుఁడే "పరాగతిః" అని దృఢమగు నిశ్చయము గలిగియుండవలెను. ఇంద్రియములను జక్కఁగ స్వాధీనము చేసికొనియుండవలయును. ఇంద్రియ మనస్సుల స్వాధీనముచేసికొని యీశ్వరునియందు సదా భక్తిగలవాఁడై గురువాక్యమునం దత్యంతాస్తిక్య బుద్ధిగలవాఁడయిన శిష్యునకు జ్ఞానులును, దత్త్వదర్శులును నగు గురువులు బ్రహ్మాత్మైక్యజ్ఞానమును బోధింతురు. అట్లుపదేశము నొందిన పుణ్యాత్ములకుఁ జిరకాలము మనననిదిధ్యాసనములవలన నపరోక్ష జ్ఞానము తనంతట నాత్మయందే పుట్టును. గురువాక్యమును శ్రద్ధతోడ మననముచేసి నిదిధ్యాసనముచేయు ప్రశాంతమగు మనస్సున నాత్మస్వరూపము పూర్ణముగ ప్రకాశించును. అప్పుడు "అహం బ్రహ్మాస్మి" యను జ్ఞానము కలుగఁగా యథార్థముగ బ్రహ్మవేత్తయై "బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి" యను నట్లు బ్రహ్మస్వరూపుఁడే యగుచున్నవాఁడు. అట్టి మహాపురుషుఁడు శరీరధారియయ్యు ముక్తుఁడేయగు; జీవన్ముక్తుడనఁదగియుండు. అట్టి మహాత్మునకుఁ బ్రపంచమంతయు

బ్రహ్మాండము లన్నియు వేద్యములే. వారికి గోచరముగాని దొక్కటియు నుండదు. మాయను జయించిన వాఁడగు. త్రిగుణాత్మికయగు ప్రకృతి యామహానుభావునకు లోఁబడి నదియే. ఆతఁడు గుణముల కతీతుఁడై వర్తించు. అట్టి పురుషుఁడు లోకమున నెట్లు వర్తించుననఁగా శ్రీ కృష్ణుఁడే గీతాశాస్త్రమున రెండవ యధ్యాయాంతమున స్థితప్రజ్ఞుని లక్షణములుగను, పండ్రెండవ యధ్యాయాంతమునఁ బరమభక్తుని లక్షణములుగను, పదునాల్గవయధ్యాయము తుదను గుణాతీతుని లక్షణములుగను వివరించియున్నారు.

ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥
దుఃఖే ష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః స్థితధీ ర్మునిరుచ్యతే ॥
యః సర్వత్రానభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।

. . . .

రాగద్వేషవియుక్తైస్తు విషయా నింద్రియైశ్చరన్ ।
ఆత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥

(౨ అ. శ్లో. ౫౫-౫౭, ౬౪)

అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।
నిర్మమో నిరహంకార స్సమదుఃఖసుఖః క్షమీ ॥
సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।
మయ్యర్పిత మనోబుద్ధి ర్యో మే భక్త స్స మే ప్రియః ॥

యస్మా న్నోద్విజతే లోకో లోకా న్నోద్విజతే చ యః ।
హర్షామర్ష భయోద్వేగై ర్ముక్తో యస్స చ మే ప్రియః ॥

అనపేక్ష శ్శుచి ర్దక్ష ఉదాసీనో గతవ్యథః ।
సర్వారంభపరిత్యాగీ యో మద్భక్త స్స మే ప్రియః ॥

యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।
శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః ॥

సమ శ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః ।
శీతోష్ణసుఖదుఃఖేషు సమ స్సంగవివర్జితః ॥

తుల్యనిందాస్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేన చిత్ ।
అనికేత స్స్థిరమతి ర్భక్తిమాన్ మే ప్రియో నరః ॥

యే తు ధర్మ్యామృత మిదం యథోక్తం పర్యుపాసతే ।
శ్రద్ధధానా మత్పరమా భక్తా స్తేఽతీవ మే ప్రియాః ॥

(గీత. ౧౨ అ. శ్లో. ౧౩-౨౦)

ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥

ఉదాసీనవదాసీనో గుణై ర్యో న విచాల్యతే ।
గుణా వర్తంత ఇత్యేవ యోఽవతిష్ఠతి నేంగతే ॥

సమదుఃఖసుఖ స్స్వస్థ స్సమలోష్టాశ్మకాంచనః ।
తుల్యప్రియాప్రియో ధీర స్తుల్యనిందాత్మసంస్తుతిః ॥

మానాపమానయో స్తుల్య స్తుల్యో మిత్రారిపక్షయోః ।
సర్వారంభపరిత్యాగీ గుణాతీత స్స ఉచ్యతే ॥

(గీత. ౧౪ అ. శ్లో. ౨౨-౨౫)

మనోగతములగు కామము లన్నిటిని సంపూర్ణముగ వదలి యెవ్వఁడు నాత్మయందే యానందించుచుండు. దుఃఖములు గలిగినప్పుడు మనస్సున కలవిలపా టొందడు, సుఖమునం దుపొంగడు. సుఖాసుఖము లేవి ప్రాప్తించినను నిర్వికారుఁడై రాగద్వేషములు పూర్ణముగ విడిచియుండును. సర్వభూతములయందును మిత్రభావము గలిగి సుహృదుఁడై యుండు. నేను, నాది, యనుభావనులు వెదకినను గాన రావు. ఏకార్యము చేయుచున్నను మనోబుద్ధుల నీశ్వరునియం దర్పించి స్వామిభృత్యన్యాయమునను లోకహితముకొఱకై కర్మములఁ జేయుచుండును. లోకులు లోకదృష్టిచేఁ గీడుచేసినను, మేలుచేసినను, దూషించినను, భూషించినను, సన్మానించినను, అవమానించినను, సదానందుఁడై యొక్కదానియం దాశ యుంచక యాత్మారాముఁడై యుండు.

గుణాతీతుఁడయ్యును గుణముల చేష్టలను ద్వేషింపఁడు. లేని విషయములను గోరఁడు. సంప్రాప్తమైనవానిని ద్వేషింపఁడు. సుఖదుఃఖములయందుఁ దుల్యముగఁ జూచుచు, మట్టిని, ఱాతిని, బంగారమును ఒక్కదృష్టితోఁ జూచుచుఁ బ్రియాప్రియములను, నిందాస్తుతులను, మానావమానములను నొక్కరీతిగ నెంచుచు, మిత్రులను శత్రులను నొక్కవిధముగఁ బ్రేమించుచు స్వప్రయోజనకరములగు కర్మముల నొక్కటియుఁ జేయ నపేక్షించక యుండును.

వీరలు లోకమున నిల్లు వర్తించుచు లోకహితార్థ మీశ్వరుని ప్రతినిధులుగ వర్తించుచు వేఱుస్వాతంత్ర్యము లేక సర్వకార్యములు లోపము లేక చేయుచు శరీరముండుసందాఁకఁ గాలము గడుపుదురు. ఇట్టివారలు బ్రహ్మవేత్తలు. బ్రహ్మవేత్తలగువారలు పైన సూచించిన రీతిని బ్రవర్తనము వలన నెఱుంగఁబడుదురు. మహావాక్యముల నోటితో వచించుచు, బ్రహ్మవేత్తలమని లోకమునఁ బ్రకటించుకొనుచు, విషయసుఖముల రమించుచు, నింద్రియముల విషయములలోఁ బ్రవర్తించుచున్నవిగాని నేను సాక్షియగు బ్రహ్మస్వరూపుఁడనని నోటి మాటలతోఁ జెప్పుకొనుట బ్రహ్మవేత్తలకు లక్షణము గానేరదు. బ్రహ్మవేత్తలు లోకమునకు మేలుచేయుదురు. తమకు సుఖము నించుకయైనను గోరకుండుటయే కాక సాధ్యమైనంత మట్టుకు దానికి విముఖులై యుందురు. ముందు వివరించిన రీతిని సాధనచతుష్టయమును బూర్ణముగ సాధించి నిస్సంగియై, లోకమున నొక్కదానిని గోరక కుటీచకుఁడై, యాత్మయందు దృఢనిశ్చయము గలిగి బహూదకుఁడై, యాత్మయే తానను జ్ఞానము పుట్టఁగా హంసయై, యోగాభ్యాసముచే నాత్మసాక్షాత్కారము కాఁగా, బరమహంస యగుచున్నాఁడు. ఈ రీతిని సాధనచతుష్టయసంపత్తి కొంత గలిగినది మొదలపరోక్ష జ్ఞానము లభించుదనుక నాలుగుసోపానము లేర్పఱుపఁబడినవి. ఈ సాధనసంపత్తి గలిగిన జీవుఁడు జ్ఞానమున కధికా

రియై కారణగురువుల కటాక్షమునకుఁ బాత్రుఁడై యుండును. అపు డదృశ్యుఁడుగ లోకహితార్థము వర్తించుచుండు కారణ గురువు ప్రత్యక్షమయి సూక్ష్మములగు తత్త్వములను గ్రమ క్రమముగ నుపదేశించును. ఈ యుపదేశము స్థూలదేహమున వర్తించు జాగ్రదవస్థయందు సామాన్యముగ కాదు. స్వప్న మునను, సమాధియందును సూక్ష్మశరీరధారియగు జీవునకు సిద్ధించును. ఇదియే నిజమగు నుపనయనము. దానిని సూచిం చునదియే బాల్యావస్థయందు జరుగు నుపనయనము. అట్టి యుపదేశమైనది మొదలు మహాత్ములు రక్షించి శిక్షింపఁగాఁ గాలక్రమమునఁ బరిపూర్ణుఁడగును.

ఇట్టి జీవుఁడు యథార్థమగు సన్న్యాసమున కర్హుఁడు. ఐహి కములు నాముష్మికములు నగు సుఖములయందు దృఢమగు వైరాగ్యము గలిగియుండుటచేతఁ దత్సాధనములగు కర్మము లను బూర్తిగ విడిచి కేవల జ్ఞానసాధనముల వెదకుచుండును. ఇట్టి పరమార్థజ్ఞానమును బడయుటకు యోగాభ్యాసము ముఖ్య సాధనము. కనుక నద్దాని నభ్యసింపవలయు. ఈ యోగ విషయము మఱియొక యధ్యాయమున విస్తరింపఁబడును.

(౧౬ వ అధ్యాయము చూడుడు)

ఐహికాముష్మికములలో నొక్క విషయమునందును మనస్సు రమించకుండియు నొకయింటనుండుఁ గావునఁ కుటీచకుఁడనఁ బడును. పిదప నాయిల్లును వదలి స్థిరనివాసము లేక గ్రామైక

రాత్రముగఁ దిరుగుచు నాత్మయందు స్థిరాభిలాషగలవాఁడగుచు బహూదకుఁడనఁబడు. బహూదకుఁడు కుటీచకునకంటె నొక్కమెట్టు మీఁదివాఁడు.

రెండవస్థితియం దాత్మయందు దృఢమనస్సు గలవాఁడగు. ఈ స్థితియందుండి మరలి సంసారమోహమునఁబడ నవకాశముండదు. ఆత్మస్వరూపమును జక్కఁగ గ్రహింపలేక పోయియు నాత్మయొక్కటియే వేద్యమగు తత్త్వమను దృఢభావము గలిగియుండు. ఆ తత్త్వమును దెలిసికొనుటకు మనస్సు నేకాగ్రముగఁ జేసి చిత్తవృత్తులను నిరోధించి యాత్మయందుఁ జేర్పఁ గ్రమక్రమమున నాత్మస్వరూపము కొంచెము కొంచెముగ గోచరమగు. ఇంద్రియములను విషయములనుండి మరలించి యింద్రియ సుఖములను స్మరింపక యుండునట్లు మనస్సును నిలిపి నిశ్చలముసేయ నిర్వాతమగు స్థలముననుండు సరస్సున నిశ్చలమగు జలమునందు సూర్యబింబము స్వచ్ఛముగను బరిపూర్ణముగను బ్రతిఫలించునట్లు శాంతమగు శుద్ధాంతఃకరణమున నాత్మ ప్రతిఫలించు. అపుడాత్మస్వరూపము స్వల్పముగ నెఱింగి యాయాత్మయే తాననుజ్ఞాన మంకురించును. అపుడు "హంస" యనునామమున నొప్పు. 'అహమ్ సః' నేనే యాయాత్మ అనుజ్ఞానము కొంచెము కలుగును. మఱియు నాయోగము దృఢము కాను కాను సూక్ష్మదృష్టి యభివృద్ధియై క్రమక్రమముగ స్థూలశరీరమును వదలి సూక్ష్మ

శరీరమున స్వతంత్రముగ వర్తించుటకు శక్తిగలుగఁగా నా స్థూలశరీర మనాత్మయని స్వానుభవముచేఁ దెలిసికొనును. కాలక్రమమున వరుసగ నుపాధులన్నింటి నొకదాని వెనుక నొకదానిని విడిచి వానినన్నింటి ననాత్మగఁ దెలిసికొనుచు మనోవృత్తుల నన్నింటి ననాత్మ వికారములుగ నెఱింగి కడ పట నాయుపాధుల నన్నింటికంటె విలక్షణుఁడును ఉపాధుల కన్నింటి కధీశ్వరుఁడు నగు నాత్మను దెలిసికొనుచున్నాఁడు.

హిరణ్మయే పరే కోశే విరజం బ్రహ్మ నిష్కళమ్ ।
త చ్ఛుభ్రం జ్యోతిషాం జ్యోతి స్త ద్యదాత్మవిదో విదుః ॥

(ముండకోపనిషత్తు)

ఆత్మవేత్తలచే నెఱుఁగఁబడు నాత్మ (బ్రహ్మ) తత్త్వము హిరణ్మయమగు (మహాప్రకాశకరమగు) ఉత్తమోపాధి యందు నిర్మలమును, నిరవయవమును, శుభ్రమును, అయి, జ్యోతులన్నింటిలో విశేషప్రకాశమగు జ్యోతి.

ఆత్మయే తానని స్వానుభవముచే నెఱుంగు. అపుడే యథార్థముగ "అహం బ్రహ్మాస్మి" "సర్వం ఖల్విదం బ్రహ్మ" అను వాక్యార్థము ననుభవించి యపరోక్షజ్ఞానము గలవాఁ డగును. అప్పుడు పరమహంసయనఁబడును. ఇట్లపరోక్షజ్ఞానము గలిగిన వారలే పరమహంసపరివ్రాజకు లనఁదగినవారు. ఇట్టి జ్ఞానము లేనివారియం దీశబ్దము నామమాత్రముగనే యుండు. వారలను గుఱించియే కదా "వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థా

సన్న్యాసయోగా ద్యతయశ్శుద్ధసత్త్వాః” అని శ్రుతుల యందుఁ బ్రతిపాదింపఁబడి యున్నది. వేదాంతవిజ్ఞాన మనఁగా వేదాంతమునందుఁ బ్రతిపాదింపఁబడిన జ్ఞానము స్వానుభవముచే దృఢముగఁ జేయఁబడినప్పుడు విజ్ఞాన మనఁబడుచున్నది. కావున వేదాంతవిజ్ఞానమని యుపయోగింపఁబడెను. అట్టి దృఢజ్ఞానముచేఁ దత్త్వమును నిశ్చితులై యుండవలయు. అట్టి వారలు పరమహంస పరివ్రాజకులు. వారలయం దహంభావ మిసుమంతయైన నుండదు. అట్టివారలను జేరి నమస్కరించుచో వారిని బ్రహ్మస్వరూపులని యెంచుచు “నమో నారాయణాయ” యని నమస్కరింతురు.

ఇదియే జ్ఞానమార్గము. కడపట జ్ఞానము స్థిరమయి యాత్మసాక్షాత్కారము కాఁగా జ్ఞానయోగియగు. ఆత్మస్వరూపము స్వానుభవముచే నెఱుఁగ నుత్తముమగు “పరాభక్తి” పుట్టక తీరదు. భక్తిజ్ఞానములు వికసింప లోకహితము పొందెడి గర్మములను జేయుచుఁ బరిపూర్ణకర్మియు నగు.

ఇట్లు మూఁడులక్షణములు పరిపూర్ణములై యిచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తులను మూఁడింటిని బూర్ణముగఁ బ్రకాశింపఁజేయుచు, సచ్చిదానందస్వరూపుఁడై లోకమున వెలయు. ఇట్టివారు బ్రహ్మవిద్యానిధులై బ్రహ్మవేత్తలయి పామర జనులకుఁ ద్రోవఁ జూపుచుఁ బామరులై లోకమున నుండువారలకును, విదేహులైన మహాత్ములకును, మధ్యభాగమున నుండు

వారలై బ్రహ్మవిద్యా రహస్యములు లోకమున నశింపక యుండ రక్షించుచు మానవకోటికి రక్షకులై వర్తించుచుందురు.

ముక్తినిగోరియు స్వార్థపరులై యుండుటయుఁ గలదు. ఐహికములగు వాంఛలను బూర్ణముగ వదలి స్వర్గసుఖములను సహితము గోరక యథార్థముగ నిష్కాములై వర్తించుచుండియు, భగవదర్పణముగఁ గర్మములం జేసి కాని, సగుణోపాసనము చేసి కాని చిత్తశుద్ధిఁ బూర్తిగ లేకుండుటచే సర్వభూత హితులు కాకయుండువారుం గొందఱు గలరు. వారలితరులను బ్రేమించుట బంధరూపముగ భావించుచు నీషణత్రయమును మాత్రము వదలి భూతహితమును సహితము మఱచి యేకాంతముననే వర్తించుచు నెల్లవారి నొక్కరీతిగనే దూరస్థులను జేయుచు స్వవిముక్తికాములై పరహితమించుక యేని చింతింపరు. అట్టివారు మరల నిహలోకమునఁ దత్కాలమున జన్మించుటకు వలయు బంధము లొక్కటియు లేమిం జేసి యిహలోకజన్మము నిక్కాలమునం బొందరు. స్వర్గకాములును గామింజేసి స్వర్గమునందు నవకాశము లేదు. సర్వభూతహితులు కాకయుండుటచేత సర్వభూతాత్మక మగు బ్రహ్మతాదాత్మ్యమును జెందినవారు కారు. అట్టివారు బ్రహ్మలోకమందుఁ గొంతదూరము పోయినను బోఁగలరుగాని మరల నేదో కాలాంతరమున సంసారమునం బ్రవేశించి

"సర్వభూతాత్మ భూతాత్మ" యగునందాఁక సంసారమున నుండవలసి యుండును. దీనినే

> ఆబ్రహ్మభువనా ల్లోకాః పునరావర్తినోఽర్జున ।
> మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥

(గీత. ౮-౧౬)

బ్రహ్మలోకమునకుఁ బోయిన జీవులకుఁ బునర్జన్మము గలదు గాని పరబ్రహ్మస్వరూపుఁడను, వాసుదేవాత్మకుఁడను నగు నన్నుపాసించువారలకుఁ బునర్జన్మము లేదని గీతాశాస్త్రమున భగవంతుఁడు నొక్కి వక్కాణించియున్నాఁడు. ఇట్టి వారి పునర్జన్మము సామాన్యులగు జీవులకుఁగలుగు పునర్జన్మ వంటిది గాదు.

సంసారచక్రమునకు బద్ధులై త్రిలోకములందుఁ బరిభ్రమించువారల విషయము నిచ్చట చెప్పియుండలేదు. భేదబుద్ధి గలవారలై భగవంతుఁడు "సర్వభూతాంతరాత్మ" యను భావము లేక వివిధములగు నుపాసనలఁ జేయుచు లోకమున నుండు భూతముల విషయమగు చింత యెంతమాత్రము లేక స్వవిముక్తికాములై యుండువారలు బ్రహ్మలోకమునకుఁ బోయినను మఱియొక బ్రహ్మకల్పమునందైనను జన్మమును బొంది సర్వభూతహితత్వము నభ్యసించి,

> సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని ।
> ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ।

యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥

సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వ మాశ్రితః ।
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే ॥

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥

(గీత. ౬-౨౯-౩౨ శ్లో.)

అను నీశ్లోకములయందు భగవంతుఁ డర్జునున కుపదేశించిన రీతిని సమస్తభూతములయందు నాత్మను జూచుచు, నాత్మయందు సమస్తభూతములను జూచుచు, సమాహిత చిత్తుఁడై, సర్వత్ర సమదర్శనుఁడై, సర్వభూతములను దనవలెఁ జూచుచు, భావించుచు, వాని సుఖదుఃఖములను దన సుఖదుఃఖములుగ నెంచుచు వర్తించువాఁడు నాయం దనఁగాఁ బరబ్రహ్మము నందు వర్తించుచున్నాఁ డనఁదగు. అట్లు సర్వభూతసముఁడై సర్వభూతములయందుండు నాత్మతోఁ దాదాత్మ్యమును జెందుచుండు మహాత్ముఁడు పరబ్రహ్మముతోఁ జేరిన యోగియే యై పరబ్రహ్మ స్వరూపుఁడే యగుచున్నాఁడు. కావుననే యీ పదవిం జెందిన శుకయోగి యౌవనమున నుండియుఁ గౌమారమగు శరీరము గలిగియుండియు మార్గమునఁ బోవుచుండ నొక కొలనియందు వివస్త్రలై జలకములాడుచుండు స్త్రీలు వారిం జూచి మనోవికారమునొందక యూరకుండిరి. పిమ్మట

వృద్ధుఁడగు వ్యాసమహర్షి యామార్గముననే రాఁగా స్త్రీలందఱు సిగ్గుపడి పరుగెత్తి వస్త్రములను ధరించిరి. శుకుఁడు యౌవనమున నుండియు బ్రహ్మభావము దప్ప వేఱు భావన లేక సర్వాంతర్యామిత్వమును బొందియుండుటచేతఁ బరపురుషుఁడను భావము వారికిఁ గలుగలేదు. వ్యాసులవారించుక "యహం ప్రత్యయము" గలిగియుండుటచేతఁ బరపురుషుఁడు వచ్చెనని లజ్జించిరి. ఇట్టి స్థితియందుండు శుకయోగి యరణ్యమున నొంటిగఁ బోవుసమయమున వ్యాసులవారు కుమారుని యందుండు మమతచేత వెంటఁ జని యోహో కుమార యని పిలువఁ దరువులును బాషాణములును 'ఓ' యని ప్రతిధ్వనులిచ్చెనఁట. అట్టిపురుషుఁడు యథార్థమగు ముక్తుఁడు.

యం ప్రవ్రజంత మనుపేత మపేతకృత్యం
ద్వైపాయనో విరహకాతర ఆజుహావ ।
పుత్రేతి తన్మయతయా తరవో౽భినేదు
స్తం సర్వభూతహృదయం మునిమానతో౽స్మి ।

(శ్రీ భాగవతము ౧-౨-౨)

మ. సముఁడై యెవ్వఁడు ముక్తకర్మచయుఁడై
సన్న్యాసియై యొంటిఁ బో
వ మహాభీతి నొహో కుమార యనుచున్
వ్యాసుండు చీరంగ వృ
క్షములుం దన్మయతం బ్రతిధ్వనులు
సక్కం జేసె మున్నట్టి భూ

తమయుఁ బ్రొక్కెద బాదరాయణిఁ దపో
ధన్యాగ్రణిన్ ధీమణిన్.

అట్టి శుకయోగి ముక్తుఁడయ్యును యథార్థముగఁ దీవ్ర మోక్షేచ్ఛ గలవారలకు బ్రహ్మజ్ఞానము నుపదేశించుటయే వ్రతముగఁ గలిగి పరీక్షిత్తున కుపదేశించు నెపమున లోకము నకు భాగవతకథలం దెలిపి లోకులను గృతార్థులను జేయు చునే యున్నాఁడు.

పదునైదవ యధ్యాయము

భక్తిమార్గము

మోక్షసాధనములలో మూఁడవదియగు భక్తిమార్గము కర్మజ్ఞానమార్గములకంటె నిరపాయమును సుకరమును నగునది. కర్మమార్గమునం దధికారతారతమ్యములు గలిగి నానావిధములగు మనస్స్పర్ధల కవకాశమున్నయది. ఎల్లజనులకు నెల్లకర్మములు సులభసాధ్యములు గావు. కర్మములయం దేవిధమగు లోపములుండినను అవి ఫలముల నీయఁజాలక పోవుటయే గాక దోషములఁగూడఁ గలుగఁజేయును. భక్తిమార్గమున నట్టి ప్రత్యవాయములు లేవు.

న హి కల్యాణకృత్ కశ్చిద్ దుర్గతిం తాత గచ్ఛతి ॥
(గీత. ౬-౪౦)

న మే భక్తః ప్రణశ్యతి ॥ (గీత. ౯-౩౧)

అను గీతావాక్యములు దీనినే తెలుపును. జ్ఞానమార్గమన్ననో బహుదుస్తరమగునది. ఆ మార్గమునఁ బోవుజీవుఁడు అసహాయుఁడై యొంటరిగనే పాటుపడవలయును. కొంచెము జ్ఞానము లభించినను అహంకారము వృద్ధియగుట కవకాశమున్నయది. సగుణోపాసన మార్గముననే యపరవిద్య

సంపాదించుట యెల్లభంగుల దుర్లభమైయుండ నవ్యక్తమగు నక్షర పరబ్రహ్మతత్త్వజ్ఞానమును సాధించుట యెంతకష్టమో అనుభవముగలవారికే వేద్యము. భక్తిమార్గమన్ననో యెల్ల వారికి సాధ్యము ; నిరపాయము. భక్తిమార్గమున నుండువార లన్యోన్య సహకారులగుదురు. వైషమ్యముల కవకాశము లామార్గమునఁ దక్కువగా నుండును.

అట్టి భక్తిస్వరూపము భక్తులకేగాని యితరులకు వేద్యము గాదు. కావున భక్తాగ్రేసరులగువార లాభక్తిస్వరూపము నెట్లు నిరూపించియున్నారో చూతము. భక్తాగ్రేసరులలోఁ జేరిన భగవంతుఁడగు శ్రీనారదుడు "సా త్వస్మిన్ పరమ ప్రేమా" అది భగవంతునియందుఁ బరమప్రేమస్వరూపమై నదని వచించెను. జ్ఞానమార్గముననుండువార లవ్యక్తమగు పరబ్రహ్మతత్త్వము నెఱుంగఁ గోరుచున్నారు. అవ్యక్తము నెఱుంగుట దేహధారులకు బహు దుస్సాధ్యమని భగవం తుఁడే చెప్పియున్నాఁడు.

> క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్త చేతసామ్ ।
> అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే ॥ (గీత. ౧౨-౫)

భగవంతులగు శ్రీ శంకరాచార్యులును అవ్యక్తమును ధ్యానముచేయుట సాధ్యము కాదనియు, నవ్యక్తము నక్షరము నగు తత్త్వము "జ్ఞేయము" ఎఱుగఁదగినదియే గాని "ధ్యే యము" అనఁగా ధ్యానింపఁదగినది గాదనియు స్పష్టముగ

శ్రీ భగవద్గీతా భాష్యమున వ్రాయుచున్నారు. సగుణబ్రహ్మ మనియు నీశ్వరుఁడనియు నెఱుఁగఁబడు తత్త్వము నుపాసింప వచ్చును. భగవంతుని యవతారములగు శ్రీ రామకృష్ణాదు లనుగాని, ఆయా మతస్థులచే భగవదవతారములుగ నుపా సింపఁబడు క్రైస్తు, బుద్ధుఁడు మొదలగు మహాపురుషులను గాని ధ్యానింపవచ్చును. మనస్సు దుర్బలము గావున నిట్టి రూపమును గుణములును గల వస్తువును భావనచేయ నోపును. నిరాకారమును నిర్గుణమును నగు పరబ్రహ్మమును ధ్యానింప దుస్తరము. ఆ పరబ్రహ్మతత్త్వ మవిజ్ఞాతమని శ్రుతులు ఘోషించుచున్నవి. ఎంత మహానీయుఁడైనను ఆతత్త్వ మిట్టి దని వాక్కులచే నిర్వచింపఁజాలఁడు, మనస్సుచే గ్రహింపఁ జాలఁడు. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ" అను నుపనిషద్వాక్య మీయర్థమునే బోధించుచున్నది. కావు ననే భక్తులకు నెల్లమతములయందును భగవంతుని లీలావ తారములే యుపాసనార్హము లని నిరూపింపఁబడి యున్నవి.

భక్తానుగ్రాహీ లీలావతారః ॥

భక్తుల యనుగ్రహార్థము లీలావతారముల గ్రహించిన వాఁడు భగవంతుఁడు. అవ్యక్తమును, అక్షరమును, నిర్గుణ మును, నిరవయవమును, నిరంజనము నగు నాతత్త్వమును కించిజ్ఞుఁడగు భక్తుఁడు తన యల్పమనస్సుచే గ్రహింపఁజాలఁ డని యాబ్రహ్మతత్త్వము "ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవా

మ్యాత్మమాయయా” యన్నట్లు తనశక్తిచేతనే తనకధీనమై యుండు ప్రకృతితోఁగూడి సగుణబ్రహ్మముగను, నానావిధ లీలావతారములుగను వ్యక్తమాయెను.

భక్తిమార్గమున సగుణమగు నీశ్వరుని భక్తుఁడు ప్రేమచే నుపాసించును. ప్రేమించుటకు సకలకళ్యాణగుణనిధి యగు దివ్య సుందర విగ్రహమును ఆలంబనముగ గ్రహింపవలయు. ఇట్టి ప్రేమ నిర్గుణమును, నిరుపాధికమును, నిరవయవమునగు తత్త్వమందుఁ గలుగదు. దానియందుఁ బ్రేమాస్పద మొక్కటియును లేదు. జ్ఞానమార్గమునకు భక్తిమార్గమునకుఁ గల ముఖ్యభేద మిదియ.

కావుననే భక్తాగ్రేసరుఁడగు నారదుఁడు “అస్మిన్” అని యొక పురుషునందుఁ బ్రేమయని నిరూపించియున్నాఁడు. ఆ భగవంతునియందుఁ బ్రేమరూపము భక్తి. ఉత్తమమగు ప్రేమయన సామాన్యముగఁ బ్రతిఫలమును గోరు ప్రేమగాదు. ఈ ప్రేమను నిరూపించుటయం దిట్లు వివరించిరి.

> నారదస్తు తదర్పితాఖిలాచారతా ।
> తద్విస్మరణే పరమవ్యాకుల తేతి ॥

సర్వకర్మముల నుపాస్యునియం దర్పించుటయు నామూర్తిని స్మరించక మఱచినచో నపారమగు దుఃఖమును బొందుటయు, నాప్రేమయొక్క స్వరూపము. లోకమునఁ బరస్పర ప్రేమాతిశయముగల వార లొండొరులయెడ నెట్లు వర్తించెదరో యూ

హించిన నీ భక్తిస్వరూపమును గొంచెము గ్రహింప సాధ్యమగు. అట్టి ప్రేమాతిశయముచే బద్ధులగువారలలో నొండొరులకు భేదము కొంచెమైనను గానరాదు. ఇరువురు నొక్కరూపముగ భావింతురు. ఇరువురి మనోభావము లొక్కటియగుఁగాని వేఱుగ నుండఁజాలవు. ఒండొరుల వియోగము దుర్భరము. వియోగము గలిగినను అన్యోన్యస్మరణ మెడతెగక యుండును. ఏకాలమునందుఁగాని యొకరినొకరు మఱవఁజాలరు. మఱపు దగులుటకంటె నధికమగు దుఃఖము వేఱొండదు. ఒక వస్తువుకంటె మనస్సునకు రమ్యమగు మఱియొకటి గలిగిననే గదా మొదటిది మఱపు దగులును? అట్టిది యొకటియు లేమింజేసి విస్మృతి యసాధ్యమనఁదగు. ఇట్టి ప్రేమ స్వల్పముగనైన మనోగోచరమైనచో భగవంతుని యందలి భక్తి యిట్టిదని యూహింపఁజాలుదుము. నిష్కామమగు లౌకిక ప్రేమయే గ్రహింపలేనివారలకు భక్తి సాధ్యము గాదు. ఐహికసుఖసాధన మగు దృఢప్రేమ యింత బలకారిగను రమ్యముగను నున్నయది. ఇట్టిప్రేమయే నిరతిశయ సుఖము నిచ్చును. అపారశక్తిమంతుఁడును, అభ్యుదయ నిశ్శ్రేయసముల నొసగూర్చు గురుస్వరూపుఁడును, నిర్వ్యాజ కరుణయే స్వభావముగఁ గలవాఁడును, దివ్యమంగళవిగ్రహుఁడును నగు భగవంతునియం దర్పింపఁబడినచో నది భక్తి యనఁబడును. ఈప్రేమయే పరమప్రేమరూపము. ప్రతిఫల

మనుగోరి చేయు భక్తి వణిగ్వృత్తియని భక్తాగ్రేసరుఁడగు ప్రహ్లాదుఁడు చెప్పినాఁడు గదా. మఱియు నారదుఁడు భక్తి వలనఁ గలుగు ఫలములఁ జెప్పియున్నాఁడు.

> య ల్లబ్ధ్వా పుమా న్సిద్ధో భవ త్యమృతో భవతి । తృప్తో భవతి ॥ య త్ప్రాప్య న కించి ద్వాంఛతి, న శోచతి; న ద్వేష్టి । న రమతే నో త్సాహీ భవతి ॥ య జ్జ్ఞాత్వా మత్తో భవతి । స్తబ్ధో భవ త్యాత్మారామో భవతి ॥

నిజమగు నీభక్తి గలిగిన మనుష్యుఁడు సిద్ధుఁడగు. అమృతుఁడగు. తృప్తుఁడగు. మఱియు నీభక్తిని బొందినవాఁడొక్కటియును గోరఁడు. శోకింపఁడు. ద్వేషింపఁడు. విషయములయందు రమింపఁడు. ఫలార్థియై యొక్కకర్మమును జేయఁడు. ఆత్మయందే రమించుచు, మత్తుఁడై స్థిరుఁడై యానందించును.

భక్తుఁడు భక్తివలనఁ గామము లీడేర్చుకొనఁడు. భక్తి త్యాగరూపమైనది; ఉపాస్యునకు సర్వమును నివేదించి వారి ప్రసాదముతప్ప వేఱుకోరిక లేనివాఁడు భక్తుఁడు. "నివేదయామి చాత్మానం త్వం గతిః పరమేశ్వర" భక్తుఁడు తనదియగు సర్వము నుపాస్యుని కర్పించుటయేగాక తనను అనఁగాఁ దనమనస్సును, ఇంద్రియములను, శరీరమును వాని కర్పించి వాని స్మరణమునకంటె వాని కైంకర్యమునకంటె నుత్తమమగు సుఖముఁ గోరకుండు.

ఇదియే పరమప్రేమరూపమగు భక్తి. సామాన్యముగ సంసారమున వర్తించుచుం బూర్వకర్మానుసారములగు శుభాశుభ వాసనలం గలిగియుండు జీవుం డెట్లెట్టి యుత్తమ భక్తిని సాధింపనగునో విచారింపవలయును.

సామాన్యజనులు లోకమునం దమకు సుఖమునిచ్చు పదార్థములను జంతువులను మానవులను బ్రేమింతురు. మొదట కేవలము తమసుఖమునే కోరుచుం గాలక్రమమునం దమకు సుఖమొసంగు నితరుల సుఖములను దమ సుఖముకంటె నెక్కుడుగ భావింతురు. దృఢమగు ననురాగముచేం గట్టబడి యుండు స్త్రీపురుషు లొండొరులయందలి ప్రేమాతిశయముచే నొకరొకరును రెండవవారి సుఖము నెక్కుడుగ భావించుచుందురు. అన్యోన్య సన్నిధానమే పరమసుఖముగ నెన్నుదురు. ఆసుఖమునకుం బోల్చుటకు ద్రవ్యము విద్యయు మొదలగునవియన్నియు ననర్హములుగం దోచును. స్త్రీ తనశక్తి యుక్తు లన్నిటిని బ్రియుని సంతోషముకొఱకు వినియోగించును. తన మనస్సును బుద్ధిని శరీరమును సయితము నాతనికి సమర్పించును. ఆస్త్రీ పురుషుండును దనశక్తియుక్తు లన్నియును, శరీరమును మనస్సును సయితము ప్రియురాలి కర్పించి యామెకు సుఖమునొనగూర్చుటకంటె నన్యమగు కార్యము లేక వర్తించును. ఇట్లు వర్తించుటయం దిరువురును దమయింద్రియ సంబంధములగు సుఖములను మఱచుచు రానురాను వారియం

దన్యోన్యానురాగము పరిశుద్ధమై నిష్కల్మషమైనదగు. తమున్న దాము మఱచి యొండొరులతోఁ దాదాత్మ్యము చెంది యిరువురు నొక్కరూపముగ నెంతురు. తనువులు రెండయ్యును వారొక్క మనస్సుతో భావించుచుందురు. ఇట్టి నిష్కల్మషమగు ప్రేమకంటె వేలకొలఁది మడుంగు లెక్కుడై మిగుల దృఢమై గాఢమయిన ప్రేమను భక్తుఁడగువాఁడు పరిపూర్ణుఁడును, దయాస్వరూపుఁడును, సమస్తకల్యాణగుణములు గలవాఁడును, సర్వము దానైనవాఁడును, ఆనందదాయకుఁడును, ఆనందస్వరూపుఁడును నగు పరమేశ్వరునియందు సమర్పించును. ఆ ప్రేమ యెంతకాల మనుభవించినను విరాగము పుట్టదు. అది యనన్యముగ నుండును. ఎంతవృద్ధియైనను భారము గానరాదు. దానినుండి కలుగు సుఖము లౌకిక సుఖమువలె క్షీణించునది గాదు. ఇవి యన్నియుఁ జక్కఁగఁ బరిశీలించి చూచినఁగాని పరమభక్తున కుపాస్యుని యందలి పరమ ప్రేమ యాథార్థ్యమును నూహింపఁ దరముగాదు. మొట్టమొదట నైహికములగు భార్యాభర్తృపుత్త్రాదుల యందుఁ బ్రేమఁ జేసి కాలక్రమమున నద్దానిఁ బరిశుద్ధముగఁ జేసికొని ఆ యనురాగమును భగవంతునియందు సమర్పించి పతిపుత్త్రాదులవలని సుఖమునకంటె నెన్నియోమడుంగు లెక్కుడగు సుఖమును భగవంతుని స్మరణాదులచేఁ జెందుచుఁ గ్రమమున నైహికమగు ప్రేమను బారమార్థికమగు

ప్రేమగ మార్చి పరమపురుషార్థ సాధనముగఁ జేసికొనవల యును.

భక్తిని సాధించుటకు మొట్టమొదట దేహమును బరిశుద్ధ ముగఁ జేసికొని సాత్త్వికాహారమునే గ్రహించవలయును. భక్తి యెప్పుడును ప్రేమరూపమైనది గావునఁ నా ప్రేమ ప్రేమాస్పదుఁడగు భగవంతునియందు వలె భగవంతుని సృష్టిలోనుండు సకల భూతములయందును బ్రవహించును. కావునఁ దా నాహారముగొనుచో నితరభూతముల కెంతమా త్రము హింసను గలుగఁ జేయరాదు. హింసను గలుగఁ జేయుట ప్రేమభావమునకు విరుద్ధము. ప్రేమభావమునకు విరుద్ధములగు కార్యముల నన్నింటిని బ్రయత్నముతో వదల వలయును. హింసవలనఁ బడయు నాహారము ప్రతిబంధకమగు టయేగాక భూతద్వేషము నభివృద్ధిచేయును.

అహింసా ప్రథమం పుష్పం పుష్ప మింద్రియనిగ్రహః ।

భగవంతుని కర్పించు పుష్పములలో అహింస సర్వో త్కృష్టమైనది. భక్తుఁడు సర్వభూతహితమును గోరువాఁడు. ఆహార నియమము మాత్రముగాక శరీరము నెప్పుడు ఇతర విధములం గూడఁ బరిశుద్ధముగ నుంచుకొనవలయును. అపరి శుద్ధులగువారలతో సాంగత్యమును విడువవలయును. ఇట్టి శౌచములేని శరీరము భక్తునకు యోగ్యముగాదు.

శరీరము మాత్రము పరిశుద్ధముగ జేసికొనినఁ జాలదు. మనస్సును సహితము పరిశుద్ధముగఁ జేసికొనవలయును. మనస్సులోని మాలిన్యములగు కామములను క్రమముగ విడువవలయును. కామములకు లోఁబడియుండు మనస్సు కామ్యార్థములయందు రమింపఁబోవుచు నిశ్చలభక్తికి నునికి పట్టు గానేరదు. యథార్థమగు భక్తి యనఁగా మనస్సు సర్వ కామములనుండి మరలించి యుపాస్యునియందు రమించునట్లు చేయుట. మనస్సు పలుకామ్యములయందు రమించుచుండి నచో నెట్లుపాస్యునిమాత్రము ప్రేమింప సమర్థమగు? మనో భీష్టము లన్నియు నుపాస్యునియందే త్రిప్పుచుండవలయును. మనస్సు పూర్వవాసనాబలముచేత నితర విషయములయందు రమింపఁ బరుగులిడుచుండినను దాని నట్లు పోనీయక యుపాస్య దైవమునందే మరల మరల నిలుపుచుండవలయును. దీనినే యభ్యాసమని చెప్పుదురు. మనస్సు బహుచంచలమనియును, బెనుగాలినైనను నిలుపవచ్చునుగాని మనస్సును నిలుపుట కష్ట తరమనియును మొఱయిడిన యర్జునునకు శ్రీ కృష్ణభగవం తుఁడు అభ్యాసముచేతను, వైరాగ్యముచేతను మనస్సు స్థిరముగ నిలుపుకొనవచ్చునని యుపదేశించి యున్నాఁడు గదా!

> చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవ ద్దృఢమ్ ।
> త స్యాహం నిగ్రహం మన్యే వాయో రివ సుదుష్కరమ్ ॥

అసంశయం మహాబాహో! మనో దుర్నిగ్రహం చలమ్ ।
అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥

(గీత. ౬-అ. 3౪-3౫)

పూర్వవాసనాబలముచే విషయములయందుఁ గలరాగము విడుచుట వైరాగ్యము. అట్లు విషయములనుండి విముఖమైన మనస్సు నుపాస్యునియందుఁ ద్రిప్పుట యభ్యాసము. విషయసుఖములు నశ్వరములని తెలిసి విషయములయం దాసక్తి పోయి విషయవిముఖమైన మనస్సును ప్రేమాస్పదుఁడైన యుపాస్యునియందుంచుట సులభము. అట్టి యుపాస్యునియం దుంచిన మనస్సున విషయములందలి రాగము తగ్గించుట సులభము. ఈ రీతిని వైరాగ్యాభ్యాసము లన్యోన్య సహకారములగును. ఈ రెండుపాయములచే మనస్సు నిశ్చలముగ నుపాస్యునియందు నిలుపనగు. అట్లు నిశ్చలముగ నిలిచిన పుడు భక్తునకు నుపాస్యుని మఱపుదగులుట యసాధ్యము గదా! ఎన్ని బాధలు వచ్చినను, ఎన్ని కష్టములు సంభవించినను, ఎన్ని మనోవ్యథలు ప్రాప్తించిన నుపాస్యుని మఱువఁడు.

భక్తునకు భగవత్పాదములను జేరవలయునని తాపము గలిగియుండవలయును. నిప్పు తగిలి మండుచుండు గృహము నంటుకొని ప్రతిక్షణమును ప్రాణాపాయము గలుగునని భీతిగల వానికిఁ ప్రాణరక్షకుఁడు వచ్చునా యను తీవ్ర పరితాపము గలిగియుండు రీతిని భగవంతుని బొంద నాశయుండవలయును.

అంతవఱకు దైవస్వరూపము గోచరముగాదు. నిజమగు భక్తున కట్టి సమయమున వేఱుచింత యుండదు. వాఁడు ప్రాణము తల్లడిల్లుకాలమున భగవంతునే చింతించుచుండును గాని వేఱుచింత వాని మనస్సున నుండదు. ఇదియే భక్తుని మనోవృత్తికిని సామాన్యుని మనోవృత్తికిని భేదము. భక్తుని మనస్సు సర్వకాలములయం దేకాగ్రమై, సుఖములందును దుఃఖములయందును జలింపక యన్నియు నాదైవమునొద్దనుండి భక్తానుగ్రహార్థమే వచ్చుచున్నవని నిశ్చలమైయుండు. ఇట్లే కాగ్రమై నిష్కామమైన మనస్సును, బరిశుద్ధాహారముచే శుద్ధశరీరమును భక్తుఁడు గాఁగోరువానికి ముఖ్యముగ నుండును. కావున భగవంతుఁడగు శ్రీ రామానుజాచార్యులవారు భక్తులు కాఁగోరువారలకుఁ బరిశుద్ధమగు దేహము, పరిశుద్ధమగు మనస్సు నుపాస్యుని నిరంతరస్మరణము సను నీమూఁడు సాధనముల విధించియున్నారు.

భక్తి యభివృద్ధి చేసికొనుటకు సాధనములు నిరంతరముగ నభ్యసింపఁ దగినవి మఱికొన్ని గలవు. ప్రతిదినమును గొంత కాల ముపాస్యుని బూజసేయవలయును. మొట్టమొదట నిష్టమగు కాలమునఁ బూజసేయుచుఁ బూజాకాలమున మనస్సు నుపాస్యునియందునిచి కాలక్రమమునఁ గాలమంతయు నామనస్సును వానియందే లయింపఁజేయ నభ్యసించుచు రావలయును. మఱియుఁ గొంతకాలము భగవంతుని

కళ్యాణగుణములను, వాని లీలావతారముల చరిత్రములను మనస్సున ధ్యానించుచు, నుపాస్యునియందు మనస్సు నేకాగ్రముగఁ జేయుట కభ్యసింపవలయును. ఇట్లు పూజలందును ధ్యానమునందును భక్తుఁడు ఆనందభరితుఁ డగును. ఆనందమును బొందునుగాని మఱెవ్విధమగు కామమును గోరఁడు. మఱియు నెల్లప్పుడును భూతహితము చేయుటకు యత్నింపవలయును. భగవంతునియందు భక్తియుండుటచే భగవంతునివలె నడచుటకు యత్నింపవలయును. భగవంతునియందున్న కళ్యాణగుణములను బలుమాఱు ధ్యానించుటచేతను, వానిలో నొక్కొక్కదాని నభ్యసించుటచేతను, ఆ గుణములను దనయందు దృఢముగ నెలకొలుప యత్నము చేయఁదగు. భగవంతుఁడు సర్వభూతహితము నెల్లప్పుడు చేయురీతిని దానును సర్వభూతహితమును గోరి కర్మములఁ జేయుచు, మనస్సును, వాక్కును, గాయమును, బరోపకారమునకే యుపయోగించుచుఁ దనవగు తనుకరణభోగములను బరోపకారమునకు వినియోగించుచుండవలయును. భగవంతుఁడు ఎల్లప్పుడు దయయే స్వభావముగఁ గలవాఁడు. ఇచ్చుటయే వారి నైజగుణము. భక్తుఁడును దనకుఁ గల సర్వస్వము భగవంతుని బిడ్డలగు సకల భూతముల కిచ్చుటయే ప్రథమకైంకర్యముగ నభ్యసించును. ఇదియేగదా ప్రేమయొక్క ప్రథమలక్షణము. స్వప్రయోజనము నించుకయైనను గోరక యున్నదంతయును

ప్రేమింపఁబడువారల కిచ్చుటయే ప్రేమ. దాని నెల్లప్పుడు నభ్యసింపుచుఁ, బ్రేమస్వరూపుఁడగుటకు యత్నింపఁదగు.

లోకమున నిట్లు ప్రతిఫల మపేక్షింపక ప్రేమించుట యెంత యరుదు? సామాన్యముగ నెల్లవారును బ్రతిఫలమెద్దియే నొకదానిని గోరువారలే గాని నిష్కల్మషముగఁ బ్రేమించు వారరుదుగ నున్నవారు. తాఁ బ్రేమించు వారినుండి ప్రతిఫల మించుకయైనఁ గోరుట కేవల వణిగ్వృత్తి గాని పరిశుద్ధమగు ప్రేమగాదు. పరిశుద్ధమగు ప్రేమ యల్పమైనను బ్రతిఫల మును గోరదు.

ఈ రీతిని మనోవాక్కాయముల పారిశుద్ధ్యమును, అహింసయుఁ, బరోపకారబుద్ధియు నభ్యసింప నిష్కామమగు భక్తి యభివృద్ధియగు.

సత్పురుషుల సాంగత్యము మఱియొక సాధనము. ఎప్పుడు నాత్మవిషయమగు సంభాషణములఁగాని, పరమాత్మధ్యాన మునఁగాని కాలము గడుపుచుండు పెద్దల సాంగత్యమున భక్తుఁడు పరిశుద్ధుఁడగు. అట్టివారలతోటి సంభాషణ మెట్టి వారినిగాని యుత్తమస్థితికిం దెచ్చును. కేవల సంసారవిషయ ములగు సంభాషణములుగాని వృథా ప్రసంగములుగాని వారు చేయరు. ఎప్పుడును బరమార్థసాధనములగు సంభాషణములు చేయుచుందురు గావున వారిసాంగత్యము పరమపవిత్రమైనది. అంతియుగాదు. అట్టివారి సాన్నిధ్యంబున వారి మనశ్శక్తియు,

మనఃపారిశుద్ధ్యమును ఇతరుల మనస్సులను గూడఁ బరిశుద్ధములుగఁ జేయు. వారి శరీరములనుండి యెల్లప్పుడు బయలు వెడలు పరిశుద్ధములగు నణువులసముదాయము సయితము సమీపమున నున్నవారి శరీరములయందుఁ బ్రవేశించి యా శరీరములను బరిశుద్ధములుగఁ జేయును. దీనినే వారి పాద ధూళియని చెప్పుదురు. ఈ కారణములచేత సత్సాంగత్యము యొక్క ఫల మింతయని లెక్కించుట యసాధ్యము.

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ।

అని శ్రీ శంకరభగవత్పాదాచార్యులవారు వ్రాసియున్నారు. ఎప్పుడును దనకంటె నుత్తములగు వారల సాంగత్యమును వెదకి సంపాదించి యనుభవించుచుండఁదగు. అట్లుగాక యల్పబుద్ధులును, విషయాసక్తులును నగువారి సాంగత్యము చేయువారు చెడిపోవుదురు.

మఱియు సత్పురుషుల సాంగత్యమువలె సత్పురుషులగు వారిచే వ్రాయఁబడిన గ్రంథముల వ్యాసంగముచేయుట యింకొక సాధనము. అట్టి వారలు రచించిన గ్రంథములు సద్విషయములను గుఱించినవి. కావున నా గ్రంథముల వ్యాసంగము చేయఁదగు. అట్టి గ్రంథముల వ్యాసంగము చేయుటచేత మనస్సు సద్విషయములందే రమించుచు, నసద్విషయముల సంసర్గములేక పరిశుద్ధమగు. భగవంతుని చరిత్రములను,

భాగవతులయుఁ బరమభక్తులయుఁ జరితములను, బరమార్థ జ్ఞానమును, జ్ఞానసాధనములను బోధించు గ్రంథములు పావనములు గనుక పూనికతోఁ జదువఁదగినవి.

మఱియు భక్తాగ్రేసరుండగు ప్రహ్లాదుఁడు భక్తునకు భక్తి యభివృద్ధి కాఁగలమార్గములను వివరించియున్నాఁడు.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్ ।
అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్ ।
ఇతి పుంసార్పితా విష్ణౌ భక్తిశ్చే న్నవలక్షణా ॥

(శ్రీ భాగవతము ౭-౫-౨౩-౪)

తనుహృద్భాషలసఖ్యముఁ శ్రవణముఁ దాసత్వముఁ వందనా
ర్చనము ల్సేవయు నాత్మలో నెఱుకయు స్సంకీర్తనల్చింతనం
బను నీతొమ్మిది భక్తిమార్గముల సర్వాత్మకుఁ హరిన్నమ్మి స
జ్జనుఁడైయుండుట భద్రమంచుఁదలతుఁ సత్యంబు దైత్యోత్తమా ॥

(ఆంధ్రభాగవతము)

ఉపాస్యుని చరితముల శ్రవణముచేయుట. ఉపాస్యుని నామములచేఁ గీర్తనము చేయుట, అనఁగా భజించుట. ఉపాస్యుని నామరూపములను స్మరణముచేయుట, అనఁగా నంతఃకరణమునందు మఱువకుండుట. ఉపాస్యుని పాదముల సేవించుట. షోడశోపచారములచే నర్చనము సేయుట. సాష్టాంగ దండప్రణామములు చేయుట. ఉపాస్యుని కైంకర్యము సలుపుట, అనఁగా భృత్యునివలె నిష్కామములగు కైంకర్యములు

చేయుట. ఉపాస్యునియందు స్నేహరూపమగు సఖ్య భక్తి. అర్జునుని భక్తియు నుద్ధవునిభక్తియు నిందులకు దృష్టాంతము. వారిరువురు శ్రీ కృష్ణునియందు నిత్యము స్నేహము చేయుచు, వారి సాంగత్యమును కోరుచు నుత్తములగు స్నేహితు లన్యోన్యాను రాగముచే బద్ధులయి మైత్రీభావము నొందురీతిని భక్తుఁడుపాస్యుని జెలిఁగా భావించి సదా హరిసన్నిధానమును గల్పించుకొనియుందురు. బలిచక్రవర్తివలె దేహసహితముగ సర్వస్వము నుపాస్యున కర్పించుట. అను నీ తొమ్మిది విధములగు భక్తిని వారియందు సమర్పించవలయును.

మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।
శ్రద్ధయా పరయోపేతా స్తే మే యుక్తతమా మతాః ॥

(గీత. ౧౨-౨)

యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।
అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ।
తేషా మహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।
భవామి నచిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్ ॥

(గీత. ౧౨-౬-౭)

మనస్సు సదా నాయందు నిలిపి సమాహితచిత్తులై, యుత్తమమగు శ్రద్ధతోఁగూడినవారలై యెవరు నన్ను ధ్యానింతురో వారలు యోగులలో శ్రేష్ఠులు. ఎవ్వరైతే సర్వకర్మములను నాయందు సన్న్యసించి నన్నే పరమగతిగా నెంచుచు వేఱు శరణము లేక నన్నుపాసించి ధ్యానింతురో వారలను

జననమరణరూపమగు సంసారమునుండి శీఘ్రముగఁ దరింపఁ జేయుదును. అని భగవంతుఁడు గీతాశాస్త్రమున నొక్కి చెప్పియున్నాఁడు.

మనస్సు సదా యుపాస్యునియందుంచుట, నిరంతరము ధ్యానించుట, పూజించుటయు, నుపాస్యుని పరాగతియని భావించుట, దృఢమగు శ్రద్ధగలిగియుండుటయు నివి భక్తుని ముఖ్యధర్మము లగుచున్నవి. అట్టి భక్తులను భగవంతుఁడే శీఘ్రకాలమున నుద్ధరించెదనని వాక్రుచ్చియున్నాఁడు.

ఈ విధమున బహువిధములగు సాధనములచే భక్తి నభ్యసించి కాలక్రమమున భక్తుఁ డీశ్వరానుగ్రహపాత్రుఁడగును. ఇంతియగాదు. ఈ మార్గములఁ దనశక్తికొలఁది నభ్యసించుచుఁ బూర్వాధ్యాయమున సూచింపఁబడినరీతిని దనయుపాధులను సంస్కరింపఁ జాలినవియుఁ దన్ను ఋణవిముక్తునిగఁ జేయునవియునగు కర్మములను జాగరూకుఁడై చేయుచు, సర్వభూతములను ప్రేమించుచుండఁ గాలక్రమమునఁ గర్మము పరిపక్వముకాఁగా నీశ్వరానుగ్రహమునకుఁ బాత్రుఁడగు.

అపుడు ఏకాంతధ్యానమున భక్తుఁడు పరవశుఁడై యుండ భక్తపరాధీనుఁడగు నాభగవంతుఁడు భక్తుని శుద్ధాంతఃకరణమున నొకనిమేషమాత్రమైనను జూపట్టినఁ భక్తుఁడు పరమానంద భరితుఁడగు. అదిమొదలు భక్తునిమార్గమంతయు నాజ్యోతిచేఁ బ్రకాశించును. వెనుక మాటిమాటికిఁ బూర్వపు

నజ్ఞానము తన్నుఁ గప్పుచుండినను జ్యోతిర్మాత్రము మఱుపు దగులదు. అది మొదలు విషయము లన్నియు భక్తునిమార్గము నుండి మరలిపోవుటయే గాక వానియందలి రుచియుతము భక్తుని వదలిపోవును.

......రసో ప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ (గీత.)

పరస్వరూపదర్శనము కాఁగా విషయములయందుండిన నల్పమగు నాశయము విడిచిపోవునని తాత్పర్యము.

ఆ యుపాస్యుని తేజస్సును జూచిన దృష్టికిఁ దక్కిన పదార్థము లన్నియు నిస్సారములై కన్పడును. అది మొదలు దృష్టి యాత్మవిషయములయం దించుకయైనను దిరుగదు. అప్పుడు భక్తుఁ డుపాస్యునియందే మునిఁగి యెడతెగక యానందము ననభవించుచుండును. అపుడు జగమంతియు నాయుపాస్యునిచే నిండినట్లేయుండును. అన్నింటియందు నుపాస్యదైవము తప్ప వేఱుతత్త్వముగానరాదు, లోకమునం జేయఁదగుకార్యము లన్నియు నాయుపాస్యుని కైంకర్యములుగ బుద్ధికిఁ దోఁచును. వేఱుకార్యమే కానరాదు. భగవంతు నెల్లచోటుల నెల్లప్పుడును జూచుచు నెప్పుడెప్పు డేయేకార్యములు చేసినను, ఆ భగవంతుని కైంకర్యములుగా నెంచును. కావుననే యుద్దేశమునఁ బరమభాగవతోత్తములు శరీరపోషణముకొఱకుఁ జేయు కార్యములుఁగూడ స్వకార్యములుగా భావింపరు.

శరీరముననుండు భగవంతుని యారాధనములుగ భావింతురు. గృహమునకుఁ దేఁబడు తండులములు శాకములు లోనగునవి భగవన్నివేదనముకొఱకుఁ దేఁబడినవని తలఁతురు. తాము భుజించుటయు భగవదారాధన మని చెప్పుదురు కాని వేఱు మాటలచేఁ దెలుపరు. ఇట్టి యీశ్వరభావము నిరంతరముగ నుండవలయునని పెద్దలయుద్దేశ్యము. ఇక్కాలమున భావమును వదలి శబ్దములమాత్ర ముపయోగించుటయే గాక యాశబ్దములు గొన్నిసమయముల నపహాస్యముతోఁగూడ నుపయోగించుటయుఁ గలదు. పెద్దల యభిప్రాయములును, ఉద్దేశ్యములు నెట్లపార్థము లగుచున్నవో చూడ మిగుల సంతాపాస్పదముగ నున్నయది.

ఇట్లు సర్వకాలములయందును సమస్త భూతములయందు నుపాస్యదైవమునే చూచుచు భృత్యుఁడై యెల్లప్పుడు కైంకర్యము చేయుచుండును. తనదగుశక్తి యొక్కటియు లేదనియు, సర్వము నాయుపాస్యునిచే యనియు దృఢనిశ్చయుఁడై యహంకారము పూర్ణముగ విడుచును. మొదటనుండియు నహంకారమును విడుచుచుండినను దానియంకురమైన నెంత మాత్రముండినను దానినిగూడ విడుచును.

అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।
విముచ్య నిర్మమ శ్శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥
(గీత. ౧౮-౫౩)

అహంభావము బలము గర్వము కామము క్రోధము విషయములను గ్రహించుటయు నివి యన్నియును విడిచి మమకారము సహితము లేనివాఁడు శాంతస్వరూపుఁడై బ్రహ్మస్వరూపుఁడగుటకు సిద్ధుఁడగుచున్నాఁడు.

బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।
సమః సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥

(గీత. ౧౮-౫౪)

బ్రహ్మభూతుఁడై ప్రసన్నమగు నంతఃకరణముగలవాఁడై యెన్నఁడైనను బ్రాప్తించిన యప్రియములకు దుఃఖము నొందఁడు. లేనివానిని గోరఁడు. సమస్తభూతములయందు బ్రహ్మస్వరూపము సమముగఁ జూచుచు నాయం దుత్కృష్టమగు పరాభక్తిని బొందుచున్నాఁడు.

భక్త్యా మామభిజానాతి యావాన్ యశ్చాస్మి తత్త్వతః ।
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్ ॥

(గీత. ౧౮-౫౫)

ఇట్టి పరాభక్తిసహాయమున నాస్వరూపమును యథార్థముగ నెఱుంగును. అట్లెఱింగి యాపిదప నాయందుఁ బ్రవేశించును.

సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।
మత్ప్రసాదా దవాప్నోతి శాశ్వతం పద మవ్యయమ్ ॥

(గీత. ౧౮-౫౬)

సర్వకర్మములను సహితము చేయుచు నన్నే ఆశ్రయముగ భావించుచుఁ గడపట నాయనుగ్రహమున శాశ్వతమగు పురుషార్థమును బొందుచున్నాఁడు.

ఈ మూఁడు శ్లోకములయందును భక్తునిచే నెక్కఁబడు కడపటి సోపానములను శ్రీ కృష్ణభగవంతుఁడు నిరూపించి యున్నాఁడు. అహంకారాదుల వదలి బ్రహ్మభూతుఁడై పరాభక్తి నొందుచున్నాఁడు. ఇదియే సాధ్యభక్తి యనఁబడుచున్నది. అట్టి యుత్తమోత్తమమగు భక్తి ప్రకాశింపఁగ భక్తున కుపాస్యుని స్వరూపము పూర్ణముగ నభివ్యక్తము కాఁగా నాయుపాస్యుని స్వరూపమును యథార్థముగ నెఱుంగును. అట్టి పరాభక్తిచేఁ దత్త్వజ్ఞానము సంపూర్ణముగఁ బ్రకాశింప నుపాస్యునియందుఁ బరవశుఁడై మునింగి బ్రహ్మానందము ననుభవించుచుండు. భక్తిజ్ఞానములు పరిపూర్ణముగఁ బ్రకాశింప సర్వకర్మముల సహితము జాగరూకుఁడై లోపములేక లోకుల మేలుకొఱకుఁ జేయును. ఇట్లు భక్తిజ్ఞానకర్మములు మూఁడును బరిపూర్ణములుగ నాభక్తునియందు వెలయును. ఇట్లు మూఁడు శక్తులను జూపుచు సచ్చిదానంద స్వరూపుఁడగు యోగి యగుచున్నాఁడు. ఈ మూఁడు లక్షణములం గలుగు యోగిని కేవల భక్తునికంటెను, కేవలజ్ఞానికంటెను, కేవలకర్మికంటె నధికుఁడని భగవంతుఁడు చెప్పియున్నాఁడు.

ఇట్లు వరుసగ మూఁడు మార్గములును సంక్షేపముగ వివరింపఁబడినవి. మూఁడుమార్గములవలనను బొందఁదగు గమ్యస్థాన మొక్కటి యనియు నిరూపింపఁబడినది. మార్గములు మొదటమొదట భిన్నభిన్నములుగ నున్నను దుద కొక్కటి యగుచున్నవి. కర్మమార్గమునఁ బరిపూర్ణుఁడు కాఁగా భక్తిజ్ఞానములు తమంతటఁ గర్మిహృదయమునం బ్రకాశింపఁబరమయోగి యగును.

జ్ఞానపరిపాకవశమగు నపరోక్షజ్ఞానమును • భక్తిపరిపాకమగు పరాభక్తియును నొకటియేయని పెద్దలు చెప్పుచున్నారు. భక్తుఁడు తనయందుఁ దప్ప నెల్లెడల నుపాస్యునిఁ జూచుచుఁ గడపటఁ దనయందును జూచిన జ్ఞానము వికసించి యది యపరోక్షజ్ఞాన మగు. తనయందే పరమాత్మను జూచుచున్న జ్ఞానికిని పరిపాకదశయం దంతటను బరమాత్మ కనఁబడ భక్తి వికసించి పరాభక్తి యగును. భక్తిజ్ఞానమార్గములు కడపట రెండును నొక్కటియె యగును. జ్ఞానులును భక్తులును బరిపాకదశానంతర మాధికారికాది పదములయందు నిలిచి, లోకానుగ్రహార్థము కర్మము చేసినవారిని కర్మమార్గము నవలంబించువారని చెప్పవచ్చును. కర్మయోగియు భక్తిజ్ఞానముల నవలంబించినఁగాని పరిపూర్ణకర్మయోగి కానేరఁడు. ఈరీతిని మూఁడుఁయోగములును బరిపాకదశయం దొకటియె యగును.

పదాఱవ యధ్యాయము

అర్చనము

యజ్ఞములును హోమములును దేవతలనుద్దేశించి చేయు దురనియును, దేవతలవలనఁ బొందిన మేలునకు మాఱుచేయు దురనియును వివరింపఁబడియె. ఐనను జీవుఁ డీశ్వరాంశమై యుండుటచేతను, సమస్త దేవతలు నీశ్వరాంశములుగనే యుం డుటచేతను, ఆ దేవతలకుంగల ఋణము తీర్చుటతో జీవుఁడు తృప్తుఁడు కాఁడు. ఈశ్వరునినుండి వెలువడిన కళయే కావున నాయీశ్వరునిం జేరుటను జీవుఁడు ముఖ్యముగఁ గోరుచుండును. ఇట్లు తన యుత్పత్తిస్థానమగు నీశ్వరుని జేరుటకుంగల మార్గ ములు సంక్షేపముగఁ బూర్వాధ్యాయముల వివరింపఁబడియె.

తనయందు బీజరూపముగ నుండు నాత్మశక్తులను వికసింపఁ జేసికొనుటకుఁ బ్రతిజీవునకుం బూజ యావశ్యకము. జీవుఁ డెల్లప్పుడును బూజసేయునది భగవంతునినే. ఏ రూపమునఁ బూజించిన నారూపమున భగవంతుఁడే యభివ్యక్తమై యున్నట్లు భగవంతుని బూజించునుగాని భగవంతుని కంటె భిన్నమగు దానిని బూజించుటలేదు. పూజజేయుట కెప్పుడును భగవంతుని సాకారముగ భావించుట సులభోపాయము.

శ్రీమన్నారాయణమూర్తి రూపమున సకలచిహ్నములతోఁ గూడియున్నట్లు గాని, శ్రీ సదాశివ స్వరూపమునఁ గాని, లోకమాతయగు శక్తిస్వరూపమునఁగాని, భగవంతుని యవతారములగు శ్రీ రామకృష్ణాదిరూపములం గాని, లోకమునకంతటికిని వెలుఁగును వేఁడిమిని ప్రాణశక్తి నిచ్చి రక్షించు లోకచక్షువగు సూర్యుని రూపమునఁగాని, క్రైస్తువు బుద్ధుఁడు మొదలగు రూపములంగాని పూజింపవచ్చును. సాకారము గాక కేవలము సచ్చిదానంద స్వరూపునిగ నగుణబ్రహ్మమును నహితము పూజించుట కష్టము. జ్ఞానమార్గమున నడుచు వారలకు మాత్ర మది సాధ్యముగాని సామాన్యముగ నెల్ల వారికి నసాధ్యము. ఇట్టి యవ్యక్తోపాసనము కష్టసాధ్య మనియును, భగవంతుఁ డర్జునున కుపదేశించియున్నాఁడని ముందే చెప్పఁబడియె. సాకారముగఁ బూజసేయుట సులభమార్గము కావున నది యనేకులకు సాధ్యము.

మఱియు నర్చనము బాహ్యపూజయు నాంతరంగిక మగు నుపాసనయు నని రెండువిధములు. బాహ్యపూజయందు స్థూలలోచనములకు గోచరమగు మూర్తి భగవంతునకుఁ బ్రత్యామ్నాయముగ నుపయోగింపఁబడును. పుష్పములు మొదలగు పూజాద్రవ్యములు నహితము నుపయోగింపఁబడు. ఆమూర్తి విగ్రహముగాఁగాని, సాలగ్రామముగాఁగాని, లింగముగాఁగాని, నానావిధములుగ నుండును. ఒక్కొక్కరూపమును

గొన్ని చిహ్నములతో వెలసి భగవంతుని శక్త్యాదులలోపలఁ గొన్నింటిని నిరూపించుచుండును. పూజించు విగ్రహము శంఖ చక్రగదాధరుఁడుగను, జతుర్భుజుఁడుగను, శ్రీవత్సాంకుఁడు గను లక్ష్మీసమేతుఁడుగను నలంకరింపఁబడి శ్రీమన్నారాయణ మూర్తిని దెలుపును. ఆ చిహ్నము లొక్కొక్కటియు నా దేవుని శక్తులను సూచించుచు, నుపాసకుఁడు మనస్సున నా శక్తులను ధ్యానించుటకు సహాకారము లగుచున్నవి. ఆ విగ్రహము, శూలము, వజ్రము, ఖడ్గము, పరశువు, కపాలము, డమరుకము, వ్యాఘ్రచర్మాంబరము నీ మొదలగు చిహ్నము లతోఁగూడిన శ్రీ సాంబసదాశివునిఁ దెల్పుచు నా దేవుని లక్షణములను ధ్యానించుటకు సహాకారమగును. శ్రీమన్నారాయణమూర్తి బింబమునుజూడ నాలుగు భుజములు, శంఖచక్రములు మొదలగునవి యామూర్తి నాలుగుభుజములచే నాలుగు దిక్కులను లోకమంతయును బరిపాలించి రక్షించు ప్రభువని యును, శంఖము సృష్టికారణమగు శబ్దబ్రహ్మ స్వరూపమని యును, చక్రము స్వాధీనమై వర్తించుచుండు సమష్టి మనస్తత్త్వమనియును, లేక వాని యధీనమునఁ బరిభ్రమించుచుండు ప్రపంచచక్రమనియును, శ్రీవత్సము స్వాధీనమై వర్తించు ప్రకృతిస్వరూపమనియును దెల్పుచు, నారూపమున మూర్తీ భవించియుండు భగవంతుని దెల్పును. శూలము, ఖడ్గము, వజ్రము మొదలగు నాయుధములు లయకర్తయగు మహా

దేవుని జూపును. వరదాభయహస్తములు రెండును లయకర్త యందు జీవులనుద్ధరించి యుత్తములుగఁ జేయు మహానుభావునిగఁ దెల్పును. కపాలము వ్యాఘ్రచర్మమును వైరాగ్యసుఖము కంటెఁ బరమగుసుఖము లేదని బోధించును. అర్ధదేహమును ధరించియుండు నంబ బ్రహ్మవిద్యాస్వరూపిణి యగు లోకమాత తనబిడ్డల నపారకరుణచే రక్షించి తండ్రిపాదములం జేర్చు మహాశక్తి యనియును, సకలార్థదాయిని యనియును బోధించును. అంబయే ముముక్షువులకు శివుని పాదపద్మములను, స్మరణచే మోక్షమును, జిజ్ఞాసువులకు జ్ఞానమును, సర్థార్థులకు సిద్ధార్థములను నిచ్చుతల్లి. విష్ణుబ్రహ్మలకు సహితము ఆద్యంతములు గనరాని జ్యోతిర్మయమగు స్తంభముగ విజృంభించిన మహాదేవుని చిహ్నము లింగము నిరవయవుఁ డనియు సూచించును.

సాలగ్రామము విష్ణువు ప్రతీకముగ భావింపఁ బడుచున్నది. ఇట్లు స్థూలములగు నింద్రియములకు గోచరములగు బింబములు బాహ్యపూజయందు పయోగింపఁబడును. మఱియుఁ బుష్పములు హృదయము నుండి వెలువడు భక్తిజ్ఞానములను దెల్పును. భక్తితో నిండియుండు హృదయముతో భగవంతుని భావించువో నాభక్తి ప్రత్యయములు సూక్ష్మలోకమునఁ బుష్పరూపమున యోగదృష్టికిఁ గనఁబడు నని యోగులు చెప్పుచున్నారు. హృదయమునుండి యుపాస్యుని పాదములం

గూర్చి ప్రవహించు భావములే పుష్పములుగ నర్పింపఁబడుఁ గావునఁ బుష్పాలు నాభక్తి సంకల్పములను సూచించు. కావు ననే భక్తుఁ డుపాస్యుని బింబమును బుష్పములతోఁ బూజించుచో నాపుష్పములను హస్తములంగొని హృదయసమీపమునకుం గొంపోయి హృదయమునుండి యుపాస్యుని పాదములయం దర్పించును. మఱియు జలములు నభిమంత్రితములై పరిశుద్ధములై యుపాస్యదైవము తేజస్సుతోఁ గూడినవియైన నాజలములను భక్తుఁడు తనపైఁ బ్రోక్షించుకొనఁగా భక్తుని స్థూలసూక్ష్మోపాధులు పరిశుద్ధములై యుపాస్యుని దివ్య తేజస్సును బొందుట కర్హములగుచున్నవి.

ఉపాసకుఁ డుపాస్యునిరూపము నేకాగ్రమగు దృష్టితో నొక కొంతసేపు లక్షించిచూచి కన్నులు మూసికొని యారూపమును మనంబున సంపూర్ణముగ స్పష్టముగ నిర్మించుకొనవలెను. అట్లు మానసికమగు రూపమును గల్పించి ధ్యానించుటకు బాహ్యమగు బింబము సహకారియగును. ఇట్లు సులభముగ బాహ్యబింబమునుండి యాంతరంగికమగు మానసికబింబమును ధ్యానింప సాధ్యమగు. ఆ బింబముగూడఁ గ్రమమున సచేతనమై యుపాస్యస్వరూపమే యగును. భక్తుఁడు ధ్యానించుటయందును, స్తోత్రములందు నుపాస్యుని లక్షణములను గుర్తించుచు నాలక్షణములను దనయందభివృద్ధిచేసికొనం గోరుచుఁ గ్రమక్రమమున నుపాస్యునియందు మనస్సు లయిం

చినఁ దదేక ధ్యానపరుఁడై బహిఃప్రజ్ఞయు లేకయుండును. అపుడా యుపాస్యుని సన్నిధానమున నున్నట్లు భావించుచు శాంతిరూపమగు నానందమును బొందును. ఇవ్విధమైన మంత్రపూతమగు జలముచే దనయుపాధుల స్వభావమునఁ గలుగు మాలిన్యమును బోఁగొట్టి వానిని బరిశుద్ధములుగఁ జేసి బాహ్యబింబము సహాయమున మనస్సు నేకాగ్రముగఁ జేసి మానసిక బింబమును గల్పించుకొని యాబింబమున నుపాస్యుని యథారూపముగఁ జూచుచు, నాదేవుని దివ్యలక్షణములను, గుణములను ధ్యానించుచు, నుపాస్యునియందుఁ బరవశుఁడై యానందము ననుభవించును.

ఇట్లు బాహ్యములగు బింబములు, చిహ్నములు నుపాసనమునకు మిగుల సహాకారులు. మానసికమగు బింబమును నిర్మించి ధ్యానించుట కందఱకు సాధ్యము కాదు. కావున బాహ్యములగు విగ్రహములు లోనగునవి మిగుల నుపయోగకరములు. ఎవ్వరేని మానసికబింబమును బూజింపఁజాలక యుండి బాహ్యవిగ్రహములఁ బూజించిరేని వారియందు దప్పులు పట్టుట సరిగాదు. అట్టివారిని బాహ్యములగు విగ్రహాదుల నుపయోగించక యుండుఁడని బోధించిన వారలకు గీడు చేయుదురుగాని మేలు చేయఁజాలరు. ఇట్టులే బాహ్యములగు నాలంబనము వలయువారు వానినుపయోగింపక మానసిక ధ్యానము చేయువారలయందు దప్పులు పట్టుటయును సరిగాదు.

వారివారి మనోవృత్తులకుఁ దగినట్లు వారివారి యోగ్యతానుసారము రెండు నుపయోగకరములగు మార్గములే. ఒక్కొక్కరు నితరుల యుపాసనామార్గముల దూషింపక యన్యోన్య సహిష్ణువులై సుహృద్భావముతో నుండిన నందఱును గాలానుసారముగ గడతేరుదురు. అన్ని మార్గములు భగవంతుని మార్గములే. అన్ని మార్గములందును బలువు రా భగవంతుని పాదములను జేర యత్నించువారలే. ఏయే మార్గమున నుపాసించిన నాయా మార్గముననే యుపాసకుల ననుగ్రహించెదనని యును, మార్గములన్నియును దనయొద్దకుఁ జేర్చునవియే యనియు శ్రీ భగవంతుఁడు గీతాశాస్త్రమున నుడివియున్నాఁడు.

> యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజా మ్యహమ్ ।
> మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥
>
> (గీత. ౪-౧౧)

విగ్రహముల నుపయోగించుటవలని ప్రయోజనము లనేకములు.

౧. ధ్యానించు వారి మనస్సులు చంచలములుగ నుండును. కనుక చంచలములగు మనస్సుల నేకాగ్రములుగఁ జేయుటకు బాహ్యమగు విషయ మావశ్యకమను విషయము ముందే విస్తరింపఁబడెను. విగ్రహమునందలి చిహ్నములు సహితము పాస్యుని లక్షణములను శక్తులను సూచించుచుండుటచే ధ్యానమునకు సహితము సహకారు లగుచున్నవి.

మఱియు విగ్రహము శాస్త్రీయముగఁ జేయఁబడి మంత్రములచేతను, నాగమ ప్రయోగములచేతను, ప్రాణప్రతిష్ఠ చేయఁబడినవు డాబింబము తేజోమయమై దేవతాశక్తి దనయందుఁ గల్గి దినదిన ముపాస్యునిచేఁ బూజింపఁబడుచు ధ్యానింపఁబడుచు రాఁగాఁ గ్రమక్రమమున దానియందలి దేవతాప్రభావము మహిమయు వృద్ధియగును. పూజించువాని భక్తిజ్ఞానము లెంత యెక్కువగనుండిన నాబింబమునందలి తేజోమహిమములు నహితము నంత యెక్కువగ నుండును. ఉపాస్యుని భక్తిజ్ఞానములు హెచ్చను బింబమునందలి తేజోమహిమములు నహితము దినదిన ప్రవర్ధమానము లగుచుండును. అట్టి బింబమును భక్తుఁడు సమీపించగనే మనస్సు రమ్యమగు భక్తితో నిండి ధ్యానమున కున్ముఖమగు. ఆ బింబమును జూచినమాత్రమున శరీరము పులకాంకితమగుటయు, మనస్సు భక్తిపరవశమగుటయు, దేవతాధ్యానము తప్ప వేఱు తలఁపులు మనస్సునందుఁ జొరక మనస్సేకాగ్రమగుటయు నీ మొదలగు ఫలము లాబింబమునుండి కలుగును. ఆ బింబముయొక్క సామీప్యమునఁ బరిశుద్ధమగు తేజస్సుండుటచేత నుపాసకుని సూక్ష్మశరీరము నహితము సౌమ్యచలనము గలది యగు. సాంసారిక తాపత్రయములును, హేయములగు మనోవికారములునుఁ దొలఁగును.

ఇంతియగాదు. లోకమునఁ బ్రేమాతిశయముచే బద్ధులగు మిత్రులొండొరులకు వియోగము ప్రాప్తించినను మిత్రుని ప్రతిరూపమగు నొకబింబమును (ఫోటోగ్రాఫ్‌ను) సమీపమున నుంచుకొని చూచునప్పుడెల్ల నపారసుఖమును, సంతోషమును, దృప్తిని బడయుటఁ గానమా! విగ్రహాదిపూజయుఁ దత్సమమేయయ్యు నంతకంటెను బెక్కుమడుంగు లెక్కుడు ప్రయోజనకారియయి యుండును. ఆ బింబమును జూచినపుడెల్లను దివ్యమంగళ విగ్రహుఁడును, దయామయుఁడును, నానందస్వరూపుఁడును, సకలానందదాయకుఁడును నగు నుపాస్యుఁడు మనస్సునకుఁ బ్రసన్నుఁడగు. దినదినము తాను బూజించి ప్రేమించి భావించి ధ్యానించు బింబమగుటచే దినదినము నా బింబమునఁ బ్రీతియెక్కువగుచు నావిగ్రహము ప్రత్యక్షమగు దైవమే యైనట్లగు. ఆ విగ్రహము తనప్రాణమునకంటె నెక్కువ యగు. ఆ విగ్రహము మొదట సమూల్యముగ నుండినను గొంతకాలమున కది యమూల్యమగు.

ఇక్కారణములను బట్టి విగ్రహము లుపయోగించు టనేకవిధములఁ బ్రయోజనకరముగ నుండును. కావున నిజముగ భగవద్భక్తులగు వారలు విగ్రహము లుపయోగించువారలయం దసూయపడక వారలయందు బుద్ధిభేదమును బుట్టింపక యుండుట యుక్తము. స్వానుభవముచేఁ దత్త్వము నెఱింగిన

వారు చేసిన నిబంధనల తత్త్వమును దెలియనివా రాక్షేపించుటకంటెఁ బరీక్షించి చూచుట శ్రేయస్కరము.

ఈ కారణములనుబట్టియే దేవాలయములయందు విగ్రహములు పూజింపఁ బడుచున్నవి. పైని సూచింపఁబడిన కారణములుగాక దేవాలయములయందు మఱియొక గొప్ప ప్రయోజన మున్నయది. అచ్చటఁ బలువురు భక్తులు వచ్చి భక్తితోఁ బూజసేసి భక్తిసలుపుటచేత నా విగ్రహములయందలి మహిమయు విశేషమగుచుండును. పూజకు వచ్చువారందఱు సామాన్యముగ నక్కడ భక్తితోఁ గూడియుందురు. కావున నాస్థలము భక్తిని వృద్ధిచేయు స్వభావమును బొంది యుండును. మఱియు నచ్చటికిఁ బోవుటచే నొకరినిజూచి యొకరు భక్తులగుట కవకాశముండును. సామరుల కక్కడ జరుగు నుత్సవములు మొదలగునవి కన్నుల పండువై వారి మనస్సులందు భక్తి నభివృద్ధిచేయుచుండును.

దేవాలయములు నిర్మించుటయందుఁ గొన్ని రహస్యములు గలవు. దేవాలయమున నేడు ప్రాకారములో మూఁడు ప్రాకారములో యుండు. అవి జీవునికోశములను బ్రహ్మాండమునందు లోకములను సూచించుచుండును. ఆ యేడు ప్రాకారముల కవ్వల స్వామి యుండునట్లు ఏడుకోశములను దాఁటి లోపలికిఁబోయిన నాత్మసాన్నిధ్యము గలుగునని కాని యేడు లోకముల నతిక్రమించినంగాని భగవంతుని జూడ సాధ్యము

కాదనికాని సూచించును. కొన్ని యాలయములయందు మూఁడు ప్రాకారములే యుండు. మఱియుఁ గొన్నిటియం దొక్కప్రాకారమును దానిలోపల ముఖమండపమును, దానిని దాఁటిన పిదప గర్భగృహమును నను మూఁడు నుండును. ఆ మూఁటి నతిక్రమించిన స్వామిని జేరవచ్చును. ఇదియు నాత్మ తత్త్వమునే మఱియొకవిధముగ బోధించుచున్నది. మూఁడును జీవుని స్థూలసూక్ష్మకారణశరీరములను మూఁటినిగాని యీశ్వ రుని సమష్టిరూపములగు విరాడ్రూపము, హిరణ్యగర్భ స్వ రూపము, సూత్రాత్మస్వరూపము లనుమూఁడు రూపములను గాని సూచించును. వానిని దాఁటి పరమాత్మ నెఱుంగఁదగు నని తెలుపుచున్నవి. ఇట్లు దేవాలయములు స్థూలదృష్టిచేఁ బామరులకు భక్తిజనకములును, సూక్ష్మబుద్ధికి జ్ఞానజనకము లునుగ నిర్మింపఁబడియున్నయవి.

విగ్రహములన్నియు నర్చావతారములని భక్తులచే నెన్నఁ బడుచున్నవి. పూజార్హములగు బింబములన్నియు నర్చలని పిలువఁబడుచున్నయవి. మనస్సున నిర్మింపఁబడు మానసిక బింబము సహితము అర్చయనియె యెఱుఁగఁ బడు చున్నది. అర్చ లెనిమిది విధములుగ నుండఁదగునని శ్రీమద్భాగవతము నందు చెప్పియున్నది.

> శైలీ దారుమయీ లౌహీ లేప్యా లేఖ్యా చ సైకతీ ।
> మనోమయీ మణిమయీ హ్యర్చా చాష్టవిధా స్మృతా ॥

తా. శిలలచేతను, మ్రానుచేతను, లోహముచేతను, మన్ను మొదలగువాని మెత్తియుఁ, బత్త్రిమున రచించియు, నిసుక చేతను, మనస్సున నిర్మించియు, మణిచేతను నిట్టు లర్చ లెనిమిది విధములగును.

పామరులగువారు మాత్రమే యర్చలుపయోగింప యోగ్యులుగాని మనోమయములగు నర్చల నుపయోగింప శక్తులగువారలకు నితరములగు నర్చల నుపయోగించుట యుక్తము గాదని తలఁపరాదు. శ్రేష్ఠులగువారలు పోవుమార్గమునఁ బామరులుంగూడఁ బోవుటకు యత్నింతురు గావున శ్రేష్ఠులగువారలు వీనిని దిరస్కరించినఁ బామరులుగూడ వానిం దిరస్కరించియు, శ్రేష్ఠులవలె నిరాలంబముగ నుపాసించుటకు శక్తులుగాకయుఁ జెడుదురు.

యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః ।
స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥ (గీత. 3-౨౧)

కావున శ్రేష్ఠులగువారు నైతము తమ కంత యావశ్యకము కాకయుండినను పామరులగు వారలకుఁ ద్రోవచూపుటకును రుచిపుట్టించుటకును వీనిని దిరస్కరింపరాదు.

సక్తాః కర్మ ణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।
కుర్యా ద్విద్వాం స్తథాసక్త శ్చికీర్షు ర్లోకసంగ్రహమ్ ॥
న బుద్ధిభేదం జనయే దజ్ఞానాం కర్మసంగినామ్ ।
జోషయే త్సర్వకర్మాణి విద్వా న్యుక్త స్సమాచరన్ ॥
(గీత. 3-౨౫, ౨౬)

జ్ఞానులు నిరాలంబముగ ధ్యానించుచుండినను సాలంబన సహాయ మావశ్యకముగఁ గోరువారల మనస్సులను జెలువు నట్లు బోధించరు.

ఐహికములగు వాంఛల నీడేర్చుమనికాని మరణానంత రము నరకబాధలనుండి తొలగించి కాపాడుమనికాని ప్రార్థించుట ధ్యానము కాదు. అది యెంతయుఁ బామరులమార్గము. భగవంతుఁడు సకలకల్యాణగుణనిధి. సర్వాత్మకుఁడు. అట్టి దివ్యమూర్తిని ధ్యానించునపుడు మనస్సు విషయములందుఁ బరువులిడక నిలకడతో నామూర్తియందు నిలిచి తైలధార వలె నవిచ్ఛిన్నముగ నీశ్వరుని దిక్కునఁ బ్రవహించును. అట్టి మనస్సున నాత్మస్వరూపము ప్రతిఫలించి స్వానుభవమునకు వచ్చును. ఇదియే ధ్యానము. మిక్కిలి రమణీయమగు నొక వస్తువును జూచిన వారి మనస్సు మిగుల ప్రీతితో నావస్తువు నందే నిరంతరము నిలిచి బలిమిగా నావస్తువునుండి మరలించి నను మరలక మాటిమాటికి దానియందుఁ జేరి నిలుచును గదా. అట్లు సంపూర్ణముగ రమణీయత్వముగల పరమేశ్వ రునం దేకరూపముగ నిలిచి యానందభరితముగ నుండునదియే ధ్యానము. ఇట్టి ధ్యానమునకు బాహ్యాలంబన మావశ్యక మని యనుభవజ్ఞుల యభిప్రాయము.

విగ్రహములను బుష్పాదులతో నర్చించు పూజలుగాక యార్యులందు సంధ్యావందనము ముఖ్యమగు పూజయే. ఆ

యుపాసనమును ద్విజులగు బ్రహ్మ క్షత్రియ వైశ్యులు సమం త్రకముగను నితరులు స్వరిమంత్రములకు మాఱు భగవంతుని నామమంత్రములతోడను నాచరింపఁ దగియున్నది. సంధ్య యన చక్కఁగా ధ్యానముచేయుట. ఇది సంధికాలమందు నేకాగ్రమగు మనస్సుతో సూర్యమండలాంతర్వర్తియగు బ్రహ్మస్వరూపమును, శంఖచక్రగదాది లాంఛన ప్రకాశిత శ్రీమన్నారాయణ స్వరూపముగఁగాని, పంచవక్త్రములుఁ త్రినేత్రములు కపాలము మొదలగు చిహ్నములతోఁటి సదా శివస్వరూపముగఁగాని, యాదిశక్తి స్వరూపముగఁగాని యిష్టమే యిష్టదేవతాస్వరూపముగఁగాని ధ్యానించుట. సంధియనఁగా గలియుట. చీఁకటియు వెలుగును గలియు కాలము సంధ్యాకాలము. ఇవి సూర్యోదయ సూర్యాస్త మయములు రెండు. ప్రాతఃకాలమున నక్షత్రములు మాసి పోను ప్రారంభించినది మొదలు సూర్యోదయము దనుకఁ బ్రాతస్సంధ్యాకాలము. సూర్యుఁ డస్తమించినది మొదలు నక్షత్రములు తోఁచుదాఁక సాయంసధ్యాకాలము. ఇవి రెండును సంధ్యావందనమునకు ముఖ్యకాలములు. మధ్యా హ్నమును సంధ్యావందనమునకు ముఖ్యమని చెప్పఁబడు చున్నది. ఈ సమయములు మనస్సునకు సహజముగ శాంతమును గలుగఁజేయు సందర్భములని పెద్దలు చెప్పు చున్నారు.

ప్రాతఃకాలమునం దెల్లెడల నిశ్చలముగను నిశ్శబ్దముగను నుండుటచే నది మనస్సు నేకాగ్రంబుగ నిలుపుట కుచితసమయముగ నుండును. సాయంకాలమునందుఁ బగటిలోకకల్లోలములు తగ్గుచుండును గనుక నదియు సంధ్యావందనమున కనుకూల కాలము. నిద్రయం దింద్రియమనంబు లైహిక విషయ విముఖములై కేవల సుఖానుభవమున నుండుటంబట్టి ప్రాతఃకాలమున శాంతి నొందియుండును. అప్పుడు వానిని సులభముగ నేకాగ్రముగఁ జేయవచ్చును. ఆకాల మతిక్రమించిన మనస్సును నింద్రియములును లౌకికవ్యవహారములయందుఁ బ్రవేశించి బహిర్ముఖములై విషయములకై పరుగిడుచుఁ గామక్రోధాదులచేఁ గలవరమందుచుండు. అట్టికాలమున వానిని ధ్యానమునందుఁ నిలుపుట దుష్కరము. కావున నిద్రనుండి మేల్కాంచిన వెంటనే యింద్రియములను మనస్సును స్వాధీనము చేసికొని భగవద్ధ్యానము చేయుట సులభము. లౌకిక వ్యవహారములందుఁ బూనిన వెనుక వానిని ధ్యానమునకుఁ ద్రిప్పుట దుష్కరము. మనంబును ఇంద్రియంబులను ధ్యానముచే శిక్షించి భగవత్కళను వానియందుఁ బూరించిన పిదప లౌకిక వ్యవహారములు చేసినచో నావ్యవహారములు స్వాధీనముగ జరుగఁగలుగునని శ్రుతులు చెప్పుచున్నవి.

త్రికాలములలోఁ బ్రాతఃకాల మగ్రగణ్యము గనుక ప్రాతఃకాలధ్యానము మిగుల ముఖ్యము. లౌకిక వ్యవహారము

లచేఁ గలతఁజెందియుండు నింద్రియమనస్సుల నావ్యవహారములు దీఱినంతట సాయంకాలమున భగవద్ధ్యానమందు నిలిపినచో నవి స్వాధీనములై కలవరము తగ్గి సుఖనిద్ర కనుకూలములగును. ఇట్లు సాయంసంధ్యాకాలధ్యానమును ముఖ్యమగుచున్నది. మఱియు వ్యవహారముల మధ్యమునందు మాధ్యాహ్నిక భోజనమునకుఁ బూర్వము, భగవద్ధ్యానము చేయుటయు మంచిదని తేటపడుచున్నది. సంధ్యావందనము ప్రతిదినమును సకాలమునఁ జేసినచో సహజముగ నింద్రియమనంబులు ఆయా కాలములయం దేకాగ్రముగ నిలిచి సులభముగ స్వాధీనమగును. కావున నీకాలములయందుఁ దప్పక భగవంతుని ధ్యానముచేయుట మిగుల ముఖ్యము.

ప్రాణాయామము : బహిర్ముఖమగు మనస్సును లోపలికిఁ ద్రిప్పుట కిదిసహకారి. రహస్యములను దెలిసినవారి సహాయమున్న గాని ప్రాణాయామ మాచరించుట మంచిదికాదు. అట్లభ్యసించిన ననేక బాధలకుఁ బాలుపడుదురు.

ఆచమనము, మార్జనము : భగవన్నామ స్మరణముతోఁ గాని మంత్రములతో గాని యభిమంత్రించిన జలములను ద్రాగుట యాచమనము. ఆ జలములతోఁ బ్రోక్షించుకొనుట మార్జనము. భక్తిచే నుచ్చరింపఁబడిన నామమంత్రములచేఁ బవిత్రములైన జలములఁ ద్రాగిన నంతశ్శుద్ధియుఁ బ్రోక్షించుకొనిన బహిశ్శుద్ధియుఁ గలుగును.

జలప్రాశనాదులు : ఇవి రెండు. ఇందు మొదటిది. జలప్రాశనమందు రాత్రిచేసిన పాపములు పగటియందును బగటిపూఁటచేసిన పాపములు రాత్రియందును స్మరించి పారమాత్మాగ్నియందు వేల్చి నాశముచేసి పాపములన్నిటినుండి రక్షించునట్లు సంకల్పించుచున్నారు. రెండవతూరిచేయు జలవిసర్జనమునందు పాపమూలమగు నజ్ఞానము పోవునట్లు ప్రార్థనచేయుచున్నారు. దీనిచే సూక్ష్మకారణశరీరముల మాలిన్యములు తొలఁగును. కామక్రోధాదులు నహంకారమును సూక్ష్మశరీర మాలిన్యములు. కారణశరీర మాలిన్యము వానికన్నింటికిఁ గారణభూతమగు నవిద్య. ఇచ్చట ముఖ్యముగ గమనించవలసిన రహస్యము లున్నయవి. తొల్లిటిరాత్రియందుఁ జేసిన బాపములను బగటియందును, పగలుచేసిన పాపము రాత్రియందును విమర్శించుట మిక్కిలి యావశ్యకము. తాను జేసిన మనోవాక్కాయ కర్మము లన్నియు లెక్కిడితనకుఁ దాన సాక్షియు ప్రాడ్వివాకుఁడు (న్యాయపరిశీలకుఁడు)నై సావధానముగఁ బరిశీలించి దోషములను స్పష్టముగఁగని మరల జేయకుండునట్లు నిశ్చయించుచు రావలయును. ఇట్లు చేయుచు రాఁగాఁ గ్రమక్రమమున దోషములు స్పష్టముగఁ దెలియవచ్చును. వానిం దొలగించుటయు సులభమగును. దోషములని చక్కఁగఁ దెలియక పలుమఱు దోషములను జేయుట కంటె దోషములని తెలిసి వానిని జేయుట సహజము

కాదు. ఆత్మదోషములను బరిశీలించుచు వచ్చినచో వానిం జేయకుండ బాపుటకుఁ గ్రమక్రమమున నెక్కుడు ప్రయత్నము చేయుచుఁ బరిపక్వదశయందు వానిం బొత్తిగ విడువవచ్చును. ఇట్టి గుణదోషవిమర్శనము లేక జ్ఞానవృద్ధి కాఁజాలదు. కావున నీవిమర్శనమును బ్రతిదిన ముక్కతూరియైనను జేయక యుండరాదు. మఱియు దోషముల స్మరించినప్పుడు ఇష్టదేవతాస్మరణము చేయుచుఁ బ్రాశనమంత్రములందుఁ జెప్పినప్రకార మాత్మాగ్నియందు బాగుగ వేల్చి దహింపఁ జేసితినని భావించిన నాదోషముల ఫలము కొంతయేని తగ్గును. దీనిచే పాపాచరణమునఁ గలుగు నరకానుభవమును దగ్గును. ముఖ్యముగ దోషముల నప్పుడప్పుడే సావధానముగఁ బరిశీలించి మరల వానిని జేయకుండ నిశ్చయించుకొనుచుండిన స్వల్పకాలమున నశుభవాసన లెంతదృఢముగ నుండినను నవి నశించి శుభవాసనలు చేరుచుండును. కావున సంధ్యావందనమందలి యీ దోషవిచారము మిగుల శ్రేయస్కరము.

ఇట్లాచమనాదులచే నుపాధులందలి మాలిన్యమును బోఁగొట్టి నిష్కల్మషమగు నంతఃకరణముతో నిష్టదైవమును ధ్యానముచేయుట కర్హుఁడగును. ధ్యానమునకు మున్నిష్టదేవతను స్మరించి యర్ఘ్యప్రదానము చేసి స్తుతించవలయును.

గాయత్రీమంత్రోపదేశమును బొందినవా రామంత్రమును, నితరుల యథోపదిష్టమంత్రములను జపముచేయుచు నిష్టదేవత

యందు మనస్సు నేకాగ్రముగ నుంచి ధ్యానము చేయవల యును.

గాయత్రీ మంత్రమునందొక విశేషమున్నయది. మంత్రార్థమును విచారించిచూడఁగా నుపాసకుఁడు లోకమునందలి జనులందఱును సద్బుద్ధిగలవారగునట్లు భగవంతుఁడు చేయుఁగాక యని యాపరంజ్యోతిని ధ్యానించవలసినట్లు స్పష్టమగుచున్నయది. కావున దామును లోకులందఱును బరిశుద్ధులై సత్పురుషులునై లోకహితమాచరించునట్లు ప్రార్థించవలయును.

మంత్రోపదేశమును బొందినవారును బొందనివారును పైని సూచింపఁబడిన ధర్మములను గ్రహించి సకాలమున నిష్టదేవతల నుపాసించుచు లోకహితార్థము భగవద్ధ్యానమును జేయఁదగును.

రాజయోగము

ఇదిగాక మఱియొకవిధమగు నుపాసన మున్నయది. దానియందును సంధ్యావందనమునందలి మంత్రములను జెప్పినను జెప్పవచ్చును. తంత్రములను చేసినను జేయవచ్చును. కాదేని మంత్ర తంత్రములు లేక జీవేశ్వరుల రూపముల నెఱింగి జీవుఁడు పరమాత్మయందుఁ జేరునట్లు మానసిక ధ్యానమును జేయవచ్చును. ఇది జీవేశ్వరులను జేర్చు రాజయోగము. ఈ యోగమునకు సాధనములుగ నుండు పూర్వాంగములు గలవు.

అవి యోగాంగములు. వీనిని బతంజలి యోగసూత్రములందు విస్తరించి వ్రాసియున్నాఁడు.

యోగాంగముల సహాయమునఁ జీవుఁ డీశ్వరుని జేర నభ్యసించుటయే యోగాభ్యాసము. యోగాభ్యాస మన్నమాత్రమున నెద్దియో క్రొత్తమార్గ మొకటియని భావింప నక్కఱలేదు. చిత్తవృత్తినిరోధమే యోగము. ఎల్లవారును దెలిసి కాని తెలియక కాని యోగాభ్యాసమార్గమున నున్నవారలే. ఎల్లవారు నానందమును గోరుచుఁ దన్స్వరూపస్థుఁడైన యాత్మసాన్నిధ్యమును గోరుచునే యున్నవారు. ఆ యానందమున లేశమాత్రము గల యిహలోక విషయములయందుఁ బూర్ణానందము గలదని యజ్ఞానముచే భ్రమించి విషయసంయోగమును గోరుచున్నవారు. కడను విషయానందములు దుఃఖమిశ్రములనియు క్షణభంగురములనియు నెఱింగి స్వర్గసుఖములను గూర్చి యత్నింతురు. అవియును నశ్వరములని క్రమక్రమముగ నెఱింగి వైరాగ్యసంపన్నులై యాత్మసాన్నిధ్యమును వెదకుదురు. ఇట్లాత్మసంయోగమును గోరుట మానవులు మాత్రము గాదు. ఈశ్వరుని కళయగు జీవుఁడు మృత్పాషాణాదులయందుఁ గొంత కాలము సుషుప్తియం దుండునట్లుండి పిదప నోషధవనస్పతులందుఁ గించిచ్చైతన్యయుక్తుండై వర్షవాతాతపములను భూసారములను గ్రహించుచు వివిధానుభవములం గలిగి బీజరూపములుగనుండిన యాత్మశక్తులను

గొన్నింటి వికసింపఁ జేయును. పిమ్మటఁ దిర్యగ్జంతువులగు పశుపక్ష్యాదులందుఁ జొచ్చి యింద్రియస్పర్శములవలన బహు విధములగు సుఖదుఃఖముల ననుభవించును. కడపట మానవ జన్మమెత్తి మనుష్యరూపమున జీవుఁడై వెలయును. ఈయాత్ర యందంతయు నీశ్వరుని నుండి కళారూపముగ వేఱయిన జీవుఁడు మరల నామహాజ్యోతియందుఁ జేరుటకే కోరుచుం డును. వాఁడన్నిలోకములందుఁ బొందు వివిధానుభవములు నాపదవిని బొందింప సమర్థములు కాని వేఱుకావు. ఈ విధ ముగ ననేకయుగములును గల్పములును దిరిగి దీర్ఘకాలమున కందఱును బరమపురుషార్థమును బొందనోపుదురు.

ఐనను వివేకముగల మనుష్యుఁడు తన బుద్ధికుశలతను విని యోగించి ప్రయత్నానుగుణ్యముగ నాకాలప్రమాణమును దగ్గించనోపును. దీనికి దృష్టాంతములు గలవు. అడవిని బెరుగు ములగకాయలలోని బీజములను దెచ్చి సుక్షేత్రమున విత్తి తగిన యెరువుతోఁ జేర్చి వ్యవసాయకుశలతచే నభివృద్ధియైన చెట్లనుండి బీజములంగొని మఱియు నాబీజములనాటి కాయలు కాచునట్లు చేసి యీ విత్తనములతోఁ దగుమార్గమున వ్యవ సాయముచేయుచు రాఁగాఁ బండెడుకాయలు కాలక్రమమున ముంద్లుపోయి గొప్పవియై మొదటి ములగకాయలకంటెు మిగుల శ్రేష్ఠమైనవిగ నగును. అట్లే మామిడిచెట్లయందు మంచివియగు నొకజాతిమ్రాకులతో మఱియొకజాతి మ్రాకుల

నుండి యంట్లుగూర్చుటచేత నుంచిరుచిగల యంటుమామిడి పండ్లు పండును. మఱియు నెల్లూరుమండలమునందలి యావుల యందును గోడెలయందును సాధుగుణములు గలవు. మైసూరు దేశమున నమృతమహాలునందలి వృషభములయందు బిగువును జాతికుందనమును గలవు. నెల్లూరిమండలమునందలి యావులకును అమృతమహాలు వృషభములకును సంబంధమును గల్పించి కోడెలను బుట్టించుచున్నారు. వానియందు నెల్లూరు కోడెల బలమును సాధుగుణములును, మైసూరు రాజ్యము నందలి యెద్దుల పౌరుషబలమును, జాతికుందనమును, గష్టమునకోర్చు శక్తియుఁ గలుగుచున్నది.

ఇట్లు సామాన్యముగ లౌకికవ్యవహారములందు మనుష్యుఁడు తన బుద్ధికుశలతచే ననేకములగు వస్తువులను శీఘ్రముగ నుత్కృష్టస్థితికిఁ దెచ్చుచున్నాఁడు. అవి తమంతటనే వృద్ధికావలయునన్న దీర్ఘకాలము పట్టును. తనబుద్ధి కుశలతచే వస్తుతత్త్వములను యుక్తాయుక్తములను నెఱింగి విశేషప్రయత్నముచేసి తన జ్ఞానాభివృద్ధిని గూడఁ ద్వరితముగఁ జేయవచ్చును. ఇట్టి వివేకసహితమగు ప్రయత్నమే యోగాభ్యాసము.

జీవునియం దాత్మశక్తులు బీజరూపములుగ నుండి క్రమక్రమముగ లోకమున వికసించుచు వచ్చుచున్న మార్గములను బరిశీలించవలయును. తన యనుభవములతో నితరుల యను

భవమును సహాయముగఁ గొనవలయును. జ్ఞానాభివృద్ధి కనుకూలములగు మార్గముల నవలంబించవలయును. ప్రతికూలములగు మార్గములను విడువవలయును. దేశకాల నిమిత్తముల నెఱింగి యుపాయముతో సందర్భానుసారముగఁ దగు భంగిఁ బూనికతోఁ బ్రయత్నించుచు రావలయును. ఈరీతిఁ దన శరీరేంద్రియ మనస్సులను నిగ్రహించి శుద్ధములుగను సార్థకములుగను జేయుమార్గమే యోగాభ్యాస మనుపేరఁ బరఁగునుగాని యది యొక నూతనమార్గము కాదు. దీనిని స్పష్టముగ నెఱింగినచో యోగాభ్యాస మెల్లవారలకును సాధ్యమని స్పష్టమగును. అభ్యాసము చేయుటకుఁ బ్రారంభించిన నాజన్మమునను పరిపూర్ణముగ సిద్ధి కాకపోయినను జేసిన ప్రయత్నము వృథాకానేరదు. దాని ఫలము కట్టియుంచినమూటగా జీవుని నంటియేయుండును. ఇట్టి ప్రయత్నము చేయుచుండఁగా సిద్ధి గలుగకపోదు. ఈ యర్థమును గీతాశాస్త్రమున యోగభ్రష్ట విచారమందు నొక్కి బోధించియున్నారు.

పార్థ నైవేహ నాముత్ర వినాశ స్తస్య విద్యతే ।
న హి కల్యాణకృ త్కశ్చి ద్దుర్గతిం తాత గచ్ఛతి ॥

ప్రాప్య పుణ్యకృతాఁ లోకా నుషిత్వా శాశ్వతీ స్సమాః ।
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే ॥

అథ వా యోగినా మేవ కులే భవతి ధీమతామ్ ।
ఏత ద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥

తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదైహికమ్ ।
యతతే చ తతో భూయ స్సంసిద్ధౌ కురునందన ॥

(గీత. ౬ అధ్యా. శ్లో. ౪౦-౪౩)

తా. ఓయి యర్జునా! యోగభ్రష్టునకు నిహపరలోకములయందు నాశనము లేదు. శుభకరమగు కర్మము నొనరించిన వాఁడు దుర్గతి నెన్నఁడును జెందఁడు. పుణ్యకార్యము లొనరించిన మహాత్ములు పొందులోకముల నొంది పెక్కునం వత్సరము లందు గడపి సంపూర్ణయోగసాధకుఁడు కాఁడు కావునఁ బరిశుద్ధులై సకల విభవ సమృద్ధులగువారియింటఁ బుట్టును. లేదా యోగులును బుద్ధిశాలురును నగువారి వంశమునన్ననఁ బుట్టును. లోకమున నిట్టి జన్మము మిగుల దుర్లభమని తెలియఁదగు. అట్లు పుట్టియు, పూర్వదేహసంబంధమగు బుద్ధిసంయోగమునే పొంది మరల యోగసిద్ధికై యమ్మహాత్ముఁడు యత్నించునని యెఱుఁగుము.

జీవుఁ డీశ్వరునియందుఁ జేరుటయె నిజమగు యోగము. అట్టి యోగమునకు సాధనముగ నుండుమార్గమున సోపానములుగ నెంచఁ దెనిమిది యోగాంగములున్నయవి. ఈ యంగములతోఁ గూడిన యభ్యాస మష్టాంగయోగము.

అంగములు

"యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధయోఽష్టావంగాని" —పతంజలి యోగసూత్రము.

యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణము, ధ్యానము, సమాధియు నను నీ యెనిమిదియు యోగాంగములు.

అందు మొదటి రెండును – యమము, నియమము: అభ్యాసకుని యశుభవాసనలఁ దొలఁగించి శుభవాసనల నొనఁగూర్చి భావశుద్ధి నిచ్చునవి. అభ్యాసకుఁడు శుద్ధుఁడు గాకపోయినచో సామాన్యలోకవ్యవహారములయందు యోగ్యుఁడు కానేరఁడు. అట్లుండ నుత్తమమగు నాత్మసాన్నిధ్య మెట్లు సాధింపనోపును? దుశ్చరితము నుండి విరమించవలయును. ఇంద్రియములను నియమించి శాంతములుగఁ జేయవలయును. మనస్సును స్వాధీనము చేసికొనవలయును. ఇట్టివి లేనివాఁడు యోగమున కర్హుఁడు గాఁడు.

నాఽవిరతో దుశ్చరితా న్నాఽశాంతో నాఽసమాహితః ।
నాఽశాంతమానసో వాపి ప్రజ్ఞానే నైన మాప్నుయాత్ ॥

(కఠోపనిషత్తు)

కావున యోగాభ్యాసమున కారంభించుటకు ముందు తనయందుండు దుర్గుణములను బోఁగొట్టి ముఖ్యములగు కొన్ని సుగుణముల దృఢపఱచుకొనవలయును. అట్లుచేయక మూఁడవది మొదలుగాఁగల యంగములతో నారంభించి యభ్యసింప నర్హుఁడు గాఁడు. యమనియమము లెవ్వి యనఁగా:

తత్రాహింసా సత్యాస్తేయబ్రహ్మచర్యాపరిగ్రహా యమాః ॥

అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము నివి యమములు.

యోగియగువాఁడు సర్వభూతములను దనవలె భావించుచు సర్వసముఁడు గాఁగోరువాఁడు కావున నొకరికి హింస యెంత మాత్రము గలుగఁజేయరాదు. హింసయనఁగాఁ జంపుట మాత్రముగాదు. కామక్రోధాది సంకల్పములచే లోకములకు బాధయగుం గావున వానిని గలిగింపరాదు. ఒరుల నొప్పించు మాటలాడరాదు. ఎవ్వరికేని బాధను గల్గించుపనిని జేయరాదు. ఇట్లు లోకమున నెంతమాత్రమైనను బాధ కలుగఁజేయరాదు. అతని సమీపించు నెల్లవారును శాంతమును బొందున ట్లుండవలయును. ఎల్లవారు తన్ను రక్షకునిగాను సుహృదునిగా నెన్నుకొనున ట్లుండవలయును. అజాతశత్రువుగ నుండఁదగు. అట్టివానియందు సత్యముండదు. ఇతరుల ద్రవ్యము నపహరించు బుద్ధి మనస్సునందైనను గలుగదు. మఱియు బ్రహ్మచర్యము నభ్యసింపవలయు. అనఁగా నింద్రియనిగ్రహము గలిగి విషయచింత లేక యుండవలయును. విషయచింత యుండఁగా మనం బింద్రియములతోఁ గూడి విషయములయందు సంచరించుచుండునే గాని యీశ్వరునందు నైకాగ్రము గానేరదు. అపరిగ్రహము : ఐహిక సుఖసాధనములగు పదార్థములను గ్రహించుకోరిక మనస్సునందైనను లేక యుండవలయును. ఇవి యమములు.

నియమము

శౌచసంతోషతపస్స్వాధ్యాయేశ్వరప్రణిధానాని నియమాః ॥

శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము నివియన్నియు నియమములు.

శౌచము : అనఁగా పారిశుద్ధ్యము. శరీరము, నింద్రియ ములును, మనస్సు, బుద్ధియు నన్నియుఁ బరిశుద్ధములుగ నుండ వలయు. శరీరము సకాలమున స్నానముచేతను, అపరిశుద్ధము లగు పదార్థములను మనుష్యులను స్పృశించక యుండుట చేతను, బరిశుద్ధమగుచున్న యది. శరీరమునుండి సర్వకాల సర్వావస్థలయందు నతిసూక్ష్మములగు నణువులు బయలు వెడలును. ఆ యణువులు సమీపమున నుండు వారల శరీర ముల నంటి వారిశరీరములలోఁ బ్రవేశించును. అవి పరిశుద్ధ ములు నారోగ్యములునైన నితరులకు సుఖకారణములగు. పరిశుద్ధములు గాకపోయినచో నితరులకు హానికరములగు. మలిన తేజస్సు గలవియగుచో నితరుల తేజస్సును మలిన ముగఁ జేయును. సర్వభూత శ్రేయస్సుఁగోరు యోగాభ్యాసి తన శరీరమునుండి యితరులకుఁ గీడుచేయు నణువులు వెలు వడునట్లు శరీరము నపరిశుద్ధముగ నుంచుకొనరాదు. అట్లు పరిశుద్ధములగు క్రతువుల సంకల్పించుచు దుష్క్రతువులను దుర్గుణములను మనస్సునఁ జొరనీయకయు నింద్రియముల నియమించి యింద్రియమనస్సులం బరిశుద్ధముగ నుంచవలయు.

ఇట్లు స్థూలసూక్ష్మశరీరములు పరిశుద్ధములుగ నుంచుకొనుట కభ్యసింపవలెను.

> జ్ఞానం తపోఽగ్నిరాహారో మృన్మనో వార్యుపాంజనమ్ ।
> వాయుః కర్మార్కకాలౌ చ శుద్ధేః కర్తౄణి దేహినామ్ ॥

(మనుస్మృతి ౫-౧౦౫)

జ్ఞానము, తపంబు, అగ్ని, ఆహారము, మృత్తిక, కామవర్జితమగు మనస్సు, జలము, ఉపాంజనము, గాలి, కర్మములు, సూర్యుండు, కాలము నివియన్నియు దేహమునకుఁ బరిశుద్ధికరములు.

మఱియు,

> అద్భిర్గాత్రాణి శుద్ధ్యంతి మనః సత్యేన శుద్ధ్యతి ।
> విద్యాతపోభ్యాం భూతాత్మా బుద్ధిర్జ్ఞానేన శుద్ధ్యతి ॥

(మనుస్మృతి ౫-౧౦౯)

దేహము నీటిచేతను, మనస్సు సత్యముచేతను, బుద్ధి జ్ఞానముచేతను, జీవుండు విద్యాతపస్సులచేతను, పరిశుద్ధులగుదురు.

యోగ మభ్యసింపఁగోరువాఁ డిట్టి శుచిత్వము గలిగి యుండనగు. ఏమి వచ్చినను మనస్సున కలవరమందక తృప్తితో సంతోషించవలయును. శరీరము నింద్రియములను సత్ప్రవర్తనముచే నిగ్రహించి స్వాధీనపఱచుకొనుట తపస్సు. సద్గ్రంథములను జదువుటయుఁ బ్రణవజపాదులను జేయుటయు,

స్వాధ్యాయము. ఈశ్వరుని జెందవలయునను తీవ్రమగు నాశయే యీశ్వర ప్రణిధానము.

ఇక్కాలమున ననేకులు యమనియమముల నభ్యసింప కయే ప్రారంభముననే ప్రాణాయామము మొదలగు నాఱంగ ములనుమాత్ర మభ్యసించుటకు యత్నించుచున్నారు. కొం దఱు వాయుధారణమే ప్రాణాయామయోగమని దాని నభ్య సించుచు, నితరులకు బోధించుచున్నారు. యమనియమ ములు మిగుల కష్టములని వానిని విడుతురు. యమనియమ ముల నభ్యసించుటయన్న, విషయవాంఛలను వదలి విరాగ ముతో నివృత్తిమార్గమునందు వర్తించుట. సామాన్యములగు నల్పవాంఛలనైనను జయింపకయే సులభమగు మార్గమున యోగులు గాఁగోరి యమనియమములఁ బాటింపకయే వాయు ధారణమున కారంభించుట వెఱ్ఱితనము. యథార్థముగ నిశ్శ్రే యసముఁ గోరువారు మొట్టమొదట యమనియమాభ్యాస ముచేఁ జిత్తశుద్ధిఁబొంది మిగిలిన యాఱంగముల నభ్యసింప నగును.

ఆసనము

యోగాభ్యాసమున సుఖమైనదియు, స్థిరమైనదియు నగు నాసనమునఁ గూర్చుండవలయును. పద్మాసనము, సిద్ధాసనము మొదలగు ననేకవిధాసనములలో దేనియందు శరీరమునకు సుఖము గలుగునో యాయాసనమునఁ గూరుచుండవలయును.

భూమిపై దర్భాసనము దానిపైఁ గృష్ణాజినము, దానిపై వస్త్రము పఱచి దానిపైఁగూరుచుండిన సుఖముండును. కూరుచుండునపుడు శరీరము, శిరమును మెడయు నొరుగక చక్కఁగ నుండవలయును. ఇట్లుండుట ధ్యానమున జాగరూకుఁడై యుండుటకు సహకారియగు. దేనిపైనను నానుకొనిన యెడల ధ్యానముచేయునపుడు నిద్ర రావచ్చును. ఇట్లు భూమిపై మృదువగు నాసనమును నిర్మించుకొని సుఖముగ నాసనమునఁ జక్కఁగఁ గూర్చుండవలయును. కూర్చుండుప్రదేశము శుచిగ నుండవలెను. స్వభావముగాఁ బరిశుద్ధమై సమమై నీళ్ల బాధయుఁ గ్రిమికీటాదుల బాధయు లేనిదై యుండవలయును. గృహములందు దేవపూజకుఁ గాక యితర పనుల కెప్పుడు నుపయోగింపని గదియే ప్రశస్తము. ఏకాంతస్థలముగ నుండుట శ్రేష్ఠము. అచ్చట మనస్సునకు విక్షేపముగలుగఁజేయు వస్తువులనుంచక ధ్యానమునకు సహకారులగువాని నుంచియుంచుట యెంతయు ననుకూలము. ఉపాస్యదేవుని ప్రతిమయుఁ బ్రేమాస్పదులగు పెద్దల ప్రతిమలును బూజకు నుపయుక్తములగు ధూపాది ద్రవ్యములు నివి యెల్ల ధ్యానమునకు సహకారులు. అట్లు కొంతకాల మాగది పూజకు మాత్రమే యుపయోగింపఁబడుచుండ నాగదియందలి స్థూలసూక్ష్మాకాశమంతయు దివ్యతేజస్సుతో నిండియుండును. అట్టి గదిలోఁ బ్రవేశించిన తోడనే యా తేజస్సు వ్యాపించి భక్తిని గలుగఁజేయును. అట్టి

ప్రదేశములు శుచిప్రదేశము లగునుగాని తఱుచుగ లౌకిక వ్యాపారముల కుపయోగించుచు ధ్యానసమయమున మాత్రము శుద్ధముగ నీటితోఁ గడిగినమాత్రమున నది ధ్యాన యోగ్యము కాదు. ధ్యానకాలమున నేకాంతముగ నుండవలయును. ఇద్దఱు ముగ్గురు గలిసిన విక్షేపమగును. కావున నా సమయమున ముఖ్యముగ నుండఁదగినవి : (౧) ధ్యానమునకు మాత్ర ముపయోగింపఁబడు పరిశుద్ధమగు ప్రదేశము, (౨) ధ్యానమునకు సహాయములగు ద్రవ్యములు మాత్రముండుట, (౩) ధ్యానకాలమున నేకాంతముగ నుండుట. (౪) ఇట్టిప్రదేశమున సమమగు స్థలమున "చైలాజినకుశోత్తరమ్" వస్త్రము, కృష్ణాజినము, దర్భాసనము నొకదానిక్రింద నొకటిగ నునిచి సులభమైనదియు స్థిరమైనదియు నగు నొక యాసనమున నుండి కాయశిరోగ్రీవములు సమముగఁ జేసి దిక్కులను జూడక యుండవలయును.

ఈ విషయము శ్రీ భగవద్గీతయందు నాఱవయధ్యాయమున భగవంతుఁడు విధించియుండునది చూడఁదగు.

> శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిర మాసన మాత్మనః ।
> నా త్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజనకుశోత్తరం ॥
> తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః ।
> ఉపవి శ్యాసనే యుంజ్యాత్ యోగ మాత్మ విశుద్ధయే ॥
> సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః ।
> సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశ శ్చానవలోకయన్ ॥

ప్రశాంతాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః ।
మనః సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః ॥

(గీత. అ. ౬, శ్లో. ౧౧-౧౪)

ప్రాణాయామము

ఇట్లు సుఖాసీనుఁడై నాల్గవయంగమగు ప్రాణాయామము చేయవలయును. ప్రాణాయామమనఁగాఁ బ్రాణాపానములగు నుచ్ఛ్వాసనిశ్వాసములను సమముగ నియమించుట. ఇది యనుభవజ్ఞుఁడగు గురుముఖముగ నెఱింగి యభ్యసింపఁదగినది. అట్టి సహాయము లేక ప్రాణాయామ మెక్కువఁగఁ జేసినచో నపాయకరమగు. కావున జాగ్రతతో నుండుట యుచితము. దీనివలని ముఖ్యప్రయోజనము ఈయుచ్ఛ్వాసనిశ్వాసములను సమపరచి స్థిమితపరచుట.

ప్రత్యాహారము: ఇంద్రియములద్వారా బహిర్ముఖమగు మనస్సును విషయములనుండి మరలించి లోనికిఁ ద్రిప్పుట ప్రత్యాహారము. ధ్యానమునకుం గూరుచుండ రమణీయములగు శబ్దాదివిషయములు శ్రోత్రాదీంద్రియములకు సోఁకఁగా వానిని గూర్చి మనసు పోవుచుండును. అట్లు పోనీయక మనస్సున బాహ్యస్పర్శములను జొరనీయక యుండవలయును. ఇట్లింద్రియములు నియమింపఁ బడ నావలిదగు ధారణ సులభమగు.

ధారణయనఁగా : బాహ్యవిషయములనుండి త్రిప్పఁబడిన మనస్సును ఏకాగ్రముగ ధ్యేయమూర్తియందు నిలిపి వేఱు విషయములందుఁ బ్రవేశింపక యుండునట్లు చేయవలయును. మనస్సు చంచలమై పూర్వానుభవ గోచరములగు విషయసుఖములకుం బోవును. అట్లు పోనీయక మరల మరల దానిని వెనుకకుఁ ద్రిప్పి యాత్మయందే నిలుపుచు రావలయును. ఇదియే యభ్యాసమనియుఁ జెప్పఁబడును.

ధ్యానము

ఇట్లు నిలిపిన మన స్సాత్మగుణములఁ జింతించును. ఈ చింతయే ధ్యానము. ధ్యానమున నితరములగు ప్రత్యయములను మనస్సునఁ జొరనీయక యాత్మభావన యొక్కటియే మనస్సున నిలుకడగా నుండునట్లు చేయవలయును. క్రమక్రమముగ మనస్సు నేకాగ్రముగఁ జేసి యాత్మప్రత్యయ మొక్కటియే మనస్సున నవిచ్ఛిన్నముగ నుండునట్లు చేయవలయును.

శనైశ్శనై రుపరమే ద్బుద్ధ్యా ధృతిగృహీతయా ।
ఆత్మసంస్థం మనఃకృత్వా నకించి దపి చింతయేత్ ॥

తిన్నతిన్నగా ధైర్యముతో మనస్సు నితరవిషయములనుండి మరలించి యాత్మయందుంచి యేమియుఁ జింతింపక యూరక యుండవలయును. ఇట్లు తైలధారవలె నవిచ్ఛిన్నమగు స్మృతిసంతానము ధ్యానమనఁబడును. అపుడు మనస్సు బాహ్య

ములగు విషయములను విషయవాసనలను మఱచి యాత్మయందే రమించుచుండును. ఇట్లుండ మనస్సాత్మయందు మునిఁగి క్రమముగ భిన్నభావమే మఱచి యాత్మతాదాత్మ్యము నొందును. ఆత్మయనఁగా నిరుపాధికమగు నిర్గుణబ్రహ్మముగాని సోపాధికమగు సగుణబ్రహ్మముగాని యగును. ఇందు నిర్గుణబ్రహ్మము నుపాసించుట దుర్లభము. శ్రీ గీతాశాస్త్రమునందు భగవంతుఁ డీవిషయమును స్పష్టముగ వివరించి యున్నాఁడు.

> క్లేశోఽధికతర స్తేషా మవ్యక్తాసక్తచేతసామ్ ।
> అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భి రవాప్యతే ॥ (గీత. ౧౨-౫)

అట్టి యుపాసనమునందు రుచిగలిగి యింద్రియములను నియమించి సర్వసమబుద్ధులై పూనికతోఁ జేయఁగలవారలకే యది సాధ్యముగాని యితరులకు మిక్కిలి దుస్సాధ్యము గావున నట్టి యితరులకెల్ల సగుణధ్యానము సుకరము. శివకేశవాది దైవములలో భక్తునకుఁ బ్రేమాస్పదమగు నుపాస్యదివ్యమంగళమూర్తిని మనస్సున గల్పించుకొని దాని నాలంబనముగాఁ గైకొని యందుఁ బరమాత్మయు ననంతకల్యాణనిధియు నగు చైతన్యమును ధ్యానముచేయవలయును. ధ్యానమున మొట్టమొదట నామూర్తిని మనస్సున దృఢముగఁ గల్పించుకొన వలయును. క్రమక్రమమున నారూపమును పాదములనుండి శిరస్సుదాఁకఁ జిత్తమునందుఁ గల్పనచేసికొని తుదకు రూప

మంతయు మనస్సున నిలుచునట్లు చేసికొనవలయును. ఇట్లు చేయుటవలన మనస్సునకుఁ బూర్ణవ్యాపారము గలిగి యితర విషయములయందు వ్యాపించకయుండుట సుసాధ్యము. అట్టి బింబమును మనస్సునఁ గల్పించుకొనుట మొదట మొదట కష్టముగ నుండియు నభ్యాస బలముచేఁ గాలక్రమమున సాధ్య మగును. ఉపాస్యుని దివ్యగుణలీలాదుల స్మరణముచేతను, నద్దేవుని స్తోత్రములచేతను, ప్రతిమాది పూజలచేతను భక్తి ప్రేమలు క్రమక్రమముగ నభివృద్ధియై ధ్యేయమూర్తి దృఢ ముగ మనస్సున నిలుచుచువచ్చును. అంతట నామూర్తి స్మరణమాత్రమున నేర్పడుచుండును.

విలిఖితమివ రూపం చిత్తభిత్తౌ మురారే
స్సుమన ఇవ మనో యై రర్పితం తత్పదాబ్జే।
ప్రతిపద ముదయద్భి స్సాత్త్వికై రంకితాంగా
స్త ఇహ భవపయోధేః పార ముల్లంఘయంతి ॥

తా. శరీరమున నానంద బాష్పములు రోమాంచలములు లోనగు సాత్త్విక భావము లంకురించుచుండ నెవరిచేఁ జిత్తమను గోడయందు మురారి దివ్యరూపము లిఖింపఁబడినట్లు చేయఁ బడునో, ఆ మురారిపాదకమలములం దెవరిచేఁ గుసుమముల వలె మనస్సు సమర్పింపఁబడునో యట్టివారీ జన్మమున నీ యపార సంసారసాగరమును దాఁటుదురు. అని చెప్పఁబడి యున్నది.

సమాధి

ఈ యుక్తమే పూజావిధానమునందును పాదము మొదలు శిరస్సుదాఁక వేఱువేఱుగ వివిధాంగముల పూజయుఁ గడపట సర్వాంగముల నొకసారిగఁ బూజించుటయు విధింపఁబడి యున్నది. విగ్రహమును మనస్సున దృఢముగ నిలుపుచు వచ్చిన మన స్సాద్వైతమునందుఁ గ్రమక్రమముగ లయించి శరీరము పరవశమగును. అపుడు దేహేంద్రియములు నిర్వ్యాపారములు కాఁగా మనస్సేకాగ్రముగ నుపాస్యునియందు మునిఁగియుండ బాహ్యప్రజ్ఞ లేకయే పోవును. అపు డుపాసకుని మనస్సాత్మయందే యానందించుచు నాత్మస్వరూపమై యుండును. అపుడు జీవుఁడు స్థూలమగు నీ శరీరమును విడిచి సూక్ష్మశరీరముననో, దానినిగూడ విడిచి యంతకంటె సూక్ష్మమగు కారణశరీరముననో జాగరూకుఁడై వర్తించుచు నా యూర్ధ్వలోకముల జ్ఞానముగలిగి యుండును. ఇట్లు క్రమక్రమముగ నొక్కొక్క యుపాధిని వదలి దానికంటె సూక్ష్మమగు నుపాధియందు వర్తించుచు, విడువఁబడిన యుపాధిని ననాత్మగ నెఱుంగుచుఁ, గాలక్రమమున నుపాధులన్నియు ననాత్మలుగ నెఱింగి యన్నిటికంటె సూక్ష్మము, నన్నిటియందంతర్యామియునగు నాత్మను నెఱుంగు. ఇట్లాత్మసాక్షాత్కారముచే జీవునకుఁ బరమాత్మతో నైక్యానుభవము గలుగు మార్గమే యోగమార్గము. ఆ యైక్యమే నిజమగు యోగము.

సంధ్యావందనమునకుఁ జెప్పఁబడిన కాలనియమము ముఖ్యముగ నీధ్యానమునకు గమనించఁదగినది. ఈ యోగము దినదినమును కాలము తప్పక యభ్యసింపవలయును. అట్లభ్యసించుచుండిన దినదిన మావేళరాఁగా శరీర మభ్యాసబలముచేఁ దనంతట దానే ధ్యానమున కున్ముఖమగును. ఎంతగాఢముగ నిద్రించుచుండినను వేళకుఁ జక్కఁగ మెలఁకువగలుగును. ధ్యానమునకుఁ గూర్చుండిన, శరీరమును మనస్సును సులభముగ ధ్యానమున నిలుచును. ఈ రీతి నన్నిపనులును గాలనియమముగఁ జేయుచుండిన నాయాకాలమున నాయాపనులు చేయుటకు శరీరము మనస్సు నలవడి ప్రయత్నబాహుళ్యము లేకయే స్వాధీనము లగును. ఆ కాలనియమము లేకపోయినచో నిట్టి యనుకూలముండదు.

యోగాభ్యాసమునకు మఱియు మూఁడు లక్షణము లవశ్యములుగ నున్నయవి. (౧) యోగాభ్యాసమార్గమున నాదరముండ వలయును. ఆదరమనఁగా దృఢమగు నమ్మకము. నమ్మకములేక చేసినచో నల్పఫలమేయగును. కనుక దృఢమగు నాదర బుద్ధి గలిగి పూనికతోఁ జేయవలయును. (౨) అభ్యాసము నిరంతరముగ నుండవలయును. ఒకనాటి యంతరము గలిగినను ననేక దినము లభ్యసించిన సాధనపాటవము చెడును. ఎంతస్వల్పకాల మభ్యసించినను దినదినము తప్పక చేయవలయును. కొన్నిదినములు జాముల కొలఁది ధ్యాన

మభ్యసించి మఱికొన్ని దినము లభ్యసింపక యుండుటచే వృథా కాలహరణ మగును. (౩) మఱియు నీయభ్యాసము దీర్ఘ కాలము చేయవలసినది. కొంతకాల మభ్యసించి యోగసిద్ధి గాలేదని యుపేక్షింపఁ గూడదు. అనేక జన్మములనుండి దృఢ ముగా నుండు విషయవాసనల నున్మూలముచేయుటకు స్వల్ప కాలము చాలనేరదు. బహుకాలమునుండి విషయములయందు రమించుచుండిన మనస్సును వానినుండి మరలించి యాత్మయం దున్ముఖము చేయుట దుష్కరము.

కావున నభ్యాసము చిరకాలము పూనికతో వేసరక చేయ వలయును. ఈ రీతి సాదరము నైరంతర్యము దీర్ఘకాలాభ్యా సము ననుమూడును యోగసిద్ధి కత్యంతావశ్యకములు.

పదునేడవ యధ్యాయము

ఇది మంచిసమయము

చతుర్యుగసహస్రాణి బ్రహ్మణో దిన ముచ్యతే ॥

బ్రహ్మ జగత్తును సృజించి దైనందిన ప్రళయ మనుపేరఁ బరఁగు నొక యవాంతర ప్రళయము జరుగు కాలమును బ్రహ్మ కొక పగలని కాలస్వరూపము నెఱింగిన మహాత్ములు చెప్పు చున్నారు. ఇక్కాలము వేయిమహాయుగములుగ విభజింపఁ బడియున్నది. ఒక్కొక్క మహాయుగమును కృతత్రేతా ద్వాపరకలియుగము లను నాల్గుయుగములుగ నెఱుంగఁబడు చున్నది. ఇందొక్కొక యుగమునందును నాల్గు యుగముల ధర్మములు వరుసఁగ జరుగుచుండును. ఒక్కొక్కయుగము నందు నల్పకాలికము లగు నవాంతరయుగము లున్నట్లు తెలియవచ్చుచున్నది. అట్టి యవాంతరయుగము లైదువేల సంవత్సరముల కొకటి యగుననియు, నాయైదువేల సంవత్సర ముల యుగములం దొక్కొక్కదానియందును నాల్గుయుగ ముల ధర్మములు కొంత ప్రవర్తించుచుండు ననియును బెద్దల యభిప్రాయము. ఇట్లేయుగధర్మ మా యుగమునఁ బ్రధాన ముగ నడుచుచుండ దానికిలోఁబడిన యవాంతర యుగధర్మ

ములును వరుసగ జరుగుచుండును. మొదటిది యగు కృత యుగము సత్యయుగ మను నామాంతరము గలిగి యందు ధర్మము నాల్గుపాదముల వర్తించుచుండుననియును, రెండవది యగు త్రేతాయుగమున ధర్మము మూఁడుపాదములుగ నడుచుచు నొకపాద మధర్మముతోఁ గలిసియుండు ననియు, మూఁడవదియగు ద్వాపరయుగమున ధర్మము రెండుభాగములుగను, అధర్మము రెండుభాగములుగను బ్రవర్తిల్లుచుండు ననియును, నాల్గవదియగు కలియుగంబునందు ధర్మ మొక్క పాదముగను, అధర్మము మూఁడు పాదములుగను జరుగుచుండుననియును తత్త్వజ్ఞులు పూర్వము తెలిపియున్నారు.

ఇప్పు డీకలియుగమున నైదువేల సంవత్సరములు గల యుగ యంతర్భాగము గడచెను. ఒక్కొక్క యైదువేల సంవత్సరముల కాలమునందును మొదటిభాగము కలియుగధర్మముతోఁ గృతయుగధర్మములును, అనఁగాఁ గలిధర్మములలో సత్తమములును, నటులే రెండవ మూఁడవ నాల్గవభాగముల యందుఁ ద్రేతా ద్వాపర కలిధర్మములు వరుసగఁ గలిసి యుండును. కావున నీ సమయమునఁ గలియుగమున మొదటి యైదువేల సంవత్సరములు పూర్తియై రెండవ యైదువేలసంవత్సరములు గల కాలమారంభమై యుండుటవలన నీ సమయము కాలచక్రమునఁ గృతయుగధర్మము జరుగవలసిన కాలముగ నున్నదని స్పష్టమగుచున్నయది.

కలౌ పఞ్చసహస్రాంతే జాయతే వర్ణసఙ్కరః ॥

అను నీవాక్య మీయర్థమునే యించుక సూచించుచున్న యది. మొదటి యైదువేల సంవత్సరములకాలము కడపటి భాగము కలిధర్మములలో నవాంతరకలిధర్మము జరుగుకాలము కావున నైదువేల సంవత్సరముల కడపటికాలమున ధర్మము మిగుల హీనముగ నుండునని పెద్దలు సూచించియున్నారు. ఇప్పు డాకాలము దాఁటినందున మరలఁ గృతయుగధర్మము కొంత వృద్ధి కాఁదగిన సమయముగ నున్నయది. ఇప్పటి ప్రపంచస్థితిని గమనించిచూచిన నీశుభసూచకములు స్పష్టముగ వెల్లడియగుచునే యున్నయవి. ఇరువది ముప్పదియేండ్లకుఁ బూర్వము మనదేశమునందేమి యితరదేశములయందేమి యెచ్చటఁ జూచినను నాస్తికవాదము ప్రబలియుండెను. ఇంద్రియగోచరములగు విషయములకంటె నన్యమొక్కటియు లేదనియు, విషయసుఖానుభవముకంటెఁ గోరఁదగిన వేఱుసుఖము లేదనియు వాదించువారలును, దదనుసారముగనే నడుచువారును బ్రబలియుండిరి. పూర్వవైదికాచారములును, ధర్మములును నాదరణీయములని తోఁచకుండెను. ఐరోపాఖండమునందును, అమెరికాయందును మతమునం దాదరణబుద్ధి క్షీణించి జనులు ప్రకృతిబద్ధులై కేవల విషయాసక్తులగుచుండిరి. ఎల్లయెడల నీ తీరుననే పరతత్త్వవిషయములగు ధర్మములు క్షీణగతి నొందియుండెను. ఇంతియగాదు. అన్ని

భేదములందుండియును మతాభిమానము గలవారు కొద్దిగ నుండి నను వారి స్థితియు మతములందలి యథార్థతత్త్వములను, ముఖ్యాంశములను బాగుగఁ దెలిసికొనక యముఖ్యములగు బాహ్యాచారములే ముఖ్యములని పాటించుటయందు శ్రద్ధకలి శుష్కాచారపరాయణులై యుండిరి. ఆకారణము: స్వల్పములగు నాచారభేదములు నయినను పరస్పర మనస్పర్ధాసూయలకు హేతువు లగుచుండెను. అన్యోన్యమతద్వేషము లభివృద్ధియగుచుండెను. ఇప్పుడన్ననో యే దేశమునఁ జూచినను మతవిషయములయందే శ్రద్ధ హెచ్చుచుండెను. అతీంద్రియములగు విషయములయందు నమ్మిక యతిశయించుచున్నది. ఒక్కొక్క మతావలంబులును ఇతరమత గ్రంథములయందలి సారమును గ్రహించుటకు యత్నించుచున్నారు. ముఖ్యాంశములను, అముఖ్యాంశములను వేఱుపఱచుటచే సన్నిమతములయందలి ముఖ్యాంశము లొక్కటిగ నేర్పడుటయు దానికి ఫలముగ మతవైషమ్యములు తగ్గుచుండుటయు, ఐకమత్యము, భ్రాతృభావము వృద్ధియగుటయును జూచుచున్నాము. ఇట్లు మరలఁ గొంత కృతయుగధర్మము ప్రారంభమగుట స్పష్టముగఁ గానవచ్చుచున్నది. కావున భక్తిజ్ఞానముల నభ్యసింపఁగోరువారి కిది మంచిసమయము.

అట్లింతకుఁబూర్వ మధ్యాత్మవిద్య లోకమున మిక్కిలి క్షీణదశఁ జెందియుండినకాలమున బ్రహ్మవిద్యాస్వరూపులు,

నధ్యాత్మవిద్యారతుకులును, బరతత్త్వ సాక్షాత్కారముగల వారును, జీవన్ముక్తులునగు మహర్షులలోఁ గొందఱు అజ్ఞులయి సంసారసాగరమున మునిఁగి తెప్పరిల్లఁజాలక సంకటపడు చుండు శిశుప్రాయులగు పామరజనుల యుద్ధారణార్థము లోక మునఁ బరతత్త్వజ్ఞానమును బ్రకాశింపఁజేసి ధర్మమును బ్రతి ష్ఠించు నుద్దేశముగలిగి దివ్యజ్ఞానసమాజమను నొక సంఘ మును స్థాపింపఁజేసిరి. ఆసమాజము ప్రారంభించినది మొదలు ప్రపంచమునందలి దేశములన్నింటియందును దాని శాఖలు వ్యాపించి, జనుల మనస్సులను గేవల మైహికవిషయముల నుండి మరలించి యాముష్మికవిషయమునందు శ్రద్ధగలుగు నట్లు చేయుచువచ్చుచున్నయవి. ఈ సమాజశాఖలు ఏయే దేశములయందుఁ బ్రబలెనో యాయా దేశములయందు క్షీణ గతి నొందియుండిన మతములు పునరుజ్జీవితములు కాఁగా నాయా మతస్థులు ప్రవర్ధమాన శ్రద్ధతో మతధర్మముల నాచ రించుచున్నారు. ఇవ్విధమున నన్నిదేశములయందును భగ వంతుఁడు ధర్మసంస్థాపనము చేయుకొఱకీసమాజరూపమున నవతరించెనో యనునట్లు గనఁబడుచున్నది. యథార్థముగ బ్రహ్మస్వరూపులై యదృశ్యులుగ లోకసంగ్రహార్థము వర్తించుమహర్షుల ప్రోత్సాహముచే వారల యనుగ్రహపాత్రు లగు వారి ముఖ్యశిష్యులచే లోకమున నీసమాజము స్థాపింపఁ బడినదని యాసామాజికులలో ననుభవజ్ఞులగువారు చెప్పు

చున్నారు. ఈసమాజము స్థాపింపఁబడి ముప్పదియాఱు[1] సంవత్సరములు మాత్రమే యైయుండియు నది యీస్వల్పకాలముననే ప్రపంచమునందలి నానాదేశీయులయు, నానామతస్థులయు మనోవృత్తులను సవరించి పరస్పరమైత్రిని వృద్ధిచేయుటయేగాక పురాతన గ్రంథములయందు గూఢముగ నుండిన పెక్కురహస్యముల సిద్ధాంతములను దగినట్లు సుబోధములుగ వెల్లడిచేసి, మఱియు ననేకరీతుల లోకమునకు మేలుచేయుచున్నది. దీనింజూచి యీసమాజము మనుష్యమాత్రులచే స్థాపింపఁబడినదికాదని వెల్లడికాక తీరదు. ఈ సమాజమునందుఁ బ్రముఖులు ననుభవజ్ఞులున్నూ, యిక్కాలమున యథార్థముగ యోగులస్వరూప మిట్టిదని తమనడవడిచే లోకమునకుఁ బ్రదర్శించుచుఁ "బరోపకారార్థ మిదం శరీరం" అను సూక్తిని సార్థకముచేయుచు గ్రామైకరాత్రముగ సంచరించుచుఁ బరతత్త్వరహస్యములను శ్రద్ధాళువులకు బోధించుచుఁ గర్మభక్తిజ్ఞానమార్గముల సారమును స్వానుభవమునఁ జూపుచుండు 'అనిబెసంటు' (Annie Besant) గారివిషయమై జీవన్ముక్తులగు మహాత్ముల సహాయముననే యీకార్యమంతయు నడచుచున్నదని చాటించుచున్నారు. ఇంతియకాక జీవన్ముక్తులగు

[1] దివ్యజ్ఞానసమాజము క్రీ॥ శ॥ 1875 సం॥ నవంబరు తే 1 దిన అమెరికాలో న్యూయార్కుపురమున స్థాపింపఁబడెను. ఈ గ్రంథము 1911 సం॥ మున వ్రాయఁబడె.

మహానీయులు సర్వకాలము పామరుల నుద్ధరించుకొఱకుఁ దమ తపోమహిమ లోకమునందుఁ బ్రవహింపఁజేయుచున్నారనియును, వారలు ముఖ్యముగ నీ సమయమున నా తేజస్సునెక్కువగ లోకమునకుఁ బంపుచున్నారనియును, యోగ్యులగు శిష్యులు దొరకుదురాయని వారలు కాచియున్నవారనియు, నీకాలమున శ్రద్ధాభక్తులు గలిగి లోకోపకారమునకై యాముష్మికమును సాధించుటయందు యత్నముచేయువారలెప్పటికంటె నెక్కువగ వారి యనుగ్రహమునకుఁ బాత్రులగుదురనియు, లోకుల మేలుకొఱకు నొక్కి వక్కాణించుచున్నవారు.

మఱియు లోకమున ధర్మము క్షీణగతినొంది యధ్యాత్మవిద్య యాదరింపఁబడనప్పుడెల్లను బ్రహ్మవేత్తలును, జీవన్ముక్తులును, మరణమును దరించినవారును నగు మహర్షులలో నొకరుగాని, వారి ముఖ్యశిష్యులలో నొకరుగాని, లోకమున జన్మించి యజ్ఞానులగువారలకు జ్ఞానోపదేశమును జేయుచు, భక్తిశ్రద్ధలను వృద్ధిచేయుచు, బ్రహ్మవిద్యను లోకమున మఱువకయుండునట్లు కాపాడుదురని పూర్వమే చెప్పఁబడియెఁగదా! గడచిన ముప్పదాఱువర్షముల నుండి దివ్యజ్ఞానసమాజ మూలముననను, ఆ సమాజమునందుఁ బ్రముఖులుగనుండు నా మహర్షుల శిష్యసముదాయము మూలముననను, జనుల మనస్సులు పరవిద్యయందు శ్రద్ధావంతము లగుచుండుట విదితముగనున్నది. ఈ

రీతిని జనుల మనస్సులు కొంత పరిపక్వములు కాఁగా నామహాత్ములలో నొక గతిశీఘ్రకాలములోనే లోకమున జన్మింప నుద్దేశించియున్నవారనియును, ఇరువది ముప్పది సంవత్సరములలోపల నట్టియవతారము గాఁగలదనియు, నామహానుయుఁడు మనుష్యశరీరముఁ గైకొనుకాలమున వారిమాహాత్మ్యము నెఱిఁగి వారియనుచరులగుటకుఁ దగిన యోగ్యతను సంపాదించుకొనుటకు విశేషప్రయత్నము కర్తవ్యమనియు, నీ సమాజమున కగ్రాసనాధిపత్యము వహించియుండు అని బెసెంటుగారు అదృశ్యులగు వారిగురువుల యనుమతిచే బాహాటముగఁ జాటుచున్నారు.

అట్టి మహానుభావుఁడు లోకమున జన్మించినప్పు డేరీతిగ వర్తించునో, యేవిషయముల నెవ్విధమున బోధించునో నిరూపింప శక్యముగాదనియు, నేదేశమునఁ గాని యేజాతివారు గాని మొక్కవు భక్తిశ్రద్ధలుగలిగి "ఆత్మవత్సర్వభూతాని" యను న్యాయమును సార్థకమగునట్లు చేసి వర్తించుచుందురో, సాధువులగువారు కేదేశస్థులయినను, ఏమతస్థులయినను, ఏ జాతివారైనను, వారిని గౌరవపాత్రులుగ నెవరు భావింతురో ఎవ్వరెల్లవారి సుఖదుఃఖములను దమ సుఖదుఃఖములుగ భావించుచుందురో, పరోపకారనిరతులై స్వప్రయోజనముల సాధించుకొనుటకంటెఁ బరప్రయోజనముల సమకూర్చుటయే శ్రేష్ఠతరమనియు, నైహిక ప్రయోజనముకంటె నాముష్మిక

కార్యము లెక్కడుగఁ గోరఁదగినవనియును, ఫలము నభిల షించిచేయు కార్యములకంటె నీశ్వరార్పణబుద్ధితో లోకోప కారముకొఱకుఁ జేయుకార్యములు చేయఁదగినవనియును భావించి వర్తింతురో, అట్టివారామహానీయుని గుర్తింపఁ జాలుదు రనియు నట్టి పుణ్యాత్ము లామహానీయుని శిష్యకోటి యందుఁ బరిగణింపఁబడఁ జాలియుందురనియును ఆనిబెసెంటు గారు మఱల మరల నొక్కి చెప్పుచున్నవారు.

ఇట్టి గొప్ప శుభోదయముగల యికాలముకంటె మంచి కాలము ప్రాప్తించుట దుర్లభము. ఇట్టి నిరుపమాన సదు పాయభూయిష్ఠమగు సమయమును బ్రయత్నముచేత జన్మసా ఫల్యసాధనముగఁ జేసికొననియెడల జీవుఁడు మరల నిట్టి సంద ర్భములు గొరకక విచారింపవలసియుండును.

కావునఁ బరమార్థచింతగలవారందఱును నకాలమున నా మహానీయుని శిష్యకోటియం దెన్నఁబడుటకుగాని, లేక వారి పరివారమునందైనను జేరి వారి నుపచరించుటకుగాని తగిన యోగ్యతను బహుప్రయత్నముతో సంపాదింపఁదగు. అనఁగా దృఢమగు వివేకమును, దీవ్రవైరాగ్యమును, నిశ్చలభక్తియు, నెన్ని కుతర్కములచేతనైనను జలింపని దృఢనిశ్చయము, ఇంద్రియ నిగ్రహము, వాఙ్నియమము, మనస్సమాధానము లోనగువానిని వృద్ధిచేసికొనదగు. మఱియు సర్వభూతముల యందు మైత్రియుఁ దనకంటె నుత్తములగువారియందు నిశ్చల

మగు భక్తియు జాతి మత వర్ణ లింగ వ్యత్యాసములను గణ
నింపక, దీనులయందు ఎల్లవేళల వాత్సల్యము గలవారగు గు
ముల నిరంతరముగ దృఢముగ నభ్యాసము సాధ్యపడునంతవ
రకు. అందఱియందును దోషములు గలిగియున్నను సద
గుణగ్రహణము చేయుట నలవాటు చేసికొనుట కర్తవ్యము
అట్లుచేయుచో మహాత్ముల మనుష్యములకు గల దోష
దర్శనపరులుగనుండుట యనెడి మొదలగు తీవ్రదుర్వ్యసనములగు
గుణములకు లోఁబడినచో నైహికాముష్మికములకు రెండి
టికిఁ జెడినవారలగుదురు. సంగ్రహముగ గీతాశాస్త్రము
నందుఁ బదునారవ యధ్యాయమున భగవంతునిచే నుపదేశిం
పఁబడినరీతి నాసురసంపద్గుణములను సాధ్యమగునంతదను
సమూలముగ విడువ యత్నించుచు, దైవీసంపద్గుణముల
దృఢముగ నభ్యసించుచు సత్పురుషసాంగత్యమును బొంది జన
లెల్లఱుఁ బ్రవర్తింతురుగాక యని పరమదయాసాగరుఁ
డగు భగవంతుని బలుమాఱు ప్రార్థించుచున్నాము.

సర్వే జనాః సుఖినో భవంతు

ఓం శాంతిః శాంతిః శాంతిః